

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 347

బుధవారం 30-8-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




సమరానికి సై

నేటి నుంచి ఆసియాకప్ వన్డే టోర్నీ. తొలి పోరులో నేపాల్‌తో పాక్ ఢీ -12లో



ఐటీ ఆదాయాలు తగ్గుతున్నాయ్

ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో 3–4 శాతానికే పరిమితం: ఇక్రా రేటింగ్స్ -13లో



యూటీ హోదా శాశ్వతం కాదు

జమ్మూకశ్మీర్‌కు కల్పించిన కేంద్ర పాలిత ప్రాంతం(యూటీ) హోదా శాశ్వతం కాదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది.


వివరాలు 6లో ▸



ఆయుర్దాయానికి కాలుష్య కాటు

ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరం ఢిల్లీ అని.. అక్కడి వాసులు తమ ఆయుష్షులో 11.9 ఏళ్లు కోల్పోతున్నారని ఓ అధ్యయనం పేర్కొంది.

వివరాలు 6లో ▸



కుల వివక్ష వ్యతిరేక బిల్లు ఆమోదం

అమెరికాలో చర్చనీయాంశంగా మారిన కుల వివక్ష వ్యతిరేక బిల్లును కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీ 50–3 మెజార్టీతో ఆమోదించింది.

వివరాలు 6లో ▸



చైనా మ్యాప్‌పై భారత్ అభ్యంతరం

అక్సాయ్‌చిన్, అరుణాచల్‌ను చైనాలో అంతర్భాగాలుగా పేర్కొంటూ ఆ దేశం రూపొందించిన మ్యాప్‌పై భారత్ అభ్యంతరం తెలిపింది.

వివరాలు 6లో ▸

నాణేనికి అటు.. ఢిల్లీలో డ్రామా!

ఎంపిక చేసుకున్న విలేకరుల సమావేశంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు

తాను మొదటి నుంచి కేంద్రంలో పొత్తులోనే ఉన్నాడట..

హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చానంటూ మరోసారి నాలుక మడత

హోదా ఏమైనా సంజీవనా?.. ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అర్ధరాత్రి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే ధీమా



- పోలవరం కాంట్రాక్టుల కోసం హోదాను తాకట్టు పెట్టిన ఘనత చంద్రబాబుదే
- రామోజీ వియ్యంకుడు, యనమల వియ్యంకుడిని కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి డబ్బు దండుకున్న విషయం ఎవరూ మరువలేరు
- రాజధాని పేరుతో చంద్రబాబు భారీ స్కామ్‌కు తెరతీయడంతో తీవ్ర ప్రజా వ్యతిరేకత.. దాన్ని కేంద్రంపైకి మళ్లించడం కోసం
- చివరి ఏడాది ఎన్డీఏ నుంచి బయటకు టీడీపీ
- 2019 ఎన్నికల్లో బెడిసికొట్టిన అంచనాలు.. బీజేపీలోకి కోవర్టులను ప్రవేశపెట్టిన బాబు
- తన పార్ట్‌నర్ పవన్‌కళ్యాణ్‌ను కాషాయం ఫ్రంట్‌లో చేర్చి ఢిల్లీ కరుణ కోసం వేడుకోలు
- ఆ ప్రయత్నాలకు తోడు కొత్తగా పురందేశ్వరి కుటుంబంతో కుదిరిన రాజీని బీజేపీతో పొత్తు కోసం వాడుకుంటున్న చంద్రబాబు
- పురందేశ్వరి బాబు ఏజెంట్‌లా పని చేస్తున్నారని ఆరోపించిన లక్ష్మీపార్వతి
- ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమానికి ఆయన సతీమణిని ఆహ్వానించరా?
- వేలాది మంది సమక్షంలో లక్ష్మీపార్వతిని తన ధర్మపత్నిగా బహిరంగంగా ప్రకటించిన ఎన్టీఆర్
- గూడుపుఠాణి కార్యక్రమం కనుకనే ఆమెను పిలవలేదని సర్వత్రా అభిప్రాయం
- ఎన్టీఆర్ నాణెం పేరుతో నడ్డాతో చంద్రబాబు వంగివంగి మంతనాలు
- టీడీపీ కోవర్టులు మినహా మిగిలిన బీజేపీ నేతలంతా దీనికి దూరం
- నడ్డా నుంచి ఆశించిన స్పందన వచ్చిందో లేదో గానీ మీడియాకు చంద్రబాబు లంచ్ మీటింగ్
- రెండో రోజూ హస్తినలో మోదీ సర్కారుపై ప్రేమ ఒలకబోసిన చంద్రబాబు

3లో

చందమామపై సల్ఫర్

వెల్లడించిన ఇస్రో



'చంద్రయాన్-3 మిషన్' చివరి దశకు చేరింది. చంద్రుడి ఉపరితలంపై సల్ఫర్ ఉన్నట్లు రోవర్ ప్రజ్ఞాన్ తాజాగా నిర్ధారించింది. హైడ్రోజన్ కోసం అన్వేషణ సాగిస్తోంది. అలాగే చంద్రుడి ఉపరితలంపై మట్టి స్వభావాన్ని విశ్లేషించనుంది. మరో 7 రోజుల్లో అది అందించే సమాచారంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

- వివరాలు 6లో

గ్యాస్ బండ రూ.200 తగ్గింది



ఎన్నికల ముందు కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం

ఓనం, రాఖీపౌర్ణమి సందర్భంగా మహిళలకు మోదీ సర్కారు కానుక.. నేటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి..

'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' లబ్ధిదారులకు సైతం వర్తింపు

6లో

"వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు నిర్ణయానికి ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదు. ఇది ఓనం, రక్షాబంధన్ పండుగల సందర్భంగా మహిళలకు మోదీ ప్రభుత్వం ఇస్తున్న కానుక' అని కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్‌ఠాకూర్ తెలిపారు.

ఫ్యాక్ట్ చెక్

రామోజీ.. వంచనలు మీ బాబు పేటెంట్

- దొంగే.. దొంగా దొంగా అన్నట్లుగా సాగునీటి ప్రాజెక్టులపై ఈనాడు రోత రాతలు
- అడ్డగోలుగా అంచనాలు పెంచేశారంటూ వాస్తవాలను వక్రీకరించిన వైనం
- ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నా పనులు ఆపేశారంటూ దుష్ప్రచారం
- ఇప్పటికే నెల్లూరు, సంగం బ్యారేజ్ పూర్తి.. జాతికి అంకితం
- ప్రారంభానికి సిద్ధంగా అవుకు రెండో సొరంగం, 68 చెరువులను నింపే పథకం
- పూర్తి కావొస్తున్న వంశధార స్టేజ్–2 ఫేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం
- దాదాపు వెలిగొండ తొలి దశ కూడా పూర్తి
- 2019 నుంచి రూ.28 వేల కోట్లు ఖర్చు.. కొత్తగా 5.03 లక్షల ఎకరాలకు నీళ్లు

2లో

మీ 'ఫ్యామిలీ డాక్టర్'తో చర్చించండి

- రామోజీ ఇంతగా దిగజారిపోతున్నది బాబు కోసమేగా?
- రాష్ట్ర ప్రభుత్వంపై రోజూ బురదజల్లడమే మీ లక్ష్యం
- వైద్య రంగం ప్రగతిపై సర్వత్రా ప్రశంసలు.. 'ఫ్యామిలీ డాక్టర్'పై గ్రామీణుల్లో ఆనందం
- ఊళ్లోనే వైద్య సేవలు అందుతున్నాయని సంతృప్తి
- ఇది జీర్ణించుకోలేకే అరకొర వైద్యం అంటూ తప్పుడు రాతలు

- వివరాలు 3లో

ఉద్యోగ సంఘాలతో సానుకూలంగా చర్చలు

- జీపీఎస్‌లో మరికొన్ని అంశాలు చేర్చాలని కోరాయి
- అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకుంటాం
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి
- ఓపీఎస్ కావాలని మరోసారి అడిగాం: ఉద్యోగ సంఘాలు



ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశంలో మంత్రులు సురేష్, బొత్స, బుగ్గన, ప్రభుత్వ సలహాదారు సజ్జల

- వివరాలు 10లో

కార్ల అమ్మకాలు రయ్ రయ్

- ద్విచక్ర వాహనాలు కూడా..
- దేశ సగటును మించి రాష్ట్రంలో వృద్ధి.. భారీగా పెరిగిన ఆటోల విక్రయాలు
- రవాణా ద్వారా రూ.1,570.07 కోట్ల ఆదాయం
- గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నాలుగు నెలల్లోనే ఆదాయ వృద్ధి 8.40 శాతం

- వివరాలు 2లో

నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువత సొంతం

- సామాజికాభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలు అవసరం
- చదువు, సాంకేతికతతోపాటు నైతికత కూడా ముఖ్యం
- సవాళ్ల నుంచి అవకాశాలు సృష్టించాలి
- ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్

- వివరాలు 5లో

క్లుప్తంగా...

నేడు కాకినాడ జిల్లా జగ్గంపేటలో సీఎం పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం జగన్ బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి జగ్గంపేట మండలం ఇర్రిపాకకు సీఎం చేరుకుంటారు. అక్కడ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నివాసంలో జరిగే ఆయన కుమార్తె వివాహ వేడుకలో సీఎం పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

రేపు కౌలు రైతులకు రైతు భరోసా

సాక్షి, అమరావతి: సాధ్యమైనంత ఎక్కువ మంది వాస్తవ సాగుదారులకు సంక్షేమ ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. రికార్డు స్థాయిలో ఇప్పటికే పంట హక్కు సాగు పత్రాలు (సీసీఆర్సీలు) అందించింది. వరుసగా ఐదో ఏడాది కూడా కౌలు రైతులతోపాటు దేవదాయ భూములు సాగు చేసే వారికి వైఎస్సార్ రైతు భరోసా అందించేందుకు రంగం సిద్ధమైంది. సీసీఆర్సీలు పొందిన వారిలో అర్హులైన 1,42,693 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలుదారులతో పాటు 3,631 మంది దేవదాయ భూముల సాగుదారులకు వైఎస్సార్ రైతు భరోసా కింద తొలి విడతగా రూ.7,500 చొప్పున రూ.109.74 కోట్లు జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 31న తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయనున్నారు.

తెలుగుభాషావేత్తల్లో గిడుగు అగ్రగణ్యుడు

సీఎం జగన్ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ఆధునిక తెలుగుభాషావేత్తల్లో గిడుగు వెంకటరామమూర్తి పంతులు అగ్రగణ్యుడని సీఎం వైఎస్ జగన్ కీర్తించారు. మంగళవారం గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా సీఎం జగన్ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'గిడుగు రామమూర్తి గారు తన ఉద్యమం ద్వారా తెలుగుభాషను సామాన్యుల దగ్గరకు చేర్చి, వ్యవహారిక భాషను మాధ్యమంగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి. భాషా నైపుణ్యాలను వృద్ధిచేయడం ద్వారా అక్షరాస్యత పెంపు, తద్వారా మానవాభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. గిడుగువారి జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

గిడుగుకు 'అక్షర' నివాళి



లక్కిరెడ్డిపల్లి/యర్రగొండపాలెం: అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్లో గిడుగు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో 'గిడుగు' అక్షరాల రూపంలో విద్యార్థులు కూర్చున్నారు. కాగా, విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో గిడుగు చిత్రపటానికి మంత్రి ఆదిమూలపు సురేశ్ నివాళులర్పించారు.

ఏపీహెచ్ఈఆర్ఎంసీ సభ్యుడిగా రమేష్ కుమార్

సాక్షి, అమరావతి: ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్(ఏపీహెచ్ఈఆర్ఎంసీ) సభ్యుడిగా ప్రభుత్వం మాజీ ఐఏఎస్ అధికారి పి.రమేష్ కుమార్‌ను నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉన్నత విద్య ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ కుమార్ మూడేళ్ల పాటు కమిషన్ సభ్యుడిగా కొనసాగుతారు.

భాషోద్యమానికి స్ఫూర్తి గిడుగు



భాషా తపస్వి గిడుగు పుస్తకావిష్కరణ చేస్తున్న వక్తలు

విజయవాడ కల్చరల్: గిడుగు స్ఫూర్తితో వ్యావహారిక భాషా ఉద్యమం ఊపిరి పోసుకుందని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికార భాషా సంఘం, భాషా సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులు గా నిర్వహిస్తున్న భాషా వికాస వారోత్సవా లు మంగళవారం ముగిశాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి జయంతి, తెలుగు సాహితీవేత్తలకు పురస్కార కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషలో విశిష్ట కృషి చేసిన వంశీరామరాజు, తోటకూర ప్రసాద్, వెలమ ల సిమన్నకు జీవిత సాఫల్య పురస్కారాలు, తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన 47 మందికి భాషా పురస్కారాలు ప్రదానం చే శారు. తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి చేసిన డాక్టర్ కొండూరు కుసుమారెడ్డి భాషారత్న పురస్కారం అందుకున్నారు. భాషా త పస్వి గిడుగు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్ ఢిల్లీరావు, సి.రాఘ వాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడకు 'నానో'చ్చేస్తున్నా!

- రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో నానో ఎరువుల ఉత్పత్తికి సిద్ధమవుతున్న కోరమాండల్
- ఏటా 30 వేల కిలోలీటర్ల నానో ఎరువుల ఉత్పత్తి
- రూ.710 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ విస్తరణ
- ఉభయ తెలుగు రాష్ట్రాల రైతులకు ప్రయోజనం



కాకినాడ కోరమాండల్ ఎరువుల కర్మాగారం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఫెర్టిలైజర్స్ సిటీగా జాతీయ స్థాయిలో పేరొందిన కాకినాడ నగరం మరో కొత్త ఆవిష్కరణకు వేదిక కాబోతోంది. ఇకపై నానో ఎరువుల ఉత్పత్తికి సైతం కేంద్ర బిందువు కాబోతోంది. కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఈ దిశగా అడుగులు వేస్తోంది. నాగార్జున ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎఫ్సీఎల్) ఏర్పాటుతో దేశవ్యాప్తంగా ఫెర్టిలైజర్స్ సిటీగా కాకినాడ పేరొందింది. అనంతరం తమిళనాడుకు చెందిన మురుగప్ప గ్రూపు కాకినాడ జీఎఫ్సీఎల్‌ను టేకోవర్ చేసి కోరమాండల్ ఎరువుల కర్మాగారాన్ని ప్రారంభించింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో ప్లాంట్‌ను విస్తరించడంతోపాటు నానో ఎరువులను ఉత్పత్తి చేసేందుకు కోరమాండల్ ముందుకొచ్చింది.

3 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు..

ఏటా 3 లక్షల టన్నుల డీఏపీ ఉత్పత్తి సామర్థ్యంతో 1988లో ఈ పరిశ్రమను కోరమాండల్ ప్రారంభించింది. దశలవారీగా పెంచుతూ ప్రస్తుతం ఏటా 20.50 లక్షల టన్నుల డీఏపీ, పొటాష్, ఇతర ఎరువులను ఉత్పత్తి చేస్తోంది. ఇకపై ఏటా ఉత్పత్తిని 30 లక్షల టన్నులకు విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. నానో ద్రవ రూప ఎరువులను ఏటా 30 వేల కిలోలీటర్లు మేర ఉత్పత్తి చేయాలని ప్రతిపాదించింది. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి ఎరువుల దిగుమతిని తగ్గించి స్వయం సమృద్ధి సాధించడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ వైపు అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో కాకినాడ వాకలపూడిలోని కోరమాండల్ ప్లాంట్‌ను రూ.710 కోట్లతో విస్తరించేందుకు కోరమాండల్ ప్రతిపాదించింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పటికే పూర్తయ్యింది. నానో ఎరువులు, ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న ఎరువుల సామర్థ్యం పెంపు తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను కాలుష్య నియంత్రణ మండలి సేకరించింది. ఇప్పుడున్న 4.80 మెగావాట్ల క్యాప్టివ్ పవర్ ఉత్పత్తితో కలిపి 12 మెగావాట్ల క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను కూడా ప్రతిపాదించారు. బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా విస్తరణ ప్లాంట్‌లో ఉపాధి అవకాశాలలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కంపెనీ ప్రకటించింది. ప్లాంట్ విస్తరణకు అన్ని అనుమతులు వచ్చేసరికి నాలుగైదు నెలల సమయం పడుతుందని కంపెనీ అంచనా వేస్తోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే నానో డీఏపీ, ఇతర ఎరువుల ఉత్పత్తిని వచ్చే ఏడాది ప్రారంభించనున్నారు.

నానో డీఏపీతో తగ్గనున్న ఖర్చు

రైతులు గుళికల రూపంలో ఉండే ఎరువులను వ్యవసాయ క్షేత్రాల్లో చల్లుతున్నారు. ఆ ఎరువులు నీటిలో కరిగిపోయి భూమి ద్వారా మొక్కలకు పోషకాలను అందిస్తాయి. ఒక బస్తా డీఏపీ ఉత్పత్తికి సుమారు రూ.3,200 ఖర్చవుతోంది. డీఏపీపై కేంద్రం ఒక్కో బస్తాపై రూ.2 వేల సబ్సిడీ ఇస్తోంది. రైతు బస్తా రూ.1,200కు కొనుగోలు చేస్తున్నాడు. అదే బస్తా డీఏపీ బదులుగా ఒక లీటరు నానో డీఏపీ సరిపోతుంది. దీని ఉత్పత్తి వ్యయం రూ.700 నుంచి రూ.800 అవుతుంది. డ్రోన్ ద్వారా కూడా దీనిని పొలాల్లో నేరుగా పిచికారీ చేసుకోవచ్చు. నానో ఎరువులు పర్యావరణానికి పూర్తిగా అనుకూలం. ద్రావణం నేరుగా మొక్క కాండానికి చేరుతుంది. భూమిలోని వానపాములు చనిపోవు. రైతుకు భారం తగ్గుతుంది.

నానో ఎరువు అద్భుతమైన అవకాశం



నానో ఫెర్టిలైజర్ అనేది సుస్థిరమైన వ్యవసాయ విధానాలలో అద్భుతమైన అవకాశం. కోరమాండల్ ఇంటర్నేషనల్ పరిశోధన కేంద్రం, ఐఐటీ ముంబై సహకారంతో నానో సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. 2024 ప్రథమార్థంలో నానో డీఏపీ అందుబాటులోకి వస్తుంది.

– సాయిభాస్కర్, సాంకేతిక సలహాదారు, కోరమాండల్ ఇంటర్నేషనల్

కేంద్రానికి నివేదిక పంపించాం



కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఫ్యాక్టరీ విస్తరణకు ప్రతిపాదనలు వచ్చాయి. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెలలోనే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాం. ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నుంచి వచ్చిన విజ్ఞాపనలను పరిశీలించాం. ప్రజాభిప్రాయాలను క్రోడీకరించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాం.

– కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

- రాజాం మాజీ ఎమ్మెల్యే భద్రయ్య, ఆయన తనయుడు చేరిక
- అనకాపల్లి టీడీపీ నేత మలసాల భరత్ కూడా
- పార్టీలోకి ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్



తలే భద్రయ్య, రాజేశ్‌లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లా రాజాంకు చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, ఆయన తనయుడు డాక్టర్ తలే రాజేశ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వారు కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సీఎం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో పాలకొండ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున రెండుసార్లు (1985, 1994) తలే భద్రయ్య గెలుపొందారు. అలాగే ఏపీపీఎస్సీ సభ్యుడిగా ఆరేళ్లపాటు పనిచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు.

అనకాపల్లికి చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలోకి..

అనకాపల్లి టీడీపీ నేత మలసాల భరత్ కుమార్, ఆయన తల్లిదండ్రులు రమణారావు (విశాఖ డెయిరీ డైరెక్టర్), ధనమ్మ (మాజీ ఎంపీపీ) వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకోగా.. వారికి సీఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భరత్ కుమార్ కుటుంబంతోపాటు గంగుపాం నాగేశ్వరరావు (మాజీ డీసీఎంఎస్ చైర్మన్), మలసాల కుమార్ రాజా (విశాఖ జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి) కూడా పార్టీలో చేరారు.



మలసాల భరత్, రమణారావు, ధనమ్మ తదితరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్

కార్ల అమ్మకాలు రయ్ రయ్



- ద్విచక్ర వాహనాలు కూడా..
- దేశ సగటును మించి రాష్ట్రంలో వృద్ధి
- భారీగా పెరిగిన ఆటోల విక్రయాలు
- రవాణా ద్వారా రూ.1,570.07 కోట్ల ఆదాయం
- గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నాలుగు నెలల్లోనే ఆదాయ వృద్ధి 8.40 శాతం

రాష్ట్రం, దేశంలో రెండేళ్లుగా ఏప్రిల్ నుంచి జూలై వరకు వాహనాల అమ్మకాలు..

	రాష్ట్రంలో			దేశంలో		
కేటగిరీ	2023-24	2022-23	వృద్ధి శాతం	2023-24	2022-23	వృద్ధి శాతం
ద్విచక్ర వాహనాలు	1,99,271	1,85,119	7.65	52,66,834	50,50,120	4.29
కార్లు	37,158	35,638	4.27	13,89,728	13,34,161	4.16
గూడ్స్	9,008	11,278	-20.13	2,95,827	2,96,654	-0.28
ప్యాసింజర్	2,294	5,461	-57.96	1,14,116	65,584	74.00
ఆటోలు	949	106	795.28	3,30,425	1,86,656	77.02

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కార్లు, ద్విచక్ర వాహనాల అమ్మకాలు పెరుగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోల విక్రయాల్లోనూ వృద్ధి నెలకొంది. తద్వారా గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు పోల్చి చూస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో రవాణా రంగం ద్వారా వచ్చే ఆదాయంలో 8.40 శాతం వృద్ధి నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ద్విచక్ర వాహనాల అమ్మకాలు భారీగా తగ్గగా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు చూస్తే జాతీయ సగటును మించి రాష్ట్రంలో వృద్ధి చోటు చేసుకుంది. అలాగే ఇదే కాలానికి జాతీయ సగటును మించి రాష్ట్రంలో కార్ల విక్రయాల్లో వృద్ధి నమోదైంది. ఇక ఆటోల అమ్మకాల్లో ఏకంగా 795.28 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు రవాణా ఆదాయం రూ.1,448.35 కోట్లు రాగా ఈ ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.1,570.07 కోట్లు ఆదాయం వచ్చింది. ఇక దేశవ్యాప్తంగా గూడ్స్ వాహనాల అమ్మకాలు పడిపోగా రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఐదేళ్లుగా రాష్ట్రంలో రవాణా ఆదాయం..

ఆర్థిక సంవత్సరం	రవాణా ఆదాయం (రూ.కోట్లలో)
2019-20	3,181.78
2020-21	2,973.33
2021-22	3,340.57
2022-23	4,294.12
2023-24 (జూలై వరకు)	1,570.07

ఇతర రాష్ట్రాల్లో విధానాలపై అధ్యయనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రవాణా రంగం ద్వారా ఆదాయం పెంచుకోవడానికి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేస్తున్నాం. ఇతర రాష్ట్రాల్లో బాగుంటే వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వాహనాల పన్నుల విషయంలో కొత్త విధానాలను అన్వేషిస్తున్నాం. కొనుగోలుదారులను ప్రోత్సహించేలా సంస్కరణలపై దృష్టి సారించాం. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ద్విచక్ర వాహనాలతో పాటు కార్ల కొనుగోళ్లు పెరిగాయి. రవాణా ఆదాయంలోనూ వృద్ధి నమోదవుతోంది.

– ప్రసాదరావు, అదనపు కమిషనర్, రవాణా శాఖ

రామోజీ.. వంచనలు మీ బాబు పేటెంట్

- దొంగే దొంగా దొంగా అన్నట్లుగా సాగునీటి ప్రాజెక్టులపై ఈనాడు రోత రాతలు
- అడ్డగోలుగా అంచనాలు పెంచేశారంటూ వాస్తవాలను వక్రీకరించిన వైనం
- ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నా పనులు ఆపేశారంటూ దుష్ప్రచారం
- ఇప్పటికే నెల్లూరు, సంగం బ్యారేజ్ పూర్తి.. జాతికి అంకితం
- ప్రారంభానికి సిద్ధంగా అవుకు రెండో సొరంగం, 68 చెరువులను నింపే పథకం
- పూర్తి కావొస్తున్న వంశధార స్టేజ్–2 ఫేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం
- దాదాపు వెలిగొండ తొలి దశ కూడా పూర్తి
- 2019 నుంచి రూ.28 వేల కోట్లు ఖర్చు.. కొత్తగా 5.03 లక్షల ఎకరాలకు నీళ్లు
- 40 జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తి చేస్తానని 2014 జూలై 28న చంద్రబాబు బీరాలు
- 2019 మే 29 నాటికి రూ.68,293.94 కోట్లు వ్యయం చేసినా నిష్ఫలం
- ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయని దుస్థితి
- అంచనాలు పెంచేసి.. ప్రభుత్వ ఖజానాను కాంట్రాక్టర్లకు దోచిపెట్టింది చంద్రబాబే
- వారి నుంచి కమీషన్లు వసూలు చేసుకున్నదీ చంద్రబాబే
- ఆ దోపిడీలో మీకూ వాటా ఉన్నందుకే అప్పట్లో నోరెత్తలేదన్నది నిజం కాదా రామోజీ?

సాక్షి, అమరావతి

రాష్ట్ర విభజన నేపథ్యంలో కేవలం ఐదు లక్షల ఓట్ల ఆధిక్యంతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. సాగునీటి ప్రాజెక్టులను కమీషన్లు కురిపించే కామధేనువుగా మల్చుకున్నారు. కమీషన్లు ఇవ్వని కాంట్రాక్టర్లపై 60-సీ నిబంధన కింద వేటు వేశారు. ఆపై అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచేశారు. వాటిని అస్మదీయ కాంట్రాక్టర్లకు అప్పగించి, చేయని పనులకు కూడా బిల్లులు చెల్లించి ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారు. 2014 జూన్ 8 నుంచి 2019 మే 29 వరకు ఇదే లక్ష్యంగా సాగిన పాలనపై పల్లెత్తు పదం రాయని రామోజీ.. ఉల్టా చోర్ కొత్వాల్ కా డాంటే అన్నట్లు.. అంటే దొంగే దొంగా దొంగా అని అరిచినట్లు ఇప్పుడు రోత రాతలు రాస్తున్నారు. నిజంగా ఈ సామెత నాడు దోపిడీలో భాగస్వామియైన 'ఈనాడు' రామోజీకి అతికినట్లు సరిపోతుంది.



చంద్రబాబు నేతృత్వంలోని గజదొంగల ముఠాలో సభ్యుడైన రామోజీరావుకు ఈ నాలుగేళ్లుగా రాష్ట్రంలో ప్రతిదీ తప్పుగానే కనిపిస్తోంది. సీఎం జగన్ ప్రభుత్వం ఏం చేసినా అందులో కోడిగుడ్డుపై ఈకలు పీకడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. గత చంద్రబాబు పాలనలో సాగు నీటి రంగం కుదేలైనప్పటికీ మారుమాట్లాడని ఈ పెద్దమనిషి ఇప్పుడు నీతులు చెబుతున్నారు. 'నిర్మించకుండా వంచన.. అడ్డగోలుగా అంచనా' అంటూ మంగళవారం మరోమారు విషం కక్కారు. ఎందుకంటే.. డీపీటీ (దోచుకో.. పంచుకో.. తినుకో..) పద్ధతిలో ప్రభుత్వ ఖజానాను అప్పట్లో దోచుకున్నారు కాబట్టి. ఇప్పుడూ చంద్రబాబు హయాంలో సాగినట్లు సాగుతోందని భ్రమపడి వాస్తవాలను వక్రీకరించారు. ఈ దుష్ప్రచార కథనంలో ఆరోపణలు.. **వాస్తవాలు** ఇలా ఉన్నాయి.



ఆరోపణ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల పనులు పడకేశాయి. సవరించిన అంచనాలతో ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోంది. సాగు, తాగునీటి సౌకర్యం మృగ్యం.

వాస్తవం: సాగునీటి ప్రాజెక్టులపై ఖర్చు పెట్టే ప్రతి పైసా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా వైఎస్ జగన్ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రాధాన్యతా క్రమంలో వడివడిగా ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. గతేడాది నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేసి.. జాతికి అంకితం చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్ పెన్నా డెల్టాను సస్యశ్యామలం చేశారు. గాలేరు–నగరి సుజల స్రవంతి పథకంలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్, హంద్రీ–నీవా నుంచి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని 68 చెరువులను నింపే పథకం పూర్తి చేశారు. వెలిగొండ మొదటి సొరంగం ఇప్పటికే పూర్తి చేశారు. రెండో సొరంగం దాదాపుగా పూర్తి కావస్తోంది. వెలిగొండ తొలి దశ దాదాపుగా పూర్తయింది. వంశధార–నాగావళి అనుసంధానం, వంశధార స్టేజ్–2 ఫేజ్–2 కూడా పూర్తి కావస్తోంది. పోలవరం, తోటపల్లి బ్యారేజ్, తారకరామతీర్థసాగరం నుంచి హంద్రీ–నీవా వరకు అన్ని ప్రాజెక్టులనూ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారు. 2019 మే 30 నుంచి ఇప్పటి వరకు సాగునీటి ప్రాజెక్టులపై రూ.28 వేల కోట్లు వ్యయం చేసి, 5.03 లక్షల ఎకరాలకు నీళ్లందించారు. పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మినహా జలయజ్ఞం కింద చేపట్టిన 40 ప్రాజెక్టుల్లో మిగిలిన పనులను పూర్తి చేయడానికి రూ.17,368 కోట్లు అవసరమని 2014 జూలై 28న సాగునీటి ప్రాజెక్టులపై విడుదల చేసిన శ్వేతపత్రంలో చంద్రబాబు స్పష్టం చేశారు. 2014 జూన్ 8 నుంచి 2019 మే 29 వరకు చంద్రబాబు రూ.68,293.34 కోట్లు ఖర్చు చేశారు. కానీ.. ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారు. కేవలం 3.4 లక్షల ఎకరాల పాత, కొత్త ఆయకట్టుకు మాత్రమే నీళ్లందించగలిగారు. దీన్ని బట్టి చూస్తే అడ్డగోలుగా అంచనాలు పెంచింది.. పనులు చేయకుండా వంచించింది.. బిల్లులు కాజేసింది చంద్రబాబేనన్నది నిజం కాదా రామోజీ?

ఆరోపణ: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అంచనా వ్యయం 2019లో రూ.2022.20 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.18,271.31 కోట్లకు.. వెలిగొండ ప్రాజెక్టు అంచనా రూ.5,564.22 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.8,054.30 కోట్లకు ఇలా ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని రూ.24,827.23 కోట్లకు పెంచేశారు. నిర్మాణాలు చేపట్టడం లేదు. చింతలపూడి ఎత్తిపోతల అంచనాను రూ.4,909 నుంచి రూ.9,543 కోట్లకు పెంచుతూ ప్రతిపాదనలు పంపారు.

వాస్తవం: పోలవరం ఎడమ కాలువ నుంచి 63.2 టీఎంసీలను తరలించి.. ఉత్తరాంధ్రలో 8 లక్షల ఎకరాలకు నీళ్లందించాలనే లక్ష్యంతో రూ.7,214.10 కోట్లతో 2009లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. ఈ పథకంలో తొలి దశ కింద 5.8 టీఎంసీలను తరలించే పనులను రూ.2022.20 కోట్లతో 2018లో చంద్రబాబు చేపట్టారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం 63.2 టీఎంసీలను తరలించి.. ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో రూ.17,050.20 కోట్లతో పనులు చేపట్టడానికి 2022 జూన్ 17న అనుమతి ఇచ్చింది. భూసేకరణ చట్టం 2013 ప్రకారం భూసేకరణ వ్యయం, నిర్వాసితుల పునరావాస వ్యయం, 2019 నాటితో పోల్చితే పనుల పరిమాణం పెరిగింది. దీని వల్లే అంచనా వ్యయం పెరిగింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని డిజైన్లను ఇప్పటికే జల వనరుల శాఖ ఆమోదించింది. భూ సేకరణ చేస్తూ వడివడిగా ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇక వెలిగొండ ప్రాజెక్టును 2016, 2017, 2018, 2019 నాటికి పూర్తి చేస్తానంటూ చంద్రబాబు ఎప్పటికప్పుడు మాటలు మార్చుతూ వచ్చారు. సొరంగాల తవ్వకంలో ఉపయోగించే టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం)లకు మరమ్మతుల పేరుతో రూ.66 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చి.. వాటిని మింగేశారు. రెండు సొరంగాల పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై వేటు వేసి.. అంచనా వ్యయాన్ని పెంచి.. అస్మదీయులకు అప్పగించిన చంద్రబాబు కమీషన్లు వసూలు చేసుకున్నారు తప్ప పనులు చేయలేదు. జగన్ అధికారంలోకి వచ్చాక వెలిగొండను ప్రాధాన్యతగా చేపట్టి.. 2021 జనవరి 13 నాటికే మొదటి సొరంగాన్ని పూర్తి చేశారు. రెండో సొరంగం దాదాపుగా పూర్తికావొచ్చింది. నల్లమలసాగర్ నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతోపాటు భూసేకరణ చేయాల్సి ఉంది. డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టాల్సి ఉంది. అందువల్లే వాటి అంచనా వ్యయం పెరిగింది. చింతలపూడి ఎత్తిపోతలను 53.5 టీఎంసీల మేరకు చేపట్టినా జల్లేరు రిజర్వాయర్ నిల్వ సామర్థ్యాన్ని ఎనిమిది టీఎంసీలకే అప్పట్లో పరిమితం చేశారు. ఇప్పుడు ఆ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 14 టీఎంసీలకు పెంచారు. దీని వల్ల అదనంగా భూసేకరణతోపాటు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. అందువల్లే దాని అంచనా వ్యయం పెరిగింది. ఇంత చిన్న విషయం మీకు తెలియదా రామోజీ?

అడ్డగోలుగా అంచనాల పెంపు అంటే ఇదీ

- విభజన చట్టం ప్రకారం కేంద్రమే కట్టాల్సిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కమీషన్ల కోసం ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టి మరీ 2013–14 ధరలతోనే పూర్తి చేస్తానని అంగీకరిస్తూ 2016 సెప్టెంబరు 7న చంద్రబాబు దక్కించుకున్నారు. ఆ మరుసటి రోజే అంటే 2016 సెప్టెంబరు 8న పోలవరం హెడ్ వర్క్స్ అంచనా వ్యయాన్ని 2015–16 ధరలను వర్తింపజేస్తూ రూ.5,535.41 కోట్లకు పెంచేశారు. ఇదీ వంచన అంటే. అడ్డగోలుగా అంచనాల పెంపు అంటే ఇదీ రామోజీ! అందులో రూ.2,917.78 కోట్ల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో తన కొడుకు వియ్యంకుడికి చెందిన నవయుగకు చంద్రబాబు కట్టబెట్టడంతో అప్పట్లో మీరు నోరుమెదపలేదన్నది వాస్తవం కాదా రామోజీ?
- గాలేరు–నగరి సుజల స్రవంతి పథకం తొలి దశలో 27వ ప్యాకేజీలో 2014 నాటికి రూ.11 కోట్ల విలువైన పని మిగిలింది. ఆ కాంట్రాక్టర్‌పై 60–సీ నిబంధన కింద వేటు వేసి, అంచనా వ్యయాన్ని రూ.112.83 కోట్లకు పెంచేసి.. దొడ్డిదారిన సీఎం రమేష్‌కు అప్పగించింది ఎవరు? ప్రభుత్వ ఖజానా నుంచి రూ.వంద కోట్లకుపైగా దోచిపెట్టి కమీషన్లు వసూలు చేసుకున్నది చంద్రబాబు కాదా? దీనిని వంచన, దోపిడీ అనక ఇంకేమంటారు రామోజీ?

క్లుప్తంగా...

కళ్లున్న కబోదుల్లా చంద్రబాబు టీం

- మంత్రి మేరుగు నాగార్జున




తిరుమల: ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన టీం అంతా కళ్లున్న కబోదుల్లాగా ఉన్నారని రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. ఆయన మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్రంలో సామాజిక విప్లవం తెచ్చారని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 60 లక్షల దొంగ ఓట్లను చంద్రబాబు సృష్టించారన్నారు.

దొంగ ఓట్లపై చంద్రబాబు ఫిర్యాదు హాస్యాస్పదం: మంత్రి ఉషశ్రీ

చంద్రబాబు హయాంలో దొంగ ఓట్లు పెద్ద ఎత్తున చేర్పించారని, ఇప్పుడు ఆయనే ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. ఆమె మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఎక్కడ వెళ్లి ఫిర్యాదు చేసినా సత్యం ఏమిటనేది ప్రజలకు తెలుసని అన్నారు.

అవినీతి నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు




సాక్షి, రాజమహేంద్రవరం: పౌర సరఫరాల శాఖలో అవినీతి నిర్మూలనతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన సేవలందించేందుకు చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మాల్స్‌పై దాడులు చేసి తూకం, ధర విషయంలో మోసం చేస్తున్న వారి నుంచి పెద్ద మొత్తంలో అపరాధ రుసుం వసూలు చేస్తున్నట్లు చెప్పారు. దొంగ ఓట్లు సృష్టించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గతంలో గాది కింద పందికొక్కుల్లా ఇసుక తిన్న టీడీపీ నేతలు ఇప్పుడు ఇసుకపై ఆందోళనలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఇసుక గజ దొంగ చంద్రబాబే: ఎంపీ సురేష్



సాక్షి, అమరావతి: ఇసుక దొంగ చంద్రబాబేనని, ఆయన హయాంలో దారుణంగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ మండిపడ్డారు. ఆయన మంగళవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిన్నారని చెప్పారు. ఇసుక తరలింపును అడ్డుకున్న ఎమ్మార్వో వనజాక్షిని చింతమనేని కొడితే, ముఖ్యమంత్రి హోదా మర్చిపోయి, ముఠా నాయకుడిలా చంద్రబాబు సెటిల్‌మెంట్ చేశారని మండిపడ్డారు. నాడు ఇసుక గజదొంగ చంద్రబాబు అయితే చిన్న దొంగలు టీడీపీ మంత్రులు, పిల్ల దొంగలు జన్మ భూమి కమిటీలని అన్నారు. నేడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇసుక అక్రమం అనేది లేదని చెప్పారు.

చిరునవ్వుతో డ్యూటీ చేయాలి: ఆర్టీసీ ఎండీ



సాక్షి, అమరావతి: చిరునవ్వుతో డ్యూటీ చేయడం ఒక మంచి అలవాటు అని, అలాంటి వారు ఎంత పని అయినా తేలికగా చేస్తారని, ఆర్టీసీ ఉద్యోగులు ఆ మార్గంలో నడవాలని ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. విజయవాడ విద్యాధరపురంలోని ఆర్టీసీ ట్రాన్స్‌పోర్టు అకాడమీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో తనిఖీ అధికారులు(స్క్వాడ్) పని తీరును ఆయన సమీక్షించారు. ఉత్తమ విధి నిర్వహణకు గాను 12 మందికి రూ.వెయ్యి చొప్పున అందించారు.

తెలంగాణ

సీఐఎంసీ ప్యానెల్ సభ్యుడిగా జస్టిస్ రమణ



సాక్షి, హైదరాబాద్: సింగపూర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ సెంటర్ (సీఐఎంసీ) ప్యానెల్ సభ్యుడిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నియమితులయ్యారు. సింగపూర్ కన్వెన్షన్ వీక్‌లో పాల్గొనడానికి వెళ్లిన ఆయన సీఐఎంసీ చైర్మన్ జార్జి లిమ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సభ్యుడిగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ప్రముఖ కంపెనీలు టాటా, రిలయన్స్, మహీంద్రా, ఆదిత్య బిర్లా గ్రూప్‌లతోనూ జస్టిస్ రమణ సమావేశమయ్యారు. మధ్యవర్తిత్వానికి మద్దతు ఇచ్చే నిమిత్తం 'డిక్లరేషన్ ఆఫ్ ఇంటెంట్'పై సంతకం చేయడానికి ఈ సంస్థలు ముందుకువచ్చాయి.

మీ ఫ్యామిలీ డాక్టర్‌తో చర్చించండి రామోజీ

ఇంతగా దిగజారిపోతున్నది చంద్రబాబు కోసమేగా?

- రాష్ట్ర ప్రభుత్వంపై రోజూ బురదజల్లడమే మీ లక్ష్యం
- వైద్య రంగం ప్రగతిపై సర్వత్రా ప్రశంసలు
- ప్రత్యేకించి 'ఫ్యామిలీ డాక్టర్'పై గ్రామీణుల్లో ఆనందం
- ఊళ్లోనే వైద్య సేవలు అందుతున్నాయని సంతృప్తి
- ఇది జీర్ణించుకోలేకే అరకొర వైద్యం అంటూ తప్పుడు రాతలు

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంపై కూడా ఈనాడు రామోజీ రావు అక్కసు వెళ్లగక్కారు. ఈ విధానం వల్ల తమకెంతో మేలు చేకూరుతోందని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సంతోష పడుతుంటే రామోజీ మాత్రం దీనిపై కూడా విషం కక్కారు. 'వైద్య సేవల్లోనూ ప్రచార కక్కుర్తి' అంటూ చంద్రబాబు కోసం ఎంత బరితెగింపుకైనా సిద్ధమని చాటుకున్నారు. రాష్ట్రంలో వైద్య రంగం ప్రగతి గురించి, ప్రత్యేకించి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ గురించి మీ ఫ్యామిలీ డాక్టర్‌తో చర్చించే దమ్ముందా రామోజీ?

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజారోగ్య రంగం, 104, 108 సేవల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోవడంతో పాటు 'ఫ్యామిలీ డాక్టర్' విధానంతో గ్రామీణుల ముంగిటకే వైద్య సేవలు అందుబాటులోకి వస్తే సంతోషించాల్సింది పోయి ఈనాడు రామోజీ ఏడుస్తున్నారు. తన విష ప్రచారంతో వాస్తవాలకు ముసుగు వేయడానికి విఫలయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 104 సంచార వైద్య సేవలను స్వల్ప మార్పులతో ఫ్యామిలీ డాక్టర్‌గా మార్చి ఈ ప్రభుత్వం హడావుడి చేస్తోందంటూ వక్రభాష్యం పలికారు. అప్పట్లో కేవలం 277 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)లతో మొక్కుబడిగా సేవలు నడిపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 104 సేవలకు ఊపిరిపోశారు. ఏకంగా రూ.211 కోట్లతో 936 నూతన ఎంఎంయూ వాహనాలను కొనుగోలు చేసి సేవలను విస్తరించారు. దీనికి కొనసాగింపుగా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారు.

1676 మంది వైద్యుల నియామకం

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామీణ ప్రజలకు సక్రమంగా సేవలందించేందుకు ప్రతి మండలానికి కనీసం రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో తెచ్చేందుకు కొత్తగా 88 పీహెచ్‌సీలు, 63 చోట్ల సీహెచ్‌సీలు కేంద్రంగా కో లొకేటెడ్ పీహెచ్‌సీలను మంజూరు చేశారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు చేపట్టారు. దీంతో పాటు కొత్త పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. ఇలా ఏకంగా 1,676 మంది వైద్యాధికారుల్ని శాశ్వత ప్రాతిపదికన నియమించారు. అదనంగా 104 మంది వైద్యుల పోస్టుల్ని ప్రభుత్వం మంజూరు చేసింది. 175 మంది పూల్ డాక్టర్లను అందుబాటులోకి తెచ్చింది. 10,032 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రతి చోట బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన వారిని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)గా నియమించారు. ప్రస్తుతం విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో 105 రకాల మందుల్ని అందుబాటులో ఉంచారు. ఏఎన్ఎం, ఆశావర్కర్‌లు ఆయా గ్రామాల్లో సేవలందిస్తున్నారు.

ఆరోగ్య పరిస్థితులపై అవగాహన

ప్రస్తుత విధానంలో పీహెచ్‌సీ పరిధిలోని విలేజ్ క్లినిక్స్‌ను ఇద్దరు శాశ్వత వైద్యులకు సమానంగా మ్యాప్ చేశారు. దీంతో వారు నెలలో రెండు సార్లు ప్రతి విలేజ్ క్లినిక్ పరిధిలో పర్యటిస్తున్నారు. క్రమం తప్పకుండా గ్రామాలకు వెళుతుండటంతో ఆయా గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులు, సమస్యలు, ఇతర అంశాలపై వైద్యులకు ఓ అవగాహన ఉంటోంది. వైద్యుడు, రోగికి మధ్య బంధం బలపడుతోంది. మంచానికి పరిమితం అయిన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. మందుల కొరత తలెత్తకుండా ఎప్పటికప్పుడు వివరాల్ని ట్యాబ్‌లలో నమోదు చేస్తున్నారు.

97 లక్షల మందికి సేవలు

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 3,11,74,218 జనాభాకు గాను 97,43,726 మంది కనీసం ఒక్కసారైనా (31 శాతం మంది) వైద్య సేవల్ని అందుకున్నారు. ఇప్పటి వరకు 68,24,258 మందికి సాధారణ వైద్య సేవలు, 12,46,335 మంది రక్తపోటు వ్యాధిగ్రస్తులు, 8,73,440 మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు, రక్తపోటు.. మధుమేహం రెండూ ఉన్న వారు 9,21,951 మందికి సేవలందించారు. 4,90,736 మంది గర్భిణిలు, 3,07,140 మంది బాలింతలు, 57,582 మంది రక్తహీనత బాధితులు సేవలు అందుకున్నారు.

కేంద్రం ప్రశంసలు గుర్తు లేవా?

ఇటీవల డెహ్రాడూన్‌లో కేంద్ర ప్రభుత్వం చింతన్ సివిర్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం ఉత్తమ ఆరోగ్య విధానాల్లో ఒకటి అని కేంద్రం ప్రశంసించింది. వైద్య శాఖలో నియామకాలపై కూడా హర్షం వ్యక్తమైంది. ఈ విషయాలను సైతం విస్మరించి.. రామోజీరావు తప్పుడు రాతలు రాయడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ రంగంలో ఏకంగా 53 వేలకుపైగా పోస్టులను భర్తీ చేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పరిధిలో స్పెషలిస్టు వైద్యుల కొరత 61 శాతం ఉండగా, ఏపీలో కేవలం 5 శాతం మాత్రమే ఉంది. ఈ ఖాళీలను కూడా భర్తీ చేయడానికి నిరంతరం మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నియామకాల్ని చేపడుతోంది. 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, ఇందులో ఈ ఏడాది నుంచి ఐదు ప్రారంభిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఈ ప్రభుత్వం పెద్ద ఎత్తున కొనుగోలు చేసింది. ఇవన్నీ మీకు కనిపించడం లేదా రామోజీ?

బీజేపీ గేట్లు పట్టుకుని వేలాడుతోంది ఎవరు బాబూ?

- నువ్వు గేట్లు తీస్తే మా పార్టీ ఉండదా? బుర్ర పాడైందా?
- ఉగాది తర్వాత టీడీపీ కనుమరుగే
- చంద్రబాబుపై మంత్రి బొత్స ధ్వజం



సాక్షి, అమరావతి: ఢిల్లీలో బీజేపీ గేట్లు పట్టుకుని వేలాడుతోంది ఎవరని ప్రతిపక్ష నేత చంద్రబాబును రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. బాబు ఢిల్లీలో మాట్లాడుతూ తాము గేట్లు తెరిస్తే వైఎస్సార్‌సీపీ ఉండదని అనడంపై మండిపడ్డారు. ఆయన ఢిల్లీకి వెళుతుందే ఎప్పుడు బీజేపీ గేట్లు తెరుస్తుందా.. దూరదామనేనని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రి బొత్స మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఉనికి కోసం పాట్లు పడుతూ తమ పార్టీ ఉండదంటున్నారని దుయ్యబట్టారు. ఆయనొక జిత్తులమారి ముసలి నక్క అని అభివర్ణించారు. ఏ ఎండకా గొడుగు పట్టడంలో బాబు నిష్ణాతుడని రాష్ట్ర ప్రజానీకానికి అందరికీ తెలుసన్నారు. తాను ఎవరినైతే వెన్నుపోటు పొడిచారో, ఏ మహానుభావుడి మృతికి కారకుడయ్యారో ఆయన కార్యక్రమానికి చంద్రబాబు వెళ్లారని విమర్శించారు. 'నువ్వు బీజేపీతో చెలిమి చేస్తావో.. ఎవరిని పొగుడుతావో పొగుడుకో.. నువ్వు గేట్లు తీస్తే మా పార్టీ ఉండదని అనడం ఏమిటి..? మతిపోయిందా..? బుర్ర పాడైందా..?' అని బొత్స నిప్పులు చెరిగారు. తాను మొన్ననే చెప్పానని.. ఉగాది తర్వాత టీడీపీ కనుచూపు మేరలో ఉండదని మంత్రి బొత్స తేల్చి చెప్పారు. దివంగత సీఎం వైఎస్సార్ ఆశయాలతో పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని తెలిపారు. ప్రజా సంక్షేమంలో తన తండ్రి ఒకడుగు వేస్తే.. తాను రెండడుగులు వేస్తానని చెప్పి.. ఆ దిశగా వైఎస్ జగన్ పరిపాలిస్తున్నారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం పూర్తి చేసిన తమ పార్టీకి ధైర్యంగా మాట్లాడే పేటెంట్ ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కుర్రాడు, బచ్చా అంటూ చంద్రబాబు తూలనాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. బాబొక మాట అని తిరిగి మరో మాట అనిపించుకోవడం దేనికని ప్రశ్నించారు. బాబు మాటతీరు మార్చుకోవాలని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ పార్టీకి ఇవ్వని గొప్ప తీర్పును ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఇచ్చారని మంత్రి బొత్స గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని చంద్రబాబుకు సవాల్ విసిరారు. జగన్ ఆలోచనలు, ఆయన పరిపాలన ఏంటో అప్పుడు తెలుస్తుందన్నారు.

సోమవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో చంద్రబాబు, దగ్గుబాటి, పురందేశ్వరి, సీఎం రమేశ్



ఢిల్లీలో డ్రామా!

రెండో రోజూ హస్తినలో మోదీ సర్కారుపై ప్రేమ ఒలకబోసిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: పార్టీ భవిష్యత్‌పై ఆశలు ఆవిరవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలో కూరుకుపోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తాజాగా బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీలో పెద్ద డ్రామానే నడిపారు! ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమాన్ని ఇందుకు వినియోగించుకున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తరువాత రెండో రోజు ఢిల్లీలో ఎంపిక చేసుకున్న విలేకరుల సమక్షంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు విసరడం చర్చనీయాంశమైంది. తాను మొదటి నుంచి కేంద్రంలో పొత్తులోనే ఉన్నానంటూ బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన ప్రయత్నించారు. ప్రత్యేక హోదా కోసమే గతంలో తాను ఎన్డీయే నుంచి బయటకు వచ్చానంటూ తాజాగా చంద్రబాబు మరోసారి నాలుక మడతేశారు. 'హోదా ఏమైనా సంజీవనా..? ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అధికారంలో ఉండగా అర్ధరాత్రి తాను ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే భ్రమతో తనకు అలవాటైన రీతిలో చంద్రబాబు అలవోకగా అబద్ధాలు చెప్పేశారు. పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టుల కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు తాకట్టు పెట్టిన విషయం జనం మది నుంచి చెదిరిపోలేదు. రామోజీరావు, యనమల రామకృష్ణుడు వియ్యంకులను కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి ప్రాజెక్టు సొమ్మును ఏటీఎంలా వాడుకుని డబ్బులు దండుకున్న విషయాన్ని ప్రజలెవరూ ఎప్పటికీ మరువలేరు! ఇవన్నీ ఎవరికీ గుర్తుండవనే ఉద్దేశంతో బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతూ చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలాడారు!

ప్రజా వ్యతిరేకత నుంచి బయటపడేందుకు ఎన్డీఏ నుంచి బయటకు

చంద్రబాబు అధికారంలో ఉండగా రాజధాని అమరావతి పేరుతో భారీ అంతర్జాతీయ స్కామ్‌కు తెరతీయడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రాజధాని ముసుగులో ఆయన చేసిన అక్రమాలు బయటపడడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వెల్లి విరిసింది. దీన్ని కేంద్ర ప్రభుత్వంపై మళ్లించడం కోసం తన పాలన చివరి సంవత్సరంలో చంద్రబాబు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లుగా ఎన్నికల్లో ఆయన అంచనాలు బెడిసికొట్టి చిత్తుచిత్తుగా ఓడిపోయారు. వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. దీంతో చంద్రబాబు వెంటనే బీజేపీలోకి తన కోవర్టులను ప్రవేశపెట్టారు. తన మిత్రుడైన పవన్ కళ్యాణ్‌ను సైతం కాషాయ ఫ్రంట్‌లో చేర్చారు. ఘోర ఓటమి తర్వాత మళ్లీ ఎలాగైనా బీజేపీ పంచన చేరడానికి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ఆ ప్రయత్నాలకు తోడు తాజాగా పురందేశ్వరితో రాజీ చేసుకుని బీజేపీతో పొత్తు అవసరాలకు వాడుకున్నారు. ఇటీవలే బీజేపీ అధ్యక్షురాలైన పురందేశ్వరి కుటుంబంతో చంద్రబాబుకు రాజీ కుదిరింది. బీజేపీలో ఉంటూ చంద్రబాబుకు సహకరించేందుకు పురందేశ్వరి అంగీకరించారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమం సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు చంద్రబాబును దగ్గర చేసేందుకు ఆమె తాపత్రయపడ్డారు.

నాణెం విడుదల కార్యక్రమానికి సతీమణిని పిలవరా?


పురందేశ్వరి చంద్రబాబు ఏజెంటులా పనిచేస్తున్నారని ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీ పార్వతి ఆరోపించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమాన్ని ఆయన సతీమణిని పిలవకుండా నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్టీఆర్‌ను చివరి దశలో వంచించి వేధించిన కుటుంబ సభ్యులంతా ఇప్పుడు మరోసారి ఆయన భార్యను అవమానించారు. వేలాది మంది సమక్షంలో లక్ష్మీ పార్వతిని తన భార్యగా ఎన్టీఆర్ బహిరంగంగానే ప్రకటించిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. ఆమెను కార్యక్రమానికి రానివ్వకుండా గూడుపు ఠాణి చేసి కేవలం చంద్రబాబుకు సన్నిహితులైన కుటుంబ సభ్యులు మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరయ్యేలా చేశారు. ఇందులో ఎలాంటి గూడుపుఠాణి లేకపోతే లక్ష్మీపార్వతిని పిలవవచ్చు కదా? అనే ప్రశ్నకు సమాధానం లేదు.

ఆ వంకతో నడ్డాతో చంద్రబాబు భేటీ

ఇక ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమం వంకతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో చంద్రబాబు వంగి వంగి మంతనాలాడారు. ఈ భేటీలో టీడీపీ కోవర్టులు తప్ప మిగిలిన పాత బీజేపీ నేతలు ఎవరూ లేకపోవడం కొసమెరుపు. అక్కడ చంద్రబాబు తన పొత్తు ప్రతిపాదనలను నడ్డా ఎదుట పెట్టి ఎలాగైనా పొత్తు కుదిరేలా చూడాలని కోరారు. నడ్డా నుంచి ఆశించిన స్పందన వచ్చిందో లేదో తెలియదు గానీ రెండో రోజు చంద్రబాబు ఎంపిక చేసిన విలేకరుల కోసం లంచ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అక్కడ మోదీ సర్కార్‌పై తన ప్రేమను చాటుకున్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మంచి సంబంధాలు అవసరమని తాజాగా చంద్రబాబు ప్రవచించారు. చంద్రబాబు తాను సీఎంగా ఉండగా ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు నల్లజెండాలు ఎగరేయడం, నిరసన తెలియచేస్తూ హోర్డింగ్‌లు పెట్టడం, బీజేపీ అగ్రనేత అమిత్‌షా కారు మీద తిరుపతిలో రాళ్లతో దాడి చేయించిన విషయాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించటాన్ని నెటిజన్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. బీజేపీతో పొత్తు కోసం శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు మరోసారి ఎన్టీఆర్ పేరును ఉపయోగించుకున్నారు. ఎన్టీఆర్ స్మారక నాణెం కార్యక్రమాన్ని తన పొత్తు చర్చల కోసం వినియోగించుకుని మరోసారి ఆయనకు వెన్నుపోటు పొడిచారు.

పొత్తులు మాకు కొత్త కాదు

- పొత్తు ఎవరితో అనేది ఎన్నికల సమయంలో తెలుస్తుంది
- రాజకీయ అనుభవం ఉన్నవాళ్లు మోదీని విమర్శించట్లేదు
- టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీతో అయినా పొత్తులకు ఆస్కారం ఉంటుందని, అయితే ఎవరితో పొత్తు అనేది మాత్రం ఎన్నికల సమయంలో తెలుస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పొత్తుల అంశం టీడీపీకి కొత్త కాదన్నారు. 1980 నుంచే నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీఏ ప్రభుత్వాల్లో టీడీపీ భాగస్వామిగా ఉందని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా డిమాండ్‌ను నెరవేర్చనందువల్లే ఎన్డీఏ ప్రభుత్వం నుంచి తాము బయటకు వచ్చామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, రాష్ట్రాన్ని పునర్నిర్మించే క్రమంలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలతో కలసి పని చేయాల్సి ఉంటుందన్నారు. మంగళవారం ఢిల్లీలో తెలుగు మీడియాతో చిట్‌చాట్‌లో చంద్రబాబు మాట్లాడారు. విపక్షాలు ఏర్పాటు చేసిన 'ఇండియా' కూటమిపై అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ 'ఇండియా కూటమి ఎలా ముందుకు వెళుతుందో చూడాలి. కూటమికి లీడర్ లేకపోవడం బీజేపీకి అనుకూల అంశం. కూటమికి ఎవరు నాయకత్వం వహించాలన్న దానిపై కామెంట్ చేయను' అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ పాలన గురించి విలేకరులు ప్రస్తావించగా.. రాజకీయ అనుభవం ఉన్న వాళ్లెవరూ మోదీని విమర్శించడం లేదని చెప్పారు. తన వయసు గురించి మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలకు మోదీ వయసు గురించి మాట్లాడే దమ్ముందా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని చెప్పారు. తెలంగాణలో బీజేపీతో పొత్తులకు సమయం మించిపోయిందని తెలిపారు.

'ఈనాడు'పై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి

- మే 12న 'పోలవరం.. జగమంత వైఫల్యం' శీర్షికన కథనం
- ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలనే కుట్రతో నిరాధార ఆరోపణలు
- దీనికి బాధ్యులైన ఎండీ, ప్రింటర్ – పబ్లిషర్, ఎడిటర్, బ్యూరో చీఫ్, జర్నలిస్టులపై పరువునష్టం దావాతోపాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్
- జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: త్వరితగతిన పోలవరం ప్రాజెక్టు పూర్తికి చిత్తశుద్ధితో వడివడిగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలతో బురదజల్లుతూ.. వాస్తవాలను వక్రీకరించిన ఈనాడు దినపత్రికపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. గత మే 12న 'పోలవరం.. జగమంత వైఫల్యం' శీర్షికన కథనాన్ని ప్రచురించిన ఆ పత్రిక మేనేజింగ్ డైరెక్టర్, ప్రింటర్–పబ్లిషర్, ఎడిటర్, బ్యూరో చీఫ్‌లపై క్రిమినల్ ప్రొసిజర్ కోడ్–1973లో సెక్షన్ 199 (4)(బీ) కింద కోర్టులో పరువునష్టం దావా వేయడంతోపాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలనే దురుద్దేశంతో నిరాధారమైన, కుట్రపూరితమైన ఆరోపణలు చేస్తూ ప్రచురించిన కథనంలో పాలుపంచుకున్న జర్నలిస్టులపై కూడా క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు అనుమతిచ్చారు. హైకోర్టులో తక్షణమే వారిపై పరువునష్టం దావా వేయడంతోపాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సూచించారు.

టీడీపీ దొంగ ఓట్ల అడ్డా.. బాపట్ల

ఎన్నికల సంఘానికి అధికార పార్టీ నేతల ఫిర్యాదులు

- పర్చూరులో మొదలై అన్ని నియోజకవర్గాలకు వ్యాప్తి
- అత్యధికంగా పర్చూరులో 13 వేల ఫారం-7 దరఖాస్తులు
- రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లోనూ అత్యధికంగా అక్రమ ఓట్లు
- గత ఎన్నికల్లో ఆ ఓట్లతోనే పలు నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు
- ఎన్నికల సంఘానికి అధికార పార్టీ నేతల ఫిర్యాదు
- తప్పుడు ఫిర్యాదులతో టీడీపీ దొంగ నాటకాలు



➤ కృష్ణజిల్లా నాగాయలంకలో ఉంటున్న జాగర్లమూడి లక్ష్మీతులసికి బాపట్ల జిల్లా పర్చూరు మండలం దేవరపల్లి పోలింగ్ బూత్ 148లో, మార్టూరు మండలం బొల్లాపల్లి పోలింగ్ బూత్ నంబర్ 70లో రెండు చోట్లా ఓట్లు ఉన్నాయి.

➤ పర్చూరు మండలం నూతలపాడులో ఉంటున్న మిరియా చాయమ్మకు దేవరపల్లి 148 పోలింగ్ బూత్, నూతలపాడు 159 బూత్‌లో ఓట్లు ఉన్నాయి.

➤ సోమేపల్లి చిన్నవెంకటేశ్వర్లు తండ్రి వెంకటాద్రి హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయనకి హైదరాబాద్‌లో ఓటు ఉంది. దాంతోపాటు దేవరపల్లి పోలింగ్ బూత్ 148లో సీరియల్ నంబర్ 631లో కూడా ఓటు ఉంది.

➤ హైదరాబాద్‌లో నివాసం ఉండే కొమ్మాలపాటి వీరాంజనేయులుకు దేవరపల్లి 148 పోలింగ్ బూత్‌లో సీరియల్ నంబర్ 581తో ఓటు ఉంది. హైదరాబాద్ శేరిలింగంపల్లి పోలింగ్ బూత్ నంబర్ 430లో సీరియల్ నంబర్ 247తోనూ ఓటు ఉంది.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తెలుగుదేశం పార్టీ దొంగ ఓట్లకు బాపట్ల జిల్లాను అడ్డాగా మార్చుకుంది. ఇక్కడ వెల్లడైన దొంగ ఓట్ల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒక్క పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గంలోనే వేల సంఖ్యలో దొంగ ఓట్లు ఉన్నట్లు వెల్లడైంది. ఈ విషయాన్ని అధికారపార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ జిల్లా అధికారులు, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దొంగ ఓట్లను తొలగించాలని ఒక్క పర్చూరు నుంచే 12,944 ఫారం-7 దరఖాస్తులను స్థానికులు అధికారులకు సమర్పించారు. దశాబ్దాల క్రితం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు చాలా మంది ప్రస్తుతం ఉన్న ప్రాంతాలతోపాటు పర్చూరులోనూ ఓట్లు ఉంచుకున్నారు. కొందరు రెండు చోట్లా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. వేల సంఖ్యలో ఉన్న అక్రమ ఓట్లతోనే పర్చూరు, రేపల్లె, అద్దంకి నియోజకవర్గాల్లో టీడీపీ వరుసగా గెలుస్తోందన్న విషయం అందరికీ తెలిసిందే. వీటితోపాటు వేమూరు, బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లోనూ టీడీపీ దొంగ ఓట్లను పెద్ద ఎత్తున చేర్పించుకొన్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని అధికారపార్టీకి చెందిన మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్, అద్దంకి ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దొంగ ఓట్లు తొలగించాలని ఫారం-7 దరఖాస్తులను సమర్పించారు. వేమూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 2,407 ఫారం-7 దరఖాస్తులు ఇవ్వగా రేపల్లెలో 5,544, బాపట్లలో 3,155, అద్దంకిలో 2,619, చీరాలలో 1,870 ఫారం-7 దరఖాస్తులు ఇచ్చినట్లు సమాచారం. దీంతోపాటు అక్రమ ఓట్ల జాబితానూ ఎన్నికల అధికారులకు అందిస్తున్నారు.

దొంగ ఓట్లు తొలగిస్తాం



జిల్లావ్యాప్తంగా సుమారు 30 వేల వరకు ఫారం-7 దరఖాస్తులు వచ్చాయి. దీనిపై జాయింట్ కలెక్టర్‌తో విచారణ చేయిస్తున్నాం. ఫారం-7లను పూర్తిగా పరిశీలించాం. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లుంటే తొలగిస్తాం. నిబంధనల మేరకు దొంగ ఓట్లపై చర్యలు తీసుకుంటాం. ఫేక్ దరఖాస్తులు చేసిన వారిపైనా చర్యలు ఉంటాయి.

– రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

టీడీపీ ఉలికిపాటు

దొంగ ఓట్ల తొలగింపునకు అధికార పార్టీ పట్టుబట్టడంతో టీడీపీ ఉలిక్కిపడింది. దీనినుంచి బయట పడేందుకు అధికారపార్టీ నేతలు టీడీపీ ఓట్ల తొలగింపునకు కుట్రలు చేస్తున్నారంటూ ఎల్లో మీడియా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారానికి దిగింది. ఎన్నికల కమిషన్‌కూ తప్పుడు ఫిర్యాదులు చేసి రాద్ధాంతం చేస్తోంది.

> గతంలో జీవించకు, భవిష్యత్ గురించి కలలు కనకు,
> వర్తమాన క్షణం మీదే నీ మనసును నిలుపు.
> – బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 30 ఆగస్టు 2023

చేజేతులా తలవంపులు!

విశ్వవేదికపై భారతదేశానికి కీర్తి, పతకాలు తెచ్చిపెట్టిన ఒక క్రీడ... ఇప్పుడు అంతర్జాతీయంగా నలుగురిలో నగుబాటుకు కారణంగా మారిందంటే తప్పెవరిది? గడచిన నాలుగు ఒలిపింక్స్‌లోనూ వరుసగా మన దేశానికి పతకాలు సాధించి పెట్టిన రెజ్లింగ్‌లో ఆటగాళ్ళు ఇప్పుడు కనీసం భారత జాతీయ పతాకం నీడన అధికారికంగా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే వీలు లేకుండా పోయిందంటే ఆ పాపం ఎవరిది? మన అగ్రశ్రేణి రెజ్లర్లు ఈ ఏడాది మొదట్లో వీధికెక్కి, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) అప్పటి అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఆరోపణలు చేసినప్పటి నుంచి గత ఎనిమిది నెలల్లో రోజుకో వివాదం మన రెజ్లింగ్‌ను చుట్టుముడుతూనే ఉంది. ఇప్పటికే లైంగిక వేధింపుల ఆరోపణలతో సతమతమవుతున్న భారత సమాఖ్యను అంతర్జాతీయ రెజ్లింగ్ పర్యవేక్షక సంఘం 'యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్' (యుడబ్ల్యుడబ్ల్యు) తాజాగా సస్పెండ్ చేసింది. నిర్ణీత గడువులోగా ఎన్నికలు జరపనందుకు పడ్డ ఈ సస్పెన్షన్ వేటు మన రెజ్లింగ్ భవితపై నీలినీడలు పరిచింది.

ఈ సస్పెన్షన్ మరీ ఊహించనిదేమీ కాదు. కొన్ని నెలలుగా అంతర్జాతీయ రెజ్లింగ్ సంఘం పదే పదే హెచ్చరిస్తూనే ఉంది. వివాదాల్లో కూరుకుపోయిన భారత రెజ్లింగ్ సమాఖ్యను చక్కదిద్దుకోవాల్సిందిగా మన క్రీడాయంత్రాంగ పెద్దలను అభ్యర్థిస్తూనే ఉంది. దోవకు రాకుంటే సస్పెన్షన్ వేటు వేయక తప్పదని జూన్‌లో హెచ్చరించింది. జూలైలోనూ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. భారత రెజ్లింగ్ సమాఖ్యలో అంతర్గత వర్గ పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. మరోపక్క సమాఖ్య ఎన్నికల్ని వివిధ కోర్టులు నిలిపివేశాయి. చివరకు సహనం నశించిన అంతర్జాతీయ సంఘం అన్నంత పనీ చేసింది. భారత రెజ్లింగ్ సమాఖ్యపై వేటు వేసింది. సమస్యను ఆదిలోనే పరిష్కరించని మన క్రీడా అధికారుల అసమర్థత ఇక్కడి దాకా తెచ్చింది.

ఈ సస్పెన్షన్ వల్ల ఆటగాళ్ళపై వ్యక్తిగతంగా ప్రభావమేమీ ఉండకపోవచ్చు. కానీ, దేశానికి మాత్రం తీరని తలవంపులు. ఎలాగంటే, ఈ సెప్టెంబర్ 16 నుంచి బెల్‌గ్రేడ్‌లో జరగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో మన రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగానే పోటీలో పాల్గొనాల్సిన పరిస్థితి. ఇలా మన కుస్తీయోధులు అన్ని రకాల పోటీల్లో పాల్గొనవచ్చు. పతకాలు సాధించవచ్చు. కానీ, జాతీయ పతాకం ధరించడానికి లేదు. సాక్షాత్తూ బంగారు పతకం సాధించి, పోడియమ్‌పై నిలబడినప్పటికీ ప్రాంగణంలో మన జాతీయ గీతాన్ని వినిపించరు. వారి ప్రతిభా ప్రదర్శన, గెలిచే పతకాలు... ఇలా ఏవీ భారతదేశపు లెక్కలోకి రావు. అదీ ఈ సస్పెన్షన్‌తో దాపురించే దుఃస్థితి. ఒకవేళ ఇంత జరుగుతున్నా సరే ఇప్పుడిప్పుడే ఎన్నికలు నిర్వహించకుంటే, దరిమిలా సస్పెన్షన్‌ను ఎత్తివేయకుంటే... అప్పుడిక మన భారత రెజ్లర్లు రానున్న ఒలింపిక్స్ సహా ఏ అంతర్జాతీయ పోటీలోనూ దేశం తరఫున పోటీ చేసే వీలుండదు. ఇది దేశ ప్రతిష్ఠకే మాయని మచ్చ.

ఇందుకు నిందించాల్సింది మన భారత రెజ్లింగ్ సమాఖ్యను, మన పాలకులనే! లైంగికంగా వేధించినట్టు సాక్ష్యాధారాలు లభించినప్పటికీ, దేశానికి పతకాల పంట పండించిన రెజ్లర్లు న్యాయం కోసం రోడ్డున పడి ధర్నాలు చేసినప్పటికీ ఇవాళ్టికీ మన ఏలికలకు చీమ కుట్టినట్టయినా లేదు. సమాఖ్య మాజీ అధ్యక్షుడు, పాలక బీజేపీ పార్లమెంట్ సభ్యుడైన బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవడానికి ఇప్పటికీ మన పాలకులకు చేతులు రావడం లేదు. పేరుకు పదవిలో నుంచి పక్కకు తప్పుకున్నప్పటికీ, తన వారినే మళ్ళీ పీఠంపై కూర్చోబెట్టి కథ నడిపించాలని చూస్తున్న నిందితుడిని అడ్డుకొనేందుకు మన ప్రభుత్వాలకు మనస్కరించడం లేదు. బాధిత రెజ్లర్లకూ, చక్రం తిప్పాలని చూస్తున్న బడాచోర్లకూ మధ్య చిక్కుకున్నది కేవలం రెజ్లింగ్ కాదు... దేశ పరువు ప్రతిష్ఠలు! లైంగిక ఆరోపణల వ్యవహారంతో ఇప్పటికే దేశం పరువు పోగా, తాజా సస్పెన్షన్‌తో తలకొట్టేసినట్టయింది.

రాజకీయాలకు అతీతంగా సాగాల్సిన క్రీడా సంఘాలు గనక రాజకీయ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకుంటే ఇలాగే ఉంటుంది. ఆటలు, ఆటగాళ్ళ ప్రయోజనాల పరిరక్షణ వెనక్కి పోయి, క్రీడలతో సంబంధం లేని అంశాలు ముందుకు వస్తాయి. దేశంలోని అనేక ఇతర క్రీడా సంఘాల్లోనూ ఇదే జరిగింది. సమయానికి ఎన్నికలు జరపలేదంటూ నిరుడు ప్రపంచ ఫుట్‌బాల్ పర్యవేక్షక సంఘం 'ఫిఫా' మనదేశ ఫుట్‌బాల్ సమాఖ్యను సస్పెండ్ చేసింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, హాకీ ఫెడరేషన్‌లు సైతం ఈ కారణాలతోనే మన సంఘాల్ని నిషేధిస్తామని హెచ్చరించాయి. క్రీడా నియమావళిని పాటించట్లేదంటూ సాక్షాత్తూ భారత సర్కారే 2020 జూన్‌లో 54 జాతీయ క్రీడా సమాఖ్యల గుర్తింపును ఉపసంహరించింది. నియమాల ఉల్లంఘనకు పాల్పడుతున్నారంటూ ఢిల్లీ హైకోర్ట్ గత ఏడాది దాదాపు పాతిక క్రీడాసంఘాలకు అక్షింతలు వేసింది. అయినా పరిస్థితి మారలేదు. రాజకీయాలకు బలవుతున్న సంఘాల్లో ఒకటిగా మన రెజ్లింగ్ సైతం నిలిచింది.

విచిత్రంగా కొందరు ప్రస్తుత పరిస్థితికి ఆటగాళ్ళను తప్పుబడుతున్నారు. లైంగిక వేధింపుల అంశాన్ని బయటకు చెప్పడమే వారి నేరమన్నట్టుగా, వారిని 'ధర్నా జీవులు' అంటూ బ్రిజ్‌భూషణ్ నిస్సిగ్గుగా బురద జల్లుతున్నారు. ఇకనైనా పాలకులు, క్రీడా అధికారులు కళ్ళు తెరవాలి. దీర్ఘ కాలం సస్పెన్షన్ కొనసాగితే అంతర్జాతీయ పోటీలకు ఆహ్వానాలు తగ్గుతాయి. ప్రపంచ సంఘం నుంచి ఆర్థిక సహకారమూ తగ్గుతుంది. ఆటగాళ్ళ కెరీర్ దెబ్బ తింటుంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని, సంక్షోభ పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలి. అలాకాక ప్రభుత్వం ఇప్పటికీ మౌనం వీడకపోతే కష్టమే! దేశప్రతిష్ఠ కన్నా దేశంలో వచ్చే ఎన్నికల్లో గెలుపే ముఖ్యమని భావిస్తే అది మహా పాపమే!

వ్యవసాయానికి ఎన్నాళ్లీ సంకెళ్లు?

విశ్లేషణ



డాక్టర్ అజిత్ రానాడే

ఉల్లి ఎగుమతులను సమర్థంగా అడ్డుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం స్థానిక సరఫరాను పెంచింది. ఈ చర్య రైతులకు నష్టం కలిగించేదే. ఇది మార్కెట్ యంత్రాంగంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం కాదా? అంతర్జాతీయంగా బియ్యం ధరలు దశాబ్ద కాలపు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. కానీ బాస్మతీయేతర తెల్ల బియ్యం, నూకల బియ్యం ఎగుమతిని కేంద్రం నిషేధించింది. మొత్తం బియ్యం ఎగుమతుల్లో ఈ రెండూ 45 శాతం వరకు ఉంటున్నాయి (తాజాగా బాస్మతి ఎగుమతులనూ నిషేధించింది). బియ్యం ఎగుమతులను నిషేధించడానికి కారణం ఇథనాల్ తయారీదారుల ప్రయోజనాలను కాపాడటం కోసమేనని తెలుస్తోంది. ఇది వరి రైతు లాభాలను పణంగా పెడుతోంది.

ఈ సంవత్సరం మరో రెండు లక్షల టన్నుల ఉల్లిని అదనంగా సేకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఈ ఏడాది ఉల్లి నిల్వల లక్ష్యాన్ని (బఫర్ స్టాక్) మూడు లక్షల టన్నుల నుండి ఐదు లక్షల టన్నులకు తీసుకెళుతుంది. ఉల్లిపై 40 శాతం ఎగుమతి సుంకం విధించిన ఒక రోజు తర్వాత కేంద్రం నుంచి ఈ ప్రకటన వచ్చిందని గుర్తించాలి. అంటే, ఎగుమతులను సమర్థంగా అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం స్థానిక సరఫరాను పెంచింది. ఇది ఉల్లి ధరల పతనానికి కారణమవుతుంది. ఇది మార్కెట్ యంత్రాంగంలో జోక్యం చేసుకోవడం కాదా? ఉల్లి రైతులు ప్రభుత్వానికి తక్కువ ధరకు తమ పంటను అమ్మేలా చేసేందుకు ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకున్నట్లు కనిపించడం లేదా? ఇది మార్కెట్‌పై ప్రభుత్వ ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేయడం కాదా? ఈ చర్య కచ్చితంగా రైతులకు నష్టం కలిగిస్తున్నందున, కేంద్ర మాజీ వ్యవసాయ మంత్రి కూడా ఉల్లిపై ఎగుమతి పన్ను పెంపును విమర్శించారు. ఆ మాజీ మంత్రి దేశంలోని ఉల్లిపాయల్లో మూడింట ఒక వంతు సరఫరా చేసే రాష్ట్రానికి చెందినవారు. ఎగు మతి పన్నుకు వ్యతిరేకంగా రైతులు ఇప్పటికే ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

వ్యవసాయోత్పత్తుల కోసం మార్కెట్ యంత్రాంగంలో ఇటువంటి ఏకపక్ష జోక్యాలకు రైతులు అలవాటు పడ్డారు. ఈ వారం ఉల్లి ద్రవ్యోల్బణం 19 శాతానికి చేరుకోవడం కేంద్ర ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తోంది. ఇంటి బడ్జెట్‌లో ఉల్లిపాయల వాటా కొంత భాగం మాత్రమే అనుకోవద్దు. ఉల్లి ధరలు రాజకీయ నాయకులకు కన్నీళ్లు తెప్పిస్తాయి. మితిమీరిన ఉల్లిపాయల ధరల పెరుగుదల కారణంగా ప్రభుత్వాలే పడిపోయిన విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. 2020 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ప్రతిపాదించిన వ్యవసాయ చట్టాలను గుర్తుంచుకోండి. ఈ మూడు చట్టాలలో ఒకటి వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై నియంత్రణను పూర్తిగా ఎత్తివేయాలనీ, నిల్వ పరిమితులను తొలగించాలనీ ప్రతిపాదించింది. ఎగుమతులు లేదా దిగుమతులపై ఏకపక్ష నిషేధాలను సడలించాలని కూడా అది ప్రతిపాదించింది. కానీ నూతన వ్యవసాయ చట్టాలను పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆ వారంలోనే, బంగ్లాదేశ్‌కు వెళ్లే అనేక ట్రక్కులను సరిహద్దు వద్ద నిలిపివేశారు. ఎందుకంటే, అవి ఉల్లిపాయల ఎగుమతి సరుకులను తీసుకుపోతున్నాయి. ఒకవైపు ఎగుమతులను నిలిపివేయడం, మరోవైపు వ్యవసాయ మార్కెట్లపై నియంత్రణ ఎత్తివేయడం వంటి ఈ చర్యలు మిశ్రమమైన, నిజాయితీ లేని సంకేతాలను ఇస్తున్నాయి.



బహుశా, ఉల్లిపాయలపై ప్రస్తుతం విధించిన ఎగుమతి పన్నును నివారణ చర్యగా చెప్పవచ్చు. టమోటా ధరల అనూహ్య పెరుగుదల కారణంగా ఇప్పటికే దెబ్బతిని ఉన్నాం. భారత జాతీయ సహకార సంస్థల వినియోగదారు సమాఖ్య, భారత జాతీయ సహకార మార్కెటింగ్ సమాఖ్య ఇప్పటికే తమ బఫర్ స్టాక్ కోసం 15 లక్షల టన్నుల కంటే ఎక్కువ టమోటాలను సేకరించాయి. కిలో టమోటా ధర రూ.200 వరకు పెరగడంతో సబ్సిడీ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ రాయితీలను ఎక్కడినుంచి చెల్లిస్తున్నారు? ద్రవ్యోల్బణం మంటలను ఆర్పడా నికి నేపాల్, తదితర దేశాల నుండి కూడా బహిరంగంగా ప్రకటించని మొత్తంలో టమోటాలను భారత్ దిగుమతి చేసుకుంది. ప్రస్తుతం దేశీయ రిటైల్ ద్రవ్యోల్బణం 7.5 శాతం వద్ద నడుస్తోంది. ఇది భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన 6 శాతం పరిమితి కంటే ఎక్కువ. కాబట్టి, ద్రవ్యోల్బణానికి కారణమయ్యే ప్రధాన విలన్‌లలో టమోటాలు కూడా ఉన్నాయి. ఇది ప్రభుత్వాల అపఖ్యాతికి కారణమవుతోంది. పైగా అది మీడియా దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తోంది కూడా.

మరొక వ్యవసాయ సరుకును తీసుకోండి. జూలై నెలలో భారతదేశం బాస్మతీయేతర తెల్ల బియ్యం, నూకల బియ్యం ఎగుమతిని నిషేధించింది. మొత్తం బియ్యం ఎగుమతుల్లో ఈ రెండూ 45 శాతం వరకు ఉంటున్నాయి. ఈ నిషేధం మన వ్యాపార భాగస్వాములలో చాలామందిని కలవరపెట్టింది. పైగా భారతదేశాన్ని నమ్మదగని సరఫరాదారుగా కనిపించేలా చేసింది. ఈ నేపథ్యంలో ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని దేశాలు భారత్ నుండి బియ్యం దిగుమతిపై ఆధారపడటం వారి ఆహార భద్రతకు హాని కలిగించవచ్చు. దీనివల్ల ఆహార భద్రతపై భారత ప్రభుత్వం నిజంగా శ్రద్ధ చూపడం లేదని అర్థమవుతోంది. అయితే ప్రాథమికంగా బియ్యం ఎగుమతులను నిషేధించడానికి కారణం ఇథనాల్ తయారీదారుల ప్రయోజనాలను కాపాడటం కోసమేనని తెలుస్తోంది. 50 నుండి 60 లక్షల టన్నుల నూకల బియ్యంలో 30 లక్షల టన్నుల దాకా ఇథనాల్ తయారు చేయడానికి వెళ్తాయి. బియ్యం ఎగుమతిపై నిషేధం కార్ ఇంజిన్‌ల లభ్యతను పెంచుతుంది. కానీ ఇది వరి రైతు లాభాలను పణంగా పెడుతోందని గమనించాలి. అంతర్జాతీయంగా బియ్యం ధరలు దశాబ్ద కాలపు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. మంచి లాభాలు ఆర్జించేందుకు ఇదొక అవకాశం. వ్యవసాయోత్పత్తులపై ఎగుమతి నిషేధం వంటి చర్యల ఫలితంగా అంతిమంగా రైతులు నష్టపోతున్నారు.

టమోటాలు, ఉల్లిపాయలు లేదా బియ్యంపై విధానపరమైన చర్యలకు సంబంధించిన ఇటీవలి కథనాలు... వ్యవసాయంలో సంస్కరణలు ఎందుకు ఇంత కఠినంగా, అసంపూర్తిగా ఉన్నాయనే విషయాన్ని వివరిస్తున్నాయి. దీని వెనుక స్వాభావికమైన పట్టణ పక్షపాతం ఉంది. ప్రభుత్వ విధానాలు రైతుల ప్రయోజనం కంటే పట్టణ వినియోగదారుల సంక్షేమానికి (తక్కువ ఆహార ద్రవ్యోల్బణం) అధిక ప్రాధాన్యత ఇస్తాయి. కాబట్టి, మార్కెట్లను సంస్కరించే, రైతుకు అనుకూలంగా క్రమబద్ధీకరించే వ్యవసాయ విధానాలను ఎల్లప్పుడూ ఏకపక్షంగా తిప్పికొడుతున్నారు. ధరల నియంత్రణల వల్ల రైతులకు కలుగుతున్న నష్టాన్ని భర్తీ చేయడానికి, ఉచిత నీరు, విద్యుత్, చౌకగా ఎరువులు వంటి ఇన్‌పుట్ సబ్సిడీలు కొనసాగుతాయి. ఇది ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తుంటుంది. ప్రభుత్వంపై పడుతున్న భారానికి ప్రత్యామ్నాయంగా 'ఫార్వర్డ్ మార్కెట్ల' అన్వేషణ జరగటం లేదు. అందువల్లే ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకుంటోంది. దానికోసం పోటీ లేని గుత్తాధిపత్య ప్రవర్తనకు కూడా వెనుకాడటం లేదు. ఈ ఆధిపత్య దుర్వినియోగానికి గానూ ప్రభుత్వాన్ని ఎవరు కోర్టుకు లాగుతారు?

ధరల నియంత్రణ, నిల్వ పరిమితులు, ఏకపక్ష దిగుమతి, ఎగుమతి నిషేధాలతోపాటు తరచూ మారుతున్న ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయం ఇప్పటికీ సంకెళ్లతో బంధించబడి ఉంది. సాంకేతికంగా చూస్తే వ్యవసాయం రాష్ట్ర ప్రభుత్వాల పరిధికి సంబంధించిన అంశం అయినప్పటికీ కేంద్రంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యవసాయంపై తీవ్రంగా జోక్యం చేసుకుంటున్నాయి. ఈ పరిణామాలతో రైతు భారీస్థాయి, విధ్వంసకరమైన రాయితీలతో అల్లాడిపోతాడు. భారీ సబ్సిడీలతో కూడిన రసాయన ఎరువులను అధికంగా వాడటం వల్ల పంజాబ్‌లో సంభవించిన నేల క్షీణత, లవణీయత దీనికి సాక్షీభూతంగా ఉంది. వీటన్నింటికీ మించి, దేశంలో సగం మంది రైతులకు రాయితీలు లభించవు. ఎందుకంటే వారు భూమి లేనివారు లేదా కౌలుదారులు కాబట్టి తాము సాగుచేసే భూమితో వారికి సంబంధం ఉండదు. వ్యవసాయ విధాన పరంగా మనం నేస్తున్న వలలు మనల్ని చిక్కుల్లో పడేశాయి. అందుకనే వాటి సంకెళ్ల తొలగించడం చాలా కష్టంగా మారింది. మార్కెట్లు మెరుగ్గా పనిచేయాలన్నా, ప్రభుత్వ జోక్యాన్ని పరిమితంగా ఉంచాలన్నా, మార్కెట్ ప్రక్రియలో పాల్గొని, దాని నుండి లాభం పొందేందుకు రైతుకు మరింత స్వేచ్ఛను అందించాల్సి ఉంది. దీనికోసమే మనకు భారీ సంస్కరణలు అవసరం.

వ్యాసకర్త ఆర్థికవేత్త
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అద్వైతే ఈజీ



అక్సాయి చిన్, అరుణాచల్ ప్రదేశ్ ప్రాంతాలను మళ్లీ చైనా భౌగోళిక పటాలు తమవిగా చూపుతున్నాయి. దీనికి మన స్పందనేమిటి? ఓ ఓ! అయితే మళ్లీ కొన్ని చైనీస్ యాప్స్‌ను నిషేధించడానికి టైమొచ్చిందా?

– సుమంత్ రామన్, జర్నలిస్ట్

గట్టి జవాబుందా?



భారతదేశంలోని ఒక పూర్తి రాష్ట్రాన్ని (అరుణాచల్ ప్రదేశ్) మళ్లీ తమదిగా చైనీస్ మ్యాపులు పేర్కొంటున్నాయి. 'ఇది తప్పు, అంగీకారం కాదు' లాంటి బలహీనమైన జవాబులకు బదులుగా ఇండియా స్పందన ఏమిటి? భారత మ్యాపుల్లో టిబెట్‌ను స్వతంత్ర దేశంగా గుర్తిస్తే? జవాబులు ఇలా ఉండొచ్చు: చైనా అంటే భయం. ఆశ్రితుల ప్రయోజనాలు పోతాయి. చైనా దిగుమతుల మీద భారీగా ఆధారపడ్డాం. షీ జిన్‌పింగ్‌ను ముఖాముఖి ఎదుర్కొనే సంకల్పం లేదు. జోక్ ఏమిటంటే, ఇప్పటికే చైనా మెడలు వంచేశామని తమ భక్తులను వాట్సప్ యూనివర్సిటీ నమ్మించడం!

– సందీప్ మనుధానె, విద్యావేత్త

కావాలా? వద్దా?



షరియా చట్టాలను ఇష్టపడే పాకిస్తానీయులు పాశ్చాత్య దేశాలకు వెళ్లడానికి వాటి దౌత్యకార్యాలయాల ముందు వీసాల కోసం భారీ క్యూలు కడుతున్నారు : కానీ ఎవరూ కూడా (ఆ చట్టం అమల్లో ఉన్న) అఫ్గానిస్తాన్ దౌత్యకార్యాలయం ముందు వేచి ఉండటం లేదు.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఖాళీగా ఉన్నారా?



నారాయణమూర్తి బృందం 1981లో ఇన్ఫోసిస్‌ను ప్రారంభించింది. రాజీవ్ గాంధీ 1984లో ప్రధానమంత్రి అయ్యారు. ఒకవేళ దేశానికి రాజీవే కంప్యూటర్లు తెచ్చివుంటే, ఆ మూడున్నరేళ్ల కాలంలో ఇన్ఫోసిస్ ఇంజినీర్లు ఏం వాడివుంటారు? టైప్ రైటర్లా?

– కిరణ్ కుమార్ ఎస్., వ్యాఖ్యాత

సంపద సృష్టికర్త

ఈ మధ్య రాజకీయాల్లో బాగా తల పండిందని చెప్పుకొనే ఓ పెద్దాయన ఊరూరా తిరుగుతూ 'సంపదను సృష్టిస్తానని' ఊదర కొడుతున్నారు. నిజంగా సంపద సృష్టించే తెలివితేటలు, ఆలోచనలు ఉండివుంటే ఆయన ముఖ్యమంత్రిగా దిగిపోయే నాటికి రూ. 2,64,451 కోట్ల అప్పు ఎందుకు పేరుకుపోతుంది? సంపద సృష్టించే తెలివితేటలుంటే అప్పులు చేయాల్సిన అవసరం ఏముంది? ఇటువంటి మాయ మాటలు పదే పదే చెబితే, ఓటర్లు నమ్ముతారనుకోవటం అమాయకత్వమే అవుతుంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత అధికారాన్ని చేపట్టిన ఈ పెద్దాయన పాలనా కాలం (2014–2019)లో ప్రభుత్వ ఆదాయం 6 శాతానికి పడిపోయింది. ఇక 2019–23 కాలంలో అంటే ప్రస్తుత సీఎం జగన్ మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్ర ఆదాయం 16.7 శాతానికి పెరిగింది. ఈ నాలుగేళ్ళలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన అప్పు కేవలం 1 లక్షా 77 వేలకోట్లు మాత్రమే అని కేంద్ర ప్రభుత్వమే చెప్పింది. ఏ ఇబ్బందులూ లేకపోయినా రెండున్నర లక్షల కోట్లు అప్పు చేసిన వాడు సంపద సృష్టిస్తాడా? లేక అనేక ఇబ్బందులు ఎదురైనా కేవలం లక్షా డెబ్బైవేల కోట్లు అప్పు చేసిన వాడు సంపదను సృష్టిస్తాడా?

ఇంతకూ సంపద సృష్టి అంటే ఏమిటి? మానవ వనరుల సృష్టే నిజమైన సంపద సృష్టిగా చెప్పాలి. విద్యపై అత్యధిక పెట్టుబడి పెట్టి అద్భుతమైన మానవ వనరులను జగన్ సృష్టిస్తున్నారు. అలాగే ప్రజలకు అత్యంత ప్రాథమిక అవసరమైన వైద్య రంగంలోనూ అధికంగా ఖర్చు చేస్తున్నారు. ఈ నాలుగేళ్ళలో విద్యారంగానికి రూ. 1,12,577 కోట్లు ఖర్చు చేయగా, వైద్యరంగానికి కుడా అదే స్థాయిలో నిధులు ఖర్చుపెడుతోది ప్రభుత్వం. నాలుగేళ్ళలో 330 లక్షల మందికి పైచిలుకు జనాభా దారిద్ర్య రేఖను దాటారు. అంతకు ముందు వున్న 11.7 శాతం పేదరికం, ఈ నాలుగేళ్ళలో 6 శాతానికి తగ్గింది. పేదరికాన్ని తగ్గించటం ద్వారా పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచటమే 'సంపదను సృష్టించటం' అంటే! అదే నేడు రాష్ట్రంలో కొనసాగుతోంది.

– ఈదర శ్రీనివాస రెడ్డి,
నాగార్జున విశ్వవిద్యాలయం

లక్ష్యం ఒకటి... చెబుతున్నదొకటి!

సీపీఐ నేత రామకృష్ణ నాయకత్వంలో 'దేశాన్ని కాపాడండి, రాష్ట్రాన్ని రక్షించండి' నినాదంతో బస్ యాత్ర సాగుతోంది. ఇప్పటికే రెండు పాలకవర్గ పార్టీల యాత్రలు సాగుతున్నాయి. సాధారణంగా పాలకవర్గ పార్టీలవారు అధికార పీఠం కోసం యాత్రలు చేస్తారు. అలా చేసి కొందరు విజయులైనారు.

ప్రజల తరఫున పోరాడే కమ్యూనిస్టులుగానీ, సామాజిక కార్యకర్తలు కానీ సామాజిక సమస్యల పరిష్కారం కోసం విశాల ప్రజాసమూహాలను చైతన్యవంతం చేయడానికీ, పోరాటాలలో భాగస్వామ్యం చేయడానికీ యాత్రలు చేస్తారు, పాలకవర్గ పార్టీల్లా అధికారపీఠం కోసం చేయరు. రామకృష్ణ బస్ యాత్రను కొన్ని ప్రాంతాల్లో నిలిపి, సదస్సులు, చర్చా గోష్ఠులు, సభలూ జరుపుతున్నారు. ఆయా ప్రాంతాల సమస్యల గూర్చి మాట్లాడుతున్నారు. ఉత్తరాంధ్ర వెనకబాటుతనం మీద, రాయలసీమ వెనకబాటుతనం మీద, మధ్యాంధ్రకు అమరావతి రాజధాని మీద సభలు జరుపుతున్నారు. అయితే ఈ సభలూ, చర్చలూ, సదస్సులలో పాలకవర్గ పార్టీలను ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నేతలను భాగస్వాములను చేస్తున్నారు. ఆ యా ప్రాంతాల సమస్యలకు కారకుల్లో ఒకరో, ముఖ్యులో తెలుగుదేశం పార్టీ వారు. వారికి తమ వేదికలపై భాగస్వామ్యం ఇస్తూ – 'రాష్ట్రాన్ని రక్షించండి' అన్న నినాదం ఇస్తున్నారంటే... అధికారపార్టీ పాలన నుండి రాష్ట్రాన్ని రక్షించండి అని పిలుపివ్వడమేగదా! ఆ యా సభల్లో రామకృష్ణ విమర్శలు కేవలం వైసీపీ మీదనే ఉంటున్నాయి.

ఉద్యమాల పార్టీ నాయకునిగా అధికార పార్టీకి వ్యతిరేకంగా చేసే పోరాటం ప్రతిపక్షంలో ఉన్న పాలకవర్గ పార్టీకి సహకరించేదిగా ఉంటోందన్న గమనిక ఉండొద్దా? తాము ఏ సమస్యల గురించి ప్రస్తావిస్తున్నామో, ఆ సమస్యలకు ఇప్పటి ప్రతిపక్ష పార్టీ కారణమని సాధారణ ప్రజానీకానికి కూడా తెలుసు. మరి కమ్యూనిస్టు నాయకులకు తెలీదా? జగన్ మోహనరెడ్డి పాలనను తొలగించి, తెలుగు దేశం పాలనను స్థాపిస్తే రాష్ట్రం రక్షింపబడుతుందా? 'దేశాన్ని కాపాడండి' అని బీజేపీకి వ్యతిరేకంగా ఇస్తున్న నినాదానికి అనుగుణంగా తెలుగుదేశం చర్యలు ఉన్నాయా?

దేశాన్ని సర్వవిధాలా భ్రష్టుపట్టిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా ఒక్క పలుకు కూడా పలకని తెలుగు దేశం పార్టీని తమ వేదికల మీదకు ఎందుకు పిలుస్తున్నారు? పెద్దపీట ఎందుకు వేస్తున్నారు. పోనీ విశాల కూటమి కోసం అనుకున్నా... ఇతర కమ్యూనిస్టు పార్టీలను, మార్క్సిస్టు, లెనినిస్టులను, దళిత, బహుజన పార్టీలను పిలవాలి కదా! మరి వారిని ఎందుకు పిలవడం లేదు?



రామకృష్ణ బస్ యాత్ర ఉద్దేశ్యం 'బాబుని గద్దెనెక్కించడం' అనేది ఈ యాత్ర తీరుతెన్నులను చూస్తే ఎవరికైనా అనుమానం వస్తుంది. కమ్యూనిస్టులు తమ ఆశయాలను దాచుకోరు... స్పష్టంగా ప్రకటిస్తారు. రామకృష్ణ దాస్తున్నారు. పాదయాత్రీకుడూ, వారాహి యాత్రికుడూ స్పష్టంగా జగన్ మోహనరెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఓడించి తమని గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో వారు పడుతోన్న ఇబ్బందులనే, ప్రజల ఇబ్బందులుగా ప్రచారం చేస్తున్నారు.

జగన్ సంక్షేమం తప్ప, అభివృద్ధి ఊసెత్తటం లేదంటున్నారు. సంక్షేమ పథకాలు తప్పెలాగవుతాయనంటే... ఔనౌను, తప్పుకాదు మేమూ వాటి కంటే అధికంగా పథకాలిస్తాం, వాటితో పాటు అభివృద్ధి చేస్తామంటున్నారు. వారాహి నుంచి ఉరుముతున్నారొకరు, గళమెత్తి గర్జిస్తున్నారొకరు. వారిరువురిదీ ఒకే బాట, ఒకే మాట! భాష కూడా ఒకటే! రామకృష్ణ బస్ యాత్ర కూడా ఇందుకేమీ భిన్నంగా లేదు, ఒక్క భాషలో తప్ప.

వాళ్లు... 'తోలు ఒలుస్తాం, బట్టలూడదీస్తాం, రోడ్లమీద కొట్టుకుంటూ తీసుకెళ్తాం' అనంటున్నారు. వారు అధికారంలోకి వస్తే, గిస్తే చేయబోయేవి ఇవేనని చెప్తున్నారు. ఈ కార్యక్రమాల వలన 'రాష్ట్రం ఎలా రక్షించబడుతుందో' రామకృష్ణ చెప్తారా? వారి కంటికి 'నాడు – నేడు' పాఠశాలలు కనబడవు. 'రైతు భరోసా కేంద్రాలు' కనరావు. ఇంటింటినీ ఆదుకునే వలంటీర్లు, ఆశావర్కర్లు ఆనరు. ముంగిటకు వచ్చి ఇచ్చే బియ్యం, పప్పు దినుసుల వ్యాను, ఊరి ముంగిటి సచివాలయం, ఆసుపత్రి వంటివేవీ చూడరు. రామకృష్ణా వారితో గొంతు కలపడం విడ్డూరం.

జగన్ పాలనలో లోపాలు, ప్రజావ్యతిరేక విధానాలు ఏవో తనదైన పరిశీలనతో ప్రకటించాలి. ప్రజలను వాటి పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం చేయాలి. ఆ యా ప్రాంతాల సమస్యలపై నిర్వహిస్తోన్న సభలూ, సెమినార్లలో ఆ యా ప్రాంత ప్రజాసంఘాలనూ, ప్రజాస్వామిక శక్తులనూ, దళిత, బహుజన శక్తులనూ, వామపక్ష శక్తులనూ కలుపుకొని కార్యాచరణ నిర్దేశించడం, దాని మీద ఉద్యమాలు నిర్వహించడం చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. ఇవేవీగాకుండా తూతూమంత్రంగా ఆ యా ప్రాంతీయ సమస్యలు మాటాడుతూ జగన్ పాలన, కేంద్రంలో మోదీ పాలనను విమర్శిస్తూ సభలు, సమావేశాలూ, చర్చాగోష్ఠుల ముక్తాయింపుల జరుగుతున్నాయంటే సమస్యల పరిష్కారాలకంటే, అధికార మార్పిడి ముఖ్యమని ఆయన అనుకుంటున్నట్లు అర్థమవుతోంది. పాలకపార్టీలయిన తెలుగు దేశం, కాంగ్రెస్, బీజేపీ తదితరాలు అధికారమార్పిడి కోసం ప్రయత్నిస్తాయి, కమ్యూనిస్టులు వ్యవస్థ మార్పిడి కోసం ప్రయత్నించాలి. రామకృష్ణ ఆ దిశలో కృషి చేయాలి.

– నగిరికటకం భానోజీ

బంజారా బతుకమ్మ

బంజారా (లంబాడీ)లు అత్యంత ఉత్సాహపూరితంగా జరుపుకొనే పండుగ 'తీజ్'. దీనిని 'బంజారాల బతుకమ్మ పండుగ' అనడం అతిశయోక్తి కాదు. తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగలో పెళ్లి కాని లంబాడీ యువతుల పాత్ర అతి ముఖ్యమైనది.

తీజ్ పండుగ బతుకమ్మను పోలి ఉంటుంది. గోదుమ మొలకలను 'తీజ్'గా పిలుస్తారు. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే తీజ్‌లో గోదుమ మొలకలను ఎనిమిది రోజుల పాటు భక్తి భావంతో పెంచి తొమ్మిదవ రోజు తండా ప్రజలందరూ కలిసి ఊరేగింపుతో నిమజ్జనం చేస్తారు. శ్రావణ మాసంలో తండా పెద్దమనిషి 'నాయక్' అనుమతి తీసుకొని తీజ్ పనులను మొదలుపెడతారు. ఆడపిల్లలు అంగడికి వెళ్లి గోదుమలు, వాటిని మొలకెత్తించడానికి దూసేరు తీగలతో అల్లిన బుట్ట (ఓల్టి)లు, సెనగలు, ఇతరత్రా సామాన్లు తెచ్చుకుంటారు. పుట్ట మట్టిని తెచ్చి అందులో మేక ఎరువును కలుపుతారు. లంబాడీల దేవతలు 'దండి యాడి', 'తుల్జా భవాని', 'సేవాభాయి', 'సేవాలాల్ మహారాజ్', 'సీత్లా భవాని' పేర్లతో తయారు చేసిన బుట్టలలో మొదటగా తండా పెద్దమనిషి నాయక్ చేత ఎరువు కలిపిన మట్టిని పోయిస్తారు. ఆ తరువాత నానబెట్టిన గోదుమలు బుట్టలో చల్లిస్తారు. ఈ అన్ని కార్యక్రమాలూ బంజారా ఆడపిల్లల ఆటపాటలతో జరుగుతాయి. నాయక్ ఇంటి ముందు వేసిన పందిరిపై ఒక్కో ఆడపిల్లకో బుట్ట పెడతారు. రోజూ ఆడపిల్లలు స్నానం చేసి బావి నుంచి నీటిని తెచ్చి ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తొమ్మిది రోజుల పాటు బుట్టల్లో పోస్తారు. యువతుల్లో ఒకరు తమ బృందానికి నాయకురాలిగా వ్యవహరిస్తారు.



ఈ నీరు అత్యంత పవిత్రమైందనీ, దీని వల్ల శుభం జరుగుతుందనీ నమ్మకం. నానబెట్టిన గోదుమలను బుట్టలలో చల్లే రోజు పెళ్లి కాని ఆడపిల్లలు రేగు ముళ్లకు సెనగలు గుచ్చే ఆచారం ఒకటుంది. అలా గుచ్చే సమయంలో తమకు బావవరుస అయిన వారు ముళ్లను కదిలిస్తారు. అయినా సహనంతో ఆడపిల్లలు సెనగల్ని ముళ్లకు గుచ్చాల్సిందే. గోధుమలు, సెనగలు గునుగుపూలలా పొడుగ్గా పెరిగితేనే నచ్చిన జీవిత భాగస్వామి దొరుకుతాడనీ, తమ బతుకులు పచ్చగా ఉంటాయనీ, పిల్లా పాపలు ఆయురారోగ్యాలతో ఉంటారనీ, తండా బాగుపడుతుందని గిరిజనుల నమ్మకం. ఏడో రోజు జరిపే కార్యక్రమమే 'ధమోళి' (రొట్టెలో బెల్లం కలిపిన ముద్దను) చుర్మో అంటారు. ఆ రోజు మేరామా భవానీకి జంతువులను బలి ఇవ్వడం ఆచారం. దీన్నే 'అకాడో' అని కూడా అంటారు. మేక మాంసాన్ని ఇంటింటికీ పంపిస్తారు. ఆరోజు తండా పెద్దమనిషి ఇంటి దగ్గర తీజ్ వద్ద ఆటపాటలతో తండా వాసులు అందరూ నృత్యాలతో ఉత్సాహంగా, ఆనందంగా గడుపుతారు.

ఎనిమిదో రోజు తమ లంబాడి ఆరాధ్య దేవతల ప్రతిరూపాలను మట్టితో చేసి పూజిస్తారు. వారికి పెళ్లిళ్లు చేస్తారు. ఆడపిల్లలు తమను డోక్రీలుగా ఊహించుకుంటారు. పెళ్లి అయితే తమ పుట్టింటిని వదిలివెళ్లాల్సి వస్తుందని ఏడుస్తారు. వారిని సోదరులు ఓదార్చుతారు. తీజ్ నిమజ్జనానికి బంధుమిత్రులను ఆహ్వానిస్తారు. డప్పు చప్పుళ్లతో సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ నృత్యం చేస్తూ నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

– లకావత్ చిరంజీవి నాయక్
(శ్రావణ మాసంలో తీజ్ పండుగ జరుపుకొంటున్న సందర్భంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.10.33 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.10.03 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.4.44 నుండి 6.14 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.37 నుండి 12.26 వరకు, **అమృతఘడియలు:** ప.12.21 నుండి 1.50 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.14.

క్లుప్తంగా...

తిరుమల పవిత్రోత్సవాలు పరిపూర్ణం



పవిత్రోత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం యాగశాలలో రుత్వికులు హోమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ మలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవితో కలిసి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

108లో ప్రసవం



చోడవరం రూరల్ (అనకాపల్లి జిల్లా): గర్భిణిని ప్రభుత్వాస్పత్రికి తరలించే సమయంలో మార్గ మధ్యంలోనే నొప్పులు ఎక్కువ కావడంతో ఆమెకు 108 సిబ్బంది సుఖప్రసవం చేయించారు. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలోని తాడిపూడి దుర్గాదేవి మంగళవారం ప్రసవవేదనతో బాధపడుతున్నట్లుగా 108కు కాల్ వచ్చింది. ఆమెను 108 అంబులెన్స్‌లో చోడవరం ప్రభుత్వాస్పత్రికి చికిత్సకు తరలిస్తుండగా చోడవరం మండలం నర్సయ్యపేట గ్రామం సమీపించే సరికి ఆమెకు భరించలేని నొప్పులు వచ్చాయి. దీంతో వాహనంలోని ఈఎంటీ సీహెచ్.మధు, వడ్డాది ఆశా వర్కర్ వాహన పైలట్ జి.శంకరరావుకు చెప్పి వాహనాన్ని రోడ్డు పక్కన ఆపించారు. దుర్గాదేవికి సపర్యలు చేయడంతో ఆడశిశువుకు జన్మనిచ్చింది. క్షేమంగా ఉన్న తల్లీబిడ్డలను చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చందన మోహన్‌రావుకు సతీ వియోగం



సుబ్బలక్ష్మి (ఫైల్)

దొండపర్తి: ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త చందన మోహన్‌రావు (సీఎంఆర్) సతీమణి సుబ్బలక్ష్మి మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. 40 ఏళ్ల క్రితం చందన బ్రదర్స్‌ను నెలకొల్పి అనంతరం సీఎంఆర్‌గా రూపాంతరం చెంది తెలుగు రాష్ట్రాల్లో అనేక శాఖలను విస్తరించడంలో సుబ్బలక్ష్మి విశేష కృషి ఉంది. సుబ్బలక్ష్మి మంగళవారం మరణించడంతో నగరంలో ప్రముఖ వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు చందన మోహన్‌రావును పరామర్శించారు.

గంగపుత్రికకు పీహెచ్‌డీ పట్టా



గుర్రమ్మ (గుణ)

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకార మహిళ మైలపల్లి గుర్రమ్మ (గుణ) పీహెచ్‌డీ పట్టా పొందారు. గుర్రమ్మ పాయకరావుపేట సమయమంతుల రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. కనగుర్త చేప ప్రత్యుత్పత్తి వ్యవస్థపై చేసిన పరిశోధనలకుగాను నాగార్జున యూనివర్సిటీ ఆమెకు పీహెచ్‌డీ ప్రదానం చేసింది. మంగళవారం ఆమె పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. సామాన్య మత్స్యకార కుటుంబానికి చెందిన మహిళ పీహెచ్‌డీ పట్టా పొందడంపై ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ అభినందించారు.

12వ అంతస్తు నుంచి దూకి బాలిక ఆత్మహత్య



జెస్సికా (ఫైల్)

కృష్ణరాజపురం: అపార్ట్‌మెంటు 12వ అంతస్తు నుంచి కింద దూకి బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్ణాటకలోని బెంగళూరులోని బెళ్ళందూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. మృతురాలు జెస్సికా (14) 10వ తరగతి విద్యార్థిని. ఆమె తల్లిదండ్రులు ఐటీ ఇంజినీర్లు. వీరి స్వస్థలం తమిళనాడు. ఉదయాన్నే బాలికను పాఠశాలకు పంపి వారు విధులకు వెళ్లిపోయారు. జెస్సికా సక్రమంగా స్కూలుకు రావడంలేదని ఆమె టీచర్ ఇదే జెస్సికా తల్లిదండ్రులతో ఫోన్‌లో చెప్పారు. దీంతో తల్లిదండ్రులు మందలిస్తారని తీవ్రంగా భయపడి జెస్సికా తన ఇంటికి వెళ్లిపోయింది. తాము నివసిస్తోన్న అపార్ట్‌మెంటు 12వ ఫ్లోర్ నుంచి కిందికి దూకడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందింది. ఘటనకు కచ్చితమైన కారణాలు తెలియవని, విచారణ చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువత సొంతం

ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్



పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: సాంకేతికతను సద్వినియోగం చేసుకుని నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువతకు ఉందని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో పాల్గొన్న గవర్నర్ సందేశం ఇస్తూ మానవాళి ప్రయోజనాలు పరిరక్షించే నూతన ఆవిష్కరణలకు యువత కృషిచేయాలని సూచించారు. చదువు, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నైతికత, సామాజిక బాధ్యత కూడా ముఖ్యమని చెప్పారు. యువత నేర్చుకునే సాంకేతిక, నైపుణ్యం కేవలం తమ సొంతానికి మాత్రమే కాకుండా సమాజ హితం కోసం వాడాలని సూచించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, సంక్షోభాలకు పరిష్కారం చూపే వైవిధ్యభరితమైన ఆవిష్కరణలు చేయడంతోపాటు వాటి ద్వారా అపారమైన అవకాశాలు సృష్టించాలని సూచించారు. ప్రపంచానికి స్టార్టప్ హబ్‌గా భారత్ నిలిచిందని, ఇది మంచి పరిణామమన్నారు. యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగితే నిరుద్యోగంతోపాటు అనేక సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. కృత్రిమ మేధస్సు వినియోగం నుంచి బయోటెక్నాలజీ వరకు ప్రతి అంశం మానవాళికి ప్రయోజనం కలిగించేదిగా ఉండాలన్నారు. యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఏఎన్‌యూ అభివృద్ధి నివేదికను సమర్పించారు. అనంతరం ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పలువురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలు అందించారు.

వ్యవసాయ రంగ సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఏపీ : సాయినాథ్

వ్యవసాయ రంగంలో సంక్షోభం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యలపై తాను 2001–2002 కాలంలో అధ్యయనం చేశానని చెప్పారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో వ్యవసాయ రంగ సంక్షోభంపై అధ్యయనానికి ప్రత్యేకంగా కమిటీని నియమించారని తెలిపారు. ఈ కమిటీ సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి నిశితంగా అధ్యయనం చేసిందని పేర్కొన్నారు. తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు ప్రాంతాల్లో వ్యవసాయ రంగ సమస్యలు, వాస్తవ పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేశానని తెలిపారు. ఆ సేవలకు దక్కిన గౌరవంగా ఈ డాక్టరేట్‌ను భావిస్తానని సాయినాథ్ తెలిపారు.

అడిషనల్ డీజీ రవిశంకర్‌కు డాక్టరేట్

ఆంధ్రప్రదేశ్ లా అండ్ ఆర్డర్ అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్‌కు డాక్టరేట్ పట్టాను గవర్నర్, వీసీ అందించారు. ఏఎన్‌యూ కామర్స్ విభాగంలో ఆచార్య జీఎస్ బ్రహ్మానందం పర్యవేక్షణలో రవిశంకర్ అయ్యన్నార్ పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, పలువురు డీన్‌లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంతకల్లులో డ్రగ్స్ కలకలం

- గోవా నుంచి హైదరాబాద్‌కు సరఫరా
- ఇద్దరు అరెస్ట్



పట్టుబడిన నిందితులను చూపుతున్న సీఐ రామసుబ్బయ్య

గుంతకల్లు టౌన్: గోవా నుంచి హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాల ప్యాకెట్లను సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను అనంతపురం జిల్లా గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారినుంచి రూ.65 వేల విలువజేసే 12.890 గ్రాముల 'మేథాంపేటామైన్' అనే నిషేధిత డ్రగ్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ రామసుబ్బయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నగరానికి చెందిన ఎరెల్లి దయాకర్, మలికపురం మండలం అడవిపాలెం గ్రామానికి చెందిన రాసిబట్టుల వివేక్ హైదరాబాద్‌కు వెళ్లి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. ఈ క్రమంలోనే వీరిరువురు డ్రగ్స్‌కు బానిసలయ్యారు. హైదరాబాద్‌లో వీరికి పరిచయమైన స్నేహితులకు డ్రగ్స్ గురించి తెలియజేయగా, తమకు కూడా తెచ్చివ్వాలని వారు కోరడంతో గోవాకు వెళ్లి డ్రగ్స్ కొనుగోలు చేసి సోమవారం సాయంత్రం గుంతకల్లుకు చేరుకున్నారు. అయితే రాత్రి వరకు హైదరాబాద్‌కు రైలు లేకపోవడంతో రోడ్డు మార్గం ద్వారా ఏదైనా వాహనంలో వెళ్లేందుకు ఇద్దరు యువకులూ స్థానిక బీరప్పగుడి సర్కిల్‌లో వేచి ఉన్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు ఇద్దరు యువకుల్ని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు గుట్టు రట్టయ్యింది. స్వాధీనం చేసుకున్న డ్రగ్ ఒక్కో గ్రాము రూ.5 వేల ధర పలుకుతుందని పోలీసులు తెలిపారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

దోపిడీ దొంగల యాత్రలను ప్రజలు నమ్మరు

- 1,066వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: అధికారంలో ఉన్నపుడు రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన బాబు అండ్ కో దొంగ యాత్రలను ప్రజలు నమ్మడం లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,066వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. కోవిడ్ సమయంలో రాష్ట్రంలోని ప్రజలను గాలికి వదిలేసి పక్క రాష్ట్రంలో దాక్కున్న చంద్రబాబు ఆయన కుమారుడు లోకేశ్, దత్తపుత్రుడు ఇప్పుడు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని దుష్ప్రచారం చేస్తే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. కులవాదమే అజెండాగా అన్ని పార్టీల్లోని బాబు బినామీలు ఏకమై బహుజనులను అణగదొక్కేందుకు చేస్తున్న యత్నాలు ఫలించబోవన్నారు. సుదీర్ఘ పోరాటంతో రాజధాని ప్రాంతంలో 53 వేల ప్లాట్లు సాధించుకున్నామని, ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుందామంటే ఈ ప్రాంతంలో పేదలు ఉంటే తమ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఎక్కడ అడ్డు అవుతుందోనని వందలాది తప్పుడు కేసులు వేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. పేదలను అణగదొక్కి తామే పాలన సాగించాలని చూస్తున్న కులవాదులకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

యువతిపై టీడీపీ నాయకుడు లైంగికదాడి

- అనంతపురం జిల్లాలో బరితెగించిన మాజీ మంత్రి కాలవ అనుచరుడు
- దేహశుద్ధి చేసిన బాధిత యువతి బంధువులు
- నిందితుడి అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు



మాజీ మంత్రి కాలవతో నిందితుడు సోమశేఖర్ (ఫైల్)

రాయదుర్గం: కుమార్తె వయసు కలిగిన ఓ యువతిపై టీడీపీ నాయకుడు దారుణానికి ఒడిగట్టాడు. ఎవరూ లేని సమయంలో యువతి ఇంట్లోకి చొరబడి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసి అతనికి బాధిత యువతి బంధువులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం హులికల్లులో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాల మేరకు... హులికల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుకు ప్రధాన అనుచరుడైన బోయ సోమశేఖర్ (45) వరుసకు కోడలైన 20 ఏళ్ల యువతిపై ఎప్పటినుంచో కన్నేశాడు. అమ్మాయిని ఎలాగైనా లోబర్చుకోవాలని కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే ఏదో ఒక కారణంతో తరచూ ఆమె ఇంటి వద్దకు వెళ్లి గంటల తరబడి కాలక్షేపం చేసేవాడు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆ యువతి తల్లిదండ్రులు బయటకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదే అదనుగా భావించిన సోమశేఖర్ ఆమె ఇంట్లోకి చొరబడి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె ప్రతిఘటిస్తున్నప్పటికీ బలవంతంగా లైంగికదాడి చేశాడు. అనంతరం చెప్పులు అక్కడే వదిలి పారిపోయాడు. యువతి ఇంట్లోనే ఏడుస్తూ కూర్చొంది. కొద్దిసేపటి తర్వాత యువతి తండ్రి ఇంటికి రావడంతో జరిగిన దారుణం గురించి తెలియజేసి కన్నీటిపర్యంతమైంది. అదే సమయంలో చెప్పుల కోసం తిరిగి యువతి ఇంటి వద్దకు వచ్చిన సోమశేఖర్‌ను గుర్తించిన బాధితురాలి తండ్రి, బంధువులు చితకబాదారు. అనంతరం తన తల్లిదండ్రులతో కలిసి బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన రూరల్ సీఐ యుగంధర్ మంగళవారం నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 376 కింద (రేప్) కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు. నిందితుడు సోమశేఖర్‌ను కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా, రిమాండ్ విధించారు.

విశాఖ మార్గంలో పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్‌లోని అనకాపల్లి–తాడి సెక్షన్ల మధ్య జరుగుతున్న ట్రాఫిక్ బ్లాక్ పనుల కారణంగా ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు పలు రైళ్లను పూర్తిగా, మరి కొన్నింటిని పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

రద్దయిన రైళ్లు: మచిలీపట్నం–విశాఖపట్నం (17219) రైలు ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 3 వరకు, విశాఖపట్నం–మచిలీపట్నం (17220) రైలు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 4 వరకు, విజయవాడ–విశాఖపట్నం (22702/22701) రైళ్లు సెప్టెంబర్ 2, 4 తేదీల్లో, రాజమండ్రి–విశాఖపట్నం (07466/07467), గుంటూరు–విశాఖపట్నం (17239), కాకినాడ పోర్టు–విశాఖపట్నం (17267/17268) రైళ్లు సెప్టెంబర్ 4న, విశాఖపట్నం–గుంటూరు (17240) రైలు సెప్టెంబర్ 5న రద్దు చేశారు.

పాక్షికంగా రద్దు: తిరుపతి–విశాఖపట్నం (22708) రైలు సెప్టెంబర్ 1, 3 తేదీల్లో, విశాఖపట్నం–తిరుపతి (22707) సామర్లకోట–విశాఖపట్నం మధ్య సెప్టెంబర్ 3, 5 తేదీల్లో, విజయవాడ–విశాఖపట్నం (12718/12717) రైళ్లు విశాఖపట్నం–అనకాపల్లి మధ్య ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు పాక్షికంగా రద్దు చేశారు.

ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

- భారత ప్రభుత్వ వైద్యుల సంఘం నేత జయధీర్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం జాతీయ అడిషనల్ సెక్రటరీ జనరల్, రాష్ట్రానికి చెందిన వైద్యుడు డాక్టర్ జయధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో భారత ప్రభుత్వ వైద్యుల సంఘం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే సంఘం ఏర్పాటుకు ప్రధాన ఉద్దేశంగా తెలిపారు. వైద్యులపై దాడులు అరికట్టడం, నిందితులకు కఠినంగా శిక్షలు విధించేలా కఠినమైన చట్టాలు రూపొందించడం సహా, ఇతర డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. అదే విధంగా నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) దుందుడుకు చర్యలపై త్వరలో కేంద్ర మంత్రులు, భారత ప్రధానిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు.

5 వేల మంది విద్యార్థులతో మానవహారం

- కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



భారీ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులతో ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: కృష్ణాజిల్లా అవనిగడ్డలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐదు వేల మంది విద్యార్థులు జాతీయ పతాకాలతో మంగళవారం మానవహారం, ర్యాలీ నిర్వహించారు. అవనిగడ్డ సబ్‌జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ పతాకాన్ని అవనిగడ్డ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ఆవిష్కరించారు. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడా ర్యాలీ ప్రారంభించారు. క్రీడా మైదానం నుంచి కోర్టు సెంటర్ వరకూ రెండు కిలో మీటర్లు విద్యార్థులు భారీ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో 500 మీటర్ల నాలుగు జాతీయ పతాకాలతో చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పాల్గొన్నారు.

దివ్యాంగుడిపై టీడీపీ ఎమ్మెల్యే గద్దె అనుచరుల జులుం

- లోకేశ్ పాదయాత్రకు తీసుకువెళ్లి చెప్పిన మేరకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారు
- ఇప్పుడు మళ్లీ వారికి అనుకూలంగా మాట్లాడాలని బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



యువగళం పాదయాత్రలో గద్దె తంబికి తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ డబ్బులు ఇస్తున్న దృశ్యం (ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): 'రూ.2వేలు ఇస్తామని చెప్పి లోకేశ్ యువగళం పాదయాత్రకు తీసుకువెళ్లారు. వెళ్లిన తర్వాత కేవలం రూ.500 ఇచ్చి మోసం చేశారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు బెదిరిస్తున్నారు. దాడికి ప్రయత్నించారు.' అని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్, ఆయన కారు డ్రైవర్ దుర్గారావుపై పటమట కృష్ణానగర్‌కు చెందిన గద్దె తంబి అనే దివ్యాంగుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు... 'ఈ నెల 20వ తేదీన విజయవాడ తూర్పు నియోజకవర్గం పటమటలో జరిగిన నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు వస్తే రూ.2వేలు ఇస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నాకు చెప్పారు. అయితే, కేవలం రూ.500 మాత్రమే ఇచ్చారు..' అని గతంలో తంబి చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అనుచరుడు, కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్, ఆయన కారు డ్రైవర్ దుర్గారావు సోమవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు తనను తీసుకువెళ్లారని తంబి ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ తనతో బలవంతంగా ఎమ్మెల్యేకు అనుకూలంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారని తెలిపారు. ఈ స్టేట్‌మెంట్‌ను సోషల్ మీడియాలో పెట్టడంతో తాను ప్రశ్నించానని, దీంతో తనపై దాడికి ప్రయత్నించారని తంబి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. తనను బెదిరించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ముమ్మినేని ప్రసాద్, దుర్గారావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీఐ కాశీవిశ్వనాథ్ దర్యాప్తు చేస్తున్నారు.



గద్దె తంబి

ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణేలకు భారీ డిమాండ్

• తెలంగాణ

- మొదటి విడతగా 12 వేల నాణేలు మాత్రమే విడుదల

లక్డీకాపూల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు స్మారక రూ.100 నాణేలకు భారీ డిమాండ్ లభించింది. కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆయన చిత్రంతో కూడిన రూ.100 నాణేన్ని ముద్రించింది. దీనిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. మొదటి విడతగా 1,200 నాణేలను ప్రభుత్వం విడుదల చేయగా, వీటి కోసం ఎన్టీఆర్ అభిమానులు పోటీపడుతున్నారు. వీటి కోసం తెలంగాణ, ఏపీ నుంచి హైదరాబాద్‌కు భారీగా తరలివస్తున్నారు. మంగళవారం సైఫాబాద్‌లోని మింట్ కాంపౌండ్ వద్ద నాణేల అమ్మకాలు ప్రారంభం కాగా, గంటల తరబడి క్యూలో ఉండి ఎన్టీఆర్ నాణేలను చేజిక్కించుకుంటున్నారు. రూ.4,850, రూ.4,380, రూ.4,050గా ధరలు నిర్ణయించిన అధికారులు గిఫ్ట్ బాక్స్‌తోపాటు వంద నాణేన్ని అమ్ముతున్నారు. ప్రజల నుంచి ఊహించని డిమాండ్ ఉండటంతో అధికారులు కొత్త నాణేల ఉత్పత్తిని ప్రారంభించినట్టు సమాచారం.

శాశ్వత నివాసితులైతే స్థానికులే..

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య సీట్ల భర్తీకి సంబంధించి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. శాశ్వత నివాసితులైన విద్యార్థులను స్థానికులుగానే పరిగణించాలని స్పష్టం చేసింది. దీనిప్రకారం 2023–24 ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను భర్తీ చేయాలని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీని ఆదేశించింది. అయితే ప్రభుత్వ అధికారి జారీ చేసిన ఏదైనా స్థానిక సర్టిఫికెట్‌ను వర్సిటీకి సమర్పించాలని పిటిషనర్లకు చెప్పింది. తీర్పు వెలువరించిన తేదీ నుంచి వారం రోజుల్లోగా సర్టిఫికెట్‌ను అందజేయాలని పేర్కొంది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు వెలువరించింది.

ఆ నిబంధన వర్తించదు

'తెలంగాణ మెడికల్, డెంటల్ కాలేజీల అడ్మిషన్ నిబంధనలు–2017లోని 3(ఐఐఐ)(బీ) ప్రకారం విద్యార్థిని స్థానికుడిగా పరిగణించాలంటే అర్హత పరీక్ష(నీట్)కు ముందు నాలుగేళ్లు తెలంగాణలోనే చదివి ఉండాలని చెబుతోందని.. ఈ నిబంధన రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇలాంటి నిబంధనను తప్పుబడుతూ గతంలో సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఉత్తర్వులు కూడా ఇచ్చిందని గుర్తుచేసింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నిబంధనను పూర్తిగా ఎత్తివేయలేమంది. తెలంగాణలోని శాశ్వత నివాసితులకు 3(ఐఐఐ)(బీ) నిబంధన వర్తించదని తేల్చిచెప్పింది. పిటిషనర్ల కేసు.. రూల్ 3(ఐఐఐ)(బీ) కిందకు రాదని యూనివర్సిటీ తరఫు న్యాయవాది కూడా చెబుతున్నారని వ్యాఖ్యానించింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95కూ, ఈ రిట్ పిటిషన్ల వివాదానికీ ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. ఈ కేసులో పిటిషనర్లు తాము తెలంగాణలో శాశ్వత నివాసితులమని చెబుతున్నందున, వారు సర్టిఫికెట్ అందజేస్తే మెరిట్ ప్రకారం స్థానిక కోటాలో సీట్లు కేటాయించాలని వర్సిటీని ఆదేశించింది. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి ప్రశంస రాథోడ్ తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగులు. విధి నిర్వహణలో భాగంగా చెన్నైకి బదిలీ కావడంతో అతడు అక్కడే ఇంటర్మీడియెట్ చదివారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు తెలంగాణలోనే చదువుకున్నారు. అయితే, ఇంటర్ చెన్నైలో చదివినందున ఆ విద్యార్థిని నాన్‌లోకల్‌గా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇంటర్మీడియెట్ స్థానికంగా చదవకుంటే నీట్‌లో లోకల్ కోటా (85 శాతం) కిందికి రారంటూ ప్రభుత్వం తెచ్చిన జీవో 114ను ప్రశంస రాథోడ్ హైకోర్టులో సవాల్ చేశారు. లోకల్‌గా పరిగణించకుంటే కేవలం 15 శాతం సీట్లలోనే తాము పోటీ పడాల్సి ఉంటుందని, ఇది చట్టవిరుద్ధమని చెప్పారు. ఇదే తరహా పిటిషన్లను కలిపి ధర్మాసనం విచారణ జరిపి తీర్పు వెలువరించింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి తెగబడిన టీడీపీ

- కత్తులు, గొడ్డళ్లు, ఇనుప రాడ్లతో దాడి
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో ఘటన



గాయపడిన ఆంజనేయులు



రాజబోయిన రవీంద్ర



వెంకటేశ్వర్లు

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు కత్తులు, గొడ్డళ్లు, రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన పల్నాడు జిల్లా గొట్టిపాళ్ల గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గొట్టిపాళ్లలో సత్తెమ్మ తల్లి కొలుపుల సందర్భంగా టీడీపీ ఏర్పాటు చేసిన కుంకుమ బండి ఊరేగింపునకు వస్తున్న సందర్భంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు పసుపు చల్లారు. తమపై పసుపు ఎందుకు చల్లుతున్నారని వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రశ్నించగా.. పథకం ప్రకారం ముందే వారి వెంట తెచ్చుకున్న కత్తులు, గొడ్డళ్లు, ఇనుప రాడ్లతో రాజబోయిన రవీంద్ర, పంగల వెంకటేశ్వర్లు, సూదనబోయిన ఆంజనేయులుపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. రవీంద్రకు ఐదు కత్తిపోట్లు తగలగా, ఆంజనేయులును కత్తి, గొడ్డలితో గాయపరిచారు. వెంకటేశ్వర్లుపై ఇనుపరాడ్లతో దాడి చేయగా.. ఆయన తలకు గాయాలయ్యాయి. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై దాడికి దిగి వారి గృహాలలో విలువైన వస్తువులను ధ్వంసం చేశారు. గాయపడిన వారిని బంధువులు మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ముగ్గురినీ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కత్తిపోట్లకు గురైన రవీంద్ర పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు రాజబోయిన మధుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.శ్రీరామ్ తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నటి వరలక్ష్మికి ఎన్ఐఏ సమన్లు



సాక్షి, చెన్నై: హెరాయిన్, తుపాకుల స్మగ్లింగ్ కేసు విచారణలో భాగంగా నటి వరలక్ష్మికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సమన్లు జారీ చేసినట్లు తెలిసింది. గతేడాది కేరళ సముద్ర తీరంలో పాకిస్తాన్ నుంచి చట్టవిరుద్ధంగా తరలించిన 300 కేజీల హెరాయిన్, 5 ఏకే 47 తుపాకులు, వెయ్యి తూటాలను సముద్ర తీర భద్రతా విభాగం, కోస్ట్‌గార్డ్, నావికాదళం అధికారులు పట్టుకున్నారు. ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించారు. అప్పటి నుంచి ఈ కేసు దర్యాప్తు చెన్నై చుట్టూ తిరుగుతోంది. ఎల్‌టీటీఈ మద్దతుదారుడైన కుండ్రత్తూరు సురేష్ రాజన్‌ను ఈ కేసులో అరెస్ట్ చేశారు. అతడిచ్చిన సమాచారంతో తిరుచ్చి, చెన్నై తదితర కారాగారాల్లోని విదేశీయులను బంధించిన శిబిరాల్లో సోదాలు చేశారు. విచారణలో శ్రీలంకకు చెందిన ఆదిలింగం, అతడి బినామీ గుణ శేఖరన్‌ను అరెస్ట్ చేశారు. వీరు సినిమాలకు ఫైనాన్స్ చేస్తున్నట్లు, నటి వరలక్ష్మికి ఆదిలింగం అసిస్టెంట్‌గా పనిచేసినట్లు విచారణలో తేలింది. దీంతో వరలక్ష్మికి ఎన్ఐఏ సమన్లు జారీ చేసినట్లు సమాచారం. సినిమాల షూటింగ్ నిమిత్తం వరలక్ష్మి హైదరాబాద్‌లో ఉండటంతో విచారణకు హాజరు కాలేరని, త్వరలో విచారణకు వస్తారని ఎన్ఐఏకు ఆమె సన్నిహితులు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. కాగా, ఎన్ఐఏ తనకు ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని వరలక్ష్మి చెప్పారు. ఆదిలింగం తన దగ్గర పనిచేసి ఐదేళ్ల క్రితమే పని మానేశాడని తెలిపారు.

క్లుప్తంగా...

లోక్‌సభ ఎన్నికలు ముందే జరగొచ్చు



నలందా: ప్రతిపక్ష పార్టీల ఐక్యత కారణంగా ఆలస్యమయ్యే కొద్దీ తమకు నష్టం జరుగుతుందని భయపడుతున్న కేంద్రంలోని బీజేపీ లోక్‌సభ ఎన్నికలను ముందుగానే జరిపే అవకాశం ఉందని బిహార్ సీఎం నితీశ్ కుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలు డిసెంబర్‌లోనే జరగొచ్చంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం చేసిన వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. లోక్‌సభ ఎన్నికలు ముందుగానే జరిగే అవకాశాలున్నాయన్న విషయాన్ని ఏడెనిమిది నెలల క్రితం నుంచే తాను చెబుతున్నానన్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలన్నారు. 'ఈ విషయంలో నాకెలాంటి కోరికలు లేవు. వ్యక్తిగత ఆకాంక్షలు లేవు. బీజేపీకి వ్యతిరేకంగా పార్టీలన్నీ ఏకం చేయాలన్నదే నా ఏకైక ఆశయం'అని నితీశ్ తెలిపారు.

తోషఖానా కేసులో ఇమ్రాన్‌కు ఊరట

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట లభించింది. తోషఖానా అవినీతి కేసులో జిల్లా కోర్టు ఇమ్రాన్‌కు విధించిన మూడేళ్ల జైలు శిక్షను ఇస్లామాబాద్ హైకోర్టు కొట్టివేసింది. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆమిర్ ఫరూక్ సారథ్యంలోని డివిజన్ బెంచ్ ఎదుట సోమవారం ఈ కేసులో వాదోపవాదాలు పూర్తయ్యాయి. రూ.లక్ష పూచీకత్తుపై ఇమ్రాన్‌ను విడుదల చేయాలని పేర్కొంది. ఇమ్రాన్ కోరిన విధంగా వెంటనే తీర్పు ప్రతిని అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది. తీర్పు వివరాలను తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) వాట్సాప్ సందేశం ద్వారా విడుదల చేసింది. అయితే, ఇమ్రాన్ అటోక్ జైలు నుంచి విడుదల కాలేదు. అధికార రహస్యాల చట్టం ఉల్లంఘన కేసులో ఆయనపై విచారణ కొనసాగుతున్నందున ఇమ్రాన్‌ను జైలు నుంచి విడుదల చేయరాదని ప్రత్యేక న్యాయ స్థానం ఆదేశాలిచ్చింది. ఈనెల 30వ తేదీన తమ ముందు హాజరుపరచాలని కోరింది.

1901 తర్వాత అత్యంత పొడి ఆగస్ట్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఆగస్ట్ నెలలో వర్షాలు ఇంత తక్కువగా నమోదు కావడం 1901 తర్వాత ఇదే మొదటిసారని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. వర్షాకాలం సీజన్‌లో ఇంత తక్కువగా వర్షాలు పడటం కూడా 2015 తర్వాత ఇదే మొదటిసారని పేర్కొంది.

తైవాన్ అధ్యక్ష రేసులో.. టెర్రీ గౌ



ఫాక్స్‌కాన్ ఫౌండర్ రాకతో అధికార పార్టీకి ముక్కోణపు పోటీ

చివరికి దానికే లాభిస్తుందని అంచనాలు

ఐ ఫోన్ తయారీ సంస్థ ఫౌండర్, అపర కుబేరుడు టెర్రీ గౌ కూడా తైవాన్ అధ్యక్ష రేసులో నిలిచారు. కుచేలుడి నుంచి కుబేరుని స్థాయికి ఎదిగిన ఆసక్తికర నేపథ్యం టెర్రీది. కనుక ఆయనకున్న ప్రజాదరణ నేపథ్యంలో ఒక్కడే గనక బరిలో ఉంటే పాలక డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి గట్టి పోటీ ఇవ్వడం కూడా ఖాయమేనని అంటున్నారు. కానీ విపక్షాల తరఫున ఇప్పటికే ఇద్దరు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో టెర్రీ పోటీ విపక్ష ఓటును మూడుగా చీల్చి చివరికి 2024 జనవరిలో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో అధికార పక్షం నెత్తిన పాలు పోసేలా కనిపిస్తోందన్నది పరిశీలకుల విశ్లేషణ...

తైవాన్‌కు చెందిన 72 ఏళ్ల టెర్రీ అపర కుబేరుడు. ఐ ఫోన్ తయారీ సంస్థ ఫాక్స్ కాన్ వ్యవస్థాపకుడు. వ్యాపారవేత్తగా దేశ ప్రజల్లో ఆయనకున్న చరిష్మా అంతా ఇంతా కాదు. అధికార పక్షంతో ఇప్పటికే రెండు విపక్షాలు తలపడుతుండగా మూడో శక్తిగా ఆయన కూడా రంగంలోకి దిగి అధ్యక్ష ఎన్నికల రేసును ఆసక్తికర మలుపు తిప్పారు.

బరిలో ఆ ముగ్గురు...

అధ్యక్షుడు సై ఇంగ్ వెన్‌కు ఇది రెండో టర్మ్. అంతకు మించి పదవిలో కొనసాగేందుకు తైవాన్ నిబంధనలు అనుమతించవు. దాంతో ఈసారి అధికార డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డీపీపీ) తరఫున విలియం లై చింగ్ తే బరిలో దిగుతున్నారు.

ప్రధాన విపక్షమైన జాతీయవాద కోమింటాంగ్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా చాన్స్ దక్కించుకునేందుకు టెర్రీ ఎంతగానో ప్రయత్నించి విఫలమయ్యారు. ఆయనకు బదులుగా హౌ యూ ఇయ్‌కు పార్టీ అవకాశం ఇచ్చింది.

మరో విపక్షం టీపీపీ తరఫున దేశ ప్రజల్లో అత్యంత ఆదరణ ఉన్న కో వెన్ జే పోటీ పడుతున్నారు. రాజధాని తాయ్ పీ సిటీ మేయర్‌గా చేసిన అనుభవం ఆయన సొంతం. పైగా యువ ఓటర్లు ఆయనను వేలం వెర్రిగా అభిమానిస్తారు. ప్రస్తుతం రేసులో రెండో స్థానంతో వెన్ దూసుకు పోతున్నారు.

ఎంత ప్రయత్నించినా ప్రధాన విపక్షం డీపీపీ నుంచి అవకాశం దక్కక పోవడంతో టెర్రీ స్వతంత్ర హోదాలో పోటీకి దిగారు. అంతులేని సంపద, వ్యాపార విజయాలతో పాటు చైనాతో దీర్ఘకాలం పాటు విజయవంతంగా కలిసి పని చేసిన విశేషాను భవం టెర్రీకి మరింతగా కలిసొచ్చే అంశం.

- నేషనల్ డెస్క్, సాక్షి

- తైవాన్ ఇంజనీరింగ్ ప్రతిభకు మానవ వనరులను కలగలిపి ఫాక్స్ కాన్ (హాన్ హై ఇండస్ట్రీస్)ను ప్రపంచంలోనే అతి పెద్ద ఎలక్ట్రానిక్స్ తయారీదారుగా తీర్చిదిద్దారు టెర్రీ. 1980, 90ల్లో దక్షిణ చైనాలో అతి పెద్ద తయారీ సంస్థలను నెలకొల్పి చైనీయులకు వేలాదిగా ఉపాధి కల్పించారు.
- ఈ మోడల్ సూపర్ సక్సెస్ అయింది. ఎంతగా అంటే, యాపిల్ తన మాక్ బుక్స్, ఐ ఫోన్ల తయారీని ఫాక్స్ కాన్‌కే అప్పగించేలా ఒప్పించగలిగారు టెర్రీ.
- దాంతో ఫాక్స్ కాన్ అతి పెద్ద కంపెనీగా, టెర్రీ దేశంలోనే అతి సంపన్నుల్లో ఒకరిగా ఎదగడం సాధ్యపడింది.
- తైవాన్ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు చైనాతో తనకున్న సంబంధాలన్నింటినీ ఉపయోగిస్తానని, దేశాభివృద్ధి కోసం తన అనుభవం మొత్తాన్నీ రంగరిస్తానని చెబుతున్నారు టెర్రీ. తైవాన్‌ను ఎలాగైనా పూర్తిగా తనలో కలిపేసుకోవాలని చైనా ప్రయత్నిస్తుండటం, ఇటీవల ఆ దిశగా దూకుడు పెంచడం, అది తైవాన్ కు కొమ్ము కాస్తున్న అమెరికాతో ఘర్షణ దాకా వెళ్లడం తెలిసిందే
- పాలక డీపీపీ అసమర్థ, అసంబద్ధ, దుందుడుకు విధానాలే ఈ దుస్థితికి కారణమని టెర్రీ ఆరోపిస్తున్నారు. కానీ తైవాన్ ప్రజల్లో అత్యధికులు ఈ వాదనను విశ్వసించడం లేదు. త్రిముఖ ఓటుతో ఇప్పటికే అవకాశాలు సన్నగిల్లేలా కనిపిస్తున్న టెర్రీకి ఇది మరింత ప్రతికూలంగా మారేలా ఉంది. 40 శాతానికి పైగా ఓటర్లు పాలక పక్షానికి గట్టిగా మద్దతిస్తున్నట్టు ఇటీవలి సర్వేలు కూడా తేల్చాయి.
- ఈ పరిస్థితుల్లో విపక్షాలన్నీ ఒక్కటై ఉమ్మడిగా ఒకే అభ్యర్థిని నిలిపితేనే అధికార పార్టీకి కాస్తో కూస్తో పోటీ ఇవ్వడం సాధ్యపడేలా కనిపిస్తోంది.
- కానీ అందుకు రెండు విపక్షాల్లో ఏదీ సిద్ధంగా లేదు. దాంతో సర్వేలు చెబుతున్నట్టు అధికార డీపీపీకి కేవలం 40 శాతం ఓట్లు మాత్రమే వచ్చినా అది అధికారం నిలుపుకునే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

మిగిలింది వారం రోజులే..

చివరి దశకు చేరిన చంద్రయాన్-3 మిషన్

- జాబిల్లి ఉపరితలంపై మరిన్ని శాస్త్రీయ పరిశోధనలు
- కీలక సమాచారం అందించనున్న ల్యాండర్, రోవర్
- ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రపంచ దేశాలు



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ ఈ ఏడాది జూలై 14న శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 41 రోజుల ప్రయాణం అనంతరం ఆగస్టు 23న సాయంత్రం 6.04 గంటలకు ల్యాండర్ విక్రమ్ చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై నిర్దేశిత ప్రాంతంలో సురక్షితంగా అడుగుపెట్టింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగిన మొట్టమొదటి మిషన్‌గా చరిత్ర సృష్టించింది. దాదాపు 4 గంటల తర్వాత ల్యాండర్ నుంచి ఆరు చక్రాలతో రోవర్ ప్రజ్ఞాన్ విజయవంతంగా బయటకు వచ్చింది. నెమ్మదిగా అడుగులు వేస్తూ జాబిల్లి ఉపరితలానికి చేరుకుంది. అటూ ఇటూ తిరుగుతూ చంద్రుడిపై పరిశోధనలు ప్రారంభించింది. విలువైన సమాచారాన్ని భూమిపైకి చేరవేస్తోంది. సాఫ్ట్ ల్యాండింగ్ జరిగి వారం రోజులు పూర్తయ్యింది. ఆగస్టు 23 నుంచి ఆగస్టు 29 వరకు మొత్తం ఏడు రోజుల వ్యవధిలో చంద్రయాన్-3 మిషన్ ఏమేం చేసింది? అనే వివరాలను ఇస్రో బహిర్గతం చేసింది.

రోవర్ చాకచక్యం

చంద్రుడిపై ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్, ల్యాండర్ నుంచి రోవర్ విజయవంతంగా బయటికి వచ్చి తన కార్యాచరణ ప్రారంభించడం, చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు అనేవి మూడు ప్రధాన లక్ష్యాలు కాగా, ఆగస్టు 26 నాటికే తొలి రెండు లక్ష్యాలు నెరవేరాయి. ఆగస్టు 27న చంద్రుడి ఉపరితలంపై ఉష్ణోగ్రతల మార్పుల వివరాలను రోవర్ ప్రజ్ఞాన్ భూమిపైకి చేరవేసింది. అందరూ అనుకుంటున్నట్లు చంద్రుడు చల్లగా ఉండడని, ఉపరితలంపై 70 డిగ్రీల దాకా వేడి ఉంటుందని తేల్చింది. ఆగస్టు 28న తన ప్రయాణానికి 4 మీటర్ల లోతున్న గొయ్యి అడ్డు రావడంతో ఇస్రో కమాండ్స్‌ను పాటిస్తూ రోవర్ చాకచక్యంగా తప్పించుకుంది. ఈ మిషన్‌కు ఇంకా వారం రోజుల కాల వ్యవధి మిగిలి ఉంది. ఈ ఏడు రోజుల్లో ల్యాండర్, రోవర్ ఏం చేయనున్నాయన్నది ఆసక్తికరం. సాంకేతికంగా వాటికి ఇదే చివరి దశ.

- మిగిలిన ఏడు రోజుల్లో చందమామపై ల్యాండర్, రోవర్ మరిన్ని శాస్త్రీయ పరిశోధనలు చేస్తాయి.
- రోవర్ ప్రజ్ఞాన్ చంద్రుడి ఉపరితలంపై మట్టి స్వభావాన్ని విశ్లేషిస్తుంది.
- చంద్రుడిపై ఉన్న దుమ్ము ధూళీ, రాళ్లలోని రసాయనిక సమ్మేళనాలను రోవర్ గుర్తిస్తుంది. చందమామ ఉపరితల వాతావరణం, ఉపరితలం లోపలి పరిస్థితుల గురించి సమాచారం అందిస్తుంది.
- ల్యాండర్ విక్రమ్‌లో నాలుగు పేలోడ్‌లు ఉన్నాయి. ఇవి చంద్రుడిపై ప్రకంపనలు, ఉపరితలంపై ఉష్ణోగ్రతల స్థితిగతులు, ప్లాస్మాలో మార్పులను అధ్యయనం చేస్తాయి.
- చంద్రుడికి-భూమికి మధ్యనున్న దూరాన్ని కచ్చితంగా లెక్కించడంలో ల్యాండర్‌లోని పేలోడ్‌లు సహకారం అందిస్తాయి.
- చంద్రుడిపై మట్టి స్వభావాన్ని విశ్లేషించడం, ఉష్ణోగ్రతలను గుర్తించడం అనేవి అత్యంత కీలకమైనవి.
- చందమామ దక్షిణ ధ్రువంలో చీకటి పడగానే 14 రోజులపాటు ఉష్ణోగ్రత మైనస్ 230 డిగ్రీలకు పడిపోనుంది. ఈ అత్యల్ప ఉష్ణోగ్రతను తట్టుకొని పనిచేసేలా ల్యాండర్‌ను, రోవర్‌ను డిజైన్ చేయలేదు. ఉపరితలంపై సూర్యాస్తమయం కాగానే ఇవి పనిచేయడం ఆగిపోతుంది.
- కొన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ చంద్రయాన్-3 మిషన్ ఇప్పటిదాకా సాధించింది తక్కువేమీ కాదు. ఎవరూ చూడని జాబిల్లి దక్షిణ ధ్రువం గురించి కీలక సమాచారం అందించింది.
- చంద్రయాన్-3 చివరి దశలోకి ప్రవేశించడంతో ఇక ల్యాండర్, రోవర్ అందించే సమాచారం కోసం ప్రపంచ దేశాలు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నాయి.

చందమామపై సల్ఫర్‌ను గుర్తించిన రోవర్

చంద్రుడి ఉపరితలంపై వివిధ లోహాలతో పాటు సల్ఫర్ ఉన్నట్లు రోవర్ నిర్ధారించింది. ఈ విషయాన్ని ఇస్రో మంగళవారం వెల్లడించింది. అంతేకాకుండా అల్యూమినియం, కాల్షియం, ఐరన్, క్రోమియం, టైటానియం, మాంగనీస్, సిలికాన్ ఉన్నట్లు రోవర్ గుర్తించిందని తెలియజేసింది. హైడ్రోజన్ కోసం అన్వేషణ సాగిస్తోందని తెలిపింది.

చంద్రయాన్-3 విజయంపై కేబినెట్ ప్రశంస

చందమామపై చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్ క్షేమంగా దిగడాన్ని ప్రశంసిస్తూ కేంద్ర కేబినెట్ మంగళవారం తీర్మానం ఆమోదించింది. ఇది కేవలం 'ఇస్రో' విజయం మాత్రమే కాదని, దేశ ప్రగతికి, అంతర్జాతీయ వేదికపై పెరుగుతున్న దేశ గౌరవ ప్రతిష్టలకు నిదర్శనమని కొనియాడింది. ఆగస్టు 23వ తేదీని 'నేషనల్ స్పేస్ డే'గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించింది. చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రోను మంత్రివర్గం అభినందించిందని, సైంటిస్టులకు కృతజ్ఞతలు తెలిపిందని మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు.

జమ్మూకశ్మీర్‌కు యూటీ హోదా శాశ్వతం కాదు

- సుప్రీంకోర్టుకు తెలియజేసిన కేంద్ర ప్రభుత్వం
- అక్కడ పరిస్థితులను చక్కదిద్దాలన్న అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు కల్పించిన కేంద్ర పాలిత ప్రాంతం(యూటీ) హోదా శాశ్వతం కాదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ అంశంపై ఈ నెల 31న పూర్తిస్థాయిలో నివేదిక సమర్పిస్తామని వెల్లడించింది. ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ కొనసాగించింది. ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చవచ్చా? ఓ రాష్ట్రం నుంచి యూటీని రూపొందించవచ్చా? అని ప్రశ్నించింది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి ఏదైనా కాల వ్యవధి ఉందా? దీనికి సంబంధించి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రణాళిక ఉందా? అని అడిగింది. అక్కడ ఎన్నికల ప్రజాస్వామ్యం ఏర్పడటం చాలా ముఖ్యమని స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులను త్వరగా చక్కదిద్దాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిచ్చారు. జమ్మూకశ్మీర్‌కు కేంద్ర పాలిత ప్రాంతం హోదా శాశ్వతం కాదని ఆయన అన్నారు. లద్దాఖ్‌కు మాత్రం యూటీ హోదా మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, జమ్మూకశ్మీర్ పరిస్థితిపై గురువారం ఒక సానుకూల ప్రకటన చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

గ్యాస్ బండ రూ. 200 తగ్గింది

ఎన్నికల ముందు కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం

- నేటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్న తగ్గింపు ధర



న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. వంట గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ.200 చొప్పున తగ్గించింది. ఈ నిర్ణయం బుధవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం సమావేశమైంది. మధ్యప్రదేశ్ తోపాటు తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే చౌక ధరకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ హామీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో గ్యాస్ బండ ధరను రూ.200 చొప్పున తగ్గిస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దేశంలో గత రెండేళ్లుగా గ్యాస్ సిలిండర్ ధర పెరగడమే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. దేశ రాజధాని ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,103 ఉండగా, బుధవారం నుంచి రూ.903కు లభించనుంది. 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' లబ్ధిదారులు వంట గ్యాస్ సిలిండర్‌పై ఇప్పటికే రూ.200 చొప్పున రాయితీ పొందుతున్నారు. తాజా తగ్గింపు ధర వారికి కూడా వర్తిస్తుంది. అంటే ఒక్కో సిలిండర్ రూ.703కే పొందవచ్చు. అంతేకాకుండా ఉజ్వల యోజన కింద అదనంగా 75 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ పథకం కింద లబ్ధి పొందేవారి సంఖ్య 10.34 కోట్లకు చేరుకోనుంది.

ఎన్నికలతో సంబంధం లేదు: మంత్రి

ప్రజలకు ఉపశమనం కల్పించడానికే వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని నిర్ణయించినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ఈ నిర్ణయానికి ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఇది ఓనం, రక్షాబంధన్ పండుగల సందర్భంగా మహిళలకు మోదీ ప్రభుత్వం ఇస్తున్న కానుక అని వివరించారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన చర్యల్లో భాగంగానే గ్యాస్ ధరను తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి, అంకితభావానికి ఇదొక నిదర్శనమని స్పష్టం చేసింది. నిత్యావసరాలు సరసమైన ధరలకే ప్రజలకు అందాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొంది.

సోదరీమణులకు ఉపశమనం: మోదీ

గ్యాస్ సిలిండర్ ధరను రూ.200 చొప్పున కేంద్ర ప్రభుత్వం తగ్గించడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. రక్షాబంధన్ పండుగ సందర్భంగా వెలువడిన ఈ నిర్ణయం కుటుంబాల్లో సంతోషాన్ని పెంచుతుందని చెప్పారు. అక్కాచెల్లెమ్మలకు మరింత ఉపశమనం లభిస్తుందని వెల్లడించారు. తన సోదరీమణులంతా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలంటూ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

ఎన్నికల వ్యూహమే!?

రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందడానికే వంట గ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వం తగ్గించినట్లు ప్రచారం సాగుతోంది. వంట గ్యాస్ తోపాటు నిత్యావసరాల ధరల పెరుగుదలను కాంగ్రెస్ ప్రచారాస్త్రంగా మార్చుకుంది. కాంగ్రెస్ పాలిత రాజస్తాన్‌లో రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మధ్యప్రదేశ్, తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ.500కు సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇస్తోంది. కొన్ని నెలల క్రితం జరిగిన కర్ణాటక ఎన్నికల్లో ఇలాంటి హామీతో కాంగ్రెస్ విజయం సాధించింది. అందుకే కాంగ్రెస్ ప్రచార ఎత్తుగడలను తిప్పికొట్టి జనాన్ని తమవైపు తిప్పుకోవాలన్న వ్యూహంలో భాగంగానే సిలిండర్ ధరను మోదీ సర్కారు భారీగా తగ్గించినట్లు సమాచారం. ఈ తగ్గింపు వల్ల చమురు సంస్థలపై పడే భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించనుంది.

బెంగళూరులో సూపర్‌స్టార్ రజనీ సందడి



సాక్షి బెంగళూరు: బహుభాషా నటుడు, సూపర్ స్టార్ రజనీకాంత్(72) మంగళవారం బెంగళూరు జయనగరలోని బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) బస్ డిపో-4కు వెళ్లారు. ఉదయం 11.30 గంటల సమయంలో అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది తమ పనుల్లో బిజీబిజీగా ఉండగా ఆయన తన కారులో అక్కడికి వెళ్లారు. లోపలికి రావొచ్చా అని సిబ్బందిని అనుమతి అడిగారు.. ఆయన్ను చూసివారు ఆశ్చర్యంలో మునిగిపోయారు. సాదరంగా లోపలికి ఆహ్వానించి, ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు. వారితో ఆయన కొద్దిసేపుగడిపారు. అనంతరం రజనీ బెంగళూరులోని రాఘవేంద్ర మఠానికి వెళ్లారు, అక్కడి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గాంధీబజార్‌లోని చిన్నతనంలో చదువుకున్న స్కూలుకు వెళ్లి బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. కాగా, రజనీ సినీ రంగానికి రాకముందు బెంగళూరు ట్రాన్స్‌పోర్టు సర్వీసెస్-బీటీఎస్ (ఇప్పుడు బీఎంటీసీ)లో కండక్టర్‌గా పని చేశారు. అసలు పేరు శివాజీ రావ్ గైక్వాడ్. 22 ఏళ్ల వరకు బెంగళూరులోనే ఉన్నారు. అనంతరం సినిమాల్లో అవకాశాలు వెతుక్కుంటూ చెన్నై వెళ్లారు.

చైనా స్టాండర్డ్ మ్యాప్‌పై భారత్ అభ్యంతరం

న్యూఢిల్లీ: అక్సాయ్‌చిన్, అరుణాచల్ ప్రదేశ్‌లను చైనాలో అంతర్భాగాలుగా గుర్తిస్తూ డ్రాగన్ దేశం తాజాగా రూపొందించిన 'స్టాండర్డ్ మ్యాప్'పై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి దుందుడుకు చర్యలు సరిహద్దు సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తాయే తప్ప ఒరిగేదేమీ ఉండదని తేల్చిచెప్పింది. అక్సాయ్‌చిన్, అరుణాచల్ ప్రదేశ్‌లు చైనాలో అంతర్భాగాలని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని భారత విదేశాంగ శాఖ మంగళవారం స్పష్టం చేసింది. చైనా వైఖరిని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తప్పుపట్టారు. ఇతర దేశాల భూభాగాలు తమవేనంటూ చాటుకోవడం హాస్యాస్పదమని అన్నారు. స్టాండర్డ్ మ్యాప్‌పై భారతదేశ నిరసనను దౌత్య మార్గాల్లో చైనాకు తెలియజేశామని విదేశాంగ శాఖ వెల్లడించారు.

వచ్చే నెలలో రాహుల్ యూరప్ పర్యటన

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సెప్టెంబర్‌లో యూరప్ దేశాల్లో పర్యటించనున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో రాహుల్ ఫ్రాన్సులో అయిదు రోజులపాటు పర్యటించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 7న బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో యూరోపియన్ కమిషన్ ప్రతినిధుల సమావేశానికి హాజరవుతారు. 8న ప్యారిస్‌లో యూనివర్సిటీ ఆఫ్ ప్యారిస్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 9న ప్యారిస్‌లో లేబర్ యూనియన్ ఆఫ్ ఫ్రాన్సు సమావేశంలో పాల్గొంటారు. 10న నార్వే రాజధాని ఓస్లోకు వెళతారు. అక్కడి ప్రవాస భారతీయులతో రాహుల్ గాంధీ ముఖాముఖి ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వివరించాయి. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జీ20 సమావేశాలను ప్రతిష్టాత్మకంగా జరిపేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తున్న వేళ రాహుల్ విదేశాల్లో పర్యటనలకు వెళ్తుండటం గమనార్హం.

కుల వివక్ష వ్యతిరేక బిల్లుకు కాలిఫోర్నియా అసెంబ్లీ ఆమోదం

వాషింగ్టన్: అమెరికాలో చర్చనీయాంశంగా మారిన కుల వివక్ష వ్యతిరేక బిల్లును కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీ సోమవారం ఆమోదించింది. సభలో 50-3 మెజార్టీతో బిల్లు ఆమోదం పొందింది. రాష్ట్రంలో కుల వివక్షను అరికట్టడంతోపాటు అట్టడుగు వర్గాల ప్రజలను వివక్ష నుంచి కాపాడడమే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకొచ్చారు. బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంతో ఇక గవర్నర్ గవీన్ న్యూసమ్ వద్దకు చేరనుంది. గవర్నర్ సంతకం చేస్తే చట్టంగా మారనుంది. దీంతో అమెరికాలో కుల వివక్షకు వ్యతిరేకంగా చట్టం చేసిన మొట్టమొదటి రాష్ట్రంగా కాలిఫోర్నియా రికార్డు సృష్టించనుంది. ఈ బిల్లును కాలిఫోర్నియా అసెంబ్లీలో తొలిసారిగా సేటేట్ సెనేటర్ అయిషా వాహబ్ ప్రవేశపెట్టారు. పౌర హక్కుల కార్యకర్తలు, పౌర హక్కుల సంఘానికి దీనికి మద్దతు ప్రకటించాయి.

ఆయుర్దాయానికి కాలుష్య కాటు

- అత్యధికంగా ఢిల్లీ వాసులకు 11.9 ఏళ్లు
- ఏపీలో 2.6 ఏళ్లు, తెలంగాణలో 3.2 ఏళ్లు సగటున తగ్గుతున్న జీవితకాలం
- ది ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ నివేదిక వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరం ఢిల్లీ అని ఓ అధ్యయనం చెబుతోంది. తీవ్ర కాలుష్యం బారిన పడుతున్న ఢిల్లీ వాసులు తమ ఆయుర్దాయంలో అత్యధికంగా 11.9 ఏళ్లు కోల్పోతున్నారని పేర్కొంది. జాతీయ వాయు నాణ్యత ప్రమాణం ప్రకారం చూసినా దేశ రాజధాని వాసులు సగటు కన్నా 8.5 ఏళ్లు నష్ట పోతున్నారని తెలిపింది. భారత్‌లో ప్రజల ఆరోగ్యానికి కాలుష్యం పెనుముప్పుగా తయారైందని యూనివర్సిటీ ఆఫ్ షికాగో ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన ది ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ (ఏక్యూఎల్ఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశించిన కాలుష్య స్థాయిల కంటే భారత్‌లో చాలా ఎక్కువ కాలుష్యం ఉందని పేర్కొంది. డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాల ప్రకారం పర్టిక్యులేట్ మాటర్ (పీఎం) 2.5 ఐదు మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్‌గా కాలుష్యం ఉండాల్సి ఉంది. కాలుష్య తీవ్రతలు ఇలానే కొనసాగితే భారతీయుల సగటు ఆయుర్దాయం కన్నా 5.3 ఏళ్లు తగ్గుతుందని తెలిపింది. దేశంలోని మొత్తం 130 కోట్ల మందికి పైగా ప్రజలు వార్షిక సగటు కాలుష్య స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. జాతీయ వాయు నాణ్యత ప్రమాణం 40 మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్లకు మించి కాలుష్యం ఉండే ప్రాంతాల్లో 67.4 శాతం మంది నివసిస్తున్నారని నివేదిక తెలిపింది. సగటు భారతీయుడి ఆయుర్దాయం కాలుష్యం కారణంగా 5.3 ఏళ్లు తక్కువగా ఉంటోందని వివరించింది. 2021లో భారత్‌లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్టిక్యులేట్ మాటర్ (పీఎం) 2.5 నమోదు చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలు సగటు కన్నా 2.6 ఏళ్లు, తెలంగాణ ప్రజలు సగటు కన్నా 3.2 ఏళ్లు కోల్పోతున్నారని తెలిపింది. జాతీయ వాయు నాణ్యత ప్రమాణం 40 మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్ల ప్రకారం చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆయుష్షు ముప్పు లేదని తెలిపింది. దేశంలో హృదయ సంబంధ వ్యాధులతో 4.5 ఏళ్లు, తల్లీ పిల్లల పోషకాహార లోపంతో 1.8 ఏళ్ల ఆయుర్దాయం కోల్పోతున్నట్లు నివేదిక పేర్కొంది. 2013- 2021 మధ్య ప్రపంచవ్యాప్తంగా పెరిగిన కాలుష్యంలో భారత్ వాటా 59.1 శాతమని తెలిపింది. సగటు కంటే ఎక్కువగా ఆయుర్దాయం కోల్పోతున్న అత్యధిక జనాభా కలిగిన 10 రాష్ట్రాలు వరసగా.. యూపీ, బిహార్, బెంగాల్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు ఉన్నాయని తెలిపింది.

ఐటీసీ మౌర్య షెరటాన్‌లో బైడెన్ బస

- అమెరికా అధ్యక్షుడి కోసం ప్రెసిడెన్షియల్ సూట్, ప్రత్యేకంగా లిఫ్ట్
- హోటల్‌లోని మొత్తం 400 రూంలు బుక్
- త్వరలో సీక్రెట్ సర్వీస్ బృందం రాక
- జీ20కి హాజరయ్యే నేతలకు ఢిల్లీ హోటళ్లలో ఆతిథ్యం
- విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టిన హోం శాఖ



న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే జీ20 శిఖరాగ్రానికి హాజరయ్యే నేతలకు ఢిల్లీలోని ప్రముఖ హోటళ్లలో బస ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఐటీసీ మౌర్య షెరటాన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు తాజ్ ప్యాలెస్‌లో బస చేయనున్నారు. ఢిల్లీతోపాటు దేశ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్)లోని మొత్తం 31 హోటళ్లలో వివిధ దేశాల నేతల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జరిగే శిఖరాగ్రంలో పాల్గొనే నేతలు త్వరలోనే ఇక్కడికి చేరుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేపట్టింది.

వివిధ దేశాల నేతలు ఢిల్లీలో బసచేసే హోటళ్లివే...

ఐటీసీ మౌర్యషెరటాన్, తాజ్ మాన్‌సింగ్, తాజ్ ప్యాలెస్, హోటల్ ఒబెరాయ్, హోటల్ లలిత్, ది లోధి, లి మెరిడియన్, హయత్ రీజెన్సీ, షంగ్రి-లా, లీలీ ప్యాలెస్, హోటల్ అశోక, ఈరోస్ హోటల్, ది సూర్య, ర్యాడిసన్ బ్లూ ప్లాజా, జేడబ్ల్యూ మారియెట్, షెరటాన్, ది లీలా అంబియెన్స్ కన్వెన్షన్, హోటల్ పుల్‌మాన్, రోజెట్ హోటల్, ది ఇంపీరియల్.

ఎన్‌సీఆర్‌లోని హోటళ్లు: వివాంటా (సూరజ్‌కుండ్), ఐటీసీ గ్రాండ్ (గురుగ్రామ్), తాజ్ సిటీ సెంటర్ (గురుగ్రామ్), హయత్ రిజెన్సీ(గురుగ్రామ్), ది ఒబెరాయ్ (గురుగ్రామ్), వెస్ట్ ఇన్ (గురుగ్రామ్), క్రౌన్ ప్లాజా(గ్రేటర్ నోయిడా).

ఎవరెవరు ఎక్కడెక్కడంటే?

అమెరికా అధ్యక్షుడు బైడెన్ బస చేసే ఐటీసీ మౌర్య హోటల్‌లోని ప్రతి ఫ్లోర్‌లోనూ అమెరికా సీక్రెట్ సర్వీస్ కమాండోలు పహారా కాస్తారు. బైడెన్ బస ఉండే 14వ ఫ్లోర్‌కు చేరుకునేందుకు ప్రత్యేకంగా లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ఈ హోటల్‌లోని మొత్తం 400 రూములు బుక్కయ్యాయి. ఇంకా.. షంగ్రి-లా హోటల్‌లో యూకే ప్రధాని రిషి సునాక్ బస చేస్తారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ క్లారిడ్జెస్ హోటల్‌లో ఉంటారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఇంపీరియల్ హోటల్‌లో, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తాజ్ ప్యాలెస్ హోటల్‌లో బస చేస్తారు. ఆయా దేశాలకు చెందిన అనుసంధాన బృందాలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నాయి. ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో టర్కీ ప్రతినిధులు, మారిషస్, నెదర్లాండ్స్, నైజీరియా, స్పెయిన్ దేశాల నేతలు లి మెరిడియన్ హోటల్‌లో దిగుతారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బ్రెజిల్ ప్రతినిధి బృందం తాజ్ ప్యాలెస్‌లో, ఇండోనేసియా నేతలు ఇంపీరియల్ హోటల్‌లో ఉంటారు. షంగ్రి-లాలో యూకే, జర్మనీ బృందాలుంటాయి. హయత్ రీజెన్సీలో ఇటలీ, సింగపూర్ దేశాల ప్రతినిధులు బస చేస్తారు. కెనడా, జపాన్ బృందాలకు లలిత్ హోటల్‌లో ఆతిథ్యం కల్పిస్తారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

ఢిల్లీ పోలీసు బృందాలతోపాటు సెంట్రల్ పారా మిలటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ కమాండోలు విదేశాల నుంచి వచ్చే అతిథులకు రక్షణ కల్పిస్తారు. బైడెన్‌కు భద్రత కల్పించే అమెరికా సీక్రెట్ సర్వీస్ స్క్వాడ్ బృందం జీ20 శిఖరాగ్రానికి మూడు రోజులు ముందుగా బాధ్యతలు చేపడుతుంది. ప్రతినిధుల భద్రత కోసం సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 50 బృందాలను నియోగిస్తారు.

యడ్డిని తప్పించి తప్పు చేశాం: రేణుకాచార్య

శివాజీనగర: ప్రతిపక్ష బీజేపీలో అసమ్మతి గళం నిత్యం వినిపిస్తూనే ఉంది. యడియూరప్పను పార్టీలో నిర్లక్ష్యం చేయడమే బీజేపీకి శాపంగా మారిందని పార్టీ నేత ఎంపీ రేణుకాచార్య తాజాగా ఆరోపించారు. మంగళవారం దావణగెర జిల్లా హొన్నాళిలో విలేకరులతో మాట్లాడిన ఆయన, యడ్డిని సీఎం కుర్చీ నుంచి బలవంతంగా తప్పించారు, దీనివల్ల పార్టీకి పెద్దఎత్తున హాని జరిగిందని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ని లేకుండా చేస్తామని మేం చెప్పాం, ఇప్పుడు మాకే ఆ పరిస్థితి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయినా కూడా బీజేఎల్పీ నేతను ఎంపిక చేయలేదు, ఇది కార్యకర్తలకు బాధకు గురిచేసిందని సొంతపార్టీ నేతలపై మండిపడ్డారు. కాంగ్రెస్ చేసే ఆరోపణలకు తాము సమాధానం ఇవ్వలేని స్థితికి వచ్చామని అన్నారు.

న్యూస్‌రీల్

టీటీడీలో అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

యశవంతపుర: బెంగళూరు వయ్యాలి కావల్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం శ్రీవారి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదాన కార్యాన్ని ప్రారంభించి రెండున్నర నెలలు కావస్తుంది. మంగళవారం ఏఈఓ సుబ్రమణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పీ ప్రభావతి, జమేదార్ చిరంజీవులు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. శని, ఆదివారం జరిగే శ్రీవారి కల్యాణోత్సవం, శుక్రవారం అభిషేకం తదితర సేవల్లో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

బైక్ దొంగలు అరెస్టు



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

దొడ్డబళ్లాపురం: బైక్‌లను అపహరిస్తున్న ఇద్దరు దొంగలను దొడ్డ గ్రామీణ పోలీసులు అరెస్టు చేసారు, బెంగళూరు అమృతహళ్లికి చెందిన చేతన్ (19), మొదట అరెస్టు చేసిన పోలీసులు అతడ్ని విచారణ చేసి హూడిలేఔట్ నివాసి సాయిపవన్ అనే మరో నిందితుడిని అరెస్టు చేసారు. అపెరల్ పార్కు వద్ద నిందితుడు చేతన్ ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా తక్కువ ధరకు డియో బైక్ విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేసారు. ఇద్దరు నిందితులు శరణ్ అనే మరో వ్యక్తితో కలిసి బెంగళూరు, దేవనహళ్లి, యలహంక, కొత్తనూరు, దొడ్డబళ్లాపుర, కారహళ్లి, హెగడె నగర్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసారు. వీరి నుండి 13 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

చల్లారని పాము పగ

- 3 నెలల్లో బాలునికి 9 సార్లు కాటు



యశవంతపుర: పాము పగ 12 ఏళ్లు అనే నానుడి ఉంది, అది నిజమో, అబద్ధమో తెలియదు కానీ ఒక సర్పం బాలున్ని పదే పదే కాటేస్తూనే ఉంది. వివరాలు.. కలబురగి జిల్లా చిత్తాపుర తాలూకాలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సుమారు మూడు నెలల వ్యవధిలో 9 సార్లు కాటు వేసిందంటే ఆశ్చర్యం కలగకమానదు. జూలై 3న మొదటిసారిగా బాలున్ని నాగుపాము కాటు వేయడంతో తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్చి చికిత్సలు అందించారు. ఆస్పత్రి నుంచి ఇంటికెళ్లిన మూడు రోజులకే మళ్లీ పాము కరిచింది. ఇలా తొమ్మిదిసార్లు కాటు వేయగా ఆరుసార్లు ఆస్పత్రిలోను, మూడుసార్లు నాటు ఔషధంతో చికిత్సలు చేయించారు. చివరకు కుటుంబసభ్యులు పాముకు భయపడి సొంతూరు హలకర్టి గ్రామం వదిలి వాడి అనే ఊరుకు వలసపోయారు. అక్కడ కూడా బాలున్ని పాము కాటు వేసింది. అయితే కరిచిన పాము తల్లిదండ్రులకు గానీ, స్థానికులకు గానీ కనిపించడం లేదని చెబుతున్నారు.

బీజేపీ చార్జిషీటుపై సీఎం భగ్గు

మైసూరు: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులను గురించి చార్జిషీట్ విడుదల చేసే హక్కు బీజేపీకి లేదని సీఎం సిద్దరామయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఇంకా 100 రోజులే అవుతోంది, అప్పుడే తాము తప్పులు చేశామని చార్జిషీట్ విడుదల చేస్తామనడం సబబు కాదన్నారు. గత బీజేపీ ప్రభుత్వం 4 ఏళ్లు అధికారంలో ఉండి ప్రజలకు ఏమీ చేయలేదని, అలాంటివారు తమపై అభియోగాలు చేస్తున్నారని మండిపడ్డారు.

భద్రావతి ఉక్కుకు ఊరట?

- పునః ప్రారంభానికి సన్నాహాలు!
- వేలాది మంది జీవితాలకు భరోసా
- పదేళ్లుగా మూతపడిన భారీ ఫ్యాక్టరీ
- ఓ విభాగంలో నిపుణుల పనులు



భద్రావతిలో వేలాదిమందికి ఉపాధినిచ్చిన ఉక్కు కర్మాగారం (ఫైల్)

శివమొగ్గ: దేశంలో ప్రముఖ ఇనుము ఉక్కు కర్మాగారంగా వెలుగు వెలిగి నష్టాలతో కొన్నేళ్లుగా మూతపడిన శివమొగ్గ జిల్లాలోని భద్రావతిలో ఉన్న విశ్వేశ్వరయ్య ఇనుము, ఉక్కు పరిశ్రమ (వీఐఎస్‌ఎల్)ను పునఃప్రారంభం దిశగా కదులుతోంది. ఇందుకు కేంద్ర ఉక్కు ప్రాధికార (సెయిల్) నిర్ణయించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సోమవారం నుంచి పరిశ్రమలోని ఎస్‌ఆర్‌ఎం విభాగంలో నిపుణులు, సిబ్బంది కొన్ని పనులను ప్రారంభించారు. దీంతో వేలాది మంది కార్మికుల్లో ఆశలు చిగురించాయి. వారం రోజుల నుంచి కేంద్ర ఉక్కు ప్రాధికార, భిలాయ్‌కి చెందిన నిపుణులు, 19 వ్యాగన్లలో వస్తు సామగ్రిని తీసుకొచ్చారు. దశలవారీగా పూర్తి స్థాయిలో పరిశ్రమలో పనులు ప్రారంభమవుతాయని చెబుతున్నారు.

కేంద్రం ఆధీనంలోకి

రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో నడుస్తున్న కర్మాగారాన్ని 1989లో కేంద్రం ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంది. తరువాత ఉక్కు ప్రాధికారకు అప్పగించింది. సొంత గనులు లేవని, నష్టాలు వస్తున్నాయనే కారణాలతో కర్మాగారానికి గడ్డుకాలం మొదలైంది. మూసివేయాలని కేంద్రం నిర్ణయించగా వేలాదిమంది కార్మికులు, కుటుంబాలు ఆందోనలు నిర్వహించారు. అయినప్పటికీ సుమారు పదేళ్ల కిందట కర్మాగారం మూతపడింది. ఆనాటి నుంచి నాయకులు, కార్మికులు ఫ్యాక్టరీ పునఃప్రారంభం కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.



కర్మాగారంలో పనులు చేపట్టిన నిపుణులు

వందేళ్ల కిందట ఏర్పాటు

మైసూరు రాజుల కాలంలో నాల్వడి కృష్ణరాజ ఒడెయార్, వారి దివాన్ అయిన సర్ ఎం. విశ్వేశ్వరయ్య, మీర్జా ఇస్మాయిల్‌ల ముందుచూపుతో జిల్లాలోని భద్రావతి పట్టణంలో ఉన్న భద్రానది తీరంలో ఇనుము–ఉక్కు ఫ్యాక్టరీ కట్టాలని తీర్మానించారు. చుట్టుపక్కల ప్రాంతాలలో దండిగా ఇనుప ఖనిజం లభిస్తుండడంతో దానిని సద్వినియోగం చేయడంతో పాటు పారిశ్రామిక ప్రగతికి నడుం బిగించారు. సరిగ్గా వందేళ్ల కిందట అంటే 1923వ సంవత్సరంలో విఐఎస్ఎల్ కర్మాగారాన్ని ప్రారంభించారు. మేలిరకం ఉక్కు, ఇనుము తయారు చేయడం ద్వారా ఈ ఫ్యాక్టరీ దేశమంతటా ప్రసిద్ధి చెందింది. వేలాది మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పరిశ్రమ ద్వారా ఉద్యోగాలు, ఉపాధి కూడా లభించాయి. భద్రావతి ఆర్థిక అభివృద్ధికి జీవనాడిగా ఉండింది.

మైసూరు దసరా ప్రారంభ అతిథి హంసలేఖ

- సీఎం సిద్దరామయ్య వెల్లడి



సంగీత దర్శకుడు హంసలేఖ

మైసూరు: విశ్వ విఖ్యాత మైసూరు దసరా ఉత్సవాలను ఈ ఏడాది కన్నడ ప్రముఖ సంగీత దర్శకులు హంసలేఖ ప్రారంభిస్తారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. మంగళవారం మైసూరు నగరంలోని నాడిన శక్తి దేవత చాముండి కొండపై ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ... అక్టోబర్ 15వ తేదీన ఉదయం 10.15 నుంచి 10.30 గంటల మధ్య అమ్మవారి సన్నిధిలో దసరా ఉత్సవాలు ఆయన ఆరంభిస్తారని తెలిపారు. పంజినకవాతు, విజయ దశమి రోజున జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, చలన చిత్రోత్సవం, రైతు దసరా, యువ దసరా తదితర వాటిని నిర్వహిస్తామని, అదే విధంగా దసరా ఉత్సవాలు ముగిసే వరకు నగరంలో దీపాలంకరణ ఉంటుదన్నారు.

ఎయిర్ షోకు యోచన

ప్రస్తుతం ఈ ఏడాది ఎయిర్ షో నిర్వహించడానికి యోచిస్తున్నామని, రక్షణ శాఖ మంత్రితో మాట్లాడుతానని, గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దసరా వేడుకల్లో ఎయిర్ షో నిర్వహించామని సీఎం చెప్పారు.

అమ్మవారికి సీఎం, డీసీఎం పూజలు

ఈ సందర్భంగా సీఎం సిద్దు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లు చాముండేశ్వరి అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావాలని, గ్యారంటీలను అమలు చేస్తామని మే నెల 9వ తేదీన చాముండేశ్వరి అమ్మవారి ఎదురుగా ఇద్దరూ వాగ్దానం చేసినట్లు చెప్పారు. మొక్కు తీరడంతో అమ్మవారి దర్శనానికి వచ్చామన్నారు. మైసూరులో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి సిద్దు, డీకే తలా రూ. 2 వేలను ముడుపులుగా సమర్పించారు.

నేడే గృహలక్ష్మికి నాంది

ప్రభుత్వ గ్యారంటీ పథకాలలో ఒకటైన గృహలక్ష్మి పథకాన్ని బుధవారం మైసూరు మహారాజా కాలేజీ మైదానంలో భారీ సభలో ప్రారంభిస్తారు. సభా వేదిక నిర్మాణం పూర్తయింది. 140 అడుగుల వెడల్పాయిన ఎల్‌ఈడీ తెరను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సారథులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పాల్గొంటారు.

ఇలాగైతే కావేరి డ్యాంలు ఖాళీ: కురుబూరు

మైసూరు: 15 రోజులు రోజూ 5 వేల క్యూసెక్కుల నీటిని వదిలితే సుమారు ఆరు టీఎంసీల నీరు ఖాళీ అవుతుందని, కేఆర్‌ఎస్ జలాశయం పరిధిలో ఉన్న రైతులకు ఇది మరణ శాసనంగా మారుతుందని రాష్ట్ర రైతు సంఘం సమాఖ్య అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ అన్నారు. మంగళవారం ఆయన మైసూరులో మీడియాతో మాట్లాడారు. కేఆర్‌ఎస్, కబిని జలాశయాల పరిధిలో 64 శాతం వర్షమే కురిసిందని, ఇప్పటికే జలాశయంలో నీరు మొత్తం ఖాళీ అయిందని అన్నారు. కేఆర్‌ఎస్‌లో వంద అడుగుల నీరు, కబిలో 72 అడుగుల నీటిమట్టం ఉందన్నారు. రాబోయే కాలంలో ఇక్కడి ప్రజలకు తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవని అన్నారు. ఇలాంటి సమయంలో ఉన్న నీటిని నిల్వ చేసుకోవాలి తప్ప తమిళనాడుకు వదలవద్దని అన్నారు.

కండీషన్ లేకుండానే పరుగులు

- దొడ్డలో ప్రైవేటు బస్సుకు ప్రమాదం



దొడ్డబళ్లాపురంలో డివైడర్ ఎక్కిన ప్రైవేటు బస్సు

దొడ్డబళ్లాపురం: హిందూపురం నుంచి బెంగళూరుకు వస్తున్న వెంకటేశ్వర ప్రైవేటు బస్సు దొడ్డ పట్టణంలోని టీబీ సర్కిల్‌లో బ్రేక్ ఫెయిలై డివైడర్ పైకి దూసుకుపోయిన సంఘటన చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం హిందూపురం నుంచి వచ్చిన బస్సు దొడ్డ పట్టణంలోని టీబీ సర్కిల్‌కి రాగానే బ్రేక్ ఫెయిలయ్యింది. దీంతో డ్రైవర్ డివైడర్ ఎక్కించి నిలిపివేశాడు. ఆ సమయంలో బస్సులో 50 మందిపైగా ప్రయాణికులు ఉన్నారు. గౌరిబిదనూరులోనే రిపేరీ రావడంతో డ్రైవర్ బస్సును నిదానంగా నడిపినా ఘటనాస్థలికి వచ్చేసరికి అదుపుతప్పింది. కండీషన్ లేని బస్సులను నడుపుతూ జనం ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రయాణికులు వాపోయారు.

బీఎంటీసీ ఓల్వో బస్సు పల్టీ

శివాజీనగర: డ్రైవర్ అదుపు తప్పి బీఎంటీసీ ఓల్వో బస్సు బోల్తాపడింది. ఈ ఘటన నగరంలోని ప్యాలెస్ గుట్టహళ్ళి ఫ్లై ఓవర్ వద్ద చోటు చేసుకుంది. కెంపేగౌడ విమానాశ్రయం నుంచి హెచ్‌ఎస్ఆర్ లేఔట్ వైపు ఈ బస్సు వెళుతుండగా గుట్టహళ్ళి ఫ్లై ఓవర్ ఎక్కుతుండగా బస్సు బోల్తాపడింది. డ్రైవర్‌కు తల తిరగడం వల్ల అదుపు కోల్పోవడంతో ఈ ఘటన జరిగినట్లు చెబుతున్నారు. రోడ్డు డివైడర్‌కు ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్, కండక్టర్‌తో పాటు 13 మంది బస్సులో ఉండగా అందరూ చిన్నపాటి గాయాలు తగిలాయి. ఈ ఘటనతో సోమవారం అర్ధరాత్రి వరకు ప్యాలెస్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ నెలకొంది. కొన్నిగంటల తరువాత బస్సును తొలగించి సదాశివనగర ట్రాఫిక్ పోలీసులు విచారణ చేపట్టారు.

సమయస్ఫూర్తితో ప్రాణ రక్ష



పట్టాల మధ్యలో పడుకోవడంతో ప్రాణాపాయం తప్పింది



గండం గడిచిందని మహిళను హత్తుకున్న స్నేహితురాలు

దొడ్డబళ్లాపురం: పట్టాలపై రైలు ఉండగా దాటడానికి ప్రయత్నించిన మహిళ రైలు కదలగానే ప్రమాదంలో చిక్కుకుంది. ఈ సంఘటన బెంగళూరు రాజానుకుంట రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. సమీపంలోని అద్దిగానహళ్లికి చెందిన గార్మెంట్ కార్మికులు నిత్యం రైలు పట్టాలు దాటుకుని ఫ్యాక్టరీకి వెళ్తారు. ఇదే మాదిరి సోమవారం కూడా పట్టాలపై గూడ్స్ రైలు ఉండగా పెట్టెల మధ్య సందులో నుంచి అవతలికి వెళ్లబోయింది. అదే సమయంలో రైలు కదిలింది, ఆ మహిళ సమయస్ఫూర్తితో వెంటనే పట్టాల మధ్యలో బోర్లా పడుకుండిపోయింది. ఒక నిమిషం తరువాత రైలు వెళ్లిపోగా క్షేమంగా బయటకు వచ్చింది. ఆమె ఏమాత్రం తత్తరపడినా ఘోరం జరిగిపోయి ఉండేది. ఈ దృశ్యాలను స్టేషన్‌లో ఉన్న వారు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. ప్రమాదం నుండి బయటపడిన ఆమెను స్నేహితురాళ్లు కౌగిలించుకుని ఏడ్చేసారు.

ప్రజాసేవే పరమార్థం

- అవినీతికి పాల్పడితే చర్యలు
- పోలీసులకు డీజీపీ నిర్దేశం



పోలీసు సిబ్బంది, ఐపీఎస్‌లతో డీజీపీ

బనశంకరి: పోలీస్‌శాఖలో అవినీతికి పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని డీజీపీ అలోక్ మోహన్ తెలిపారు. మంగళవారం నగరంలో కోరమంగల కేఎస్‌ఆర్‌పీ మైదానంలో ఏర్పాటు చేసిన రిజర్వు బలగాలు సేవా కవాతులో పాల్గొని గౌరవ వందనం స్వీకరించిన అనంతరం అలోక్‌మోహన్ మాట్లాడారు. రాష్ట్ర రిజర్వు పోలీస్‌ను ఉత్తమ బలగంగా తీర్చిదిద్దడం తమ ధ్యేయమన్నారు. పోలీస్‌శాఖ అంటే సంయమనం, ఉత్తమ బృందంగా పనిచేయాలి, సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. ఇందుకు మానసికంగా, శారీరకంగా బలంగా ఉండటం అత్యంత అవసరం కావడంతో వాటిపై శ్రద్ధ వహించాలన్నారు. శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ పోలీస్‌శాఖ ప్రధాన లక్ష్యమని, అలాగే డ్రగ్స్ నియంత్రణ, రౌడీయిజం ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల అడ్డుకట్టకు శ్రమించాలని సూచించారు. ప్రజలు కోసం ఉండే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం జనస్నేహిగా ఉండటం మరువరాదని, సమయస్ఫూర్తితో, నిష్టతో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర డీజీపీలైన రవీంద్రనాథ్, కమల్ పంత్, ఎంఏ.సలీం, పోలీస్ కమిషనర్ బీ.దయానంద్, ఏడీజీపీ సీమంత్ కుమార్‌సింగ్, ఐజీపీ సందీప్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు చూపినవారికి రివార్డులు అందజేశారు.

ఉగ్ర అనుచరుడు అరెస్టు

యశవంతపుర: రాష్ట్రంలో విధ్వంసానికి ప్లాన్ వేసిన కేసులో ఐదుమంది ఉగ్రవాదుల్లో తప్పించుకు తిరుగుతున్న రెండో ప్రధాన నిందితుడు జునైద్ అనుచరున్ని బెంగళూరు ఆర్‌టీనగర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు రౌడీ మొహమ్మద్ అర్షద్ ఖాన్‌ను నిర్బంధించి విచారిస్తున్నారు. అర్షద్‌ఖాన్ ఉగ్రవాది జునైద్ అహ్మద్‌కు ప్రధాన అనుచరుడు. ఉగ్రవాద కార్యకాలాపాలలో చురుగ్గా పాల్గొనే వాడని పోలీసుల విచారణలో బయట పడింది. 2017లో స్థానిక గొడవలతో నూర్ అహమ్మద్ అనే వ్యక్తిని అపహరించి హత్య చేసిన కేసులో పై ఐదుగురితో పాటు ఇతడు కూడా నిందితుడు.

నినాదంపై వివాదం

బనశంకరి: బుర్కా ధరించిన యువతి, నమాజ్ టోపీ ధరించిన యువకుడు జైశ్రీరాం అనే నినాదాలు చేయడం చర్చనీయాంశమైంది. బెంగళూరులో చిత్రీకరించిన ఈ వీడియో వైరల్ కాగా, ముస్లిం మత పెద్దలు ఆగ్రహం వ్యక్తంచేశారు. నినాదాలు చేసింది నిజమైన ముస్లింలేనా, లేక అలా దుస్తులు ధరించి ఎవరైనా చేశారా? అనేది తెలియరాలేదు. బుర్కా తీసి మాట్లాడాలని, మీ కథ తేలుస్తామని కొందరు వారిని హెచ్చరించారు.

కాంగ్రెస్‌ది నమ్మకద్రోహం

- బీజేపీ చార్జిషీట్ విడుదల



విడుదల చేస్తున్న కటీల్, బొమ్మై

శివాజీనగర: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్ష బీజేపీ చార్జిషీటును విడుదల చేసింది. మంగళవారం బెంగళూరులో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్, బసవరాజ బొమ్మై తదితరులు అభియోగ పత్రాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు 100 రోజుల పాలనలో ద్వేషపూరిత రాజకీయం చేస్తోంది, రైతులు, చేనేతకారులు, మత్స్యకారుల పిల్లలకు ఇస్తున్న విద్యానిధి పథకాన్ని స్తంభింపజేశారు, రైతు వ్యతిరేక విధానాన్ని అనుసరించారు. గోహత్య నిషేధ చట్టం, మతమార్పిడి నిషేధ చట్టాలను, అలాగే నూతన విద్యా విధానాన్ని రద్దు చేసి సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. పరిపాలనలో ముఖ్యమంత్రి కుమారుడు యతీంద్ర జోక్యం అధికమైంది, ఆయన మాటే నడుస్తోంది. సీఎం సిద్దరామయ్య రబ్బర్ స్టాంప్ సీఎం తరహాలో కనిపిస్తున్నారు. ఒకవైపు డీసీఎం డీకే శివకుమార్ అన్నింటినీ నియంత్రణలోకి తీసుకొంటుండగా, ముఖ్యమంత్రి డమ్మీ అయ్యారని హేళన చేశారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి గండికొట్టి విశ్వాస ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు.

టపాసుల గోదాము భస్మీపటలం



పేలుడు జరిగిన భవనంలో మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

- హావేరి వద్ద సంఘటన

బనశంకరి: హావేరి సమీపంలోని ఆలదకట్టి గ్రామంలో టపాసులు గోదాము కమ్ దుకాణం భస్మీపటలమైంది. మంగళవారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో సుమారు రూ.1.5 కోట్ల విలువైన టపాసులు కాలిపోయాయి. భవనం దెబ్బతినగా, రెండుబైకులు కూడా కాలిపోగా వాసీమ్ హరిహర (32) అనే వ్యక్తి గాయపడ్డారు. వివరాలు.. కుమార సాతేనహళ్లి అనే వ్యక్తి భూమికా పేరుతో టపాసుల గోదామును నిర్వహిస్తున్నాడు. గోదాము గేట్‌కు వెల్డింగ్ చేస్తుండగా నిప్పు రవ్వలు ఎగసి టపాసుల పెట్టెలపై పడ్డాయి, దీంతో పెద్ద శబ్దంతో టపాసులు పేలిపోయాయి. భారీగా నిల్వ చేసిన బాణాసంచా మొత్తం విస్ఫోటం చెందడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. పెద్ద ఎత్తున పొగ, మంటలు వ్యాపించాయి.

30 ఫైరింజన్లతో ఆర్పివేత

ఫైర్ సిబ్బంది 30 కిపైగా అగ్నిమాపకయంత్రాలతో చేరుకుని మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపుచేశారు. జిల్లా ఎస్పీ శివకుమార్, కలెక్టర్ రఘునందమూర్తి తో పాటు వివిధ శాఖల అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గణేశ్ చతుర్థి, దీపావళి కోసం కోట్లాది రూపాయలు టపాసులను నిల్వ చేసినట్లు తెలిసింది. నిర్లక్ష్యం వహించినందుకు యజమానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.



మంగళవారం చిక్కమగళూరులో కేరళీయుల ఓనం వేడుకలు



బెంగళూరులో రాఖీలు కొనుగోలు చేస్తున్న తల్లీ కూతురు



కొడగు జిల్లా మడికెరిలో కైల్ పొద్ నమ్మె పండుగ సందర్భంగా తుపాకులతో కొడవ మహిళల సంబరం

క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించండి



ధర్నా చేస్తున్న హాస్టల్ కార్మికులు

రాయచూరు రూరల్: జిల్లాలో వివిధ సాంఘీక సంక్షేమ హాస్టళ్లలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహించే కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని హాస్టల్ కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం టిప్పుసుల్తాన్ పార్క్‌లో చేపట్టిన ధర్నాలో సంచాలకుడు మహేష్ మాట్లాడారు. గతేడాది సర్కార్ వేతన సవరణ చేసినా కార్మికులకు ఉన్న వేతన బకాయిలను చెల్లించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవం



అలంకరణలో శ్రీవారు

రాయచూరు రూరల్: నగరంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా కుంభ సమారోపణం జరిగింది. మంగళవారం నవోదయ వైద్య కళాశాల ప్రాంగణంలో వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఉత్సవాలకు నారాయణపేట ఎమ్మెల్యే రాజేంద్రరెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. పుణ్యాహవాచనం, మోదిని పూజ, రుత్విక్ వరణం, అంకురారోహణం, చతుర్వేద స్వస్తి, సుప్రభాత, తోమాల సేవలు చేశారు. పవిత్రోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

సంస్కార అభ్యాసానికి లింగదీక్ష నాంది



మాట్లాడుతున్న సంగమేశ్వర శివాచార్యులు

రాయచూరు రూరల్: మనిషికి సంస్కారం నేర్చుకోవడానికి లింగదీక్ష అవసరమని ఉడుంగల్ ఖానాపూర్ మఠాధిపతి బ్రహ్మవీర సంగమేశ్వర శివాచార్యులు అభిప్రాయపడ్డారు. మంగళవారం రామలింగేశ్వర ఆలయంలో వీరశైవ లింగాయత సమాజం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నవయసులో పిల్లలకు బోధించే పాండిత్యం, సంస్కృతి, సంప్రదాయ, ఆచార, విచారాలను అనుసరించాలని సూచించారు.

పర్మినెంట్ చేయాలని ధర్నా



ఆందోళన చేస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: రాయకం మెడికేర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని మెడికేర్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం కార్మిక శాఖాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సంచాలకుడు వీరేష్ మాట్లాడారు. ఇటీవల తొలగించిన ఐదుగురు కార్మికులను పనిలోకి తీసుకోవాలన్నారు. కార్మికుల బకాయి వేతనాలను చెల్లించి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జల్‌జీవన్‌తో ఇంటింటికీ కొళాయి కనెక్షన్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్‌తో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ కల్పిస్తామని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ తెలిపారు. మంగళవారం తాలూకాలోని బిచ్చాలిలో జల్‌జీవన్ పథకం నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ఆయన మాట్లాడారు. ఈ పథకం పనులకు రూ.కోటిని కేటాయించారన్నారు. భూములకు నీరందించేందుకు చెరువులకు రూ.2 కోట్లతో పైపులైన్లు, వంతెనల నిర్మాణాలు చేపడతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు.

మట్టి గణపతులే ముద్దు

రాయచూరు రూరల్: మట్టి గణపతులే ముద్దు అని, జిల్లాలో పీఓపీతో తయారు చేస్తున్న గణపతులను నిషేధించాలని కర్ణాటక రణధీర పడె డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సంచాలకుడు రమేష్ మాట్లాడారు. నగరంలో వచ్చే నెలలో గజానన మండళ్లు జరపనున్న ప్రతిష్ఠాపనల్లో మట్టితో తయారు చేసిన వినాయకులనే ప్రతిష్ఠించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కానరాని వరుణ జాడ

- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతన్నలు

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు అదునులో కురవక అష్టకష్టాలతో పంటలు సాగు చేసిన రైతులకు మళ్లీ వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు కన్నీరు పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సిరుగుప్ప, సండూరు, కంప్లి, బళ్లారి నియోజకవర్గాల పరిధిలో వర్షంపై ఆధారపడి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి, హడగలి, హరపనహళ్లి, హొసపేటె నియోజకవర్గాల పరిధిలో దాదాపు 8 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా వర్షం రాకపోవడంతో ఆయా తాలూకాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, వేరుశనగ, రాగి తదితర పంటలు నిలువునా ఎండిపోతుండటంతో రైతులు ఆకాశం వైపు వరుణుడి కృపాకటాక్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు రాకపోవడంతో జూలై ఆఖరు వారంలో విత్తన సాగు ప్రక్రియను అంతంత మాత్రమే పూర్తి చేశారు.

సగటు కన్నా తక్కువ వర్షపాతం

జిల్లాలో సగటు దాదాపు 300 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 176 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని అన్ని తాలూకాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతులు అధికారుల దృష్టికి తెస్తున్నారంటే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం కనిపిస్తోందని చెప్పవచ్చు. వర్షాధారిత భూములతో పాటు తుంగభద్ర ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పంటల పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. డ్యాంలో ప్రస్తుతం 78.500 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ఇన్‌ఫ్లో పతనం కావడంతో డ్యాంలో నీటి నిల్వ క్రమేణా తగ్గుముఖం పడుతోంది. డ్యాం నుంచి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, ఎల్‌బీఎంసీ తదితర కాలువలకు నీటి విడుదలతో పాటు కొంత ఆవిరి కావడం వల్ల ఒక టీఎంసీ నీరు రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోవడంతో ఉన్న నీటి ప్రకారం 60 రోజుల పాటు మాత్రమే రైతులకు నీరు అందించేందుకు వీలవుతుంది. అక్టోబర్, నవంబర్ నెలలో డ్యాంలోకి ఇన్‌ఫ్లో రాకపోతే తుంగభద్ర ఆయకట్టు పరిధిలో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. డ్యాంలో ఉన్న నీటి ప్రకారం అయితే 60 రోజులకు సరిపడే అవకాశం ఉండటంతో మరో 30 రోజులు నీరు విడుదల చేసేందుకు డ్యాంలోకి మళ్లీ ఇన్‌ఫ్లో రావాల్సిన అవసరం ఉంది. మళ్లీ డ్యాంలోకి వచ్చే ఇన్‌ఫ్లోపై తుంగభద్ర ఆయకట్టు రైతుల పరిస్థితి ఆధారపడి ఉంటుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి కరువు ఛాయలు కనిపిస్తున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.



కొళగల్లు వద్ద మిర్చిపంటలో బీటలు వారిన నేల



ఎర్రంగళి వద్ద ఎండిపోతున్న వరిపైరు

నీరందక ఎండుతున్న పంటలు

బళ్లారి రూరల్: కొళగల్లు నుంచి కురుగోడు వరకు వరి, మిర్చి పంటలు నీరందక ఎండిపోతున్నాయి. హెచ్చెల్సీకి గండిపడటంతో కొద్దిరోజులుగా మరమ్మతులు చేపట్టినందున కాలువకు నీటి సరఫరాను ఆపారు. అయితే ఈసారి ఆలస్యంగానైనా తుంగభద్ర డ్యాం నిండటంతో రైతులు సంబరపడ్డారు. కాలువలకు నీరు వదలడంతో రైతులు వరినారు సిద్ధం చేసుకొని నాట్లు వేశారు. మిర్చి పంటను కూడా సాగు చేశారు. అయితే హెచ్చెల్సీకి గండిపడటంతో నీటి సరఫరా ఆగిపోయింది. అప్పుడే వేసిన వరినాట్లు నీరు సరిపోక ఎండిపోతున్నాయి. నాటు వేయని వరినారు కూడా ఎండిపోయింది. దీంతో రైతులు నీళ్లు ఎప్పుడొస్తాయా? అని ఎదురుచూస్తున్నారు.

జవాన్ల పర్వతారోహణ

బనశంకరి: దేశవ్యాప్తంగా పలురాష్ట్రాల్లో ఎత్తైన శిఖరాలను అధిరోహించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి తలపెట్టిన సైనికబృందం చిక్కమంగళూరు జిల్లా మల్లయ్యన గిరి పర్వతాన్ని ఆదివారం అధిరోహించింది. కల్నల్ రణవీర్‌సింగ్ జంవాల్ నాయకత్వంలో 14 మంది సైనికులతో కూడిన బృందం పర్వతాన్ని ఎక్కింది. కల్నల్ రణవీర్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ దేశంలోని 28 రాష్ట్రాల్లో గల ఎత్తైన 50 శిఖరాలపై త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. 17 రాష్ట్రాల్లో ఇప్పటికే పతావిష్కరణ పూర్తి చేశామని చెప్పారు.

వారిద్దరూ చేరే అవకాశం

హుబ్లీ: గత కొన్ని రోజులుగా జిల్లాకు చెందిన బీజేపీ నేతలు ఇద్దరు కాంగ్రెస్‌లో చేరికపై ఇస్తున్న ద్వంద్వ వైఖరి ప్రకటనలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్ లాడ్ స్పష్టతనిచ్చారు. మంగళవారం ఆయన ధార్వాడలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి శంకర్ పాటిల్ మునేనకొప్ప, కుందగోళ మాజీ ఎమ్మెల్యే చిక్కనగౌడ కాంగ్రెస్‌లో చేరవచ్చనే సమాచారం ఉందని తెలిపారు. కొందరు స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతామన్నారు. మరి కొందరు గోడ మీద పిల్లివాటంలా చెబుతున్నారన్నారు. ఎవరికి ఆసక్తి ఉందో వారిని స్వాగతిస్తున్నామన్నారు. తాము ఏ ఎమ్మెల్యేను బలవంత పెట్టడం లేదన్నారు. ప్రజాప్రభుత్వంలో పెద్ద పార్టీ తమది, రెండు వైపులా ద్వారాలు ఉన్న సిటీ బస్సులాంటి తమ పార్టీలోకి ఎవరైనా రావచ్చన్నారు.

అలరించిన ప్రదర్శన



బనశంకరి: గర్భజ్ఞాన్ ఫౌండేషన్, గర్భగుడి సెంటర్ ఆధ్వర్యంలో ఘర్ ఘర్ సంతానహీనత రహిత కర్ణాటక అభియాన కు శ్రీకారం చుట్టింది. మంగళవారం టౌన్‌హాల్ వద్ద జాగృతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ ఓనం ముగ్గు వేసి సంబరాలు జరుపుకొన్నారు.

ఆదర్శప్రాయుడు ధ్యాన్‌చంద్



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పిస్తున్న కలెక్టర్ అక్రంపాషా

కోలారు: యువకులు మేజర్ ధ్యాన్‌చంద్ వంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ అక్రంపాషా తెలిపారు. మంగళవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిలో పాల్గొని ఆయన మాట్లాడారు. ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తుండడం శుభపరిణామం అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తిని పెంచుకోవాలన్నారు. క్రీడల్లో విరివిగా పాల్గొనడమే కాకుండా క్రీడా మనోభావాన్ని అలవర్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను తగిన విధంగా ప్రోత్సహిస్తున్నాయన్నారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం నారాయణ, క్రీడా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గీతా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

వికటించిన పెళ్లి భోజనం

- చిక్కోడి తాలూకాలో 100 మందికి అస్వస్థత

రాయచూరు రూరల్: పెళ్లి భోజనం వికటించి 100 మంది అస్వస్థతకు గురైన ఘటన బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా హిరేకోడిలో జరిగింది. సోమవారం రాత్రి పటేల్ నివాసంలో పెళ్లి సంబరాలు జరిగాయి. పెళ్లి భోజనంలో చికెన్, అన్నం వడ్డించారు.

అయితే భోజనం తిన్న తర్వాత జీర్ణం కాక వంద మందికి పైగా వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. వారికి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు.

మత్స్యాల మృత్యువాత



విపరీతమైన ఎండలు, వేడిగాలులతో ఈ వర్షాకాలం హడలెత్తిస్తోంది. సరైన వర్షాలు మనుషులే కాదు జంతుజాలం కూడా అవస్థలు పడుతోంది. ఈ పరిణామాలతో మంగళవారం మైసూరులోని లింగాంబుధి చెరువులో పెద్దసంఖ్యలో చేపలు చనిపోతున్నాయి. ఒడ్డున చేరిన మృత చేపలు –మైసూరు

38 ఏళ్ల తర్వాత పీయూసీ..

- విద్యపై మక్కువతో పరీక్ష రాసిన ఆటో డ్రైవర్



సాక్షి బెంగళూరు: చదువుకు వయసుతో సంబంధం లేదని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ.. నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ.. చదువుకోవాలి.. నేర్చుకోవాలనే సంకల్పం ఉంటే ఏ వయసులో అయినా మంచి ఫలితాలు సాధించవచ్చు. సరిగ్గా ఇలాంటి ఘటనే బెంగళూరులో జరిగింది. బెంగళూరులోని ఒక ఆటో డ్రైవర్ పదో తరగతితోనే చదువును ఆపేశాడు. ఆ తర్వాత సుమారు 38 ఏళ్ల అనంతరం తన పీయూసీ పరీక్షను రాసి చదువుపై తనకున్న మక్కువను చాటుకున్నాడు. పెళ్లి అయి పిల్లలున్నప్పటికీ చదువుకోవాలనే తన కలను సాకారం చేసుకున్నాడు. బెంగళూరుకు చెందిన నిధి అగర్వాల్ అనే ప్రయాణికురాలు ఇటీవల ఎక్స్ (ట్విటర్)లో ఈ విషయాన్ని తన ట్వీట్ ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ ఇంటర్‌నెట్‌లో వైరల్‌గా మారింది. ఈ ఫోటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు భాస్కర్.. ఓలా క్యాబ్ ద్వారా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 1985లో పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత కుటుంబ కారణాల రీత్యా చదువును కొనసాగించలేకపోయాడు. ఆటో డ్రైవర్‌గా వృత్తి జీవనాన్ని ప్రారంభించి అందులోనే కొనసాగుతున్నారు. ఇతనికి పెళ్లి అయి మూడు, ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ తన చదువును కొనసాగించాలనుకున్నాడు. పట్టుదలతో పీయూసీ విద్యను అభ్యసించాడు. కాగా, ఈ నెల 26న భాస్కర్ ఆటో ఎక్కిన నిధి అగర్వాల్ ఆ తర్వాత మాటామంతీ కలిపి వివరాలు తెలుసుకుంది. చదువుకోవాలనే అతని పట్టుదల చూసి సంతోషించింది. అతని స్ఫూర్తిదాయక జీవితాన్ని ఎక్స్ ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. 1985 తర్వాత పదో తరగతి పాస్ అయ్యాక తాజాగా పీయూసీ ఇంగ్లీష్ పరీక్ష రాశాడని, ఇతని చిరునవ్వు నిజంగా స్ఫూర్తినిస్తోందని నిధి రాసుకొచ్చారు.

కార్మికుల సమస్యలు తీర్చాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐయూటీయూసీ కార్యకర్తలు

కోలారు: కట్టడ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ కట్టడ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని, వారి అర్జీలను సకాలంలో పరిష్కరించి సౌకర్యాలను అందించాలని ఒత్తిడి చేశారు. అర్హులైన కార్మికుడికి పింఛను కోసం 6 నెలల్లోగా అర్జీలు సమర్పించాలనే నియమాన్ని తొలగించాలని, రూ.5 లక్షల నగదు రహిత ఆరోగ్య సేవలను కట్టడ కార్మికులకు, వారిపై ఆధారపడిన వారికి వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షణ్ముగం, జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

కాంగ్రెస్ సర్కార్‌కు భవిత లేదు

మాలూరు: గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్తు లేదని ఎంపీ ఎస్.మునిస్వామి అన్నారు. మంగళవారం బెంగళూరు రోడ్డులోని ఏపీఎంసీ ప్రాంగణం వద్ద వంశోదయ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన 5 గ్యారంటీలను నెరవేర్చడంలోనే తలమునకలై ఉందన్నారు. పాలనపై ఇంతవరకు పట్టు సాధించలేదన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి రాబోయే రోజుల్లో మరింత అధికమై కాంగ్రెస్ ప్రభుత్వం పతనమవుతుందని జోస్యం చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల విడుదలలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభివృద్ధిపై దృష్టి పెట్టలేకపోతోందన్నారు. గ్యారంటీలను నెరవేర్చడానికే మల్లగుల్లాలు పడుతున్నారన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు 40 శాతం కమీషన్ అంటూ ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీపై కూడా ఆరోపణలు వెల్లువెత్తాయన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో కూడా కేంద్రం నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి కానీ రాష్ట్ర నిధులతో కాదన్నారు.

చౌకడిపో డీలర్లు సౌజన్యంగా మెలగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: చౌకడిపో డీలర్లు ప్రజలతో సౌజన్యంగా మెలగాలని, వారిని పదేపదే దుకాణం చుట్టూ తిప్పించుకోరాదని ఎమ్మెల్యే రూపా శశిధర్ చౌకడిపో డీలర్లకు సూచించారు. మంగళవారం తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన నగర, గ్రామీణ ప్రాంత రేషన్ డీలర్ల సమావేశాన్నుద్దేశించి ఆమె మాట్లాడారు. రేషన్ డీలర్లు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఇలానే కొనసాగితే తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ కార్డులు కలిగిన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత వైద్య సౌకర్యం అందుతుందన్నారు. సమావేశంలో ఆహార శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున్, తహసీల్దార్ నాగవేణి, నగరసభ కమిషనర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అటవీ భూములపై సర్వేకు డిమాండ్



మాట్లాడుతున్న అశోక్

శ్రీనివాసపురం: తాలూకాలోని అటవీ భూముల్లో ఆక్రమణల తొలగింపునకు ముందు రైతులు, రెవిన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు దింబాల అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బ్యాంకు సభాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ శాఖ ఏకపక్షంగా ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టి రైతులు పండించిన పంటలను తొలగించి రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి జోక్యం చేసుకుని ఆక్రమణల తొలగింపు చర్యలను ఆపి అటవీ శాఖ అధికారులతో చర్చించి రాజకీయాలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా సమస్యను పరిష్కరించాలన్నారు. సీతారామరెడ్డి మాట్లాడుతూ నియమానుసారంగా చేసే ఆక్రమణల తొలగింపుపై తమకు అభ్యంతరం లేదన్నారు. అయితే అధికారులు రాత్రి వేళల్లో జేసీబీలు తెచ్చి ఆక్రమణలు తొలగించడం సరికాదన్నారు. సరైన దాఖలాలు కలిగిన రైతుల భూములను గుర్తించి వదిలేయాలని తెలిపారు. ఈసందర్భంగా సంజయ్‌రెడ్డి, నాగరాజ్, కెకె మంజు, మునివెంకటప్ప, అయ్యప్ప, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

అన్ని బెదిరింపు లేఖలను ఒక్కరే రాశారు?

బనశంకరి: రాష్ట్ర రచయితలు, సాహితీవేత్తలకు వచ్చిన బెదిరింపు లేఖలో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ కేసు సీసీబీ పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆసక్తిగల సమాచారం బయటపడింది. ఏడుగురికి రాసిన బెదిరింపు లేఖ ఒకే తరహా చేతిరాతతో ఉంది. ఒక్కరే లేఖ రాసి వేర్వేరు తాలూకాల్లో పోస్టు బాక్సుల్లో లేఖలు వేసినట్లు సమాచారం. పోస్టు చేసిన వ్యక్తి కోసం సీసీబీ పోలీసులు గాలిస్తున్నారు. ఇటీవల సాహితవేత్త డాక్టర్ మరళ సిద్ధప్పతో పాటు పలువురు సాహితీవేత్తలు, కవులు హత్య బెదిరింపు లేఖలపై హోం మంత్రి పరమేశ్వర్‌ను కలిసి రక్షణ కల్పించాలని విన్నవించారు. చర్యలు తీసుకుంటామని హోం మంత్రి హామీ ఇచ్చిన విషయం తెల్సిందే.

మృతురాలి కుటుంబానికి కేంద్రమంత్రి పరామర్శ

హుబ్లీ: బెళగావి జిల్లా నవిలుతీర్థ జలాశయంలో పడి ఆత్మహత్య చేసుకున్న ధార్వాడకు చెందిన ఆస్ట్రేలియా నివాసి ప్రియదర్శిని పాటిల్ తండ్రి ఇంటికి మంగళవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇక్కడి సత్తూరులోని ప్రియదర్శిని తండ్రి ప్రొఫెసర్ ఎస్ఎస్ దేశాయి, వారి కుటుంబ సభ్యులతో చర్చించారు. మృతురాలి పిల్లల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఆస్ట్రేలియాలోని ప్రియదర్శిని పిల్లలను భారత్‌కు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర విదేశాంగ శాఖ కార్యాలయంతో మాట్లాడి మృతురాలి పిల్లలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు చర్యలు చేపడతామన్నారు. మాజీ మేయర్ వీరేష్ అంచటగేరి, కార్పొరేటర్ విజయానంద శెట్టి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం వృద్ధురాలి దీక్ష

కోలారు: తాలూకాలోని అజ్జప్పనహళ్లి గ్రామంలో తన స్వంత స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి గ్రామానికి చెందిన కొంతమంది అడ్డుపడుతున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన 70 ఏళ్ల దళిత వృద్ధురాలు రామరత్నమ్మ తన స్థలం ముందు అంబేడ్కర్ చిత్రపటంతో బైఠాయించి మౌన పోరాటం ప్రారంభించారు. గ్రామంలో తాను నివాసం ఉన్న తన స్థలానికి సంబంధించి అన్ని దాఖలాలు ఉన్నాయన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది నకిలీ దాఖలాలు సృష్టించి తన స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కూలి పని చేసుకుని జీవిస్తున్న తనకు వేరే దారి లేదని, అధికారులు తనపై కనికరించి ఇల్లు కట్టుకోవడానికి కల్పిస్తున్న ఇబ్బందులను తొలగించి తనకు న్యాయం చేయాలని కోరారు.

హొసపేటె-ముంబై రైలు సేవలు షురూ



గంగావతి: హొసపేటె నుంచి ముంబై మధ్య రైలు సేవలను కొప్పళలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణ పచ్చజెండాను ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగర, కొప్పళ జిల్లాల్లోని వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాల సందర్శనకు వీలుగా గేట్ వే ఆఫ్ ఇండియా ముంబైకి రాకపోకల సౌకర్యాన్ని ఈ రైలు కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

సేవాదళ్ బృందం ప్రథమం

కోలారు: జిల్లా కేంద్రంలో ఇటీవల స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల కవాతులో మొదటి బహుమతి సాధించిన ఏఈఎస్ సేవాదళ్ బృందాన్ని సేవాదళ్, జిల్లా, తాలూకా సమితి సభ్యులు మంగళవారం అభినందించారు. ఉదయం సేవాదళ్ బృందంలోని సభ్యులందరికీ ప్రమాణ పత్రాలను అందించి స్వీట్లు పంచారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కెఎస్ గణేష్ మాట్లాడుతూ సేవాదళ్ విద్యార్థులు కవాతులో క్రమశిక్షణ కలిగిన సిపాయిల్లా పాల్గొని మొదటి బహుమతి సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా సమితి సభ్యుడు ఆర్ శ్రీనివాసన్, పాఠశాల సంస్థాపకుడు ఫల్గుణ, జిల్లా కార్యదర్శి ఎస్ సుధాకర్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు వద్దు

శ్రీనివాసపురం: తాలూకాలోని అటవీ భూముల్లో ఆక్రమణల తొలగింపు చర్యలను వెంటనే ఆపాలని కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఉపాధ్యక్షుడు పీఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రామమందిర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న అటవీశాఖ అధికారులు పోలీస్ శాఖ సహాయంతో పదుల సంఖ్యలో జేసీబీలతో రైతుల భూముల్లోకి చొరబడి కోట్ల రూపాయల విలువ చేసే పంటలను నాశనం చేశారన్నారు. అటవీ శాఖ అన్యాయంగా భూములను స్వాధీనం చేసుకోవడం వల్ల రైతులు వీధిపాలు కావాల్సి వచ్చిందన్నారు. అటవీ శాఖ చర్యలను కేపీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈసందర్భంగా కేపీఆర్ఎస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టీఎం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పాతకోట నవీన్‌కుమార్, సయ్యద్ ఫారూక్, ఎస్.వీరప్పరెడ్డి పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

శ్రీనివాసపురం: సహజీవనం చేస్తున్న యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ముళబాగిలు తాలూకా నంగలిలో చోటు చేసుకుంది. నంగలిలో నివాసం ఉంటున్న భాగ్య(25) అనే యువతికి ఏడేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడితో వివాహమైంది. అయితే భర్త అనారోగ్యంతో చనిపోవడంతో సొంతూరుకు తిరిగి వచ్చిన భాగ్య నంగలిలో స్థిరపడింది. అనంతరం కొంతకాలానికి బెంగళూరుకు చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడి సాన్నిహిత్యం పెరిగి సహజీవనం చేస్తోంది. బెంగళూరులోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న వ్యక్తి వారానికోసారి నంగలికి వచ్చి వెళుతుండేవారు. భాగ్య బాడుగ ఇంట్లో నివాసం ఉంటోంది. అయితే సోమవారం రాత్రి తన కూతురిని దుకాణానికి పంపి తాను ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నంగలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సవితా సముదాయం అన్ని రంగాల్లో రాణించాలి



తుమకూరు: సవిత సముదాయం వారు అన్ని రంగాల్లో రాణించాలని కన్నడ సేనె అధ్యక్షుడు ధనియా కుమార్ అన్నారు. మంగళవారం తుమకూరు నగరంలోని గార్డెన్ రోడ్డులో ఉన్న సవితా భవనంలో తుమకూరు జిల్లా సవితా సమాజం, సవితా సమాజం యువకుల పడె ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారం, నాయకత్వ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సవితా సముదాయం వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, తుమకూరు కార్పొరేషన్ లేదా తుమకూరు నగరాభివృద్ధి ప్రాధికార, ఏపీఎంసీ అధ్యక్ష స్థానాలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సవితా సమాజం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

ట్రాక్టర్ ఢీ, బైకిస్టు మృతి

దొడ్డబళ్లాపురం: ట్రాక్టర్, బైక్ ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టు మృతి చెందిన సంఘటన దొడ్డ తాలూకా ఘాటి క్షేత్రం రోడ్డులోని తపసీహళ్లి వద్ద చోటుచేసుకుంది. మంజునాయక్ (26) మృతి చెందిన వ్యక్తి. మంజునాయక్ బైక్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ట్రాక్టర్ మంజునాయక్ మీద నుండి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దొడ్డ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: నిత్యం ఒత్తిడిలో పనిచేసే ఉపాధ్యాయులకు క్రీడా కార్యక్రమాలతో ఉత్సాహం కలుగుతుందని తుమకూరు తాలూకా విద్యాశాఖ అధికారి సూర్యకళ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలను ప్రారంభించారు. విజేతలకు సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం రోజున బహుమతులను అందజేస్తారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పలు ఆటల పోటీల్లో పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

క్రిష్ణగిరి: వ్యక్తిపై ప్రైవేట్ బస్సు దూసుకెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వివరాల మేరకు సోమవారం రాత్రి క్రిష్ణగిరి బస్టాండు సమీపంలోని ప్రభుత్వ టాస్మాక్ దుకాణం వద్ద ఓ వ్యక్తి నడిచి వెళుతుండగా ప్రైవేట్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తికి 55 ఏళ్ల వయసు ఉంటుందని, వ్యక్తి ఆచూకీ తెలియలేదని పోలీసులు తెలిపారు.

రైతు సంఘం ఆందోళన



పొలంలో రైతు సంఘం నిరసన

చింతామణి: తాలూకాలో వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, అధికారులు పంటలను పరిశీలించడం లేదని నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఎండిన పొలాల్లో ఆందోళన చేపట్టారు. ఇటీవల అధికారులకు వినతిపత్రం అందజేసినా అధికారులు స్పందించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు ఎండిన పంటలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో రైతు సంఘం నేతలు వెంకటరామయ్య, కద్రిగౌడ, వెంకటసుబ్బారెడ్డి, నారాయణస్వామి, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

చిన్నారికి పరామర్శ



బాలుడితో మాట్లాడుతున్న ప్రతిభ శరత్

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధి హోసకోటె తాలూకా హలసహళ్లి గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారికి శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలుసుకున్న స్థానిక హోసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ భార్య ప్రతిభా శరత్ బాధిత బాలుడి ఇంటికి చేరుకున్నారు. చిన్నారిని దగ్గర తీసుకుని ప్రేమగా మాట్లాడుతూ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

అభాగ్యుల పెన్నిధి...హరిహర మాత

- నేటి నుండి హరిహర ఆరోగ్యమాత జయంతి ఉత్సవాలు
- తెలుగు భాషలో సైతం ప్రార్థనలు
- 8న పల్లకీ ఉత్సవం



హరిహర ఆరోగ్యమాత దేవాలయం



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు (ఫైల్)

శివాజీనగర: అభాగ్యులకు, రోగులకు జీవితంలో కష్టనష్టాల్లో మునిగి నైరాశ్యంలోనున్న ఎంతో మందిని అమ్మ చల్లని చూపులు గొప్పగా ఊరట నిచ్చాయి. కష్టాలను తీర్చి మంచి జీవితాన్నిచ్చాయి. హరిహర పట్టణంలోని ఆరోగ్యమాత చర్చి మహత్యం మాటలకు అందనిది. సమీప తుంగభద్ర నదిలో దొరికిన విగ్రహం ఆరోగ్యమాతగా అందరి కష్టాలు తీరుస్తూ పూజలందుకుంటోంది.

ఏటా సెప్టెంబర్ 8వ తేదీన క్రైస్తవులు ఆరోగ్యమాత (మేరీమాత) జన్మదినంగా పరిగణించి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. మనదేశంలో తమిళనాడు రాష్ట్రంలో వేలాంగణి తరువాత రెండో వేలాంగణి మాతగా దావణగెర జిల్లా హరిహర పట్టణంలోని ఆరోగ్యమాతను భక్తులు కొలుస్తారు. అమ్మవారిని భక్తితో కొలిస్తే ఎలాంటి కష్టమైనా తొలగిపోతుందని విశ్వసిస్తారు. ఒక్క క్రైస్తవులే కాకుండా ఇతర మతస్తులు కూడా అమ్మవారిని పూజిస్తూ ఉత్సవాల్లో వేలాదిగా పాల్గొనడం అనాదిగా వస్తోంది.

నదిలో దొరికిన విగ్రహం అందరికీ పూజ్యనీయం:
సుమారు 250 సంవత్సరాల క్రితం మధ్యకర్ణాటక దావణగెర జిల్లా హరిహర పట్టణం వద్ద తుంగభద్ర నదిలో ఒక పేద బ్రాహ్మణ పండితుడు స్నానం చేస్తుండగా సుడిలో చిక్కుకొని మునిగిపోతుండగా,



పూల పల్లకీలో సాగుతున్న ఆరోగ్యమాత రథోత్సవం (ఫైల్)



హరిహర ఆరోగ్యమాత

కాపాడాలని దేవుణ్ణి వేడుకున్నారు. సుడిలో అతని చేతికి ఒక చిన్న విగ్రహం దొరకగా, క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నాడు. ఆ విగ్రహాన్ని ఇంట్లో పిల్లలు ఆడుకోవటానికి ఉంచాడు. ఆ రాత్రి ఉబ్బసం వ్యాధితో బాధపడుతూ అంధుడై మంచం పట్టాడు. అదే రోజు అతని కొడుకు కూతురికి శరీరమంతా పుండ్లు వచ్చి బాధతోనే రాత్రి నిద్రపోయారు. రాత్రి కలలో విగ్రహం సజీవమై నిలచి ఆ పండితునితో 'నన్ను హరిహరలో గౌరవించు నిన్ను ఆశీర్వదిస్తాను' అని పలికారు. ఉదయం లేవగానే పండితునికి పిల్లలకు ఏ జబ్బు లేకుండా ఆరోగ్యంగా ఉన్నారు. అప్పటి నుంచి అతడు ఆ మూర్తిని సత్యమ్మ అనే పేరుతో పూజించటం మొదలపెట్టాడు. ఆ విగ్రహాన్ని పూజించిన వారికందరికి అద్భుత ఫలితాలు జరిగాయి. విగ్రహం పాదం కింద చంద్రుడు గుర్తు ఉండటాన్ని గమనించిన క్రైస్తవులు వీరు ప్రభువు ఏసుక్రీస్తు తల్లి మరియమ్మ అని తెలుసుకొని చిత్రదుర్గ చర్చికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే స్థానిక భక్తులు ఆమోదించకపోవడంతో ఆ పండితుని ఇంటిని చర్చిగా చేసుకున్నారు. నెమ్మదిగా కొత్త చర్చిని నిర్మించగా ఆరోగ్యమాత క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.

వైభవంగా ఉత్సవాలు:
రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలే కాకుండా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ప్రజలు కూడా అధికంగా హరిహర ఆరోగ్యమాతను కొలుస్తున్నారు. ఇప్పటికే సమీప ప్రాంతాల భక్తులు కాలినడకన క్షేత్రానికి వస్తున్నారు. 7వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. 8వ తేదీన ప్రత్యేక ప్రార్థనలు, అమ్మవారి పల్లకీ, రథోత్సవం వైభవంగా జరుగుతాయి. మొక్కులు తీరిన భక్తులు అన్న, వస్త్రదానాలు నిర్వహిస్తారు. ప్రధానంగా ఆమె ఒక జానపద దేవత, ఆమె పేరుతో జానపద గీతాలను ఆలపిస్తూ డొళ్లు వాయిస్తూ, కోలాటం ఆడటం తదితర కళలను ప్రదర్శిస్తారు.

వేడుకలకు సకల ఏర్పాట్లు: ఫాదర్ జార్జ్



సెప్టెంబర్ 8న పుణ్యక్షేత్ర వార్షికోత్సవాన్ని 'మాత మరియ జీవితం..వనితల బతుకుకు ప్రేరేపణ' అనే దైవ వాక్యంతో ఈసారి సకల ఏర్పాట్లు చేసినట్లు ఫాదర్ జార్జ్ కే.ఏ. సాక్షికి తెలిపారు. ఆగస్టు 30న బుధవారం సాయంత్రం 5.30 గంటలకు శివమొగ్గ ఆర్చిబిషప్ ఫాదర్ డాక్టర్ ఫ్రాన్సిస్ సెరావో ఎస్.జె.తో పాటుగా మంత్రి ఎస్.ఎస్.మల్లికార్జున పతాకావిష్కరణ చేసి ఉత్సవాలకు నాంది పలకనున్నట్లు తెలిపారు. బుధవారం నుండి ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని చెప్పారు. సెప్టెంబర్ 7న మహోత్సవానికి ముందు రోజు బలి అర్పణను బిషప్ రాబర్ట్ మిరాండ నిర్వహిస్తారు. 8న ఉదయం 5 గంటల నుండి ప్రార్థనలు ఆరంభమవుతాయి. ముందుగా కన్నడ, ఆ తరువాత తెలుగు, మళయాళం, తమిళం, ఇంగ్లీషు భాషలలో ప్రార్థనలు జరుగుతాయని వివరించారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు




బాలిక ప్రాణాలు కాపాడిన పోలీసులు

శివమొగ్గ: ఓ మైనర్ బాలిక (16) గాజుతో చెయ్యి కోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని బాధిత బాలికను మెగ్గాన్ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన ఘటన శివమొగ్గ నగరంలో చోటుచేసుకుంది. వివరాలు...వినోబా నగర ఫ్రీడం పార్కులో ఓ యువతి గాజు ముక్కతో చేతిపై బలమైన గాయం చేసుకుంది. స్థానికులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వినోబానగర పోలీసులు రాఘవేంద్ర, చెన్న కేశవ హుటాహుటిన అక్కడికి చేరుకుని సదరు బాలికను వాహనంలో మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు. దీంతో పోలీసులను ఎస్పీ మిథున్ అభినందించారు.

బస్సు ఢీ, పాదచారి మృతి

శివాజీనగర: ప్రైవేట్ బస్సు దూసుకెళ్లి పాదచారి మృతి చెందిన దుర్ఘటన సిటీ మార్కెట్ మినర్వ సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. నాయండనహళ్లి పంతరపాళ్య అంబేడ్కర్ నగర మురికివాడకు చెందిన మంజునాథ్ (28) మృతి చెందారు. బసప్ప సర్కిల్ నుంచి మినర్వ సర్కిల్ మధ్యలో నందిని హోటల్ వద్ద సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మంజునాథ్ రోడ్డును దాటుతుండగా శ్రీనివాస్ ట్రావెల్‌కు చెందిన బస్సు దూసుకెళ్లి మృతి చెందారు. డ్రైవర్ ముత్తుకుమార్‌ను అరెస్ట్ చేసిన సిటీ మార్కెట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి హత్య

మండ్య: మండ్య జిల్లా శ్రీరంగ పట్టణం తాలూకా కృష్ణరాజసాగర సమీపంలో ఉన్న హోస ఉండవాడి గ్రామంలో సోమవారం సాయంత్రం ఓ యువకుడిని హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. మైసూరు నగరంలోని కూర్గళ్లికి చెందిన మహేశ్ (30) హత్యకు గురైన వ్యక్తి. ఇతన్ని పొలంలో తలపై బండరాయి వేసి హతమార్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మజ్జిగపురకు చెందిన బాలరాజు, అలియాస్ బెంకి, కేఆర్ఎస్‌కు చెందిన అనంద్, అలియాస్ ఒంటి, కోర్గళ్ళికి చెందిన గోవింద శెట్టిని అరెస్ట్ చేశారు. తాగిన మత్తులో నిందితులు, మహేశ్ తలపై బండరాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు కారణాలను పోలీసులు విచారణ చేస్తున్నారు.

స్కై ఈస్పోర్ట్స్ మాస్టర్స్ విజేత గాడ్స్ రీన్



సాక్షి బెంగళూరు: ఎంతో ఆసక్తి రేకెత్తించిన భారతదేశ అతిపెద్ద స్కై ఈస్పోర్ట్స్ టోర్నీలో స్కైఈస్పోర్ట్స్ మాస్టర్-2023ను గాడ్స్ రీన్ టీమ్ విజేతగా నిలిచింది. బెంగళూరు కోరమంగళ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ పోటీలో సమీప ప్రత్యర్థి రెవనెంట్ ఈస్పోర్ట్స్ టీమ్‌పై గెలిచి ఈ ఏడాది విజేతగా గాడ్స్ రీన్ నిలిచింది. శని, ఆదివారాల్లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో విజేతగా గాడ్స్ రీన్ జట్టు నిలిచి రూ. 2 కోట్ల ప్రైజ్‌మనీ సొంతం చేసుకుంది. కోవిడ్ మహమ్మారి తర్వాత దేశంలో తొలిసారి అత్యంత గ్రాండ్‌గా కోరమంగళ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ ఈవెంట్‌లో పాల్గొనేందుకు మొత్తం 7,100 మంది పాల్గొన్నారు. మొత్తం 8 టీమ్‌లు ఈ లీగ్‌లో పాల్గొన్నాయి. జూలై 8 నుంచి ఆగస్టు 17 వరకు ఈ 8 టీమ్‌లు పోటీపడ్డాయి. 50కి పైగా మ్యాచ్‌లు జరిగాయి. చివరికి ఫైనల్‌కు గాడ్స్‌రీన్, రెవనెంట్ ఈస్పోర్ట్స్ టీమ్‌లు చేరుకున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎన్ఏ హ్యారిస్ హాజరై మాట్లాడారు. ఈ-స్పోర్ట్స్ గేమ్స్‌కు తమ ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందని హామీనిచ్చారు.

క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- మంత్రి బీ.నాగేంద్ర

శివాజీనగర: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తామని, ఏ సమస్య తన దృష్టికి తీసుకొచ్చినా పరిష్కరిస్తామని యువజన క్రీడల శాఖ మంత్రి బీ.నాగేంద్ర తెలిపారు. మంగళవారం నగరంలో కంఠీరవ క్రీడామైదానంలో హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని ప్రారంభించి మాట్లాడుతూ... హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. కన్నడిగులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, శాఖ కమిషనర్ శశికుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జానపద కళలను రక్షించాలి



అంజినప్ప ముఖవీణ కళా ప్రదర్శన

గౌరిబిదనూరు: అణగారిన వర్గాలలో జానపద కళలు దాగి ఉన్నాయని, వారిని ప్రోత్సహించాలని దళిత నాయకుడు, ఇడగూరు జీపీ సభ్యుడు సోమయ్య అన్నారు. మంగళవారం నగరానికి సమీపంలో వున్న మొరార్జి దేశాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గౌతమబుద్ధ సామాజిక, సాంఘిక సంస్థ, కన్నడ సంస్కృతి శాఖ, తాలూకా విలేకరుల సంఘం వారిచే జరిగిన అణగారిన వర్గాల జానపద కళల ప్రదర్శన కార్యక్రమంలో మాట్లాడారు. అనాది కాలం నుంచి వెనుకబడిన వర్గాలలో ఉత్తమ కళాభిరుచి ఉందని, ఉదాహరణకు గుడిబండ తాలూకా గవికుంటపల్లి అంజినప్ప తన కళా నైపుణ్యంలో ముక్కులో నీటిని తీసుకుంటూ ఐదు వాద్యాలతో పాటలు పాడే కళ వారితో నశించిపోతుందన్నారు. ఈ కళను నేర్చుకోవడానికి యువత ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కళలను భావి తరాల వారికి అందించాలన్నారు. కార్యక్రమంలో గౌతమ బుద్ధ సంఘం వైటి ప్రసన్నకుమార్, ప్రిన్సిపాల్ లోకేశ్ కుమార్, అశ్వత్థ, దేవీ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారిణికి వేధింపులు

యశవంతపుర: తనను మాజీ మేయర్ శరణు మోదీ వేధిస్తున్నాడని కలబురగి జిల్లా ఆహార సురక్షత, నాణ్యత ప్రాధికార జిల్లా అధికారి డాక్టర్ అర్చన ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఒక ఆడియోను విడుదల చేసిన అనంతరం మంగళవారం కలబుర్గిలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఆయన నడుపుతున్న తాగునీటి ఫిల్టర్‌ను సీజ్ చేశాను, తాజాగా మూడు రోజుల క్రితం మూడు చోట్ల దాడి చేసి సీజ్ చేశామని, సోమవారం శరణు తనకు ఫోన్ చేసి వేధిస్తున్నట్లు ఆమె ఆరోపించారు. ఒక మహిళ అధికారికి ఫోన్ చేసి వేధించటం ఎంత వరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. తనకు రక్షణ కల్పించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక్ ఖర్గేకు విజ్ఞప్తి చేశారు.

జరిమానా వసూలు
కేఎస్ ఆర్టీసీ బస్సులో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి జరిమానాలు విధించి రూ.4.46 లక్షలు వసూలు చేసినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 2748 మంది ప్రయాణికుల నుంచి జరిమానా వసూలు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దేవుడి పేరుతో భక్తులకు పంగనామాలు

- లక్షలు వసూలు చేసిన వ్యక్తి ఆత్మహత్య

మైసూరు: దేవుడి పేరు చెప్పి భక్తుల నుంచి లక్షలు వసూలు చేసిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మైసూరు జిల్లా టీ నరసిపూర తాలూకా బన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బన్నూరులోని రంగసముద్రం రాజా పరమేశ్వరి కాలవ పక్కనున్న జల్‌జల్ శాంతి మాదప్ప ఆలయానికి చెందిన గుడ్డప్ప విజయ్ కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు...గుడ్డప్ప విజయ్ కుమార్ ఆలయంలో ఉంటూ తనకు దేవతలు ఒంటిలో పూనుతారని చెబుతూ దర్శనానికి వచ్చిన భక్తులను మీరు నాకు అప్పు ఉన్నారని, ఇవ్వపోతే ప్రమాదంలో పడిపోతారని హెచ్చరించేవాడు. అంతే కాకుండా ఆలయంలో నిధి ఉందని చెప్పి భక్తుల నుంచి లక్షలు తీసుకున్నాడు. ఈ విషయంపై పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గుడ్డప్ప విజయ్ కుమార్ మండ్యలోని హోసూరు కాలనీలో ఓ వ్యక్తి తోటలో ఉరి వేసుకున్నాడు. దీంతో ఇతనికి డబ్బులు ఇచ్చిన వారు లబోదిబో మంటున్నారు.

లోకాయుక్తకు చిక్కిన బీబీఎంపీ ఇంజినీర్

కృష్ణరాజపురం: బీబీఎంపీ ఏఈఈ లంచం తీసుకుంటూ మంగళవారం లోకాయుక్త అధికారులకు పట్టుబడ్డాడు. వివరాలు.. నగరంలోని చామరాజ పేట డివిజన్ చెత్త నిర్వహణ కేంద్రానికి సంబంధించి బీబీఎంపీ ఏఈఈ శివణ్ణ రూ.10 వేలు డిమాండ్ చేశాడు. నిర్వాహకులు లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా వారు చెత్త నిర్వహణ కేంద్రం వద్ద నిఘా ఉంచి ఏఈఈ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



పట్టుబడిన శివణ్ణ →

హోసూరు వార్తలు..

బైక్ ఢీకొని రైతు దుర్మరణం

హోసూరు: నడిచి వెళుతున్న రైతును బైక్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడి ఆస్పత్రిలో చనిపోయాడు. వివరాల మేరకు బాగలూరు సమీపంలోని ఎలువపల్లి గ్రామానికి రైతు చెందిన వెంకటరెడ్డి (63) సోమవారం సాయంత్రం బాగలూరు- సర్జాపుర రోడ్డులో నడిచి వెళుతుండగా ఒక ద్విచక్ర వాహనదారు ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన వెంకటరెడ్డిని స్థానికులు చికిత్స కోసం హోసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఫలితం లేక మృతి చెందాడు. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేటగాళ్ల అరెస్టు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా జవుళగిరి అటవీ ప్రాంతంలో నెమళ్లు, అడవిపందుల వేట కెళ్లిన నలుగురిని అటవీశాఖాధికార్లు అరెస్ట్ చేశారు. జవుళగిరి అటవీశాఖాధికారి మురళీధరన్ నేతృత్వంలో సోమవారం రాత్రి జవుళగిరి అటవీ ప్రాంతంలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జాన్ సలూఖాన్ (26), సాధుఖాన్‌లూకస్ (28) అని తెలిసింది. వారు అదే ప్రాంతంలో నివాసముంటూ రైతు పొలంలో కూలిపనులు చేస్తు, రాత్రిపూట అడవి జంతువులను వేటాడేవారు. అలాగే కంబత్తూరు గ్రామానికి చెందిన గోవిందన్ (60), సతీష్ (22)లు అడవి పందుల వేటకు వెళ్లగా అరెస్ట్ చేసి తలా రూ. 5 వేలు చొప్పున జరిమానా వసూలు చేశారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

హోసూరు: జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 27వ తేదీ మదగొండపల్లి సమీపంలోని ఎంఎంఎస్ పాఠశాలలో జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో హోసూరు పారిశ్రామికవాడ బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో విద్యార్థి రాజ్ గుండు విసిరే పోటీల్లో మొదటిస్థానం పొందగా హైజంప్ పోటీల్లో సుబిక్ష రెండవ స్థానాన్ని కైవసం చేసుకొంది. రాజ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బాలున్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాన్ నాగేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

148 ఏళ్ల సబ్ కలెక్టర్ బంగ్లా

- చెక్కుచెదరని తెల్లదొరల భవనాలు



హోసూరు సబ్ కలెక్టర్ బంగ్లా

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా హోసూరు, డెంకణీకోట తాలూకాల్లో ఆంగ్లేయులచే నిర్మించిన భవనాలు ఎక్కువగానే నేటికీ దర్శనమిస్తున్నాయి. ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో నిర్మించిన భవనాలు కొన్ని శిథిలావస్థలు చేరుకోగా మరి కొన్ని భవనాలు ఇప్పటికీ నిక్షేపంగా ఉపయోగంలో ఉండడం విశేషం. మన ప్రభుత్వాలు, కాంట్రాక్టర్లు 20 ఏళ్ల కిందట కట్టిన భవనాలే అప్పుడే బీటలు వారి, పైకప్పులు పెచ్చులూడుతు పనికిరాకుండా దర్శనమిస్తాయి. అలాంటి పెద్ద టెక్నాలజీ లేని రోజుల్లో తెల్లదొరలు కట్టించిన భవనాలు చెక్కుచెదరకపోవడం గమనార్హం. హోసూరు సబ్‌కలెక్టర్, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు, తాలూకా కార్యాలయం, డీఎస్పీ కార్యాలయ భవనాలు నేటికీ చక్కగా ఉన్నాయి. హోసూరు - డెంకణీకోట రోడ్డు ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ భవనాన్ని 1875 ఆగస్టు 28న ఆంగ్లేయులు ప్రారంభించారు. గత 1947 మార్చి 23వ తేదీ నుంచి 1948 మే 15వ తేదీ వరకు ఆంగ్లేయ అధికారి ఆలర్టిస్ ఉన్నాడు. ప్రస్తుతం అదే భవనంలో హోసూరు సబ్‌కలెక్టర్‌గా శరణ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ భవనం వయస్సు 148 ఏళ్లు పూర్తిచేసుకొంది. హోసూరులోని డీఎస్పీ కార్యాలయ భవనానికి 110 ఏళ్లు పూర్తయింది. బ్రిటిష్‌వారి నిర్మాణ నాణ్యతను ఇప్పటి పాలకులు పాటిస్తే ఉత్తమంగా ఉంటుంది.

విద్యార్థులకు బస్సు సౌకర్యం



క్రిష్ణగిరి బస్టాండు నుంచి బస్సు ప్రారంభిస్తున్న మంత్రులు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో పాఠశాల వేళకు బస్సు సౌకర్యాలను మంత్రులు ప్రారంభించారు. కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు కే.ఎస్ నెహ్రూ, ఆర్. గాంధీ, చక్రపాణి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిష్ణగిరి కొత్త బస్టాండు నుంచి సి.కొట్టూరు గ్రామం నుంచి చిక్కపూవత్తి, బేడరహళ్లి, తిరువణపట్టి, గుజ్జత్తూరు రైల్వేస్టేషన్ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు మార్గాలను పొడిగించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... రాష్ట్రంలో బీదబడుగు, బలహీన వర్గాల ప్రజలు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరిస్తున్నారని, అందులో భాగంగా విద్యార్థులు సకాలంలో పాఠశాలలకెళ్లేందుకు బస్సు వసతులు లేని గ్రామాలను గుర్తించి బస్సు సౌకర్యాలను కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ స్నేహ, అధికారులు బాబు, సెల్వం, మోహన్‌కుమార్, తమిళరసన్, పరితానవాజ్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై ఫొటో ప్రదర్శన



క్రిష్ణగిరి: క్రిష్ణగిరి సమితి అగసిపల్లి పంచాయతీ మంగమ్మపురం గ్రామంలో ప్రజా సంబంధ శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలు, సాధనలపై ఫొటో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజల వద్దకే వైద్యం, ఇంటి వద్దకే విద్య, ముఖ్యమంత్రి అల్పాహార పథకం, గిరిజన గ్రామాలకు అంబులెన్స్ సేవలు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రతిభాశిక్షణలు, పెరటి తోటల పెంపకం తదితర పథకాల ఛాయాచిత్రాలను ఏర్పాటు చేయగా స్థానిక ప్రజలు, మహిళలు వీక్షించారు.

రేకుల షెడ్ తొలగింపు



షెడ్ తొలగిస్తున్న దృశ్యం

చింతామణి: ఇంటి ముందర రోడ్డును ఆక్రమించుకుని నిర్మించిన రేకుల షెడ్‌ను పంచాయతీ అధికారులు తొలగించారు. మంగళవారం తాలూకాలోని మూగలమరి గ్రామానికి చెందిన రూప ఇంటి ముందు రోడ్డును ఆక్రమించుకుని రేకుల షెడ్ నిర్మించారు. స్థానికంగా ఉన్నవారు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పీడీఓ రవి, ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో షెడ్‌ను తొలగించారు.

క్లుప్తంగా...

4న స్పెషల్ కేటగిరి మాన్యువల్ కౌన్సెలింగ్

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్జీరంగా వర్సిటీ చర్యలు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలు 2023–24 విద్యా సంవత్సరానికి స్పెషల్ కేటగిరి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ రెండు విడతలుగా ఆన్‌లైన్, మాప్‌అప్ కౌన్సెలింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 4న గుంటూరులోని లాంఫాం నందు స్పెషల్ కేటగిరి మాన్యువల్ కౌన్సెలింగ్, 5వ తేదీన మిగిలిన సీట్ల భర్తీకి చివరి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత పొంది, పాలిటెక్నిక్ ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న, నమోదు చేసుకున్న, దరఖాస్తు చేయని అభ్యర్థులైన ఈ కౌన్సెలింగ్‌కు అర్హులేనని పేర్కొన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణ వాయిదా

అల్లిపురం(విశాఖ దక్షిణ): ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీఎం జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నానికి సంబంధించిన కేసు విచారణ సెప్టెంబర్ 6వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు విశాఖ 3వ అదనపు జిల్లా జడ్జి, ఏసీబీ, ఎన్ఐఏ కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.వి.ఎస్.మురళీకృష్ణ ఉత్తర్వులిచ్చారు. ఈ కేసును ఇటీవల విజయవాడ ఎన్ఐఏ కోర్టు నుంచి విశాఖ ఎన్ఐఏ కోర్టుకు బదిలీ చేశారు. మంగళవారం ఈ కేసు విచారణకు రాగా.. నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును కోర్టులో హాజరుపరిచారు. నిందితుడి బెయిల్ పిటిషన్‌పై న్యాయవాది సలీమ్ వాదనలు వినిపించేందుకు ప్రయత్నించగా.. ఎన్ఐఏ న్యాయవాదులు విశాల్ గౌతమ్, సిద్ధరాములు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసులో డాక్యుమెంట్లు పరిశీలించాల్సి ఉన్నందున.. విచారణను సెప్టెంబర్ 18కి వాయిదా వేయాలని కోరారు. అనంతరం న్యాయమూర్తి కేసును సెప్టెంబర్ 6వ తేదీకి వాయిదా వేశారు.

టీటీడీ బోర్డు సభ్యుల నియామకంపై హైకోర్టులో పిల్

సాక్షి, అమరావతి: క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వారిని టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. టీటీడీ బోర్డు సభ్యులుగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను, పారిశ్రామికవేత్త శరత్‌చంద్రారెడ్డి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) మాజీ చైర్మన్ కేతన్ దేశాయ్‌ల నియామకం దేవదాయ చట్ట నిబంధనలకు విరుద్ధమని, వీరి నియామకాన్ని రద్దు చేయాలని కోరుతూ విశ్రాంత రైల్వే ఉద్యోగి చింతా వెంకటేశ్వర్లు వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. విచారణ తేలేంత వరకు ఈ ముగ్గురి నియామక ఉత్తర్వులు నిలిపేయాలని కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈవో, దేవాదాయశాఖ కమిషనర్‌లతో పాటు సామినేని ఉదయభాను, కేతన్ దేశాయ్, శరత్ చంద్రారెడ్డిలను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఎన్నికల షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి ఏఎండీ ఇంతియాజ్ మంగళవారం జారీ చేశారు. వక్ఫ్ సంస్థలకు చెందిన ముతవల్లీల నుంచి ఒక సభ్యుడు ఎన్నిక కావాల్సి ఉంది. ఇందుకోసం సెప్టెంబర్ 1నుంచి 5వ తేదీ వరకు నామినేషన్ల గడువు ఇచ్చారు. తాడేపల్లిలోని ఎన్నికల అధికారి, మైనారిటీ కమిషన్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 5 సాయంత్రం 5.30 గంటలకు నామినేషన్ల పరిశీలన, 7వ తేదీ సాయంత్రం 5గంటల లోపు ఉపసంహరణ ఉంటుంది. 9వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విజయవాడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న షా జాహూర్ ముసాఫిర్‌ఖానాలో ఎన్నికలు నిర్వహిస్తారు. అక్కడే సాయంత్రం 5గంటలకు ఫలితాలు వెల్లడిస్తారు.

'పుంగనూరు' బెయిల్ పిటిషన్లపై తీర్పు 31కి వాయిదా

మదనపల్లె : ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని అంగళ్లు, పుంగనూరులో ఈనెల 4న చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన అల్లర్లకు సంబంధించి అజ్ఞాతంలో ఉన్న టీడీపీ నాయకులు పెట్టుకున్న బెయిల్ పిటిషన్లపై మదనపల్లె రెండో ఏడీజే కోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. అంగళ్లులో జరిగిన అల్లర్లపై ముదివేడు పోలీసులు నాలుగు కేసులు నమోదుచేస్తే... అందులో రెండు కేసులకు సంబంధించి ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఇరుపక్షాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అడిషనల్ పీపీ జనార్దనరెడ్డి, ఏపీపీ రామకృష్ణ నిందితులకు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. టీడీపీ నాయకుల తరపున చిత్తూరు, మదనపల్లె, పుంగనూరుకు చెందిన న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి ఈనెల 31వ తేదీకి తీర్పు వాయిదా వేశారు.

పిల్లల ట్యాబ్‌లపై పచ్చ వైరస్ దాడి

పిల్లల్లో ఉన్నత ప్రమాణాలకు బాటలు వేస్తుంటే పచ్చపత్రిక తప్పుడు ఆరోపణలు

- 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చినప్పుడే 9, 10 తరగతుల పాఠాలూ అప్‌లోడ్
- పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బహుభాషల్లో కంటెంట్
- పిల్లలు అవాంఛనీయ సైట్ల జోలికి పోకుండా సెక్యూరిటీ ప్యాచ్‌అప్
- పాడైన వాటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ప్రతి విద్యార్థీ ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకోవాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. ఇందుకోసం రాష్ట్ర విద్యా రంగంలో వినూత్న సంస్కరణలు చేపట్టారు. కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారుస్తూ, అత్యాధునిక బోధన పద్ధతులు ప్రవేశపెడుతున్నారు. ఇందులో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు అత్యాధునిక ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తున్నారు. ఈ మహత్తర కార్యక్రమంపైనా పచ్చపత్రికలు విషం చిమ్ముతున్నాయి. ట్యాబ్‌లు పాడైపోయాయని, పాఠాలు అప్‌లోడ్ చేయలేదని, పిల్లలకు ఆ పాఠాలు సరిగా అర్థంకావడంలేదని మంగళవారం ఓ పచ్చ పత్రిక అసత్య కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంలోని అంశాలు పూర్తిగా అవాస్తవాలేనని ప్రభుత్వం ఖండించింది. దీనికి సంబంధించిన వాస్తవాలను వెల్లడించింది.

- గత సంవత్సరంలో 8 వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పూర్తిగా పంపిణీ అయ్యాయి. వీటిలో 9 వ తరగతి పాఠాలు కూడా అప్పుడే అప్‌లోడ్ చేసి అందించారు.
- ట్యాబ్‌లో ఉన్న బైజూస్ కంటెంట్ మల్టిపుల్ లాంగ్వేజ్‌లో ఉంది కనుక విద్యార్థులకు, టీచర్లకు అర్థం కాకపోవడం అనేది జరగదు. విద్యార్థులు ఆంగ్ల పదాలను సులువుగా ఉచ్ఛరించగలుగుతారు. సాంకేతిక పదాలను సులభంగా తెలుసుకోగలుగుతున్నారు. తద్వారా పై తరగతుల్లోకి వెళ్లినప్పుడు ఇబ్బంది లేకుండా పాఠాలు అర్థం చేసుకోగలుగుతున్నారు.
- విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లో సెక్యూరిటీ ప్యాచ్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు. దీనివల్ల అవాంఛనీయ సైట్లు, నాన్ అకడమిక్ అంశాలు ట్యాబుల్లో వచ్చే అవకాశమే లేదు.
- పగిలిపోయిన ట్యాబ్‌లను గ్రామ, వార్డు సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ద్వారా సేకరించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించి ఇస్తున్నారు. స్క్రీన్లు పాడైపోయిన వాటికి త్వరలో నూతన స్క్రీన్ వేయించి పంపిణీ చేస్తారు.
- అన్ని ట్యాబ్‌లలో ఎస్డీ కార్డులు ఉన్నాయి. ఎస్డీ కార్డు లేకుండా ఏ విద్యార్థికీ ట్యాబ్ పంపిణీ జరగలేదు.

పిల్లలు త్వరగా నేర్చుకొనేలా ట్యాబ్‌లు

విద్యార్థులు పాఠాలను తరగతి గదిలోను, ఇళ్ల వద్ద కూడా అనువైన సమయంలో అభ్యసించేందుకు ప్రభుత్వం ఈ ట్యాబ్‌లు ఇస్తోంది. విద్యార్థులకు సబ్జెక్టులపై లోతైన అవగాహన కల్పించేలా 8 నుంచి 10వ తరగతి వరకు అత్యుత్తమమైన బైజూస్ డిజిటల్ కంటెంట్‌ను వీటిలో అప్‌లోడ్ చేసి అందిస్తోంది. ఈ పాఠాలు గ్రాఫులు, మ్యాపులతో పాటు త్వరగా అర్థమయ్యే రీతిలో వీడియోలతో పిల్లలను ఆకర్షించేలా, మరింత శ్రద్ధగా చదువుకొనేలా చేస్తున్నాయి. వారికి పాఠాలు చెప్పే టీచర్లకు కూడా ట్యాబ్‌లు ఇస్తోంది. ఇప్పటికే రెండు విద్యా సంవత్సరాలు వరుసగా వీటిని ప్రభుత్వం పంపిణీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5.20 లక్షల మంది విద్యార్థులు, టీచర్లకు వీటిని ఇచ్చారు. స్కూల్లో ఉపాధ్యాయుడు చెప్పిన అంశాలు సరిగా అర్థంకాకపోయినా వాటిని ట్యాబ్‌ల ద్వారా ఇళ్ల వద్దే పిల్లలు నేర్చుకోగలుగుతున్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు గతంలోకంటే ఎంతో మెరుగయ్యాయని పలు పరిశీలనల్లో తేలింది.

- టీచర్లందరికీ మూడు దఫాలుగా బైజూస్ కంటెంట్, ట్యాబ్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు.
- ప్రతి వారం పిల్లలు ఎంత సమయం ట్యాబ్ మీద వెచ్చిస్తున్నారు? ఏయే అంశాలను నేర్చుకుంటున్నారు? వారి పజ్ఞానం ఏ మేరకు మెరుగుపడిందో టీచర్లు పరిశీలిస్తున్నారు. అవసరమైన సూచనలు చేస్తున్నారు.

ఉద్యోగ సంఘాలతో సానుకూలంగా చర్చలు

- జీపీఎస్‌లో మరికొన్ని అంశాలు చేర్చాలని కోరాయి
- అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకుంటాం
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి
- ఓపీఎస్ కావాలని మరోసారి అడిగాం : ఉద్యోగ సంఘాలు



ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

సాక్షి, అమరావతి : ఉద్యోగ సంఘాలతో చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. జీపీఎస్‌లో మరికొన్ని అంశాలు చేర్చాలని ఉద్యోగ సంఘాల నాయకులు అడిగారని, అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు ఆయన తెలిపారు. గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) అమలుపై మంగళవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై చర్చించింది. ఉద్యోగ సంఘాల నుండి జీపీఎస్ మీద అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించారు. అనంతరం ఆ వివరాలను మంత్రి బొత్స మీడియాకు వివరించారు. ఈ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులైన మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేశ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ముఖ్య కార్యదర్శి (హెచ్ఆర్) చిరంజీవి చౌదరి, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల నుండి ఏపీ ఎన్జీఓ సంఘం జనరల్ సెక్రటరీ శివారెడ్డి, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కే వెంకట్రామిరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ ప్రభుత్వోద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ ఆస్కార్ రావు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రాజేశ్, నాగప్రసాద్, యుగంధర్, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి చర్చలు : శివారెడ్డి

ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ.. ఓపీఎస్ కావాలని మరోసారి అడిగామని.. పది శాతం కంట్రిబ్యూషన్ లేకుండా ఇవ్వాలని కోరామన్నారు. మరోసారి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరుపుతామని చెప్పారని తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉద్యోగి మరణిస్తే ఆ ఉద్యోగి కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరామని, ఓపీఎస్ ఉద్యోగుల మాదిరిగా అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఏడాదికి రెండుసార్లు డీఆర్ ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్, పీఆర్సీ, హెల్త్ కార్డులు ఇవ్వాలని కూడా కోరామని ఆయన చెప్పారు. ఇక ఉపాధ్యాయులు తమ గురించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఉద్యోగులకు సీపీఎస్ లేదా జీపీఎస్‌లో ఏదైనా ఎంచుకునే అవకాశం ఇస్తామని చెప్పినట్లు బొప్పరాజు తెలిపారు. ఉద్యోగులు నగదు తీసుకుంటే మిగిలిన నగదును మాత్రమే పెన్షన్‌గా ఇస్తారని చెప్పారు.

టీడీపీ గుర్తింపు రద్దు చేయండి

ఏలూరు (టూటౌన్): టీడీపీ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ నవ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందించారు. ఫిర్యాదు కాపీలను మంగళవారం ఏలూరులో మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ చంద్రబాబు సమావేశాల్లో కందుకూరులో 8 మంది, గుంటూరులో 3 మరణించారన్నారు. పుంగనూరులో టీడీపీ దాడుల్లో 48 మంది పోలీసులను గాయపడ్డారన్నారు. హింసను ప్రేరేపిస్తూ.. మరణాలకు కారణమైన టీడీపీ గుర్తింపును కేంద్ర ఎన్నికల సంఘం రద్దు చేయాలన్నారు.

'ఉపాధి' కూలీల వేతనాలకు రూ.1,360.55 కోట్లు

- రెండు మూడు రోజుల్లో కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ
- 15 కోట్ల పనిదినాల లక్ష్యం జూన్‌లోనే పూర్తి
- అదనపు పని దినాలు కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆ తర్వాత కూడా అడిగిన వారికి పని ఇచ్చిన ప్రభుత్వం
- తాజాగా పనిదినాలను 21.5 కోట్లకు పెంచిన కేంద్రం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు చెల్లింపులకు రూ. 1,360.55 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ పథకం డైరెక్టర్ అదితి సింగ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మొదట రాష్ట్రానికి 15 కోట్ల పనిదినాల లేబర్ బడ్జెట్ మాత్రమే మంజూరు చేసింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూన్ నెలలోనే పూర్తి చేసి, అదనపు పని దినాలు కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. ఆ తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పని కావాలని అడిగిన వారికల్లా ఉపాధి హామీ పథకంలో పనులు కల్పిస్తూనే ఉంది. అయితే, ఆ సమయంలో పని చేసిన కూలీలకు వేతనాలు చెల్లించాలంటే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు లేబర్ బడ్జెట్‌కు ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ ఏడాది జూన్ 26 తర్వాత రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు దాదాపు రూ.1,200 కోట్ల వేతన బకాయిలు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. కాగా, కేంద్రం ఇటీవల ఉపాధి హామీ పథకం అదనపు లేబర్ బడ్జెట్‌ను 21.50 కోట్ల పనిదినాలకు పెంచడానికి ఆమోదం తెలపడంతో పాటు తాజాగా కూలీల వేతనాలకు రూ. 1360. 55 కోట్లు మంజూరు చేసింది. దీంతో వచ్చే రెండు మూడు రోజుల్లోనే ఆ కూలీల వేతన బకాయిలు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు.

ఆర్భాటం ఫుల్.. జనం మాత్రం నిల్

వెలవెలబోయిన లోకేశ్ పాదయాత్ర



టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో లోకేశ్ కోసం ఎదురుచూస్తున్న టీడీపీ నాయకులు

టి.నరసాపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రను రక్తి కట్టించేందుకు పార్టీ అధిష్టానం ఎంతగా ఆర్భాటం చేస్తున్నా.. స్పందన లేక వెలవెలబోతోంది. కిరాయి ఇచ్చి ముందుగా ఏర్పాటు చేసుకున్న జనం తప్ప ప్రజలెవరూ పాదయాత్ర వైపు కన్నెత్తి చూడటం లేదు. మంగళవారం చింతలపూడి మండలం తీగలవంచ నుంచి లోకేశ్ పాదయాత్ర మొదలైంది. పోలవరం నియోజకవర్గంలో పాదయాత్ర ప్రవేశించే సమయంలో స్వాగతం పలికేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు రెండు కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రమైన టి.నరసాపురం వరకు పాల్గొన్నారు. పాదయాత్రకు ఎక్కడా ప్రజాస్పందన కనిపించలేదు. పాదయాత్ర బొర్రంపాలెం వరకు సాగింది. శ్రీరామవరంలో పోలవరం నిర్వాసితులతో ముఖాముఖి నిర్వహించారు. పాదయాత్రలో పాల్గొన్న వారికి మధ్యాహ్నం భోజనం కోసం ఏర్పాట్లు చేశారు. జనం ఎవరూ రాకపోవడంతో వంటకాలన్నీ మిగిలిపోయాయి. కాగా.. టి.నరసాపురం మండలంలో మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ వర్గీయులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరించారు. శ్రీరామవరంలో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీల ఏర్పాటుకు ఆ గ్రామంలోని పార్టీ నాయకులు అభ్యంతరం తెలపడం కొసమెరుపు.

ప్రభుత్వ బడుల్లో బాల శాస్త్రవేత్తలు

30 వేల మంది విద్యార్థులకు టెక్నాలజీ అంశాల్లో శిక్షణ ఇచ్చిన విద్యాశాఖ

- జిల్లాలో టాపర్స్‌గా నిలిచిన 100 మందితో గ్రాండ్ ఫినాలే
- సరికొత్త ఆవిష్కరణలకు రూపమిచ్చిన ప్రభుత్వ విద్యార్థులు
- విద్యార్థుల ఆలోచనలకు ప్రోత్సాహమిచ్చిన యునిసెఫ్
- 10 విజేత బృందాలకు రూ.10 వేల నుంచి రూ.లక్ష నుంచి వరకు బహుమతులు
- బెస్ట్ నమూనాలకు పేటెంట్, మార్కెటింగ్ అవకాశం



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్

సాక్షి, అమరావతి: సర్కారు బడుల్లో నాడు-నేడు కార్యక్రమం ద్వారా సకల సదుపాయాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చురుకైన విద్యార్థులను శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రోత్సహించి.. సరికొత్త ఆవిష్కరణలు చేసేలా మార్గనిర్దేశం చేసింది. ఫలితంగా సౌర విద్యుత్‌తో నడిచే ట్రాక్టర్, రోడ్డు పాడవకుండా దమ్ము ఇనుప చక్రాలతో నడిచే ట్రాక్టర్, బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగకుండా హెచ్చరించే సెన్సార్, కారులో ఇరుక్కుపోయిన పిల్లలను రక్షించే యంత్రం, రూ.1,200కే బట్టలు ఉతికే వాషింగ్ మెషిన్ వంటి అనేక పరికరాలకు విద్యార్థులే ప్రాణం పోశారు. రాష్ట్ర ప్రభుత్వం, యునిసెఫ్ సంయుక్తంగా 'ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ 2022–23' పేరిట నిర్వహించిన ప్రదర్శనలో ప్రతిభ చాటిన 27 బృందాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు.

ప్రారంభమైన పోటీలు

మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలు సోమవారం విజయవాడలోని ఓ హోటల్లో ప్రారంభమయ్యాయి. 9, 10వ తరగతి విద్యార్థులు రూపొందించిన యంత్ర పరికరాలు వేటికవే ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. ఇందులో 10 విజేత బృందాలకు నగదు బహుమతితో పాటు భవిష్యత్‌లో యంత్రాల తయారీ, పేటెంట్ హక్కులు సైతం ఇవ్వనుండటం విశేషం. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాలుగో బహుమతి రూ.35 వేలు, ఐదో బహుమతిగా రూ.25 వేలు ప్రకటించారు. మరో 5 బృందాలకు రూ.10 వేల చొప్పున అందజేయనున్నారు.

రైతు నేస్తం సోలార్ ట్రాక్టర్



రైతులు పొలం పనులు చేయాలంటే ట్రాక్టర్ వినియోగం తప్పనిసరి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి ఇంధన ఖర్చు పెరుగుతున్నాయి. ఈ ఖర్చును తగ్గించాలనుకున్నాను. పైగా దమ్ము చేసే ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపైకి రావడంతో ఆ రోడ్లు పూర్తిగా పాడైపోతున్నాయి. ఈ రెండు సమస్యలకు ఒక పరిష్కారం చూపాలని సోలార్‌తో నడిచే సపోర్టు ల్యాండింగ్ చక్రాల ట్రాక్టర్‌ను రూపొందించాం. ట్రాక్టర్ పైన బిగించే సోలార్ ఫలకాల ద్వారా బ్యాటరీ చార్జి అవుతుంది. దానితో అవసరమైనంత పనిచేసుకోవచ్చు. మరోపక్క దమ్ము రిమ్ములు బిగించి రోడ్డుపైకి రాగానే వెనుకనున్న సపోర్టు ల్యాండింగ్ చక్రాల విచ్చుకుని ఇనుప చక్రాలను పైకి లేచేలా సహకరిస్తాయి. అప్పుడు రోడ్డు పాడవకుండా ట్రాక్టర్ ప్రయాణించవచ్చు. అతి తక్కువ ఖర్చుతో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చు. **– బోయిన సౌమ్య, కలిదిండి జెడ్పీ హైస్కూల్, ఏలూరు జిల్లా**


ఆరోగ్యాన్నిచ్చే వాషింగ్ మెషిన్



గ్రామాల్లో బట్టలు ఉతకడం కోసం చాల కష్టపడుతుంటారు. బట్టలు ఉతకడానికి మా అమ్మ పడుతున్న కష్టాన్ని చూసి చవకైన వాషింగ్ మెషిన్ రూపొందించాలనుకున్నాను. మా బృందంలోని ముగ్గురం కలిసి పాత సైకిల్, ప్లాస్టిక్ డ్రమ్‌తో వాషింగ్ మెషిన్ తయారు చేశాం. ఇందులో బట్టలు, నీరు, డిటర్జెంట్ పౌడర్ వేసి సైకిల్ తొక్కితే కొద్దిసేపటికి మురికిపోతుంది. ఇలా చేయడం వల్ల ఆరోగ్యం కూడా దక్కుతుంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.1,200 మాత్రమే ఖర్చయ్యింది.

– గుడాల సంహిత సిరి, రాయకుదురు జెడ్పీ హైస్కూల్, పశ్చిమ గోదావరి జిల్లా

ఆక్సిజన్ తగ్గితే అలారమ్



కారులో ఉన్న వారికి ఆక్సిజన్ అందకపోతే వెంటనే చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసే సెన్సార్‌ను బోర్డును తయారు చేశాం. కారులో ఆక్సిజన్ తగ్గిపోతూ.. కార్బన్ డై ఆక్సైడ్ పెరుగుతుంటే వెంటనే అలారమ్ మోగుతుంది. దీంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై సాయం అందించేందుకు వీలుంటుంది. తక్కువ ఖర్చుతో ఏ కారులైనా బిగించుకునేలా ఈ ప్రాజెక్టును రూపొందించాం.

– సి.ప్రదీప్, వావిలి తోట జెడ్పీ హైస్కూల్, చిత్తూరు జిల్లా

2025 జూన్‌కు పోలవరం తొలి దశ పూర్తి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు సత్వరమే అమలు చేయండి
- డయాఫ్రమ్ వాల్, గైడ్ బండ్ దెబ్బతినడానికి కారణాలపై లోతుగా అధ్యయనం
- సీడబ్ల్యూసీ, పీపీఏలకు కేంద్ర జల్ శక్తి శాఖ ఆదేశం
- కొత్త డయాఫ్రమ్ వాల్‌పై మరింత అధ్యయనం: సీడబ్ల్యూసీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలి దశను 2025 జూన్‌కి పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదన అమలుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)లకు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్ చెప్పారు. ఆయన మంగళవారం ఢిల్లీలో కేంద్ర జల్ శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోరా, కేంద్ర జల్ శక్తి శాఖ ప్రత్యేక కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ తదితరులతో పోలవరం పనులపై సమీక్షించారు. డయాఫ్రమ్ వాల్, గైడ్ బండ్ దెబ్బతినడానికి దారితీసిన పరిస్థితులు, కారణాలపై మరింత లోతుగా అధ్యయనం చేసి భవిష్యత్తులో అలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాఫర్ డ్యామ్‌లలో లీకేజీలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయడానికి, వాటిని మరింత పటిష్టం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణులతో అధ్యయనం చేయించాలని సూచించారు. డిజైన్ల ప్రతిపాదన, ఆమోదం నుంచి పనులు చేపట్టడం వరకూ పీపీఏ పాత్ర మరింత పెరగాలన్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించాలా? లేదంటే దెబ్బతిన్న చోట్ల మాత్రమే కొత్తగా డయాఫ్రమ్ వేస్తే సరిపోతుందా? అనే అంశంపై ఏం నిర్ణయం తీసుకున్నారని సీడబ్ల్యూసీని ప్రశ్నించారు. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికే మొగ్గుచూపుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపిందని, దానిపై మరింత లోతుగా అధ్యయనం చేసి నివేదిక ఇస్తామని సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్ వోరా చెప్పారు. కాఫర్ డ్యామ్‌లను మరింత పటిష్టం చేయడం, డయాఫ్రమ్ వాల్ నిర్మాణంపై సీడబ్ల్యూసీ, పీపీఏ, రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులతో చర్చించి నాలుగైదు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కేంద్ర జల్ శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాంకు పంకజ్‌కుమార్ సూచించారు. ఈ నివేదికల ఆధారంగా మరో సారి సమావేశమై కాఫర్ డ్యామ్‌ల పటిష్టత, డయాఫ్రమ్ వాల్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గోదావరిలో వరదలు తగ్గేలోగా వాటిపై తుది నిర్ణయం తీసుకుంటే ఈ సీజన్‌లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టవచ్చని, తద్వారా గడువులోగా ప్రాజెక్టు తొలి దశ పూర్తి చేయడానికి ఆస్కారం ఉంటుందని వివరించారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల్లో సిట్ ఏర్పాటుపై స్టే

- ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఉత్తర్వులు
- సిట్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చిన సింగిల్ జడ్జి
- సింగిల్ జడ్జి ఉత్తర్వులపై అటవీశాఖ అప్పీల్

సాక్షి, అమరావతి: ఎర్ర చందనం, గంధం, ఇతర అటవీ ఉత్పత్తుల స్మగ్లింగ్ విషయంలో సమగ్ర దర్యాప్తు నిమిత్తం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై ధర్మాసనం స్టే విధించింది. సిట్ ఏర్పాటు ఉత్తర్వులను సవాలు చేస్తూ అటవీశాఖ అధికారులు దాఖలు చేసిన అప్పీల్‌ను విచారణకు స్వీకరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. ఓ కేసు విచారణ సందర్భంగా స్మగ్లర్లపై నమోదు చేసిన కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం, అసమర్థత, ఉదాసీనత చూపుతోన్న నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే ఓ స్వతంత్ర బహిర్గత సంస్థ దర్యాప్తు చేయడం సబబుగా ఉంటుందని హైకోర్టు సింగిల్ జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అభిప్రాయపడ్డారు. అందుకే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సుమోటోగా ఈ ఏడాది జూన్ 15న ఉత్తర్వులిచ్చారు. తమ ఆదేశాల మేరకు ఏర్పాటయ్యే సిట్‌కు సివిల్ కోర్టుకు ఉండే అన్నీ అధికారాలు ఉంటాయని, తమ విచక్షణ మేర ఏ వ్యక్తినైనా పిలిచేందుకు, రికార్డులు, డాక్యుమెంట్లు, వాంగ్మూలాలు కోరే అధికారం సిట్‌కు ఉందని స్పష్టం చేశారు. 12 వారాల్లో నివేదికను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ద్వారా తమకు సమర్పించాలని సిట్‌ను జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ అటవీ శాఖ అధికారులు సీజే ధర్మాసనం ముందు అప్పీల్ చేయగా దానిపై మంగళవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. అటవీశాఖ అధికారుల తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ, సుమోటోగా ఉత్తర్వులు జారీ చేసే అధికారం సింగిల్ జడ్జికి లేదన్నారు. కోర్టు ముందు తగిన ఆధారాలు లేకపోయినా కూడా సింగిల్ జడ్జి సిట్ ఏర్పాటుకు ఆదేశాలిచ్చారని,. సుమోటోగా విచారణ జరపాలని భావిస్తే, ఆ విషయాన్ని లిఖితపూర్వకంగా సీజే ముందుంచాలని, అంతిమ నిర్ణయం ఆయనే తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. సుమోటో పరిధి పూర్తిగా సీజేకు సంబంధించిందని ఏజీ వివరించారు. సిట్ ఏర్పాటు చేయడం వల్ల కేసును మరో దర్యాప్తు సంస్థకు అప్పగించినట్లయిందని, సిట్ దర్యాప్తును సింగిల్ జడ్జి పర్యవేక్షిస్తున్నట్లు ఉందన్నారు. సిట్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చే ముందు దీనిపై ప్రభుత్వ వాదనలు విని ఉండాల్సిందన్నారు. అలాంటిది ఏమీ చేయకుండా నేరుగా సిట్ ఏర్పాటు చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనంపై విధంగా ఆదేశాలిచ్చింది.

చంద్రబాబు, లోకేశ్, పవన్‌పై పోలీసులకు ఫిర్యాదు

తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు వెల్లువెత్తిన ఫిర్యాదులు

తాడికొండ: టీడీపీ హయాంలో ఇసుక దందాకు బాధ్యులైన మాజీ సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని తుళ్లూరు సీఐ ఆనందరావుకు పలు గ్రామాల ప్రజలు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, హరిశ్చంద్రపురం, లింగాయపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమ గ్రామాలలో చంద్రబాబు, లోకేశ్ కనుసన్నల్లో అక్రమంగా ఇసుక వ్యాపారం కొనసాగిందన్నారు. నదీ తీరంలోని అన్ని గ్రామాల్లో భారీగా ఇసుక అమ్మకాలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సోదరుడు సురేంద్రకు ఇసుక అక్రమ రవాణా బాధ్యతలు అప్పజెప్పి కమీషన్ల రూపంలో చంద్రబాబు, లోకేశ్ రూ.కోట్లు దండుకున్నారని వివరించారు. బాబు ఆగడాలను గమనించిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కూడా గత ప్రభుత్వంపై దాదాపు రూ.100 కోట్లు జరిమానా విధించిందని ఫిర్యాదులో వివరించారు. అక్రమ ఇసుక సంపాదన కోసం తవ్విన గుంతలలో పలువురు ప్రాణాలు కోల్పోయారని, ఇందుకు కారణమైన చంద్రబాబు, లోకేశ్, వారినుంచి ముడుపులు అందుకున్న పవన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.



స్వాతి

చిన్నారులకు ఆత్మీయ నేస్తం

చంటి పిల్లల నుంచి పదేళ్ల లోపు చిన్నారుల మానసిక వికాసానికి దోహదపడే బొమ్మలను, స్టోరీ బుక్స్‌ను రూపొందిస్తూ వాటి ద్వారా ఉపాధి పొందుతున్నారు హైదరాబాద్ నార్సింగ్‌లో ఉంటున్న స్వాతి.



పిల్లల కోసం పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తుల తయారీలో గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. న్యూ ఏజ్ పేరెంట్స్‌ను ఆకట్టుకునేలా చేస్తున్న ఈ ప్రయత్నానికి మంచి స్పందన వస్తోందని, పిల్లలకు ఈ బొమ్మలు ఆత్మీయ నేస్తాలు అవుతున్నాయని ఆనందంగా వివరిస్తోంది స్వాతి.

''పిల్లల మనసులు తెల్లని కాగితాల్లాంటివి. వాటిపై మనం ఏది రాస్తే అదే వారి భవిష్యత్తు. పదేళ్లుగా వందలాది మంది చంటి పిల్లలతో ఆడి పాడి, వారికి నచ్చినట్టు చెప్పే పద్ధతులను నేనూ నేర్చుకుంటూ వచ్చాను. డిగ్రీ చేసిన నాకు స్వతహాగా పిల్లలతో గడపడంలో ఉండే ఇష్టం నన్ను టీచింగ్ వైపు ప్రయాణించేలా చేస్తోంది. ప్లే స్కూల్ పిల్లలతో ఆడుకోవడం, వారితో రకరకాల యాక్టివిటీస్ చేయించడం ఎప్పుడూ సరదాయే నాకు. నాకు ఒక బాబు. వాడి వల్లనే ఈ ఇష్టం మరింత ఎక్కువైందనుకుంటాను. బాబుతో పాటు నేనూ ఓ స్కూల్లో జాయిన్ అయి, నా ఆసక్తులను పెంచుకున్నాను.



ఆలోచనకు మార్గం

పదేళ్లుగా చంటి పిల్లల నుంచి పదేళ్ల వయసు చిన్నారుల వరకు వారి ఆటపాటల్లో నేనూ నిమగ్నమై ఉన్నాను కనుక వారి ముందుకు ఎలాంటి వస్తువులు వచ్చి చేరుతున్నాయనే విషయాన్ని గమనిస్తూ వచ్చాను. కానీ, నేను అనుకున్న విధంగా అన్నింటినీ ఒక దగ్గరకు చేర్చడం ఎలాగో తెలియలేదు. కరోనా సమయంలో వచ్చిన ఆలోచన నాకు నేనుగా నిలబడేలా చేసింది. ఒక ప్రాజెక్ట్ వర్క్‌లాగా పిల్లల మానసిక వికాసానికి ఏమేం వస్తువులు అవసరం అవుతాయో అన్నీ రాసుకున్నాను. నేను ఏయే పద్ధతుల్లో పిల్లలకు నేర్పిస్తున్నానో, దాన్నే నాకు నేనే ప్రాజెక్ట్ వర్క్‌గా చేసుకున్నాను. ఏ వస్తువులు ఏ ప్రాంతానికి ప్రత్యేకమైనవి, నాకు నచ్చినట్టుగా ఏయే వస్తువులను తయారు చేయించాలి అనేది డిజైన్ చేసుకున్నాను కాబట్టి అనుకున్న విధంగా పనులు మొదలుపెట్టాను. కిండోరా టాయ్స్ పేరుతో రెండేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను.

అన్నింటా ఎకో స్టైల్

పిల్లలకు దంతాలు వచ్చే దశలో గట్టి వస్తువులను నోటిలో పెట్టేసుకుంటారు. వాటిలో ప్లాస్టిక్‌వీ వచ్చి చేరుతుంటాయి. అందుకని సాఫ్ట్ ఉడ్‌తో బొమ్మలను తయారు చేయించాను. వీటికోసం మన తెలుగు రాష్ట్రాల్లోని కొండపల్లి, నిర్మల్ నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల్లోని టాయ్ మేకింగ్ వారిని కలిసి నాకు కావల్సిన విధంగా తయారు చేయించాను. ఇంద్రధనుస్సు రంగులను పరిచయం చేయడానికి సాఫ్ట్ ఉడ్ మెటీరియల్, కలర్, బిల్డింగ్ బాక్స్‌లే కాదు... ఐదేళ్ల నుంచి చిన్న చిన్న అల్లికలు, కుట్టు పని నేర్చుకోవడానికి కావల్సిన మెటీరియల్, క్రోచెట్ అల్లికలు వంటివి కూడా ఉండేలా శ్రద్ధ తీసుకున్నాను.

సాఫ్ట్ టాయ్స్‌తో పాఠం

మన దేశ సంస్కృతిని పిల్లలకు తెలియజేయాలంటే మన కట్టూ బొట్టునూ పరిచయం చేయాలి. అందుకు ప్రతి రాష్ట్రం ప్రత్యేకత ఏమిటో డెకొరేటివ్ బొమ్మల ద్వారా చూపవచ్చు. ఇవి కూడా ఆర్గానిక్ మెటీరియల్స్‌తో తయారు చేసినవే. డెకరేటివ్ సాఫ్ట్ టాయ్స్ స్వయంగా నేను చేసినవే. ఆర్గానిక్ కాటన్ మెటీరియల్‌తో చేయించిన సాఫ్ట్ టాయ్స్‌లో జంతువులు, పండ్లు, పువ్వుల బొమ్మలు కూడా ఉంటాయి. వీటివల్ల చిన్న పిల్లలకు ఎలాంటి హానీ కలగదు. రంగు రంగులుగా కనిపించే ఈ బొమ్మల ద్వారా చెప్పే పాఠాలను పిల్లలు ఆసక్తిగా వింటారు. వీటితో పాటు పిల్లలను అలరించే పుస్తకాలు కూడా అందుబాటులో ఉండేలా చూసుకున్నాను. ఒక విధంగా చెప్పాలంటే ఈ కాలపు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎలాంటి మానసిక వికాసపు బొమ్మలు కావాలనుకుంటారో అవన్నీ నా దగ్గర ఉండేలా ప్లాన్ చేసుకున్నాను.

నా ఆసక్తే పెట్టుబడి..

ఉద్యోగం చేయగా వచ్చిన డబ్బుల నుంచి చేసుకున్న పొదుపు మొత్తాలను ఇందుకోసం ఉపయోగించాను. ముందు చిన్నగా స్టార్ట్ చేశాను. ఇప్పుడు ఆన్‌లైన్ వేదికగా మంచి ఆర్డర్స్ వస్తున్నాయి. నాతో పాటు ఈ పనిలో గ్రామీణ మహిళలు భాగస్వామ్యం కావడం మరింత ఆనందాన్ని ఇస్తోంది. ప్లే స్కూళ్లు, ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా వచ్చే ఆర్డర్లను బట్టి సాఫ్ట్ టాయ్స్ తయారీలో కనీసం పాతికమంది మహిళలు పాల్గొంటున్నారు. ముందుగా వర్క్ షాప్ నిర్వహించి, టాయ్స్ మేకింగ్ నేర్పించి వర్క్ చేయిస్తుంటాను. పూర్తి ఎకో థీమ్ బేస్డ్ కావడంతో ఈ కాలం అమ్మలు ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు. నేననుకున్న థీమ్ ఎంతో కొంతమందికి రీచ్ అవడం నాకు చాలా ఆనందంగా ఉంది'' అని వివరించింది స్వాతి.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: మోహనాచారి



● పూర్వ గోయెల్

నవయువ చిత్రశాల

పర్యావరణ గొంతుక

యూత్ పల్స్

'కళ కళ కోసమే కాదు... పర్యావరణ సంరక్షణ కోసం కూడా' అంటోంది యువతరం. సంక్లిష్టమైన పర్యావరణ అంశాలను సులభంగా అర్థం చేయించడానికి, పర్యావరణ స్పృహను రేకెత్తించడానికి గ్రాఫిటీ వర్క్, ఇల్లస్ట్రేషన్, ఇమోజీ, కార్టూన్‌లను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటుంది.

ఆర్ట్, హ్యూమర్‌లను కలిపి తన ఇలస్ట్రేషన్‌లతో పర్యావరణ సంరక్షణకు సంబంధించిన అంశాలను ప్రచారం చేస్తున్నాడు రోహన్ చక్రవర్తి. కామిక్స్, కార్టూన్‌లు, ఇలస్ట్రేషన్ సిరీస్‌లతో 'గ్రీన్ హ్యూమర్' సృష్టించాడు. రెండు జాతీయ పత్రికల్లో వచ్చిన ఈ సిరీస్‌ను పుస్తకంగా ప్రచురించాడు. తన కృషికి ఎన్నో అవార్డులు వచ్చాయి.

ఎన్నో స్వచ్ఛంద సంస్థలు రోహన్ చక్రవర్తి కార్టూన్‌లను పర్యావరణ పరిరక్షణ ప్రచారానికి వినియోగించుకుంటున్నాయి.

మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన రోహన్ పదహారు సంవత్సరాల వయసు నుంచే కార్టూన్‌లు వేయడం మొదలుపెట్టాడు.

'పర్యావరణ సంక్షోభ తీవ్రతను కామిక్స్‌తో బలంగా చెప్పవచ్చు. శాస్త్రీయ విషయాలపై ఆసక్తి ఉన్న వారినే కాదు, వాటిపై అవగాహన లేని వారిని కూడా ఆకట్టుకొని మనం చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా సులభంగా చెప్పవచ్చు' అంటున్నాడు రోహన్ చక్రవర్తి.



● అశ్విని మేనన్

కార్టూనిస్ట్, గ్రాఫిక్ స్టోరీ టెల్లర్ పూర్వ గోయెల్ తన కళను పర్యావరణ సంబంధిత అంశాల ప్రచారానికి ఉద్యమస్థాయిలో ఉపయోగిస్తోంది. పర్యావరణ నిపుణులు, పరిశోధకులు, పర్యావరణ ఉద్యమ సంస్థలతో కలిసి పనిచేస్తోంది. 'అన్ని వయసుల వారిని ఆకట్టుకొని, అర్థం చేయించే శక్తి కార్టూన్‌లకు ఉంది' అంటోంది 26 సంవత్సరాల పూర్వ గోయెల్.



● అక్షయ

పశ్చిమ కనుమల జీవవైవిధ్యానికి వాటిల్లుతున్న ముప్పు నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని దిబంగ్ లోయలోని మిష్మి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల వరకు పూర్వ గోయెల్ తన కళ ద్వారా ఆవిష్కరించింది. అభివృద్ధిగా కనిపించే దానిలోని అసమానతను ఎత్తి చూపింది.

డెహ్రాడూన్‌కు చెందిన పూర్వ గోయెల్ నదులు, అడవులు ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యను దగ్గరి నుంచి చూసింది. బెల్జియంలో గ్రాఫిక్ స్టోరీ టెల్లింగ్‌లో మాస్టర్స్ చేసింది. ఐక్యరాజ్య సమితి జీవవైవిధ్యం అంశంపై కెనడాలో నిర్వహించిన సదస్సుకు హాజరైంది.

'ఆ సదస్సులో వక్తలు పర్యావరణ విధానాల గురించి సంక్లిష్టంగా మాట్లాడారు. సామాన్యులు ఆ ప్రసంగ సారాన్ని అర్థం చేసుకోవడం కష్టం. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ అర్థమయ్యేలా పర్యావరణ విషయాలను చెప్పాలనుకున్నాను. దీనికి నా కుంచె ఎంతో ఉపయోగపడింది. నన్ను నేను కమ్యూనికేటర్‌గా భావించుకుంటాను' అంటుంది పూర్వ గోయెల్.

ఒక స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన నివేదిక ఆధారంగా కామిక్ బుక్ తయారుచేసింది గోయెల్. ఈ కామిక్ బుక్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది.

'మేము ఎన్నో రిపోర్ట్‌లు విడుదల చేశాం. కాని ఒక్క రిపోర్ట్ చదవడానికి కూడా మా ఎకౌంటెంట్ ఆసక్తి చూపించలేదు. కామిక్స్ రూపంలో ఉన్న రిపోర్ట్ ఆమెకు బాగా నచ్చింది. కామిక్స్ ద్వారా తెలుసుకున్న విషయాలను ఇతరులకు చెప్పడం మొదలు పెట్టింది' అని ఆ సంస్థ ప్రతినిధులు చెప్పినప్పుడు ఉత్సాహం రూపంలో గోయెల్‌కు ఎంతో శక్తి వచ్చి చేరింది.

'గ్రాఫిక్ డిజైన్‌లో భాగంగా బ్రాండ్ డిజైన్ నుంచి పబ్లికేషన్ డిజైన్ వరకు ఎన్నో చేయవచ్చు. కాని నాకు కామిక్ స్ట్రిప్స్ అంటేనే ఇష్టం. ఎందుకంటే పెద్ద సబ్జెక్ట్‌ను సంక్షిప్తంగానే కాదు అర్థమయ్యేలా చెప్పవచ్చు. ఒకటి లేదా రెండు వాక్యాలు, ఇమేజ్‌లతో పెద్ద స్టోరీని కూడా చెప్పవచ్చు' అంటున్న అశ్విని మేనన్ గ్రాఫిక్ డిజైన్‌ను పర్యావరణ అంశాల ప్రచారానికి బలమైన మాధ్యమంగా చేసుకుంది.

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)లో చదువుకున్న అశ్విని కళకు సామాజిక ప్రభావం కలిగించే శక్తి ఉందని గ్రహించింది. తన కళను సమాజ హితానికి ఉపయోగించాలనుకుంది.

రిచీ లైనల్ ప్రారంభించిన డాటా స్టోరీ టెల్లింగ్ సంస్థ 'బెజలెల్ డాటా' అసాధారణ ఉష్ణోగ్రతలకు సంబంధించిన సంక్లిష్టమైన సమాచారం అందరికీ సులభంగా, వేగంగా అర్థమయ్యేలా యానిమేటెట్ ఇమోజీలను క్రియేట్ చేస్తోంది.

'సంప్రదాయ రిపోర్ట్ స్ట్రక్చర్స్ ప్రకారం వెళితే అందరికీ చేరువ కాకపోవచ్చు. రిపోర్ట్ సారాంశాన్ని సులభంగా అర్థం చేసుకునేలా డాటా కామిక్స్ ఉపయోగపడతాయి. పెద్ద వ్యాసం చదువుతున్నట్లుగా కాకుండా ఇతరులతో సంభాషించినట్లు ఉంటుంది' అంటున్న రిచీ లైనల్ ఎన్నో స్టోరీ టెల్లింగ్ వర్క్‌షాప్‌లు నిర్వహించాడు. క్లైమెట్ డాటాపై అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీతో కలిసి పని చేశాడు.

సంక్లిష్టమైన విషయాలను సంక్షిప్తంగా, సులభంగా అర్థమయ్యేలా చేయడానికి రిచీ లైనల్ అనుసరిస్తున్న మార్గంపై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది.

మెరైన్ బ్లాగిస్ట్, నేచర్ ఫొటోగ్రాఫర్ గౌరవ్ పాటిల్ రాతలతోనే కాదు ఇలస్ట్రేషన్స్, ఫొటోలతో పర్యావరణ సంబంధిత అంశాలను ప్రచారం చేస్తున్నాడు. సముద్ర కాలుష్యం నుంచి కాంక్రీట్ జంగిల్స్ వరకు ఎన్నో అంశాల గురించి తన ఇల్లస్ట్రేషన్‌ల ద్వారా చెబుతున్నాడు.

బెంగళూరుకు చెందిన అక్షయ జకారియ వైల్డ్‌లైఫ్ డాక్యుమెంటరీలు చూస్తూ పెరిగింది. పర్యావరణంపై ఆసక్తి పెంచుకోవడానికి అది కారణం అయింది. పర్యావరణ సంరక్షణపై అవగాహనకు ఇలస్ట్రేషన్, డిజైన్‌లను ఉపయోగిస్తోంది.

రోహన్ చక్రవర్తి నుంచి అక్షయ వరకు పర్యావరణ అంశాలపై ఆసక్తి పెంచుకోవడానికి రకరకాల కారణాలు ఉండొచ్చు. అయితే అందరినీ ప్రకృతి ప్రపంచంలోకి తీసుకువచ్చింది అనురక్తి మాత్రమే కాదు అంతకంటే ఎక్కువైన అంకితభావం కూడా.



పార్క్... పుస్తకమూ... మనమూ...

ట్రెండ్

పెద్దగా మాటలుండవు.
ఒక పదీ పదిహేనుమందివచ్చి
పార్కులో కలుస్తారు.
అందరి చేతుల్లో వారికి నచ్చిన పుస్తకాలు ఉంటాయి.
తలా ఒకచోట కూచుని
పుస్తకాన్ని నిశ్శబ్దంగా చదువుకుంటారు.
వీడ్కోలుకు ముందు కాసిన్ని కబుర్లు... ఒక చాయ్...
ఒకరి పుస్తకం మరొకరికి అరువు...
ఒక ఆరోగ్యకరమైన వ్యాపకం
ఆరోగ్యకరమైన బృందం...
సెల్‌ఫోన్‌ల కాలుష్యంలో
ముంబైలో తాజా ట్రెండ్ 'సైలెంట్ రీడింగ్'.

శనివారం సాయంత్రం 5 గంటలు. ముంబైలోని జుహూలో కైఫీ ఆజ్మీ పార్క్. మెల్లమెల్లగా కొంత మంది నడుచుకుంటూ వచ్చి ఒకచోట జమయ్యారు. వారి చేతుల్లో పుస్తకాలు, చాపలు, దుప్పట్లు, చిరుతిండ్లు ఉన్నాయి. ఒక్కొక్కరు వారికి నచ్చినచోట దుప్పటి పరిచి పుస్తకం తెరిచి కూచున్నారు. దూరం నుంచి చూస్తే ఒక పదిహేను ఇరవై మంది శిలల్లా కూచుని చేతుల్లో పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. మంచి ప్రకృతిలో, మంచి సమయంలో, నచ్చిన పుస్తకాన్ని, తమలా పుస్తకాలను ఇష్టపడేవారి సమక్షంలో చదువుకోవడం ఎంత బాగుంటుంది? పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడు. పుస్తకాలను చదివే వారితో స్నేహానికి మించింది లేదు. అందుకే ఇప్పుడు ముంబైలో 'సైలెంట్ రీడింగ్' అనేది ఒక ట్రెండ్‌గా మారింది. కొత్త స్నేహితులను పరిచయం చేస్తోంది.



సైలెంట్ రీడింగ్ ఎందుకు?

పుస్తకాభిమానులు బుక్ రిలీజ్ ఫంక్షన్లకు వెళ్లినా, ఆథర్ టాక్‌కు వెళ్లినా ఏదో రణగొణధ్వని. పుస్తకం గురించి తక్కువ... మెరమెచ్చులు ఎక్కువ. అంతేకాదు, కొంతమంది పుస్తకాన్ని తప్ప దానిని రాసినవారిని కలవాలనుకోరు. మరికొంతమంది ఇంట్రావర్ట్‌లు తాము నిశ్శబ్ద స్నేహితులుగా ఉండాలనుకుంటారు. ఇలాంటి వారంతా ఏ గోలా లేని 'సైలెంట్ రీడింగ్'ని ఇష్టపడుతున్నారు. ఈ సైలెంట్ రీడింగ్ గ్రూపుల్లో వాగుడుకాయలకు ప్రవేశం లేదు. హాయిగా నిశ్శబ్దంగా చదువుకోవడమే. మంచి పుస్తకాన్ని ఒకరితో మరొకరు పంచుకోవడమే.

బెంగళూరులో మొదలు

బెంగళూరులోని కబ్బన్ పార్క్‌లో శ్రుతి షా, హర్ష్ స్నేహాన్షు ఇద్దరు పుస్తక ప్రేమికులు 'కబ్బన్ రీడ్స్' పేరుతో 'సైలెంట్ రీడింగ్'ని 2022 డిసెంబర్‌లో మొదలెట్టారు. కబ్బన్ పార్క్‌లో పుస్తక ప్రేమికులు విశేషంగా వచ్చి వారానికి ఒకసారి పుస్తకాలు చదువుకుని వెళ్లడం అందరినీ ఆకర్షించింది. దాని ప్రభావంతో ముంబైలోని జుహూలో దియా సేన్ గుప్తా, రచనా మల్హోత్రా అనే ఇద్దరు స్నేహితురాళ్లు 'జుహూ రీడ్స్' పేరుతో ఈ సంవత్సరం మేలో 'సైలెంట్ రీడింగ్'ను మొదలెట్టారు. వెంటనే జుహూలోని పుస్తక ప్రేమికులను ఇది ఆకర్షించింది. అన్ని వయసుల వాళ్లు ఇక్కడికి వచ్చి కూచుని ప్రశాంతంగా పుస్తకాలు చదవసాగారు. అంతేనా? వీల్‌చైర్‌లో ఉండేవారు కూడా వచ్చి పుస్తకంలో, పుస్తకాన్ని ఇష్టపడే వారి సమక్షంలో ఓదార్పు పొందసాగారు. 'సెల్‌ఫోన్లు వచ్చాక పుస్తకం చదివే అలవాటు తగ్గింది. మనుషులు సెల్ చూసుకుంటూ కనిపించడమే అందరికీ తెలుసు. కాని ఒకప్పుడు పుస్తకం చదువుతూ కనిపించేవారు. సైలెంట్ రీడింగ్ వల్ల పుస్తకం చదువుకుంటూ కనిపించేవారు అందరినీ ఆకర్షిస్తున్నారు. దానివల్ల పుస్తకాలు చదవాలన్న అభిలాష పెరుగుతోంది. మేము ఆశిస్తున్నది అదే' అని జుహూ రీడ్స్ నిర్వాహకులు అన్నారు.



దేశ, విదేశాల్లో...

బెంగళూరు కబ్బన్ పార్క్‌తో మొదలైన సైలెంట్ రీడింగ్ ఉద్యమం ఇప్పుడు ముంబైలో బాంద్రా, దాదర్, కొలాబా లాంటి ఐదారు చోట్లకు విస్తరించింది. ఇక మన దేశంలోని ఢిల్లీ, పూణె, చెన్నై, కొచ్చి, హైదరాబాద్‌లకు కూడా వ్యాపించింది. సోషల్ మీడియా ద్వారా కబ్బన్ రీడ్స్ గురించి తెలుసుకున్నవారు న్యూయార్క్, లండన్, దుబాయ్, మెల్‌బోర్న్‌లలో కూడా సైలెంట్ రీడింగ్ సమూహాలను తయారు చేస్తున్నారు. 'ఈ రీడింగ్స్‌కు వచ్చినవారు మంచి స్నేహితులుగా మారుతున్నారు. బిజీ లైఫ్‌లో మనిషి ఒంటరితనాన్ని ఫీలవుతున్నాడు. ఆ ఒంటరితనం పోగొట్టేందుకు సైలెంట్ రీడింగ్ గ్రూపులు సాయం చేస్తున్నాయి' అని నిర్వాహకులు అభిప్రాయ పడుతున్నారు.

వాట్సాప్ యూనివర్సిటీ నుంచి

వాట్సాప్ యూనివర్సిటీలో వచ్చే నానా చెత్త ప్రభావంలో పడి అనవసర భావోద్వేగాలకు లోను కావడం కన్నా వికాసం, జ్ఞానం, జీవితానుభవం, ఆహ్లాదం పంచే పుస్తకాన్ని అక్కున చేర్చుకోవడం నేటి తక్షణావసరం. పుస్తకాలు చదివే వారితోనే నాగరిక సమాజం ఏర్పడుతుంది. ఆ విధంగా సైలెంట్ రీడింగ్ గ్రూపులు సమాజాన్ని మరింత అర్థవంతం చేస్తున్నాయి. ఇలాంటి ఉద్యమాల్ని పుస్తకాభిమానులు ఎక్కడికక్కడ అందుకోవాల్సిన అవసరం ప్రతి ఊళ్లో, పట్టణంలో ఉంది.

కిచెన్‌టిప్స్

● పాలకూరలో టీస్పూను పంచదార, కాసిన్ని నీళ్లుపోసి పది నిమిషాలపాటు మరిగించి, తరువాత చల్లటి నీటిలో వేయాలి. చల్లారాక గ్రైండ్ చేసి గ్రేవీల్లోకి వాడుకుంటే పాలకూరలోని పోషకాలు బయటకు పోకుండా ఉంటాయి.



● కూరల్లో గ్రేవీ కోసం కొన్నిసార్లు నీళ్లు పోస్తుంటాము. అయితే ఇలా పోసే నీళ్లను కాస్త మరిగించి పోస్తే కూర వేడికి వేడినీళ్లు చక్కగా సరిపోయి గ్రేవీ మరింత రుచికరంగా వస్తుంది. చల్లటి నీళ్లపోస్తే ఆ నీరు కూర ఉష్ణోగ్రతలకు చేరుకోవడానికి సమయం పట్టి గ్రేవీ అంత రుచిగా రాదు.





● ఆలు పరాటా చేసేటప్పుడు .. ఉడికించిన బంగాళదుంపలను ఇరవై నిమిషాలపాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచి చల్లారనివ్వాలి. పూర్తిగా చల్లారాక దుంపల తొక్కతీసి ఆలు పరోటా చేస్తే దుంపల మిశ్రమం అతుక్కోకుండా, జిగట లేకుండా పరాటాలు చక్కగా వస్తాయి.

● కూరలో కారం, మసాలా ఘాటు ఎక్కువైనప్పుడు, పెరుగు, ఫ్రెష్‌క్రీమ్, పాలు... వీటిలో ఏ ఒక్కటైనా కూరను బట్టి రెండు మూడు టేబుల్ స్పూన్లు వేసి కలిపితే ఘాటు తగ్గుతుంది.

బ్యూటిప్స్

ఈ ప్యాక్ వేసుకోండి... అందంగా మెరిసిపోండి

● అరకప్పు కీరదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి చేసి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేయండి. కీరాదోస పిగ్మెంటేషన్ సమస్యను దూరం చేస్తుంది. దీనితో పాటు ముడతలు, సన్నని గీతలు వంటి సమస్యలు దూరం అవుతాయి

● ఒక పాత్రలో బార్లీ గింజల పొడిని తీసుకుని అందులో కొద్దికొద్దిగా గోరువెచ్చటి నీళ్ల పోసుకుంటూ ముద్దలా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ను చక్కగా కలిపి ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయండి. దీన్ని 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా తరచు చేస్తుండడం వల్ల. మచ్చలు, మృత కణాలు తొలగిపోయి చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది

● పాలల్లో కొద్దిగా ఓట్స్ వేసి ఉడికించాలి. తర్వాత ఇందులో కాస్త పెరుగు, తేనె వేసి బాగా కలపాలి. ఇది కాస్త చల్లబడిన తర్వాత బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట అప్లై చేసుకుని 20 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. బాగా తర్వాత తేలికపాటి క్లెన్సర్‌ను ఉపయోగించి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉండే బ్లాక్‌హెడ్స్ సులభంగా తొలగిపోతాయి.





కెరీర్ బెస్ట్ ఆరో ర్యాంక్‌లో ప్రణయ్

భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌కు ఎగబాకాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అతను పురుషుల సింగిల్స్‌లో మూడు స్థానాలు పురోగతి సాధించి తొమ్మిది నుంచి ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. గతవారం డెన్మార్క్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రణయ్ కాంస్య పతకాన్ని సాధించడం అతని ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. గత డిసెంబర్ నుంచి టాప్-10లో స్థిరంగా కొనసాగుతున్న ఏకైన భారత షట్లర్ ప్రణయే కావడం విశేషం.

యూఎస్ ఓపెన్ డబుల్స్ బరిలో సాకేత్



ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ స్టార్ సాకేత్ మైనేని ఈ ఏడాది నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ పోటీపడనున్నాడు. భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీతో కలిసి 77వ ర్యాంకర్ సాకేత్ ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలలో బరిలోకి దిగాడు. యూఎస్ ఓపెన్‌లో మాత్రం యూకీతో కాకుండా కరత్‌సెవ్ (రష్యా)తో సాకేత్ జత కట్టాడు. బ్రెజిల్ ప్లేయర్ డెమోలైనర్‌తో కలిసి యూకీ ఆడనున్నాడు. 35 ఏళ్ల సాకేత్ 2016 యూఎస్ ఓపెన్ సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో ఆడి తొలి రౌండ్‌లో నిష్క్రమించాడు.

'ఆసియా' సమరానికి సై

- బరిలో ఆరు జట్లు
- నేటినుంచి ఆసియా కప్ వన్డే టోర్నీ
- తొలి పోరులో నేపాల్‌తో పాక్ 'ఢీ'
- భారత్, పాక్ 3 సార్లు తలపడే అవకాశం!
- మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం గం. 3.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



ముల్తాన్: ప్రపంచ కప్ పోరుకు ముందు మరో ప్రధాన టోర్నీకి రంగం సిద్ధమైంది. నేటినుంచి జరిగే ప్రతిష్టాత్మక ఆసియా కప్ సమరంలో ఆరు జట్లు తమ సత్తాను పరీక్షించుకోనున్నాయి. భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లకు వరల్డ్ కప్‌కు ముందు ఇది ట్రయల్‌గా ఉపయోగపడనుండగా... వరల్డ్ కప్ బరిలో లేని నేపాల్ ఆరో టీమ్‌గా తన ఉనికిని ప్రదర్శించే ప్రయత్నం చేయనుంది. అన్నీ జట్లూ సహజంగానే టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగుతుండగా... ఈ టోర్నీలో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగే సమరాలు అభిమానుల్లో ఆసక్తిని రేపుతున్నాయి. కనీసం రెండు సార్లు ఇరు జట్లు తలపడే అవకాశం ఉండగా, ఫైనల్ చేరితే మరోసారి దాయాదుల మధ్య పోరును చూడవచ్చు. నేడు సొంతగడ్డపై జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో బాబర్ ఆజమ్ నాయకత్వంలోని పాకిస్తాన్ జట్టు రోహిత్ కుమార్ సారథ్యంలోని నేపాల్‌తో తలపడుతుంది. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 17న కొలంబోలో జరుగుతుంది. ఆరు జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచే రెండేసి జట్లు ముందంజ వేస్తాయి. సూపర్-4 దశలో మిగిలిన మూడు టీమ్‌లను ఎదుర్కొన్న తర్వాత టాప్-2 టీమ్‌లు ఫైనల్లో తలపడతాయి.

ఫేవరెట్‌గా రోహిత్ బృందం...

ఏడాది క్రితం కూడా యూఏఈలో ఆసియా కప్ జరగ్గా అప్పుడు రాబోయే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని టి20 ఫార్మాట్‌లో నిర్వహించారు. ఇప్పుడు వన్డే వరల్డ్ కప్‌కు సరిగ్గా నెల రోజుల ముందు వన్డే ఫార్మాట్‌లో ఈ టోర్నమెంట్ జరగబోతోంది. అన్ని రకాలుగా పటిష్టంగా ఉన్న భారత్ సహజంగానే ఫేవరెట్‌గా కనిపిస్తుండగా... వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ హోదాలో పాకిస్తాన్ బరిలోకి దిగుతోంది. భారత్ తమ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 2న క్యాండీలో పాకిస్తాన్ జట్టుతో ఆడుతుంది. అనంతరం సెప్టెంబర్ 4న నేపాల్‌తో రెండో మ్యాచ్‌లో తలపడుతుంది. భారత జట్టు ఇటీవల ప్రదర్శన, వ్యక్తిగతంగా ఆటగాళ్ల రికార్డులు, టీమ్ కూర్పును బట్టి చూస్తే భారత్ చాలా పటిష్టంగా కనిపిస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా గట్టి పోటీనిచ్చే స్థితిలో ఉండగా, అఫ్గానిస్తాన్ కూడా సంచలనాలు ఆశిస్తోంది. అధికారికంగా ఆసియా కప్ నిర్వహణ హక్కులు పాకిస్తాన్ బోర్డుకే ఉన్నాయి. అయితే పాకిస్తాన్‌కు వెళ్లేందుకు భారత్ అంగీకరించకపోవడంతో హైబ్రీడ్ మోడల్‌లో టోర్నీని నిర్వహిస్తున్నారు. మొత్తం 13 మ్యాచ్‌లలో 4 మాత్రమే పాకిస్తాన్‌లో జరుగుతుండగా, శ్రీలంక 9 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. శ్రీలంకలో జరిగే మ్యాచ్‌లకు వాన కొంత అంతరాయం కలిగించే అవకాశం ఉంది.

చరిత్ర మనదే...

1984 నుంచి 2022 వరకు 15సార్లు ఆసియా కప్‌ను నిర్వహించారు. 2018లో చివరిసారిగా వన్డే ఫార్మాట్‌లో నిర్వహించగా, నాడు ఫైనల్లో బంగ్లాదేశ్‌ను ఓడించి భారత్ విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా భారత్ ఖాతాలో 7 టైటిల్స్ ఉండగా, శ్రీలంక 6 సార్లు ట్రోఫీ గెలుచుకుంది. పాకిస్తాన్ 2 సార్లు విజేతగా నిలిచింది. 2019 వన్డే వరల్డ్ కప్ తర్వాత ఈ ఫార్మాట్‌లో భారత్, పాకిస్తాన్ తలపడటం ఇదే మొదటిసారి కానుంది. గత ఆసియా కప్ (టి20)లో ఇరు జట్ల మధ్య జరిగిన రెండు మ్యాచ్‌లలో చెరో మ్యాచ్ గెలిచి సమంగా నిలవగా... వరల్డ్ కప్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో జరిగిన పోరులో కోహ్లి అద్భుత ఆటతో టీమిండియాను గెలిపించాడు. గత కొన్నేళ్లుగా ఆసియా కప్ సమరాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా అఫ్గానిస్తాన్ టీమ్ పురోగతి కారణంగా ఆ జట్టు శ్రీలంకతో, పాక్‌తో, బంగ్లాతో తలపడినప్పుడు ఉద్రిక్తభరిత వాతావరణం ఉంటోంది. అయితే భారత్ మాత్రం సహజంగానే తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ ఇతర జట్లకంటే ఎప్పుడూ ఒక మెట్టు పైనే ఉంటోంది. టీమిండియా కూడా తమ స్థాయికి తగినట్లుగా ఆడితే మరో టైటిల్ మన ఖాతాలో చేరడం ఖాయం.

జొకోవిచ్ శుభారంభం

- రెండో రౌండ్‌లోకి సెర్బియా స్టార్
- మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ సొంతం
- నాలుగో సీడ్ హోల్గర్ రూనె అవుట్



న్యూయార్క్: కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంతో యూఎస్ ఓపెన్‌లో బరిలోకి దిగిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ అలవోకగా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 6-0, 6-2, 6-3తో అలెగ్జాండర్ ముల్లర్ (ఫ్రాన్స్)పై నెగ్గాడు. ఈ గెలుపుతో 36 ఏళ్ల జొకోవిచ్ యూఎస్ ఓపెన్ ముగిశాక తుది ఫలితంతో సంబంధం లేకుండా మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటాడు. ముల్లర్‌తో గంటా 35 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించాడు. నెట్ వద్దకు 23 సార్లు దూసుకొచ్చి 20 సార్లు పాయింట్లు గెలిచాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయాడు. మరోవైపు నాలుగో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ చేరిన రూనె 3-6, 6-4, 3-6, 2-6తో కార్‌బెలాస్ బేనా (స్పెయిన్) చేతిలో ఓడిపోయాడు. ఏడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), పదో సీడ్ టియాఫో (అమెరికా), తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.

మహిళల సింగిల్స్‌లో ఆరో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) కష్టపడి రెండో రౌండ్‌కు చేరగా... రెండు సార్లు మాజీ రన్నరప్ వొజ్నియాకి (డెన్మార్క్) సులువుగా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. కోకో గాఫ్ 2 గంటల 51 నిమిషాల్లో 3-6, 6-2, 6-4తో సిగెముండ్ (జర్మనీ)పై, వొజ్నియాకి 6-3, 6-2తో ప్రాజోరోవా (రష్యా)పై గెలిచారు.

రెండు మ్యాచ్‌లకు కేఎల్ రాహుల్ దూరం



బెంగళూరు: సుదీర్ఘ కాలం తర్వాత భారత జట్టులోకి పునరాగమనం చేసిన కేఎల్ రాహుల్ బరిలోకి దిగేందుకు మరికొంత సమయం వేచి చూడక తప్పదు. సెలక్టర్లు ఊహించినట్లుగానే స్వల్ప 'అసౌకర్యం'తో బాధపడుతున్న అతను ఆసియా కప్‌లో భారత్ ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత కూడా రాహుల్ పూర్తి ఫిట్‌గా మారలేదు. ఈ విషయాన్ని హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ నిర్ధారించాడు. భారత జట్టుతోపాటు శ్రీలంకకు ప్రయాణించకుండా రాహుల్ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లోనే ఉండిపోనున్నాడు. సెప్టెంబర్ 4న అతని గాయం పరిస్థితిని సమీక్షించి ఆపై నిర్ణయం తీసుకుంటారు. ఐసీసీ నిబంధనల ప్రకారం సెప్టెంబర్ 5 వరకు ప్రపంచ కప్ జట్టును ప్రకటించాల్సి ఉన్న నేపథ్యంలో రాహుల్ కోలుకోగలడా అనేది ఆసక్తికరం.

ప్రజ్ఞానంద జట్టుకు టైటిల్

హరికృష్ణ, హారిక, అర్జున్ జట్లకు కూడా పతకాలు • ప్రపంచ ర్యాపిడ్ టీమ్ చెస్ చాంపియన్‌షిప్



హారిక
హరికృష్ణ
అర్జున్

దసెల్‌డార్ఫ్ (జర్మనీ): గతవారం ప్రపంచకప్ టోర్నమెంట్‌లో రజత పతకం గెలిచి సంచలనం సృష్టించిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మరోసారి ఆకట్టుకున్నాడు. ప్రపంచ ర్యాపిడ్ టీమ్ చెస్ చాంపియన్‌షిప్‌లో ప్రజ్ఞానంద రాణించి తన జట్టు విజేతగా అవతరించడంలో కీలకపాత్ర పోషించాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో స్విస్ ఫార్మాట్‌లో 12 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో జర్మనీ వ్యాపారవేత్త, చెస్ ప్లేయర్ అయిన వాదిమ్ రోసెన్‌స్టీన్ (డబ్ల్యూఆర్) జట్టు 22 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. డబ్ల్యూఆర్ జట్టుకు గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, సో వెస్లీ (అమెరికా), నోదిర్‌బెక్ (ఉజ్బెకిస్తాన్), నిపోమ్‌నిషి (రష్యా), క్రిస్టాఫ్ (పోలాండ్), కీమర్ (జర్మనీ), హు ఇఫాన్ (చైనా), కోస్టెనిక్ (స్విట్జర్లాండ్), వాదిమ్ రోసెన్‌స్టీన్ (జర్మనీ) ప్రాతినిధ్యం వహించారు. ప్రజ్ఞానంద మొత్తం ఏడు గేమ్‌లు ఆడి ఆరు గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా'గా ముగించి 6.5 పాయింట్లు సాధించాడు. భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, విదిత్ సంతోష్ గుజరాతి, డానిల్ దుబోవ్ తదితరులు సభ్యులుగా ఉన్న ఫ్రీడమ్ జట్టు




ప్రజ్ఞానంద

20 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకుంది. పుణేకు చెందిన ఎంజీడీ1 జట్టు 18 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఎంజీడీ1 జట్టు తరఫున భారత గ్రాండ్‌మాస్టర్లు హరికృష్ణ, హారిక, అర్జున్, నిహాల్ సరీన్, రౌనక్, ఆదిత్య మిట్టల్, శ్రీనాథ్ నారాయణన్, గునే మమద్‌జాడా (అజర్‌బైజాన్) పోటీపడ్డారు. వ్యక్తిగత విభాగాల కొస్తే బోర్డు-1పై హరికృష్ణ కాంస్యం, బోర్డు-3పై విదిత్, అర్జున్ రజత, కాంస్య పతకాలను నెగ్గారు. బోర్డు-7పై హారిక రజత పతకం దక్కించుకుంది.

'సోల్డ్ అవుట్'

భారత జట్టు వరల్డ్ కప్ మ్యాచ్‌ల టికెట్లు ఫినిష్



న్యూఢిల్లీ: 'మీరు క్యూలో ఉన్నారు... దయచేసి కాసేపు వేచి ఉండండి'... ఈ కాసేపు కాస్తా గంట నుంచి 10 గంటల వరకు కూడా చూపించింది! చివరకు కొద్ది సేపట్లోనే అది కాస్తా 'సోల్డ్ అవుట్' బోర్డుతో ముగిసింది. వన్డే వరల్డ్ కప్ టికెట్ల కోసం మంగళవారం ఆన్‌లైన్‌లో ప్రయత్నించిన భారత అభిమానుల్లో ఎక్కువ మందికి ఇదే తరహాలో నిరాశ ఎదురైంది. భారత్ ఆడే 9 లీగ్ మ్యాచ్‌లకు సంబంధించి 'మాస్టర్ కార్డ్' వినియోగదారుల కోసమే ప్రత్యేకంగా సాయంత్రం 6 గంటల నుంచి 'బుక్ మై షో'లో టికెట్లు అందుబాటులో ఉంచారు. అయితే గంటల వ్యవధిలోనే అన్ని మ్యాచ్‌ల టికెట్లు అమ్ముడుపోయాయి. ఇప్పుడు 9 మ్యాచ్‌లకు కూడా 'సోల్డ్ అవుట్' అనే చూపిస్తోంది. నిజానికి గత బుధవారం బీసీసీఐ ఇచ్చిన సమాచారం ప్రకారం 31 ఆగస్టు నుంచి 3 సెప్టెంబర్ వరకు భారత లీగ్ మ్యాచ్‌లకు సాధారణ అభిమానుల కోసం దశలవారీగా టికెట్లు అమ్ముతారు. అయితే ఇప్పుడు 'సోల్డ్ అవుట్' అంటే పూర్తిగా అమ్ముడుపోయాయా లేక పరిమిత సంఖ్యలో 'మాస్టర్ కార్డ్' కోసం అందుబాటులో ఉంచి మిగతా టికెట్లు ఆపి ఉంచారా తెలీదు. అసలు టికెట్ల సంఖ్య విషయంలో ఎలాంటి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఫ్యాన్స్ ఆయా తేదీల్లో మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిందే!

సినిమా



• మిర్నా మీనన్
• అనుపమా పరమేశ్వరన్

రాకేష్ మరిన్ని సినిమాలు చేయాలి

- మంత్రి రోజా సెల్వమణి



• రోజా, రాకేష్, సంతోష్‌కుమార్, తనికెళ్ల భరణి

'జబర్దస్త్' ఫేమ్ రాకింగ్ రాకేష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం ప్రారంభోత్సవం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి రోజా సెల్వమణి కెమెరా స్విచ్చాన్ చేయగా, తెలంగాణ ఎంపీ (రాజ్యసభ) సంతోష్ కుమార్ క్లాప్ ఇచ్చారు. నటుడు తనికెళ్ల భరణి గౌరవ దర్శకత్వం వహించగా, నటుడు సాయికుమార్ మేకర్స్‌కి స్క్రిప్ట్ అందజేశారు. గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ పతాకంపై జయలక్ష్మీ సాయి కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ అంజి దర్శకత్వం వహిస్తుండగా, అనన్యా నాగళ్ల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో రోజా మాట్లాడుతూ– ''రాకేష్‌కి ఎప్పట్నుంచో లీడ్ రోల్ చేయాలని ఉంది. ఈ సినిమాతో అది నెరవేరడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా విజయం సాధించి, భవిష్యత్‌లో రాకేష్ మరిన్ని సినిమాలు చేసి, ప్రజలకు వినో దాన్ని పంచాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''నటుడిగా, నిర్మాతగా రాకేష్ మరెన్నో సినిమాలు చేసి, మంచి పేరు తెచ్చుకోవాలి'' అన్నారు ఎంపీ సంతోష్ కుమార్. ''చిన్న సినిమాలు పెద్దగా అవుతున్నాయి. ఈ సినిమా కూడా పెద్ద విజయం సాధించి, రాకేష్ మరో పది సినిమాలు చేసే స్థాయికి రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు తనికెళ్ల భరణి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఫౌండర్ రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: చరణ్ అర్జున్.

ఈసారి పండక్కి.. నా సామి రంగ



• నాగార్జున

సంక్రాంతికి 'నా సామి రంగ' అంటున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'నా సామి రంగ' టైటిల్‌ను ఖరారు చేశారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం (ఆగస్ట్ 29) నాగార్జున బర్త్ డే. ఈ సందర్భంగా 'నా సామి రంగ'ను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, ఈ చిత్రాన్ని వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'ఈసారి పండక్కి నా సామి రంగ' అంటూ ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వీడియోలో నాగార్జున పేర్కొన్నారు. ఈ సినిమాతో 'పలాస' ఫేమ్ దర్శకుడు కరుణకుమార్ నటుడిగా పరిచయం అవుతున్నారు. ''సంక్రాంతి సీజన్‌లో నాగార్జునగారికి చాలా హిట్ ఫిల్మ్స్ ఉన్నాయి. వినోదాత్మకంగా సాగే 'నా సామి రంగ' సినిమాను సంక్రాంతికి థియేట్రికల్ రిలీజ్ చేయనున్నాం. బెజవాడ ప్రసన్నకుమార్ ఈ సినిమాకు కథ, డైలాగ్స్ అందిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి.

పవర్‌ఫుల్ రోల్: ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించనున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో నాగార్జున ఓ పవర్‌ఫుల్ రోల్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది.

కలర్‌ఫుల్ ఓనమ్



• ఇన్ని లాగించాలా అంటున్న అనుపమ

పంటలు ఇంటికి వచ్చిన వేళ..
వంటలు ఘుమఘుమలాడిన వేళ..
ఇంట్లో పండగ వేళ... ఇలా ఓనమ్ పండగను ఘనంగా జరుపుకున్నారు కొందరు తారలు. కేరళ ప్రాంతంలో పంటలు వచ్చే ఈ మాసంలో ఓనమ్ పండగ జరుపుకుంటారు. మంగళవారం పండగ సందర్భంగా పలువురు కథానాయికలు అందంగా ముస్తాబై, మెరిసిపోయారు. ఓనమ్ సాద్య పేరుతో దాదాపు 26 రకాల వంటకాలను అరిటాకులో వడ్డించుకుని, ఆరగించారు. పండగ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు.



• అదా శర్మ



• అపర్ణా దాస్
• కల్యాణి
• మాళవికా మోహనన్

ఆ పాయింట్‌తో ఖుషి తీశామనేది అవాస్తవం

- దర్శకుడు శివ నిర్వాణ



"నిన్ను కోరి, మజిలీ' వంటి నా గత చిత్రాల్లో విఫలమైన ప్రేమకథలను చూపించాను. కానీ, ఈసారి పూర్తి స్థాయి వినోదం, ఉత్సాహంగా ఉండే ప్రేమకథ తీయాలని 'ఖుషి' చేశాను" అన్నారు శివ నిర్వాణ. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు శివ నిర్వాణ చెప్పిన విశేషాలు.

• డైరెక్టర్ మణిరత్నంగారి ఫ్యాన్‌గా ఆయన దగ్గర చేరాలనుకుని చెన్నై వెళ్లాను. కానీ ఆయన్ను కలవడానికి కుదరలేదు. మణిరత్నంగారి సినిమాలను ఇష్టపడతాను కానీ ఆయనలా తీయాలనుకోను. ఆయన తీసిన 'సఖి' లాంటి పాయింట్‌తో 'ఖుషి' తీశామనే వార్తలు అవాస్తవం. • ప్రస్తుత సమాజంలోని ఒక సమకాలీన అంశాన్ని విజయ్, సమంతలాంటి స్టార్స్ ద్వారా చూపిస్తే బాగుంటుందని నమ్మాను. ప్రేమకథను ఎంత కొత్తగా చెప్పాలనే ఆలోచన నుంచి పుట్టిందే కాశ్మీర్ నేపథ్యం. ఈ చిత్రంలో విజయ్ పాత్ర అమ్మాయిలకు, కుటుంబ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. సమంత వాస్తవ జీవితానికి, ఈ చిత్రానికి ఎలాంటి సంబంధం లేదు. • నిర్మాతలు నవీన్, రవిశంకర్‌గార్లు డైరెక్టర్స్‌కు స్వేచ్ఛ ఇస్తారు కాబట్టి సంతోషంగా సినిమా చేసుకోవచ్చు. హేషమ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. నేను డైరెక్ట్ చేసిన 'నిన్ను కోరి, మజిలీ, టక్ జగదీశ్' సినిమాల్లో కొన్ని పాటలు రాశాను. కానీ, 'ఖుషి'కి అన్ని పాటలు రాయాల్సి వచ్చింది.. రాశాను. • మనం పాన్ ఇండియా సినిమా చేయాలని ముందే అనుకుని, కథ రాసుకోనవసరం లేదనేది నా అభిప్రాయం. 'బాహుబలి, పుష్ప, ఆర్ఆర్ఆర్, కార్తికేయ 2' వంటి సినిమాలన్నీ మన నేటివిటీకి నచ్చేలా చేసుకున్నవి. ఇతర భాషల వాళ్లు కూడా వాటిని ఇష్టపడ్డారు కాబట్టి పాన్ ఇండియా సినిమాలు అయ్యాయి. మనకు నచ్చే మన నేటివిటీ సినిమా బాగా చేసుకుంటే అది ఇతరులకు నచ్చి పాన్ ఇండియా మూవీ అవుతుందన్నది నా అభిప్రాయం.

ప్రేక్షకులు నవ్వితే వచ్చే తృప్తే వేరు

- సుప్రియ యార్లగడ్డ



• అనురాగ్, నితిన్ కృష్ణమూర్తి, సుప్రియ, శరత్

''థియేటర్‌లో ప్రేక్షకుల నవ్వులు చూస్తున్నపుడు వచ్చే తృప్తే వేరు. అలాంటి గొప్ప తృప్తి, మజాని ఇచ్చిన చిత్రం 'బాయ్స్ హాస్టల్'' అని నిర్మాత సుప్రియ యార్లగడ్డ అన్నారు. ప్రజ్వల్ బీపీ, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స, తేజస్ జయన్న ఉర్స్ ప్రధాన పాత్రల్లో, రిషబ్ శెట్టి, పవన్ కుమార్, షైన్ శెట్టి, రష్మీ గౌతమ్, తరుణ్ భాస్కర్ అతిథి పాత్రల్లో నటించిన చిత్రం 'బాయ్స్ హాస్టల్'. నితిన్ కృష్ణమూర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిలింస్ ఈ నెల 26న తెలుగులో రిలీజ్ చేశాయి. ఈ సందర్భంగా సక్సెస్ మీట్‌లో నిర్మాత అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ– ''బాయ్స్ హాస్టల్' చూస్తే కొత్త అనుభూతిని పొందుతారు'' అన్నారు ''విద్యార్థుల కోసం టికెట్ వన్ ప్లస్ వన్ ఆఫర్ పెట్టాం'' అన్నారు నిర్మాత శరత్. ''మా చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు నితిన్ కృష్ణమూర్తి.

నరకాసురుడి యాక్షన్



• రక్షిత్

రక్షిత్ అట్లూరి, అపర్ణ జనార్ధన్, సంకీర్తన విపిన్, శత్రు కీలక పాత్రల్లో సెబాస్టియన్ దర్శకత్వం వహించిన చిత్రం 'నరకాసుర'. ఆజ్జా శ్రీనివాస్, కారుమూరు రఘు నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ రెండో వారంలో రిలీజ్ కానుంది. ''నరకాసుర' అనే రాక్షసుడి జననం నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం'' అన్నారు సెబాస్టియన్. ''మా సినిమా టీజర్ బాగుందని చాలామంది ప్రశంసించారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు నిర్మాతలు.

సాక్షి బిజినెస్
బుధవారం
30-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
79	37
65,076	19,343

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	13,923	▲	218
డోజోన్స్	34,794	▲	234
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	126
డాక్స్	15,931	▲	138
షాంఘై	3,136	▲	37
నికాయ్	32,227	▲	57

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,869
బంగారం (99.5 స్వచ్ఛత)	58,633
వెండి (కిలో)	73,781

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.80	83.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.44	105.82
€	యూరో	ఎస్‌బీఐ	87.80	90.88
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.54	57.28
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.06	54.35
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.99	61.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.10	22.72
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.602	23.34
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.22	12.29

టయోటా నుంచి తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనం

ఆవిష్కరించిన కేంద్ర మంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ టయోటా తాజాగా ప్రపంచంలోనే తొలి 'బీఎస్ 6 (స్టేజ్ 2) ఎలక్ట్రిఫైడ్ ఫ్లెక్స్ ఫ్యూయల్' ఆధారిత వాహనాన్ని రూపొందించింది. దీని నమూనాను కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ వాహనాన్ని రాబోయే రోజుల్లో మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతారని ఆయన తెలిపారు. ఇటు విద్యుత్, అటు 20 శాతానికి మించి ఇథనాల్ మిశ్రమం ఉన్న ఇంధనంతో కూడా ఇది నడుస్తుంది. కాలుష్యాన్ని తగ్గించడంలోనూ, వ్యవసాయ రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ తోడ్పడే టెక్నాలజీని రూపొందించిందని టయోటా కిర్లోస్కర్ సంస్థకు మంత్రి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. వివిధ రకాల ఇంధనాలతో పని చేయగలిగే ఇంజిన్ గల వాహనాన్ని ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనంగా వ్యవహరిస్తారు. ఇన్నోవా హైక్రాస్ మోడల్ ఆధారంగా, కొత్త బీఎస్ 6 ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా టయోటా కిర్లోస్కర్ .. ఈ ఎలక్ట్రిక్ ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాన్ని రూపొందించింది. మరోవైపు, దేశీయంగా ఇథనాల్‌కు డిమాండ్ పెరిగే కొద్దీ రైతులు 'అన్నదాతలు'గా మాత్రమే కాకుండా 'శక్తి దాతలు'గా కూడా మారగలరని గడ్కరీ వ్యాఖ్యానించారు. ఇథనాల్ ఎకానమీ రూ. 2 లక్షల కోట్ల స్థాయికి చేరిన రోజున .. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న వ్యవసాయ రంగం వృద్ధి రేటు 20 శాతానికి చేరగలదని ఆయన పేర్కొన్నారు.

మార్కెట్లోకి మళ్లీ హీరో కరిజ్మా..

ధర రూ. 1.72 లక్షలు



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తాజాగా కరిజ్మా బ్రాండ్‌ను మళ్లీ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. కరిజ్మా ఎక్స్ఎంఆర్ 210 సీసీ బైక్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ. 1.72 లక్షలుగా (ఎక్స్‌షోరూం) ఉంటుంది. ప్రీమియం సెగ్మెంట్‌లో తమ వాటాన్ని పెంచుకునే దిశగా తమకు ఇది మరో మైలురాయి అని హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా తెలిపారు. తాము ప్రస్తుతం ఈ విభాగంలో ఇప్పుడిప్పుడే కార్యకలాపాలు ప్రారంభిస్తున్నామని, మార్కెట్ వాటా 4–5 శాతం మాత్రమే ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రీమియం ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను పూర్తి స్థాయిలో వేగవంతంగా రూపొందించుకోనున్నట్లు గుప్తా చెప్పారు. ప్రస్తుతం 150 సీసీ లోపు సెగ్మెంట్‌లో అగ్రస్థానంలో ఉన్న హీరో మోటోకార్ప్ ఇకపై 150 సీసీ నుంచి 450 సీసీ వరకు బైక్‌ల సెగ్మెంట్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకోవడంపై దృష్టి పెట్టనుంది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది వ్యవధిలో ప్రతి మూడు నెలలకోసారి ఒక కొత్త ఉత్పత్తిని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.

రెండో రోజూ స్వల్ప లాభాలు

- 65 వేలపైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 37 పాయింట్లు
- మెరిసిన మెటల్, విద్యుత్ షేర్లు



ముంబై: ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఇటీవల విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ ఈక్విటీలను అమ్మేస్తుండటంతో ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించారు. ఇంట్రాడేలో 232 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 79 పాయింట్ల లాభంతో 65వేల స్థాయిపైన 65,076 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు పెరిగి 19,343 వద్ద నిలిచింది. మెటల్, రియల్టీ, యుటిలిటీ, విద్యుత్, కన్జూమర్ రంగాల షేర్లు రాణించాయి. ఎఫ్ఎంసీజీ, టెలికం, బ్యాంకింగ్ షేర్లు డీలా పడ్డాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- పిరమిడ్ టెక్నోప్లాస్ట్ షేరు లిస్టింగ్‌లో పర్వాలేదనిపించింది. ఇష్యూ ధర (రూ.166)తో బీఎస్ఈలో 11% ప్రీమియంతో రూ.185 వద్ద లిస్ట య్యింది. 13% ఎగసి రూ.188 వద్ద గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి 6% లాభపడి రూ.176 వద్ద స్థిరపడింది.
- గార్మెంట్ తయారీ, ఎగుమతిదారు గోకుల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ షేరు 20% ర్యాలీ చేసి రూ.736 వద్ద స్థిరపడింది. యూఈఏకి చెందిన దుస్తుల తయారీ కంపెనీ అట్రాకోను 55 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.455 కోట్లు)కు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడంతో ఈ షేరుకు డిమాండ్ లభించింది.
- బల్క్ డీల్ ద్వారా జామ్‌నగర్ యుటిలిటీస్ 5 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేసినట్లు వార్తలు వెలుగులో రావడంతో జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేరు 5% ర్యాలీ చేసి రూ.222 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

మూడేళ్లలో 500 కొత్త స్టోర్లు

సెంచరీ మ్యాట్రెసెస్ ఈడీ ఉత్తమ్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వచ్చే మూడేళ్లలో ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్ (ఈబీవో) సంఖ్యను 1,000కి చేర్చుకోనున్నట్లు సెంచరీ మ్యాట్రెసెస్ ఈడీ ఉత్తమ్ మలానీ తెలిపారు. ప్రస్తుతం 500 ఉండగా మరో 500 స్టోర్స్ ప్రారంభించనున్నట్లు వివరించారు. తెలంగాణలో 100 ఈబీవోలు ఉన్నాయని, ఈ ఏడాది చివరికి 200కు పెంచుకుంటున్నామన్నారు. మరోవైపు, దేశీయంగా మ్యాట్రెస్‌ల మార్కెట్ రూ. 10,000 కోట్లుగా ఉండగా సంఘటిత రంగ వాటా 40% అని, ఇందులో తమకు 10% వాటా ఉందని, దీన్ని మూడేళ్లలో 20%కి పెంచుకోనున్నామని వివరించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధును సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్న సందర్భంగా మంగళవారమిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మలానీ ఈ విషయాలు చెప్పారు. ఆదాయాలకు సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 35 శాతం వృద్ధి అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన స్లీప్ సొల్యూషన్స్ అందిస్తూ సెంచరీ అందరీ నమ్మకాన్ని చూరగొందని సింధు తెలిపారు.

రూ. 45 వేల కోట్ల పెట్టుబడులు

- ఎనిమిదేళ్లలో రెట్టింపు ఉత్పత్తి లక్ష్యం
- ఏడాదికి 40 లక్షల వాహనాల తయారీ
- మారుతీ సుజుకీ భారీ విస్తరణ ప్రణాళిక



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ వచ్చే ఎనిమిదేళ్లలో తమ వార్షికోత్పత్తిని 40 లక్షల యూనిట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ఇందుకోసం రూ. 45,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. సంస్థ వార్షిక సర్వ సభ్య సమావేశంలో (ఏజీఎం) పాల్గొన్న సందర్భంగా చైర్మన్ ఆర్‌సీ భార్గవ మంగళవారం ఈ మేరకు 'మారుతీ 3.0' వెర్షన్ భారీ విస్తరణ ప్రణాళికలను వెల్లడించారు. తమ సంస్థ 40 ఏళ్లలో వార్షికంగా ఇరవై లక్షల యూనిట్ల తయారీ, అమ్మకాలను సాధించిందని ఆయన చెప్పారు. కంపెనీ ప్రస్థానంలోని మూడో దశలో టర్నోవరును రెట్టింపు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్‌లు, సీఎన్‌జీ మొదలైన టెక్నాలజీలన్నింటినీ పరిశీలించనున్నట్లు భార్గవ చెప్పారు. 2030–31 నాటికి మరో 20 లక్షల వార్షికోత్పత్తి, 28 మోడల్స్‌ను జోడించుకోవాలని భావిస్తున్నట్లు వివరించారు. 'తొలి దశలో మాది ప్రభుత్వ రంగ సంస్థగా ఉండేది. కోవిడ్ మహమ్మారితో మా రెండో దశ ముగిసింది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద కార్ల మార్కెట్‌గా భారత్ ఆవిర్భవించింది. రాబోయే రోజులు చాలా సవాళ్లతో, చాలా అనిశ్చితితో కూడుకున్నవిగా ఉంటాయి. కొత్తగా ఇరవై లక్షల కార్ల సామర్థ్యాన్ని సాధించేందుకు దాదాపు రూ. 45,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అది కూడా ద్రవ్యోల్బణంపై ఆధారపడి ఉంటుంది' అని భార్గవ చెప్పారు.

మార్కెట్ వాటా మళ్లీ పెంచుకుంటాం..

చిన్న కార్లకు డిమాండ్ మందగించడంతో తగ్గిన తమ మార్కెట్ వాటాను .. వేగంగా వృద్ధి చెందుతున్న ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకోవడం ద్వారా మళ్లీ పెంచుకుంటామని భార్గవ ధీమా వ్యక్తం చేశారు. అటు ఎలక్ట్రిక్ వాహనాల విషయానికొస్తే.. దేశీయంగా విద్యుత్ వాహనాల పరిస్థితుల గురించి కంపెనీ యాజమాన్యం క్షుణ్నంగా అధ్యయనం చేసిందని పేర్కొన్నారు. 2024–25 నుంచి 2030–31 మధ్య కాలంలో ఆరు మోడల్స్‌ను ఉత్పత్తి చేయాలనే ప్రణాళికలు ఉన్నాయని భార్గవ తెలిపారు. ఇక రూ. 10,000కు చేరువకు షేరు ధర చేరిన నేపథ్యంలో స్టాక్‌ను విభజించే అంశాన్ని బోర్డు ముందు ఉంచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆటోమోటివ్ రంగానికి పీఎల్ఐ స్కీము పొడిగింపు

ఆటోమోటివ్ రంగానికి సంబంధించిన రూ. 25,938 కోట్ల ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్ర నాథ్ పాండే తెలిపారు. వాస్తవంగా 2022–23 నుంచి 2026–27 వరకు ఉద్దేశించిన ఈ స్కీము.. తాజా నిర్ణయంతో 2027–28 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. సబ్సిడీలను మూడు నెలలకోసారి విడుదల చేయడం, విలువ జోడింపును పరీక్షించే ఏజెన్సీల సంఖ్యను ప్రస్తుతమున్న రెండు నుంచి నాలుగుకు పెంచడం వంటి చర్యలు తీసుకోవాలంటూ పరిశ్రమ వర్గాలు కోరాయని ఆయన చెప్పారు. వాటిని పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. 2022 ఏప్రిల్ 1 తర్వాత నుంచి దేశీయంగా తయారైన నిర్దిష్ట అడ్వాన్స్‌డ్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఏఏటీ) ఉత్పత్తుల అమ్మకాలకు ఈ స్కీము వర్తిస్తుంది. దీని పనితీరును సమీక్షించిన సందర్భంగా మంత్రి తాజా వివరాలు వెల్లడించారు. కొత్త టెక్నాలజీ ఉత్పత్తులను దేశీయంగా తయారు చేయడాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పీఎల్ఐ స్కీముకి 95 కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి.

టాటా ఎలక్ట్రిక్ వాహనాలకు కొత్త బ్రాండింగ్



న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్లలో పది బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో టాటా మోటార్స్‌లో భాగమైన టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ తమ విద్యుత్ వాహనాలకు సంబంధించి కొత్త బ్రాండ్ గుర్తింపును ఆవిష్కరించింది. 'టాటాడాట్‌ఈవీ' బ్రాండింగ్‌తో కొత్త శకంలోకి ప్రవేశిస్తున్నట్లు సంస్థ హెడ్ (మార్కెటింగ్) వివేక్ శ్రీవత్స తెలిపారు. కస్టమర్లకు మరింత వైవిధ్యమైన, అర్థవంతమైన అనుభూతిని అందించేందుకు ఇది దోహదపడగలదని ఆయన పేర్కొన్నారు. కంపెనీకి ప్రస్తుతం నాలుగు చక్రాల ఈవీల సెగ్మెంట్‌లో 70 శాతం పైగా మార్కెట్ వాటా ఉంది. నెక్సాన్, టియాగో, టిగోర్, ఎక్స్‌ప్రెస్–టీ పేరిట ఈవీలను విక్రయిస్తోంది. 2026 నాటికి పది కొత్త ఈవీలు ఆవిష్కరించే దిశగా 2 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. 2030 నాటికల్లా తమ మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో విద్యుత్ వాహనాల వాటా సగానికి పైగా ఉంటుందని టాటా మోటార్స్ భావిస్తోంది. ఈ ఏడాది 1 లక్ష పైచిలుకు ఈవీలు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

టెక్నో పెయింట్స్ కలర్ బ్యాంక్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ కంపెనీ టెక్నో పెయింట్స్ కలర్ బ్యాంక్స్ టెక్నాలజీని ప్రవేశపెట్టింది. భారత్‌లో అతికొద్ది కంపెనీలే వీటిని వినియోగిస్తున్నాయి. సంస్థ ప్రయాణంలో మైలురాయిగా నిలుస్తుందని టెక్నో పెయింట్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఫార్చ్యూన్ గ్రూప్ ఫౌండర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'స్మార్ట్‌ఫోన్‌తోనూ ఆపరేట్ చేయగలిగే ఈ కలర్ బ్యాంక్స్‌తో 3,000 పైచిలుకు రంగులను నిమిషాల్లో అందించవచ్చు. ముందుగా 1,000 మంది డీలర్ల వద్ద ఇవి రానున్నాయి. బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటుడు మహేశ్ బాబు రాకతో మారుమూల పల్లెలకూ కంపెనీ పాకింది. డీలర్ల నుంచి మంచి స్పందన ఉంది. మార్చికల్లా 250 ఎక్స్‌పీరియెన్స్ సెంటర్లను ప్రారంభిస్తున్నాం. హైదరాబాద్ సమీపంలోని పాశమైలారం, చేరియాల్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని నడికుడి వద్ద రూ. 100 కోట్లతో ఏర్పాటవుతున్న ప్లాంట్లలో అక్టోబరులో ఉత్పత్తి మొదలవుతుంది' అని వివరించారు.

జాబ్ పాయింట్

చిత్తూరు జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 17 పోస్టులు

చిత్తూరు జిల్లా డిస్ట్రిక్ట్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ(ఎన్‌టీఈపీ) జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
- » **పోస్టుల వివరాలు:** సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్–01, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్–సూపర్‌వైజర్–06, ల్యాబ్ టెక్నీసియన్–03, డీఆర్ టీబీ కౌన్సిలర్–01, అకౌంటెంట్–02, సీనియర్ మెడికల్ ఆఫీసర్–01, డీపీసీ–01, డీపీఎస్–01, పీపీఎం కోఆర్డినేటర్–01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్, డీఎంఎల్‌టీ, డిప్లొమా, ఎంబీబీఎస్, పీజీ, డిగ్రీ, సర్టిఫికేట్ కోర్సు, ఎంబీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీస్, ఓపీ నెం. 24, జిల్లా హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్ క్యాంపస్, చిత్తూరు చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 30.08.2023.
- » **దరఖాస్తు పరిశీలన తేదీలు:** 01.09.2023 నుంచి 07.09.2023 వరకు
- » **మెరిట్ జాబితా వెల్లడి తేది:** 08.09.2023 నుంచి 10.09.2023 వరకు
- » **వెబ్‌సైట్:** https://chittoor.ap.gov.in

హైదరాబాద్ జిల్లా టీవీవీపీ హాస్పిటల్స్‌లో 69 పోస్టులు

తెలంగాణ వైద్య విధాన పరిషత్, హైదరాబాద్ జిల్లా కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన హైదరాబాద్ జిల్లాలోని టీవీవీపీ హాస్పిటల్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 69
- » **స్పెషాలిటీ:** ఓబీ అండ్ జీ, అనెస్తీషియా, పీడియాట్రిక్స్, రేడియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ, పాథాలజీ.
- » **అర్హత:** సంబంధిత స్పెషాలిటీలో మెడికల్ పీజీ/డీఎన్‌బీ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.1,00,000 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** పీజీ/డీఎన్‌బీ/డిప్లొమా మార్కులు, ఉత్తీర్ణత సాధించిన సంవత్సరం ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రోగ్రామ్ ఆఫీసర్, హైదరాబాద్, నాలుగో అంతస్తు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఖైరతాబాద్ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 06.09.2023.
- » **వెబ్‌సైట్:** https://hyderabad.telangana.gov.in

జీజీహెచ్, గుంటూరులో 19 పోస్టులు

గుంటూరులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, ట్రామా కేర్‌సెంటర్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 19
- » **పోస్టుల వివరాలు:** జనరల్ సర్జన్(న్యూరో సర్జన్)–02,ఆర్థోపెడిక్ సర్జన్–01, అనస్థటిస్ట్–02, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్–08, స్టాఫ్ నర్స్–05, ల్యాబ్ టెక్నీషియన్–01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఎంఎల్‌టీ, డిప్లొమా, జీఎన్ఎం, ఎంబీబీఎస్, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, గుంటూరు చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 04.09.2023.
- » **వెబ్‌సైట్:** https://guntur.ap.gov.in

యూఐఐసీ, చెన్నైలో 100 పోస్టులు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్1) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
- » **పోస్టుల వివరాలు:** లీగల్ స్పెషలిస్ట్–25, అకౌంట్స్/ఫైనాన్స్ స్పెషలిస్ట్–24, కంపెనీ స్పెషలిస్ట్–03, యాక్చువరీలు–03, డాక్టర్–20, ఇంజనీర్–22, అగ్రికల్చర్ స్పెషలిస్ట్–03.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 23.08.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** డాక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూ ఆధారంగా మిగిలిన ఖాళీలను ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 14.09.2023.
- » **వెబ్‌సైట్:** https://uiic.co.in

ఐఐటీలకు మరో దారి.. జామ్

» పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలకు జామ్ పరీక్ష
» 21 ఐఐటీల్లో మూడు వేలకు పైగా సీట్లు
» సెప్టెంబర్ 5 నుంచి దరఖాస్తుకు అవకాశం

ఐఐటీలంటే దేశంలో ఎంతో క్రేజ్. పదో తరగతి పూర్తవుతూనే ఐఐటీల్లో చేరాలని కలలు కనే వారెందరో!! ఇంటర్‌లో చేరి జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ కోసం నిద్రాహారాలు మాని ప్రిపరేషన్ సాగిస్తారు. కాని పోటీ లక్షల్లో ఉంటే..సీట్లు వేలల్లోనే!! దీంతో ఐఐటీ కల చెదిరి నిరాశతో నిష్క్రమించే వారి సంఖ్యే ఎక్కువ!! అలాంటి వారు తమ ఐఐటీ కల నెరవేర్చుకునేందుకు మరో మార్గం.. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్..సంక్షిప్తంగా జామ్!! ఇది జాతీయ స్థాయిలో.. ఐఐటీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ పీహెచ్‌డీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. తాజాగా.. జామ్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జామ్‌తో ప్రయోజనాలు, ప్రవేశం కల్పించే ఇన్‌స్టిట్యూట్‌లు-కోర్సులు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్..



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు.. ఇంజనీరింగ్, సైన్స్ విద్యాబోధనలో ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఇన్‌స్టిట్యూట్స్. వీటిలో బ్యాచిలర్ స్థాయిలో బీటెక్ ప్రోగ్రామ్‌లో అడుగుపెట్టాలని లక్షల మంది విద్యార్థులు ఆశిస్తారు.ఇలాంటి ప్రసిద్ధ ఐఐటీల్లో పీజీస్థాయిలో చేరే అవకాశం కల్పిస్తోంది.. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్).

ఎమ్మెస్సీ కోర్సులు

జామ్ ద్వారా ఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో మ్యాథమెటిక్స్, సైన్సెస్ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షను ప్రతి ఏటా ఒక ఐఐటీ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఐఐటీ-చెన్నై నిర్వహిస్తోంది. పరీక్ష తేదీలను సైతం ఖరారు చేసింది.

కోర్సులివే

జామ్ స్కోర్ ద్వారా ప్రవేశం కల్పించే కోర్సులు.. ఎమ్మెస్సీ(రెండేళ్లు); మాస్టర్స్ ఇన్ ఎకనామిక్స్(రెండేళ్లు); జాయింట్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ; పోస్ట్ బ్యాచిలర్ డిగ్రీ ప్రోగ్రామ్స్; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.

అర్హత

సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా 5.5 సీజీపీఏ సాధించాలి. 2024లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు వేలకు పైగా సీట్లు

ప్రస్తుతం దేశంలోని 21 ఐఐటీల్లో.. ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ రీసెర్చ్, ఎమ్మెస్సీ–ఎంటెక్ వంటి పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మూడు వేలకుపైగా సీట్లకు జామ్ స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థలు సైతం జామ్‌తో ఎమ్మెస్సీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీటిలో దాదాపు రెండు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా ఐఐఎస్ఈఆర్–పుణె, భోపాల్ క్యాంపస్‌లు, ఐఐఎస్సీ–బెంగళూరు, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా జామ్ స్కోర్ ఆధారంగా ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ, ఎంఎస్ బై రీసెర్చ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఏడు పేపర్లు

జామ్–2024ను ఏడు టెస్ట్ పేపర్లుగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. అవి.. బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటిక్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లలో పరీక్షకు హాజరవ్వొచ్చు. ఈ విషయాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది.

జామ్.. ఇలా

జామ్ పరీక్ష మొత్తం మూడు విభాగాల్లో జరుగుతుంది. వివరాలు..

- సెక్షన్–ఎ: ఇందులో 30 బహుళైచ్ఛిక ప్రశ్నలు (ఎంసీక్యూ) ఉంటాయి. ఇందులో 10 ఒక మార్కు ప్రశ్నలు, 20 రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్–బి: ఈ విభాగంలో 10 మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్(ఎంఎస్‌క్యూ) ఇస్తారు. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు ఉంటాయి. వీటిలో ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉంటాయి. అభ్యర్థులు అడిగిన ప్రశ్నకు సరితూగే సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది.
- సెక్షన్–సి: ఈ విభాగంలో 20 న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 10 ప్రశ్నలకు 1 మార్కు చొప్పున, 10 ప్రశ్నలకు 2 మార్కులు చొప్పున కేటాయిస్తారు.
- మొత్తం మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు 60 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.
- నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమలవుతోంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కు చొప్పున కోత విధిస్తారు.

డిగ్రీ స్థాయి పుస్తకాల అధ్యయనం

జామ్‌లో విజయానికి అభ్యర్థులు తమ అకడమిక్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బ్యాచిలర్ డిగ్రీ స్థాయి పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది. సబ్జెక్ట్/పేపర్ వారీగా ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

బయోటెక్నాలజీ

ఇందులో రాణించేందుకు బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌ను ప్రిపేరవ్వాల్సి ఉంటుంది. బయాలజీ విభాగానికి సంబంధించి పదో తరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు అకడమిక్స్‌ను అభ్యసనం చేయాలి. జనరల్ బయాలజీ, బయోకెమిస్ట్రీ అండ్ ఫిజియాలజీ, బేసిక్ బయోటెక్నాలజీ, మాలిక్యులర్ బయాలజీ, సెల్ బయాలజీ, మైక్రోబయాలజీ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. కెమిస్ట్రీకి సంబంధించి పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాఠ్యాంశాలను చదవాలి. మ్యాథ్స్, ఫిజిక్స్‌లను ఇంటర్ స్థాయిలో చదివితే సరిపోతుంది.

కెమిస్ట్రీ

ఫిజికల్ కెమిస్ట్రీ: బేసిక్ మ్యాథమెటికల్ కాన్సెప్ట్‌లు, అటామిక్ అండ్ మాలిక్యులర్ స్ట్రక్చర్, థియరీ ఆఫ్ గ్యాసెస్, సాలిడ్ స్టేట్, కెమికల్ థర్మోడైనమిక్స్, కెమికల్ అండ్ ఫేజ్ ఈక్విలిబ్రియా, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్, అబ్జార్ప్షన్, స్పెక్ట్రోమెట్రి; ఆర్గానిక్ కెమిస్ట్రీ అండ్ స్పెక్ట్రోమెట్రి బేసిక్ కాన్సెప్ట్‌లు, ఆర్గానిక్ రియాక్షన్ మెకానిజం, సింథటిక్ అప్లికేషన్స్, క్వాలిటేటివ్ ఆర్గానిక్ అనాలసిస్, ఆరోమాటిక్ అండ్ హెటిరో సైక్లిక్ కెమిస్ట్రీ. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పిరియాడిక్ టేబుల్, కెమికల్ బాండింగ్, షేప్స్ ఆఫ్ కాంపౌండ్స్, మెయిన్ గ్రూప్ ఎలిమెంట్స్, ట్రాన్సిషన్ మెటల్స్, బయో ఇనార్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ.

ఎకనామిక్స్

మైక్రో ఎకనామిక్స్, మాక్రో ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ ఫర్ ఎకనామిక్స్, ఇండియన్ ఎకానమీ, మ్యాథమెటిక్స్ ఫర్ ఎకనామిక్స్‌లను అధ్యయనం చేయాలి.

జియాలజీ

ప్లానెట్ ఎర్త్, జియో మార్ఫాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, పాలియోంటాలజీ, స్టాటిగ్రఫీ, మినరాలజీ, పెట్రోలజీ, ఎకనామిక్ జియాలజీ, అప్లయిడ్ జియాలజీలపై దృష్టి పెట్టాలి.

మ్యాథమెటిక్స్

సీక్వెన్సెస్ అండ్ సిరీస్ ఆఫ్ రియల్ నంబర్స్, ఫంక్షన్స్ ఆఫ్ వన్/టూ/త్రీ రియల్ వేరియబుల్, ఇంటిగ్రల్ క్యాల్కులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ క్యాల్కులస్, గ్రూప్ థియరీ, లీనియర్ ఆల్జీబ్రా, రియల్ అనాలసిస్ పాఠ్యాంశాలను ప్రిపేరవ్వాలి.

మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్

ఈ పేపర్‌లో మ్యాథ్స్‌కు 40 శాతం, స్టాటిస్టిక్స్‌కు 60 శాతం వెయిటేజీ ఉంటుంది. మ్యాథ్స్‌కు సంబంధించి సీక్వెన్సెస్ అండ్ సిరీస్, డిఫరెన్షియల్ క్యాల్కులస్, ఇంటిగ్రల్ క్యాల్కులస్, మాట్రిసెస్ చాప్టర్లను అధ్యయనం చేయాలి. స్టాటిస్టిక్స్‌లో ప్రాబబిలిటీ, ర్యాండమ్ వేరియబుల్స్, స్టాండర్డ్ డిస్ట్రిబ్యూషన్, జాయింట్ డిస్ట్రిబ్యూషన్, సాంప్లింగ్ డిస్ట్రిబ్యూషన్, లిమిట్ థీరమ్స్, ఎస్టిమేషన్, టెస్టింగ్ ఆఫ్ హైపో థీసిస్‌లను అధ్యయనం చేయాలి.

ఫిజిక్స్

మ్యాథమెటికల్ మెథడ్స్, మెకానిక్స్ అండ్ జనరల్ ప్రాపర్టీస్ ఆఫ్ మేటర్, ఆసిలేషన్స్, వేవ్స్ అండ్ ఆప్టిక్స్, ఎలక్ట్రిసిటీ అండ్ మ్యాగ్నటిజం, కైనటిక్ థియరీ, థర్మోడైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, డివైజెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ పాఠ్యాంశాలను అధ్యయనం చేయాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: సెప్టెంబర్ 5 – అక్టోబర్ 13, 2023
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: జనవరి 8, 2024
- జామ్ తేదీ: ఫిబ్రవరి 11, 2024
- ఫలితాల వెల్లడి: మార్చి 22, 2024
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://jam.iitm.ac.in

క్లుప్తంగా...

విశాఖ వేదికగా మిలన్-2024

సీఎం జగన్‌కు వివరించిన తూర్పు నావికాదళ అధికారి రాజేశ్‌ పెందార్కర్‌



సీఎం వైఎస్‌ జగన్‌కు ఐఎన్‌ఎస్‌ షిప్‌ మోడల్‌ను బహూకరిస్తున్న రాజేశ్‌ పెందార్కర్‌

సాక్షి, అమరావతి: తూర్పు నావికాదళం విశాఖపట్నం వేదికగా వచ్చే ఫిబ్రవరిలో మిలన్‌-2024 నిర్వహించనుంది. తూర్పు నావికాదళం ఫ్లాగ్‌ ఆఫీసర్‌ కమాండింగ్‌ ఇన్‌ చీఫ్, వైస్‌ అడ్మిరల్‌ రాజేశ్‌ పెందార్కర్‌ మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ను కలిశారు. మిలన్‌-2024 నిర్వహణ వివరాలను సీఎంకు తెలియజేశారు. విశాఖపట్నంలో నిర్వహించే మిలన్‌-2024కు 57 దేశాల ప్రముఖులు, నౌకాదళాలు పాల్గొనే అవకాశముందని చెప్పారు. సముద్ర భద్రతకు సంబంధించి తలెత్తుతున్న సవాళ్లను అధిగమించేందుకు తాము చేపట్టిన వివిధ కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేశ్‌ పెందార్కర్‌ను సీఎం జగన్‌ సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేయగా.. రాజేశ్‌ ముఖ్యమంత్రికి ఐఎన్‌ఎస్‌ విశాఖపట్నం షిప్‌ మోడల్‌ను బహూకరించారు. సమావేశంలో నేవీ ఉన్నతాధికారులు కెప్టెన్‌ వీఎస్‌సీ రావు, కెప్టెన్‌ రోహిత్‌ కట్టోజు, కమాండర్‌ వైకే కిశోర్, లెఫ్టినెంట్‌ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో సీఎస్‌ జవహర్‌రెడ్డిని తూర్పు నావికాదళ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

పీజీ మెడికల్‌ యాజమాన్య కోటా సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్‌ యాజమాన్య కోటా సీట్ల భర్తీలో భాగంగా తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు చేస్తూ మంగళవారం డాక్టర్‌ వైఎస్సార్‌ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు తమకు సీట్లు కేటాయించిన వైద్య కళాశాలల్లో సెప్టెంబర్‌ నాలుగో తేదీ మధ్యాహ్నం మూడు గంటల్లోగా రిపోర్ట్‌ చేయాలని రిజిస్ట్రార్‌ డాక్టర్‌ రాధికారెడ్డి తెలిపారు.

మాన్యుఫాక్చరింగ్‌ హబ్‌గా విశాఖ

వీసెజ్‌లో మరో 3 యూనిట్ల ఏర్పాటుకు గ్రీన్‌ సిగ్నల్‌

- పనులు ప్రారంభానికి అద్వైత్‌ బయో ఫ్యూయల్, బయోకాన్, గ్రాన్యూల్‌ కంపెనీలు సిద్ధం
- రూ.500 కోట్ల పెట్టుబడులు.. 1,200 మందికి ఉపాధి అవకాశాలు
- ఏడాదిలోపే కార్యకలాపాల ప్రారంభం
- వీసెజ్‌ నుంచి తొలి త్రైమాసికంలో రూ.50 వేల కోట్ల విలువైన ఉత్పత్తుల ఎగుమతి
- గతేడాదితో పోలిస్తే 34 శాతం వృద్ధి



సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాలకు వేదికగా విశాఖపట్నం మారుతోంది. మాన్యుఫాక్చరింగ్, ఫార్మా, ఐటీ, కార్గో... ఇలా భిన్నమైన రంగాలకు సంబంధించిన పరిశ్రమలు ఒక్కొక్కటిగా విశాఖకు విస్తరిస్తున్నాయి. తాజాగా విశాఖపట్నం స్పెషల్‌ ఎకనమిక్‌ జోన్‌ (వీసెజ్‌)లో మరో మూడు మాన్యుఫాక్చరింగ్‌ యూనిట్ల ఏర్పాటుకు ఆమోదం లభించింది. రూ.500 కోట్లకు పైగా పెట్టుబడులతో రెండు బయో డీజిల్‌ కంపెనీలు, ఒక ఫార్మా కంపెనీ ఏడాదిలోపు ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా 1,200 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరోవైపు తొలి త్రైమాసికంలో గతేడాదితో పోలిస్తే ఉత్పత్తుల ఎగుమతుల్లో 34 శాతం వృద్ధి కనబరిచిన వీసెజ్‌... అర్ధ సంవత్సరానికి 50 శాతం వృద్ధి నమోదు దిశగా ముందుకు సాగుతోంది.

యూఎస్, కెనడాకు ఎగుమతులే లక్ష్యంగా...

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన మూడు యూనిట్లు విశాఖ సెజ్‌లోనే ఏర్పాటు కానున్నాయి. ఇందులో బయోడీజిల్‌ తయారీ సంస్థ అద్వైత్‌ బయో ఫ్యూయల్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్, బయోకాన్‌ లిమిటెడ్, ఫార్మాస్యూటికల్‌ ఉత్పత్తుల తయారీ సంస్థ గ్రాన్యూల్స్‌ సీజెడ్‌ఆర్‌వో సంస్థలు ఉన్నాయి. ఈ కంపెనీలు ఏడాదిలోపు తమ కార్యకలాపాలు ప్రారంభించాలని వీసెజ్‌ నిబంధన విధించింది. అయితే... ఈ సంస్థలన్నీ ఆరు నుంచి పది నెలల్లోపే ఉత్పత్తుల తయారీని మొదలు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని వీసెజ్‌ అధికారులు చెబుతున్నారు. ఈ మూడు కంపెనీలు ప్రధానంగా కెనడా, యూఎస్‌కు ఎగుమతులే లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి.

రికార్డు స్థాయిలో ఎగుమతులు



ఏపీ, తెలంగాణకు వస్తున్న పరిశ్రమలు వీలైనంత త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాం. దువ్వాడ వీసెజ్‌ పరిధిలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సెజ్‌లు, యూనిట్ల ద్వారా రికార్డు స్థాయి ఎగుమతులు సాధించాం. 2023–24 మొదటి త్రైమాసికంలో రూ.50,195 కోట్ల విలువైన వస్తువులు, సేవలను ఎగుమతి చేశాం. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 34 శాతం వృద్ధి రేటు సాధించాం. వివిధ వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా రూ.35,992 కోట్లు, సేవారంగం ఎగుమతుల్లోనూ 36 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది జూన్‌ 30వ తేదీ వరకు గణాంకాలను పరిశీలిస్తే రూ.1,04,961 కోట్ల పెట్టుబడులు వీసెజ్‌ ద్వారా రాగా... మొత్తం 6,61,579 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

– ఎం.శ్రీనివాస్, వీసెజ్‌ జోనల్‌ డెవలప్‌మెంట్‌ కమిషనర్‌

వేడుకగా హంస పురస్కారాల ప్రదానం

వివిధ విభాగాల్లో తొమ్మిదిమంది ప్రముఖులకు సన్మానం



హంస పురస్కారాల గ్రహీతలతో అతిథులు

రాజానగరం: రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో హంస పురస్కారాల ప్రదాన కార్యక్రమం మంగళవారం వేడుకగా జరిగింది. తెలుగు భాషాభివృద్ధికి విశిష్ట సేవలందిస్తున్న తొమ్మిది మంది ప్రముఖులను ఘనంగా సన్మానించి, పురస్కారాలను అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం, రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది మందికి హంస పురస్కారాలు ప్రదానం చేశారు. వీరిలో సాహిత్యంలో ఎస్‌.అబ్దుల్‌ అజీజ్‌ (రచయిత, కర్నూలు), మెడుగుల రవికృష్ణ (ఉపాధ్యాయుడు, గుంటూరు), డాక్టర్‌ జడా సుబ్బారావు (అసిస్టెంట్‌ ప్రొఫెసర్, నూజివీడు), వైహెచ్‌కే మోహనరావు (విలేకరి, పిడుగురాళ్ల), సామాజిక రచనలో ఎండపల్లి భారతి (రచయిత్రి, చిత్తూరు), కవిత్వంలో మాడభూషి సంపత్‌కుమార్‌ ఆచార్యులు (నెల్లూరు), అవధానంలో సూరం శ్రీనివాసులు (రిటైర్డ్‌ హెచ్‌ఎం, నెల్లూరు), సాంకేతిక రచనలు డాక్టర్‌ కేవీఎన్‌డీ వరప్రసాద్‌ (అసిస్టెంట్‌ ప్రొఫెసర్, రాజమహేంద్రవరం) ఉన్నారు. వ్యాసరచన పోటీల్లో గండికోట హిమశ్రీ (బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు), జస్మితరెడ్డి (మంగళగిరి)లకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్‌ నందమూరి లక్ష్మీపార్వతి, 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు, సాహితీవేత్త, సంఘ సేవకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ప్రముఖ సాహితీవేత్త శలాక రఘునాథశర్మ, రిజిస్ట్రార్‌ ఆచార్య కె. సుధాకర్‌ ప్రసంగించారు.

పది ఫెయిలైన విద్యార్థులు ఫీజు చెల్లింపునకు అవకాశం

సాక్షి, అమరావతి: గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరం మార్చిలో పబ్లిక్‌ పరీక్షలు రాసేందుకు పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఈమేరకు పాఠశాలల్లో ప్రైవేటు విద్యార్థుల ఫీజులు స్వీకరించేందుకు చర్యలు చేపట్టాలని పరీక్షల విభాగం డైరెక్టర్‌ డి.దేవానందరెడ్డి మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్‌ 15 వరకు ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో సెప్టెంబర్‌ 20 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో సెప్టెంబర్‌ 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మూడు సబ్జెక్టులు దాటితే రూ.125 ఫీజు చెల్లించాలని సూచించారు. షెడ్యూల్‌ ప్రకారం బుధవారం నుంచి www.bse.ap.gov.inలో స్కూల్‌ లాగిన్‌ నుంచి మాత్రమే ఫీజు చెల్లించాలని, సీఎఫ్‌ఎంఎస్, బ్యాంకు చలాన్‌లు అంగీకరించడంలేదని తెలిపారు. ఫెయిలైన విద్యార్థులందరూ పరీక్షలకు హాజరయ్యేలా సంబంధిత ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

మరో మూడు రోజులు ఉష్ణతాపం

- సాధారణంకంటే 3 నుంచి 5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంపైకి వాయవ్య గాలుల ఫలితం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మరో మూడు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. వారం క్రితం వరకు వేసవిని తలపించేలా ఎండల తీవ్రత కొనసాగింది. ఆ తర్వాత కాస్త తగ్గుముఖం పట్టి సాధారణ స్థితికి చేరుకుంది. ప్రస్తుతం మళ్లీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంపైకి వాయవ్య గాలులు వీస్తున్నాయి. ఇవి తేమతో కూడిన వేడిగాలులు కావడంతో ఉష్ణతీవ్రత పెరుగుతోంది. అలాగే ప్రస్తుతం బంగాళాఖాతంలో కానీ, రాష్ట్రానికి సమీపంలో కానీ అల్పపీడన ద్రోణులు, ఉపరితల ఆవర్తనాలు లేవు. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలో సగానికి పైగా జిల్లాల్లో 37 నుంచి 39 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. ప్రధానంగా ప్రకాశం, ఎస్పీఎస్సార్‌ నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, పార్వతీపురం మన్యం, బాపట్ల, అనంతపురం, పశ్చిమగోదావరి, నంద్యాల, వైఎస్సార్, ఎన్టీఆర్, ఏలూరు, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఉష్ణతాపం అధికంగా ఉంటోంది. ఈ పరిస్థితి మరో మూడురోజుల వరకు ఉంటుందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి చెప్పారు. గాలిలో తేమ కూడా ఎక్కువగా ఉండడంతో ఉక్కపోత ఉంటుందని తెలిపారు. మంగళవారం నందనమార్రెళ్ల(ప్రకాశం), బాలాయపల్లె (తిరుపతి), పెదమేరంగి (పార్వతీపురం మన్యం)లో 39, నింద్ర (చిత్తూరు), సీతారాంపురం (ఎస్పీఎస్సార్‌ నెల్లూరు), ఎల్లనూరు (అనంతపురం), ఇబ్రహీంపట్నం (ఎన్టీఆర్‌)లలో 38, తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి), విశాఖపట్నంలలో 37 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

అనధికార విద్యుత్‌ కోతలేమీ లేవు

- పగటి పూటే రైతులకు తొమ్మిది గంటల విద్యుత్‌ సరఫరా
- దరఖాస్తు చేసిన వెంటనే వ్యవసాయ విద్యుత్‌ సర్వీసు మంజూరు
- ఏపీసీపీడీసీఎల్‌ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అనధికారిక విద్యుత్‌ కోతలతో పంటలు ఎండిపోతున్నాయనేది అవాస్తవమని ఆంధ్రప్రదేశ్‌ మధ్య ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్‌) సీఎండీ జె.పద్మా జనార్దన రెడ్డి తెలిపారు. 'ఎడా పెడా కోతలు.. ఎండుతున్న పంటలు' అనే శీర్షికతో ఈనాడు పత్రిక మంగళవారం ప్రచురించిన వార్తా కథనాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు 'సాక్షి' ప్రతినిధితో సీఎండీ ప్రత్యేకంగా మాట్లాడారు. వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా రైతులు దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్‌ సర్వీసులు మంజూరు చేస్తున్నామన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు ఏపీసీపీడీసీఎల్‌ పరిధిలో 92,247, ఏపీఈపీడీసీఎల్‌ పరిధిలో 42,726, ఏపీఎస్పీడీసీఎల్‌ పరిధిలో 2,31,046 వ్యవసాయ సర్వీసులు కొత్తగా ఇచ్చామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు డిస్కంల పరిధిలో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రత్యేక వ్యవసాయ విద్యుత్‌ లైన్లు అమర్చడం ద్వారా నెట్‌వర్క్‌ను స్థిరీకరించామన్నారు. తద్వారా రాత్రి పూట కాకుండా పగటిపూటే 9 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను రైతులందరికీ అందించే ఏర్పాటు చేశామని చెప్పారు. దీనివల్ల పాముకాట్లు, కరెంటు షాకుల వల్ల రాత్రి సమయంలో జరిగే రైతుల దుర్మరణాలను అరికట్టగలిగామన్నారు. ఎక్కడైనా వ్యవసాయ విద్యుత్‌ సరఫరా సంబంధిత సమస్యలు ఉంటే ఆ ప్రాంత సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ను లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదిస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

పాఠశాలల్లో ఫోన్‌ బ్యాన్‌ మంచి పరిణామం

ప్రభుత్వ నిర్ణయంపై చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ మాజీ చైర్మన్‌ కుమార్‌ హర్షం

సాక్షి, అమరావతి: పాఠశాలల్లో మొబైల్స్‌ బ్యాన్‌ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమని చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ మాజీ చైర్మన్‌ బీవీఎస్‌ కుమార్‌ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పిల్లల కోసం, వారి భవిష్యత్తు పట్ల ఎంతో శ్రద్ధ వహించే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలని కోరారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో చదువుకునే సమయంలో పిల్లలు, యువతకు మొబైల్స్‌ ప్రధాన అవరోధంగా మారాయని తెలిపారు. పిల్లల ఏకాగ్రతను దెబ్బతీసి చదువు, ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

ఎకో వైజాగ్‌కు అందరూ సహకరించాలి

- విశాఖపట్నం సుందర నగరం.. పర్యాటకపరంగా ఒక అద్భుతం
- బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌ బిన్నీ
- త్వరలో ఏసీఏ ఆధ్వర్యంలో స్కూల్‌ క్రికెట్‌ లీగ్‌ మ్యాచ్‌లు
- విద్యార్థి దశ నుంచే ప్రొఫెషనల్‌ క్రికెటర్లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు
- 11 మంది యువ క్రికెటర్లకు రూ.65 లక్షల నగదు పురస్కారాలు



మేయర్‌ హరి వెంకటకుమారి, అధికారులతో కలసి వాక్‌లో పాల్గొన్న బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌ బిన్నీ

ఆరిలోవ(విశాఖ తూర్పు)/దొండపర్తి: ఎకో వైజాగ్‌కు అందరూ సహకరించాలని బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌ బిన్నీ పిలుపునిచ్చారు. ఆంధ్ర క్రికెట్‌ అసోసియేషన్, జీవీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం విశాఖపట్నంలో 'ఎకో వైజాగ్‌ వాక్‌' నిర్వహించారు. ఆర్కే బీచ్‌ వద్ద కాళీ మాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌ను మేయర్‌ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్‌ ఎ.మల్లికార్జున, ఏసీఏ సభ్యులతో కలసి రోజర్‌ బిన్నీ ప్రారంభించారు. అనంతరం వైఎంసీఏ వద్ద జరిగిన సభలో బిన్నీ మాట్లాడుతూ.. విశాఖపట్నం సుందర నగరమని.. పర్యాటకపరంగా అద్భుతంగా ఉందన్నారు. మొక్కలు నాటడంలో కలిగే ప్రయోజనం గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. దేశంలోనే స్వచ్ఛత, పర్యావరణలో ఉత్తమ నగరంగా విశాఖకు మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. నగరంలో ఐదు వేల మొక్కలు నాటుతామని చెప్పారు. మేయర్‌ హరి వెంకటకుమారి మాట్లాడుతూ.. ఖాళీ ప్రదేశాలలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని.. బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. కలెక్టర్‌ మల్లికార్జున మాట్లాడుతూ.. కాలుష్య రహిత నగరంగా విశాఖను తయారుచేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి ఎస్‌ఆర్‌ గోపీనాథ్‌రెడ్డి, జాయింట్‌ కలెక్టర్‌ విశ్వనాథన్, సీఏ ట్రెజరర్‌ ఎ.వి.చలం, అపెక్స్‌ కౌన్సిల్‌ సభ్యుడు కె.వి.పురుషోత్తం, టీమిండియా క్రికెటర్‌ కె.ఎస్‌.భరత్‌ తదితరులు పాల్గొన్నారు.

యువ క్రికెటర్లకు ప్రోత్సాహం..

పాఠశాల దశ నుంచే విద్యార్థులను ప్రొఫెషనల్‌ క్రికెటర్లుగా తీర్చిదిద్దేందుకు ఆంధ్ర క్రికెట్‌ అసోసియేషన్‌ స్కూల్‌ స్థాయి లీగ్‌ మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోందని బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌ బిన్నీ తెలిపారు. మంగళవారం విశాఖలో ఏసీఏ కార్యదర్శి ఎస్‌.ఆర్‌.గోపీనాథ్‌రెడ్డితో కలిసి బిన్నీ మీడియాతో మాట్లాడారు. జోన్‌ స్థాయిలో అండర్‌ 14, 15, 16, 19 ప్లేయర్లకు న్యూట్రిషన్‌ సపోర్ట్‌ అలవెన్స్‌ కింద ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున ఏసీఏ అందజేయనుందని చెప్పారు. ఏపీ నుంచి జాతీయ జట్టుకు ఆడిన 11 మంది యువ క్రికెటర్లు ఎస్‌.మేఘన, కె.అంజలి శ్రావణి, బి.అనూష, కె.నితీష్‌కుమార్‌రెడ్డి, ఎండీ షబ్నం, జి.హనుమ విహారి, కేఎస్‌ భరత్, రిక్కీ బోయ్, కె.వి.శశికాంత్, కె.రత్నకుమారి(ట్రైనర్), కె.నవజీవన్‌ (వీడియో అనలిస్ట్‌)కు రూ.65 లక్షల నగదు పురస్కారాలను ఏసీఏ అందజేయనుందని ప్రకటించారు. అండర్‌–14, 19 క్రికెట్‌లో ప్రతిభ చూపిన 20 మందిని ఎంపిక చేసి ఆస్ట్రేలియాలో శిక్షణ ఇచ్చేందుకు ఏసీఏ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. విశాఖలో మరో అంతర్జాతీయ క్రికెట్‌ స్టేడియం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. భూమి కేటాయింపునకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందన్నారు. కాగా, ప్రపంచకప్‌ను గెలిచే సామర్థ్యం టీమిండియాకు ఉందని.. రిజర్వ్‌ బెంచ్‌ భారత్‌ జట్టుకు బలమన్నారు. రోహిత్‌ శర్మ, విరాట్‌ కోహ్లి తన ఫేవరేట్‌ క్రికెటర్లు అని చెప్పారు.

• తెలంగాణ

మార్క్‌'ఫ్రాడ్‌'

➡ ఆయన ఓ మార్క్‌ఫెడ్‌ అధికారి...కొన్నాళ్ల క్రితం ఇంట్లో ఒక శుభకార్యం జరిగింది. ఆ సమయంలో ఒక ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌ బుక్‌ చేశారు. అతిథులకు భోజన ఏర్పాట్లు చేశారు. దానికి లక్షల్లో ఖర్చు అయ్యింది. అయితే ఆ ఖర్చును ఒక ప్రైవేట్‌ బ్యాంకు భరించింది.

➡ మరో అధికారి మూడేళ్ల కాలంలోనే హైదరాబాద్‌లో ఒక విల్లా, మరో జిల్లాలో 10 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. కమీషన్ల కారణంగానే ఆయనకు భారీగా సొమ్ము అందిందని సమాచారం.

జాతీయ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు.. ప్రైవేట్‌ బ్యాంకులో జమ

- ఎరువులు అమ్మగా వచ్చిన సొమ్మూ... ప్రైవేట్‌లోనే
- రుణం తీసుకున్న బ్యాంకులోనే ఎందుకు జమ చేయడం లేదన్న ప్రశ్న
- వందల కోట్లపై మార్క్‌ఫెడ్‌ అధికారుల నిర్వాకం... కమీషన్ల కోసం కక్కుర్తి

సాక్షి, హైదరాబాద్‌: మార్క్‌ఫెడ్‌లో ఇష్టారాజ్యంగా అక్రమాలు జరుగుతున్నాయనడానికి పైరెండు ఘటనలు ఒక నిదర్శనం. ఒక ప్రైవేట్‌ బ్యాంకుతో మిలాఖతై ప్రభుత్వ సొమ్ముతో కమీషన్లు పొందుతున్నారు. ప్రభుత్వ సంస్థ అయిన మార్క్‌ఫెడ్‌ తన ఆర్థిక లావాదేవీలను ప్రైవేట్‌ బ్యాంకులతో జరుపుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదికి దాదాపు రూ. 2 వేల కోట్ల వరకు లావాదేవీలు ప్రైవేట్‌ బ్యాంకుతో చేయడం భద్రత దృష్ట్యా సరైన పద్ధతి కాదని మార్క్‌ఫెడ్‌లోని కొందరు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ పూచీకత్తుతో జాతీయ బ్యాంకుల నుంచి అప్పులు చేసి, రైతులకు ఇస్తున్న మార్క్‌ఫెడ్, ఆ సొమ్మును ఒకట్రెండు ప్రైవేట్‌ బ్యాంకుల్లో పెడుతోంది. ఈ ఒక్క యాసంగి సీజన్‌లోనే దాదాపు రూ.826 కోట్లు వివిధ జాతీయ బ్యాంకుల నుంచి అప్పుగా తెచ్చి, ఆ సొమ్మును ఒక ప్రైవేట్‌ బ్యాంకు ద్వారా రైతులకు అందజేసింది. వానాకాలం సీజన్‌కు చెందిన రూ.వందల కోట్లు, యాసంగి సీజన్‌కు సంబంధించి రూ. వందల కోట్లు ప్రైవేట్‌ బ్యాంకుల్లోనే పెడుతోంది.

ఒక్క ఏడాదిలోనే రూ.2400 కోట్లు

2022–23లో ఫెర్టిలైజర్స్‌ అమ్మగా వచ్చిన సొమ్ము దాదాపు రూ. 700 కోట్లు, పంట సేకరణకు తీసుకొచ్చిన దాదాపు రూ. 900 కోట్లు, పంట విక్రయాలకు వచ్చిన దాదాపు రూ. 800 కోట్లు కూడా ప్రైవేట్‌ బ్యాంకుతోనే లావాదేవీలు జరిపారు.

కమీషన్లు... బహుమతులు.. టూర్‌ ప్యాకేజీలు

వందలాది కోట్ల రూపాయలు ప్రైవేట్‌ బ్యాంకులో జమ చేసేందుకు అవకాశం కల్పించిన కొందరు కీలకమైన మార్క్‌ఫెడ్‌ అధికారులు, ఉద్యోగులకు సంబంధిత ప్రైవేట్‌ బ్యాంకు భారీ నజరానాలు, కమీషన్లు, బహుమతులు, స్వదేశీ, విదేశీ టూర్‌ ప్యాకేజీలు ఇస్తున్నట్టు సమాచారం. లక్షల్లో డబ్బు ముట్టజెపుతున్నట్టు తెలిసింది. వాస్తవంగా ప్రైవేట్‌ బ్యాంకులు షెడ్యూల్‌ బ్యాంకు లిస్టులో ఉన్నా, జాతీయ బ్యాంకులను కాదని ప్రైవేట్‌లో పెట్టడం రిస్క్‌తో కూడిన వ్యవహారంగానే చెబుతుంటారు. అలాంటి రిస్క్‌ ఎవరికోసం మార్క్‌ఫెడ్‌ అధికారులు తీసుకుంటున్నారన్నది ప్రశ్న. ఒకప్పుడు ఆయిల్‌ఫెడ్‌లోనూ ప్రైవేట్‌ బ్యాంకులో డబ్బులు జమ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా, అప్పట్లో ఒక ఎండీ దానిని తిరస్కరించారు. ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్‌ బ్యాంకులో పెట్టడం శ్రేయస్కరం కాదంటూ నిర్ణయం తీసుకున్నారు. కానీ మార్క్‌ఫెడ్‌ మాత్రం ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్‌ బ్యాంకుల్లో పెట్టి రిస్క్‌ చేస్తుంది. కొందరు అధికారులు కమీషన్ల కోసం కక్కుర్తి పడడం వల్లే ఇదంతా జరుగుతుందన్న చర్చ జరుగుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు అధికారులు, ప్రస్తుతం పనిచేస్తున్న ముగ్గురు అధికారులు అక్రమాల్లో పాలుపంచుకున్నట్టు తెలిసింది.

ఇక్కడ రుణాలు...అక్కడ జమ

- ➡ మార్క్‌ఫెడ్‌ ప్రభుత్వ పూచీకత్తుతో పంట ఉత్పత్తుల కొనుగోలుకు జాతీయ బ్యాంకులు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో రుణాలు తీసుకొస్తుంది.
- ➡ అలా తీసుకొచ్చిన రుణాలను అవే జాతీయ బ్యాంకుల్లో జమ చేయకుండా, ప్రైవేట్‌ బ్యాంకుల్లో ఎందుకు జమ చేస్తున్నారన్నదే ప్రశ్న.
- ➡ పోనీ డిపాజిట్లు జమ చేసిన ప్రైవేట్‌ బ్యాంకు ఏమైనా రుణాలు ఇస్తున్నాయా అంటే అదేమీ లేదు.
- ➡ కొనుగోలు చేసిన పంటలను తిరిగి టెండర్లు వేసి విక్రయిస్తారు. అలా విక్రయించగా వచ్చిన సొమ్మును కూడా ప్రైవేట్‌ బ్యాంకుల్లోనే జమ చేస్తున్నారు.
- ➡ ఇలా ఒక ప్రైవేట్‌ బ్యాంకులోనే అధికంగా జమ చేస్తుండటంపై ఆరోపణలు వస్తున్నాయి.
- ➡ ఎరువులను అమ్మగా వచ్చిన సొమ్ము కూడా ప్రైవేట్‌ బ్యాంకుల్లోనే ఉంచుతున్నారు. ఇలా వందల కోట్ల రూపాయలు ప్రైవేట్‌ బ్యాంకులో జమ అవుతున్నాయి. బ్యాంకుకు కోట్ల రూపాయల లాభాలు వస్తున్నాయి.


ఇస్రో శాస్త్రవేత్త కారుపై దాడి

బెంగళూరులో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

యశవంతపుర: ఇస్రో శాస్త్రవేత్త కారుపై గుర్తుతెలియని దుండగులు రాళ్లతో దాడి చేసిన ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి 12:45 గంటల సమయంలో ఇస్రో శాస్త్రవేత్త అశుతోష్‌ సింగ్‌ ఇంటికి వెళుతుండగా కొందరు దుండగులు ఆయన కారును వెంబడించారు. అడ్డగించి కారు వెనుక అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి. అశుతోష్‌సింగ్‌ స్నేహితుల వద్ద గోడు చెప్పుకోగా వారు మాదనాయకనహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూనియర్‌ అసిస్టెంట్‌ గ్రేడ్‌–2 పరీక్ష రద్దు

సింగరేణికి హైకోర్టు షాక్‌



సాక్షి, హైదరాబాద్‌: సింగరేణి యాజమాన్యానికి హైకోర్టు షాక్‌ ఇచ్చింది. గత సంవత్సరం నిర్వహించిన జూనియర్‌ అసిస్టెంట్‌ గ్రేడ్‌-2 పరీక్షను రద్దు చేసింది. నిర్వహణలో పలు అవకతవకల కారణంగా పరీక్షను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. అన్ని జాగ్రత్తలు తీసుకుని, నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ పరీక్షను మళ్లీ నిర్వహించాలని తేల్చి చెప్పింది. అభ్యంతరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది కీ విడుదల చేయాలని సంస్థను ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన పిటిషన్‌ను అనుమతిస్తూ తుది తీర్పు వెలువరించింది. అలాగే స్టే ఎత్తివేయాలంటూ దాఖలైన మధ్యంతర అప్లికేషన్లను కొట్టివేసింది. సింగరేణి వ్యాప్తంగా 177 జూనియర్‌ అసిస్టెంట్‌ గ్రేడ్‌-2 పోస్టులను భర్తీ చేసేందుకు 2022, సెప్టెంబర్‌ 4న నిర్వహించిన పరీక్షకు 79,898 మంది హాజరయ్యారు. ఆ తర్వాత సింగరేణి 'కీ'ని విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో పరీక్ష సందర్భంగా మాస్‌ కాపీయింగ్, ఇతర అవకతవకలు జరిగాయంటూ రామగుండంకు చెందిన అభిలాష్‌ సహా పలువురు హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం, తీర్పు వెలువరించే వరకు ఫలితాలను వెల్లడించవద్దని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై మరోసారి జస్టిస్‌ మాధవీదేవి విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించలేదని భావించిన న్యాయమూర్తి.. రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఇసుక లారీ డ్రైవర్‌పై టీడీపీ నేతల దాడి

- బాధితుడిని కులం పేరుతో దూషణ
- 'జమ్మలమడుగు'లో ఇసుక రీచ్‌ వద్ద ఆ పార్టీ ఆందోళన.. ఉద్రిక్తత
- 10 మందిపై పోలీసుల కేసు నమోదు



ఎంఎల్‌ఏ బావమరిది చొక్కా చింపిన టీడీపీ నేతలు (ఇన్‌సెట్‌లో) గాయపడిన టిప్పర్‌ డ్రైవర్‌



టీడీపీ నేతల దాడికి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జమ్మలమడుగు రూరల్‌: రాష్ట్రవ్యాప్తంగా ఇసుక రీచ్‌ల వద్ద తెలుగుదేశం పార్టీ చేపట్టిన ధర్నా జమ్మలమడుగులో ఉద్రిక్తంగా మారింది. దళితుడైన ఓ టిప్పర్‌ డ్రైవర్‌పై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. ప్రశ్నించిన ఇసుక కాంట్రాక్టర్‌పై కూడా వారు దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఇటు వైఎస్సార్‌సీపీ అటు టీడీపీ కార్యకర్తలు పోటాపోటీగా నిరసనలకు దిగటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పరిస్థితి అదుపులోకి వచ్చింది. వివరాలివీ..

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలంటూ టీడీపీకి చెందిన జమ్మలమడుగు నేతలు మంగళవారం ధర్నా నిర్వహించారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి, (సుబ్బిరామిరెడ్డి) మాజీ ఎమ్మెల్సీ దేవగుడి శివనాథరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు మండలంలోని అంబవరం గ్రామం రీచ్‌ వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ఆ సమయంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను అడ్డుకుని డ్రైవర్‌ రాంప్రసాద్‌ను కులం పేరుతో దూషించి దాడిచేశారు. ఈ సంఘటనలో రాంప్రసాద్‌ తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకుని వచ్చిన ఎంఎల్‌ఏ డాక్టర్‌ మూలే సుధీర్‌రెడ్డి బావమరిది ధీరజ్‌రెడ్డి.. అనుమతులున్న టిప్పర్‌లను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. దీంతో వారిమధ్య మాటామాటా పెరిగింది. ధీరజ్‌రెడ్డి చొక్కాను చింపివేశారు. అనంతరం టీడీపీ వర్గీయులు జమ్మలమడుగు వైపు వస్తుండగా ముద్దనూరు రహదారి వద్ద వారి వాహనాలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆపి తమ నాయకులపై ఎందుకు దాడిచేశారని నిలదీశారు. ఇరు పార్టీల నాయకులు బ్రిడ్జిపై బైఠాయించారు. ఇంతలో పోలీసులు రంగప్రవేశం చేసి వారందరినీ అక్కడ నుంచి పంపించివేశారు.

10 మంది టీడీపీ నేతలపై కేసు

టిప్పర్‌ డ్రైవర్‌ రాంప్రసాద్‌ను కులం పేరుతో దూషించి రాడ్‌తో దాడిచేసిన సంఘటనలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పొన్నతోట శ్రీను, నరసింహులు మరికొంత మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ సదాశివయ్య తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించండి



ధర్నా చేస్తున్న హాస్టల్ కార్మికులు

రాయచూరు రూరల్: జిల్లాలో వివిధ సాంఘీక సంక్షేమ హాస్టళ్లలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహించే కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని హాస్టల్ కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం టిప్పుసుల్తాన్ పార్క్‌లో చేపట్టిన ధర్నాలో సంచాలకుడు మహేష్ మాట్లాడారు. గతేడాది సర్కార్ వేతన సవరణ చేసినా కార్మికులకు ఉన్న వేతన బకాయిలను చెల్లించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవం



అలంకరణలో శ్రీవారు

రాయచూరు రూరల్: నగరంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా కుంభ సమారోపణం జరిగింది. మంగళవారం నవోదయ వైద్య కళాశాల ప్రాంగణంలో వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఉత్సవాలకు నారాయణపేట ఎమ్మెల్యే రాజేంద్రరెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. పుణ్యాహవాచనం, మోదిని పూజ, రుత్విక్ వరణం, అంకురారోహణం, చతుర్వేద స్వస్తి, సుప్రభాత, తోమాల సేవలు చేశారు. పవిత్రోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

సంస్కార అభ్యాసానికి లింగదీక్ష నాంది



మాట్లాడుతున్న సంగమేశ్వర శివాచార్యులు

రాయచూరు రూరల్: మనిషికి సంస్కారం నేర్చుకోవడానికి లింగదీక్ష అవసరమని ఉడుంగల్ ఖానాపూర్ మఠాధిపతి బ్రహ్మవీర సంగమేశ్వర శివాచార్యులు అభిప్రాయపడ్డారు. మంగళవారం రామలింగేశ్వర ఆలయంలో వీరశైవ లింగాయత సమాజం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నవయసులో పిల్లలకు బోధించే పాండిత్యం, సంస్కృతి, సంప్రదాయ, ఆచార, విచారాలను అనుసరించాలని సూచించారు.

పర్మినెంట్ చేయాలని ధర్నా



ఆందోళన చేస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: రాయకం మెడికేర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని మెడికేర్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం కార్మిక శాఖాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సంచాలకుడు వీరేష్ మాట్లాడారు. ఇటీవల తొలగించిన ఐదుగురు కార్మికులను పనిలోకి తీసుకోవాలన్నారు. కార్మికుల బకాయి వేతనాలను చెల్లించి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జల్‌జీవన్‌తో ఇంటింటికీ కొళాయి కనెక్షన్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్‌తో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ కల్పిస్తామని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ తెలిపారు. మంగళవారం తాలూకాలోని బిచ్చాలిలో జల్‌జీవన్ పథకం నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ఆయన మాట్లాడారు. ఈ పథకం పనులకు రూ.కోటిని కేటాయించారన్నారు. భూములకు నీరందించేందుకు చెరువులకు రూ.2 కోట్లతో పైపులైన్లు, వంతెనల నిర్మాణాలు చేపడతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు.

కానరాని వరుణ జాడ

- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతన్నలు



కొళగల్లు వద్ద మిర్చిపంటలో బీటలు వారిన నేల



ఎర్రంగళి వద్ద ఎండిపోతున్న వరిపైరు

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు అదునులో కురవక అష్టకష్టాలతో పంటలు సాగు చేసిన రైతులకు మళ్లీ వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు కన్నీరు పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సిరుగుప్ప, సండూరు, కంప్లి, బళ్లారి నియోజకవర్గాల పరిధిలో వర్షంపై ఆధారపడి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి, హడగలి, హరపనహళ్లి, హొసపేటె నియోజకవర్గాల పరిధిలో దాదాపు 8 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా వర్షం రాకపోవడంతో ఆయా తాలూకాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, వేరుశనగ, రాగి తదితర పంటలు నిలువునా ఎండిపోతుండటంతో రైతులు ఆకాశం వైపు వరుణుడి కృపాకటాక్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు రాకపోవడంతో జూలై ఆఖరు వారంలో విత్తన సాగు ప్రక్రియను అంతంత మాత్రమే పూర్తి చేశారు.

సగటు కన్నా తక్కువ వర్షపాతం

జిల్లాలో సగటు దాదాపు 300 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 176 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని అన్ని తాలూకాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతులు అధికారుల దృష్టికి తెస్తున్నారంటే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం కనిపిస్తోందని చెప్పవచ్చు. వర్షాధారిత భూములతో పాటు తుంగభద్ర ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పంటల పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. డ్యాంలో ప్రస్తుతం 78.500 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ఇన్‌ఫ్లో పతనం కావడంతో డ్యాంలో నీటి నిల్వ క్రమేణా తగ్గుముఖం పడుతోంది. డ్యాం నుంచి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, ఎల్‌బీఎంసీ తదితర కాలువలకు నీటి విడుదలతో పాటు కొంత ఆవిరి కావడం వల్ల ఒక టీఎంసీ నీరు రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోవడంతో ఉన్న నీటి ప్రకారం 60 రోజుల పాటు మాత్రమే రైతులకు నీరు అందించేందుకు వీలవుతుంది. అక్టోబర్, నవంబర్ నెలలో డ్యాంలోకి ఇన్‌ఫ్లో రాకపోతే తుంగభద్ర ఆయకట్టు పరిధిలో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. డ్యాంలో ఉన్న నీటి ప్రకారం అయితే 60 రోజులకు సరిపడే అవకాశం ఉండటంతో మరో 30 రోజులు నీరు విడుదల చేసేందుకు డ్యాంలోకి మళ్లీ ఇన్‌ఫ్లో రావాల్సిన అవసరం ఉంది. మళ్లీ డ్యాంలోకి వచ్చే ఇన్‌ఫ్లోపై తుంగభద్ర ఆయకట్టు రైతుల పరిస్థితి ఆధారపడి ఉంటుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి కరువు ఛాయలు కనిపిస్తున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

నీరందక ఎండుతున్న పంటలు

బళ్లారి రూరల్: కొళగల్లు నుంచి కురుగోడు వరకు వరి, మిర్చి పంటలు నీరందక ఎండిపోతున్నాయి. హెచ్చెల్సీకి గండిపడటంతో కొద్దిరోజులుగా మరమ్మతులు చేపట్టినందున కాలువకు నీటి సరఫరాను ఆపారు. అయితే ఈసారి ఆలస్యంగానైనా తుంగభద్ర డ్యాం నిండటంతో రైతులు సంబరపడ్డారు. కాలువలకు నీరు వదలడంతో రైతులు వరినారు సిద్ధం చేసుకొని నాట్లు వేశారు. మిర్చి పంటను కూడా సాగు చేశారు. అయితే హెచ్చెల్సీకి గండిపడటంతో నీటి సరఫరా ఆగిపోయింది. అప్పుడే వేసిన వరినాట్లు నీరు సరిపోక ఎండిపోతున్నాయి. నాటు వేయని వరినారు కూడా ఎండిపోయింది. దీంతో రైతులు నీళ్లు ఎప్పుడొస్తాయా? అని ఎదురుచూస్తున్నారు.

మధ్యాహ్న భోజనంతోనే విద్యార్థులు బడి బాట



మాట్లాడుతున్న హెచ్ఎం శివకుమార్

కంప్లి: పాఠశాలల్లో మధ్యాహ్న వేడి భోజనం తయారు చేసే సిబ్బంది చేతి వంట రుచి వల్లనే ఎక్కువ మంది విద్యార్థులు బడికి డుమ్మా కొట్టకుండా వస్తున్నారని సిరిగేరి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శివకుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆహార సురక్షత జాగృతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం 2003 నుంచి అమలులో ఉందన్నారు. పాఠశాలల్లో వంట చేసే సిబ్బంది పిల్లల భవిష్యత్తును కాపాడి సక్రమంగా బడికి వచ్చేలా చేస్తున్నారన్నారు.

జవాన్ల పర్వతారోహణ

బనశంకరి: దేశవ్యాప్తంగా పలురాష్ట్రాల్లో ఎత్తైన శిఖరాలను అధిరోహించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి తలపెట్టిన సైనికబృందం చిక్కమంగళూరు జిల్లా మల్లయ్యన గిరి పర్వతాన్ని ఆదివారం అధిరోహించింది. కల్నల్ రణవీర్‌సింగ్ జంవాల్ నాయకత్వంలో 14 మంది సైనికులతో కూడిన బృందం పర్వతాన్ని ఎక్కింది. కల్నల్ రణవీర్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ దేశంలోని 28 రాష్ట్రాల్లో గల ఎత్తైన 50 శిఖరాలపై త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. 17 రాష్ట్రాల్లో ఇప్పటికే పతావిష్కరణ పూర్తి చేశామని చెప్పారు.

వారిద్దరూ చేరే అవకాశం

హుబ్లీ: గత కొన్ని రోజులుగా జిల్లాకు చెందిన బీజేపీ నేతలు ఇద్దరు కాంగ్రెస్‌లో చేరికపై ఇస్తున్న ద్వంద్వ వైఖరి ప్రకటనలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్ లాడ్ స్పష్టతనిచ్చారు. మంగళవారం ఆయన ధార్వాడలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి శంకర్ పాటిల్ మునేనకొప్ప, కుందగోళ మాజీ ఎమ్మెల్యే చిక్కనగౌడ కాంగ్రెస్‌లో చేరవచ్చనే సమాచారం ఉందని తెలిపారు. కొందరు స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతామన్నారు. మరి కొందరు గోడ మీద పిల్లివాటంలా చెబుతున్నారన్నారు. ఎవరికి ఆసక్తి ఉందో వారిని స్వాగతిస్తున్నామన్నారు. తాము ఏ ఎమ్మెల్యేను బలవంత పెట్టడం లేదన్నారు. ప్రజాప్రభుత్వంలో పెద్ద పార్టీ తమది, రెండు వైపులా ద్వారాలు ఉన్న సిటీ బస్సులాంటి తమ పార్టీలోకి ఎవరైనా రావచ్చన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



వినతిపత్రం సమర్పించిన విరుపాక్షి

రాయచూరు రూరల్: నగరంలో బాబూ జగ్జీవన్ రాం సర్కిల్ సమీపంలో నగరసభ కేటాయించిన ప్రభుత్వ భూమిని కాపాడాలని జేడీఎస్ అధ్యక్షుడు విరుపాక్షి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ భవనంలో జిల్లాధికారితో మాట్లాడారు. రెవిన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిని నగరసభ అధికారులు ఇష్టమొచ్చినట్లు ఖాతా నంబర్లు కేటాయించి ఆక్రమణకు గురి చేశారన్నారు. ఈ విషయంలో కేటాయించిన ఖాతాలను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

మట్టి గణపతులే ముద్దు

రాయచూరు రూరల్: మట్టి గణపతులే ముద్దు అని, జిల్లాలో పీఓపీతో తయారు చేస్తున్న గణపతులను నిషేధించాలని కర్ణాటక రణధీర పడె డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సంచాలకుడు రమేష్ మాట్లాడారు. నగరంలో వచ్చే నెలలో గజానన మండళ్లు జరపనున్న ప్రతిష్టాపనల్లో మట్టితో తయారు చేసిన వినాయకులనే ప్రతిష్టించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా బసవణ్ణ మహోత్సవం



బసవణ్ణను అలంకరించిన దృశ్యం

కంప్లి: విశ్వవిఖ్యాత హంపీలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక వెండి బసవణ్ణ మహోత్సవం ఏర్పాటు చేశారు. విరుపాక్షేశ్వర దేవస్థాన రథ వీధిలో బసవణ్ణ విగ్రహాన్ని ఊరేగించారు. సోమవారం రాత్రి వరకు వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి.

వికటించిన పెళ్లి భోజనం

- చిక్కోడి తాలూకాలో 100 మందికి అస్వస్థత



అస్వస్థులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

రాయచూరు రూరల్: పెళ్లి భోజనం వికటించి 100 మంది అస్వస్థతకు గురైన ఘటన బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా హిరేకోడిలో జరిగింది. సోమవారం రాత్రి పటేల్ నివాసంలో పెళ్లి సంబరాలు జరిగాయి. పెళ్లి భోజనంలో చికెన్, అన్నం వడ్డించారు. అయితే భోజనం తిన్న తర్వాత జీర్ణం కాక వంద మందికి పైగా వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. వారికి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు.

అలరించిన ప్రదర్శన



బనశంకరి: గర్భ జ్ఞాన్ ఫౌండేషన్, గర్భగుడి సెంటర్ ఆధ్వర్యంలో ఘర్ ఘర్ సంతానహీనత రహిత కర్ణాటక అభియాన కు శ్రీకారం చుట్టింది. మంగళవారం టౌన్‌హాల్ వద్ద జాగృతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ ఓనం ముగ్గు వేసి సంబరాలు జరుపుకొన్నారు.

ఆదర్శప్రాయుడు ధ్యాన్‌చంద్



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పిస్తున్న కలెక్టర్ అక్రంపాషా

కోలారు: యువకులు మేజర్ ధ్యాన్‌చంద్ వంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ అక్రంపాషా తెలిపారు. మంగళవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిలో పాల్గొని ఆయన మాట్లాడారు. ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తుండడం శుభపరిణామం అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తిని పెంచుకోవాలన్నారు. క్రీడల్లో విరివిగా పాల్గొనడమే కాకుండా క్రీడా మనోభావాన్ని అలవర్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను తగిన విధంగా ప్రోత్సహిస్తున్నాయన్నారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం నారాయణ, క్రీడా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గీతా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గురువందన, స్నేహ సమ్మిలన



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

కంప్లి: కురుగోడు సమీపాన గల బాదనహట్టిలో గురువందన, స్నేహ సమ్మిలన కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు వేడుకగా నిర్వహించారు. 1980 నుంచి 2000 వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన గురువులకు, గురుమాతృమూర్తులను అలంకరించిన వాహనంలో గ్రామంలోని బావి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రముఖ వీధుల్లో ఊరేగించి ఉడుసలమ్మ దేవి ఆలయం ఎదురుగా వేదిక వరకు పిలుచుకొని వచ్చారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం ముఖ్యకార్యనిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన వారిని ఈ స్థాయికి తెచ్చిన గురువులను ఎప్పుడూ మరువరాదన్నారు. వారు అందించిన అక్షర భిక్షం ఫలితంగా తాము ఆ సాధనను సాధించగలిగామన్నారు. గ్రామంలోని పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయ అవసరమైతే అందించేందుకు తాను సిద్ధమని హామీ ఇచ్చారు. వేదికపై పూర్వ విద్యార్థి ఆర్.వీరనగౌడ, రిటైర్డ్ ఉపాధ్యాయులు బీ.పంచాక్షరయ్యస్వామి, నాగప్ప, అమరేష్‌గౌడ, బసవరాజ, వెంకటరమణమ్మ, నాగలక్ష్మీ, ముక్కణ్ణ, దేవేంద్రప్ప, చంద్రణ్ణ, అనువేలు, శ్రీదేవి, కాస్లి, గాయత్రి, పార్వతి, కోదండరామిరెడ్డి, పద్మరాజ్ నాయక్, షెక్షావలీ, గోవర్ధన్, రాఘవేంద్రరెడ్డి, మూగప్ప, గంగాధరప్ప, హనుమేష్, రిజ్వాన బేగం సన్మానితులు కాగా పూర్వ విద్యార్థులు మరేగౌడ, బీ.మల్లారెడ్డి, మహేష్, ప్రసాద్, నవీన్, అంద్రు కరిబసప్ప, కే.మంజునాథ్ పాల్గొన్నారు.

గండి మరమ్మతు పనులు పూర్తి

- హెచ్ఎల్‌సీకి నీటి విడుదల పునరుద్ధరణ



గండి పూడ్చివేత పనులు పూర్తయిన దృశ్యం

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి విజయనగర, బళ్లారి, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరందించే హెచ్ఎల్‌సీ కాలువకు గండి పడటంతో మూడు రోజులుగా తుంగభద్ర బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ రవిచంద్ర, ఎస్‌డీఓ సంధానిల ఆధ్వర్యంలో గండి పూడ్చివేత పనులు చురుకుగా చేపట్టి మంగళవారానికి పూర్తి చేశారు. హెచ్ఎల్‌సీకి గండి పడిన వెంటనే కాలువకు డ్యాం నుంచి నీటి సరఫరాను తగ్గించారు. దీంతో నాలుగు రోజుల నుంచి ఆయకట్టు రైతుల పంటలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నందున కాలువ గండి మరమ్మతు పనులు చకచకా పూర్తి చేసి నీటి విడుదలను పునరుద్ధరించారు. హెచ్ఎల్‌సీ కాలువకు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దులకు బుధవారానికి నీరు చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కార్మికుల సమస్యలు తీర్చాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐయూటీయూసీ కార్యకర్తలు

కోలారు: కట్టడ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ కట్టడ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని, వారి అర్జీలను సకాలంలో పరిష్కరించి సౌకర్యాలను అందించాలని ఒత్తిడి చేశారు. రిజిస్టర్ చేసుకున్న కార్మికుడి కుటుంబానికి ఆరోగ్య సౌకర్యాలు, రెండేళ్లుగా విద్యా సహాయధనం అందడం లేదన్నారు. అందరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే కట్టడ కార్మికులకు ఉండడానికి ఒక గూడు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన కార్మికుడికి పింఛను కోసం 6 నెలల్లోగా అర్జీలు సమర్పించాలనే నియమాన్ని తొలగించాలని, రూ.5 లక్షల నగదు రహిత ఆరోగ్య సేవలను కట్టడ కార్మికులకు, వారిపై ఆధారపడిన వారికి వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. స్లం బోర్డుకు ఇచ్చిన రూ.518 కోట్ల నిధులను వెనక్కు తీసుకుని కట్టడ కార్మికుల సంక్షేమానికి వెచ్చించాలని ఒత్తిడి చేశారు. ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షణ్ముగం, జిల్లా అధ్యక్షుడు ఎస్ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హొసపేటె వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్ల పొడిగింపు

- భవిష్యత్‌లో బళ్లారి వరకు పొడిగింపునకు ప్రయత్నిస్తాం: ఎంపీ దేవేంద్రప్ప



పచ్చజెండా ఊపి రైళ్లను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

హొసపేటె: ముంబై–గదగ్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంగళవారం నుంచి హొసపేటె జంక్షన్ వరకు పొడిగించారని, రానున్న రోజుల్లో వీటిని బళ్లారి జంక్షన్ వరకు పొడిగించేందుకు ప్రయత్నిస్తామని బళ్లారి లోక్‌సభ సభ్యుడు దేవేంద్రప్ప తెలిపారు. రైలును బళ్లారి జంక్షన్ వరకు పొడిగించాలని ఇప్పటికే రైల్వే శాఖా మంత్రిని కోరామని తెలిపారు.

నైరుతి రైల్వే నుంచి గదగ్–సీఎస్ఎంటీ (ముంబై) ఎక్స్‌ప్రెస్(11139/11140) షోలాపూర్–గదగ్–షోలాపూర్ డెమో ఎక్స్‌ప్రెస్(11305/11306) రైళ్లను హొసపేటె జంక్షన్ వరకు పొడిగింపును ఎంపీలు దేవేంద్రప్ప, కరడి సంగణ్ణ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ప్రారంభించారు. అంతకు ముందు జరిగిన చర్చా వేదికలో వై.దేవేంద్రప్ప మాట్లాడుతూ బళ్లారి ప్రాంతంలో అత్యంత కీలకమైన జీన్స్ ఉత్పత్తుల ఎగుమతికి ఈ రైళ్లు దోహదపడుతాయన్నారు. పర్యాటకం, పరిశ్రమలు, వ్యవసాయం, వాణిజ్యం వంటి రంగాలను ప్రోత్సహించేందుకు మరింత సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. వినియోగదారులు, ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ సంకల్ప బలంతో భారతీయ రైల్వే రంగంలో విప్లవం చోటు చేసుకుంటోందన్నారు. వందే భారత్ యోజన అభివృద్ధి పథకంలో బళ్లారికి ఇప్పటికే రూ.16.7 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. 175 ఏళ్ల చరిత్ర ఉన్న బళ్లారి జంక్షన్ మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. కొప్పళ పార్లమెంటు సభ్యుడు కరడి సంగన్న మాట్లాడుతూ గతంలో 9 రైళ్లు మాత్రమే నడిచే స్టేషన్‌లో ఇప్పుడు 40–45 రైళ్లు నడుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షులు లతా, రైల్వే శాఖ అధికారులు సంతోష్‌కుమార్ వర్మ, భరత్‌కుమార్, అనిత, రైల్వే అభివృద్ధి సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

హొసపేటె–ముంబై రైలు సేవలు షురూ

గంగావతి: హొసపేటె నుంచి ముంబై మధ్య రైలు సేవలను కొప్పళలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణ పచ్చజెండాను ఊపి ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగర, కొప్పళ జిల్లాల్లోని వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాల సందర్శనకు వీలుగా గేట్ వే ఆఫ్ ఇండియా ముంబైకి రాకపోకల సౌకర్యాన్ని ఈ రైలు కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న మల్లయ్య

రాయచూరు రూరల్: జిల్లా పరిశ్రమల కేంద్రం(డీఐసీ) అధికారులపై చర్యలు చేపట్టాలని దేవదుర్గ పరిశ్రమల కేంద్రం అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు మల్లయ్య ఒత్తిడి చేశారు. ఆయన మంగళవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం పరిశ్రమల అభివృద్ధికి కేటాయించిన 29 ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు కాకుండా నిర్లక్ష్యం వహించిన బళ్లారి కేఐఏడీబీ ఈఈ శ్రీధర్, ఏఈఈ గోవింద నాయక్‌లను సస్పెండ్ చేయాలన్నారు. దేవదుర్గలో అక్రమంగా దొడ్డరంగన్న నిర్మించిన దుకాణాలను తొలగించాలన్నారు.

మృతురాలి కుటుంబానికి కేంద్రమంత్రి పరామర్శ

హుబ్లీ: బెళగావి జిల్లా నవిలుతీర్థ జలాశయంలో పడి ఆత్మహత్య చేసుకున్న ధార్వాడకు చెందిన ఆస్ట్రేలియా నివాసి ప్రియదర్శిని పాటిల్ తండ్రి ఇంటికి మంగళవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇక్కడి సత్తాపురలోని ప్రియదర్శిని తండ్రి ప్రొఫెసర్ ఎస్ఎస్ దేశాయి, వారి కుటుంబ సభ్యులతో చర్చించారు. మృతురాలి పిల్లల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఆస్ట్రేలియాలోని ప్రియదర్శిని పిల్లలను భారత్‌కు తీసుకు రావడానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర విదేశాంగ శాఖ కార్యాలయంతో మాట్లాడి మృతురాలి పిల్లలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు చర్యలు చేపడతామన్నారు. మాజీ మేయర్ వీరేష్ అంచటగేరి, కార్పొరేటర్ విజయానంద శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీగా రవికుమార్ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ రవికుమార్(ఎడమ)

బళ్లారిఅర్బన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం నూతన ఏఎస్పీగా కేపీ రవికుమార్ గతంలో ఉన్న ఏఎస్పీ నటరాజ్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. రవికుమార్ బెంగళూరు ఎఫ్ఎస్ఎల్ జేడీగా పని చేసి బళ్లారికి బదిలీ అయ్యారు. గతంలో 2007లో బళ్లారి కౌల్‌బజార్, బళ్లారి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా పని చేశారు. కేపీ రవికుమార్ బళ్లారికి ఏఎస్పీగా రావడంపై పలువురు పోలీసు అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

పోలీసులకు రక్షాబంధన్



బ్రూస్‌పేట్ సీఐకు రాఖీ కడుతున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా కోర్టు రోడ్డులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ సభాంగణంలో మంగళవారం ఇన్నర్ వీల్ రోటరీ క్లబ్ మహిళా అధ్యక్షురాలు ఎన్‌డీ లక్ష్మీప్రియ, కార్యదర్శి శిల్పా మహిళా సభ్యులు కలిసి సుమారు 80 మంది పోలీసులకు రాఖీలు కట్టి రక్షాబంధన్‌ను జరుపుకున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు తెలిపారు. కుటుంబ సమేతంగా అన్నకు చెల్లెలు, తమ్ముడికి అక్కలు రాఖీలు కట్టడం సంప్రదాయం. అయితే పోలీసులు వారి విధుల్లో బిజీగా ఉన్నందున ముందుగానే రాఖీలను కట్టి రక్షాబంధన్‌ను జరుపుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఏఆర్ డీఎస్పీ జీఎం తిప్పేస్వామి, బ్రూస్‌పేట్ సీఐ సింధూర్, ట్రాఫిక్ ఎస్ఐ సీఐ అయ్యనగౌడ పాటిల్, ఎస్ఐ నాగభూషన్, ఆర్‌పీఐలు గోవిందప్ప, అమోఘ, పోలీస్ సిబ్బంది, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కూడా..



ఆటో డ్రైవర్లకు రాఖీ కడుతున్న దృశ్యం

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు బీజేపీ రాష్ట్ర మహిళ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివకృష్ణమ్మ, కార్యవర్గ సభ్యురాలు విజయలక్ష్మి, జిల్లాధ్యక్షురాలు కే.సుగుణ, ఉపాధ్యక్షురాలు డాక్టర్ అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్ప చంద్రశేఖర్, నగర అధ్యక్షురాలు జ్యోతి ప్రకాష్, రూపశ్రీ, రాజేశ్వరి, బేబి, అన్నపూర్ణ, యువమోర్చా ఉపాధ్యక్షులు సుధాకర్ తదితరులు రాఖీలు కట్టి రక్షబంధన్‌ను జరుపుకున్నట్లు జిల్లాధ్యక్షురాలు పుష్ప తెలిపారు.

న్యాయం కోసం వృద్ధురాలి దీక్ష

కోలారు: తాలూకాలోని అజ్జప్పనహళ్లి గ్రామంలో తన స్వంత స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి గ్రామానికి చెందిన కొంతమంది అడ్డుపడుతున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన 70 ఏళ్ల దళిత వృద్ధురాలు రామరత్నమ్మ తన స్థలం ముందు అంబేడ్కర్ చిత్రపటంతో బైఠాయించి మౌన పోరాటం ప్రారంభించారు. గ్రామంలో తాను నివాసం ఉన్న తన స్థలానికి సంబంధించి అన్ని దాఖలాలు ఉన్నాయన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది నకిలీ దాఖలాలు సృష్టించి తన స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కూలి పని చేసుకుని జీవిస్తున్న తనకు వేరే దారి లేదని, అధికారులు తనపై కనికరించి ఇల్లు కట్టుకోవడానికి కల్గిస్తున్న ఇబ్బందులను తొలగించి తనకు న్యాయం చేయాలని కోరారు.